
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+6 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 44

సోమవారం 6-5-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


రవీంద్రజాలం
చెన్నైకి ఆరో విజయం.. 28 పరుగుల తేడాతో పంజాబ్‌పై గెలుపు - 14లో


ఏ వయసు వారికైనా బీమా
ఐదేళ్ల తర్వాత క్లెయిమ్ చెల్లించాల్సిందే.. మార్పులు చేసిన ఐఆర్‌డీఏఐ - 15లో


ముగిసిన మూడో దశ ప్రచారం
మూడో దశ ఎన్నికల ప్రచారం ముగిసింది. 11 రాష్ట్రాల్లోని 92 లోక్‌సభ స్థానాలకు ఈ నెల 7న పోలింగ్ జరగనుంది.
వివరాలు 6లో ▸


కర్కరేను చంపింది కసబ్ కాదు!
ముంబై ఉగ్రదాడి సమయంలో కర్కరేను ఆర్ఎస్ఎస్‌కు చెందిన పోలీస్ చంపాడని.. కసబ్ కాదని కాంగ్రెస్ నేత వడెట్టివార్ ఆరోపించారు.
వివరాలు 6లో ▸


మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు షాక్
ఎన్నికల వేళ మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన బినా నియోజక వర్గ ఎమ్మెల్యే నిర్మలా సప్రే బీజేపీలో చేరారు.
వివరాలు 6లో ▸


నిప్పుతో చెలగాటమా..
రిజర్వేషన్ల పేరిట హిందూ, ముస్లింల మధ్య కాంగ్రెస్ చిచ్చు పెట్టి నిప్పుతో చెలగాటం ఆడుతోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారు.
వివరాలు 6లో ▸

మాయం
నారా మేనిఫెస్టో..
రారా టీవీ వీడియో

మాయగాళ్లు

'ల్యాండ్ టైట్లింగ్ చట్టం' అద్భుతమంటూ ఈటీవీలో స్టోరీ

నాలుగు నెలల కిందట 'అన్నదాత' కార్యక్రమంలో ప్రసారం

- ఈ చట్టం వస్తే రైతుల భూములకు భద్రత ఉంటుందంటూ ప్రశంస
- ఇపుడేమో ఎన్నికల ముందు బాబు కోసం అడ్డగోలు దుష్ప్రచారం
- ఈ చట్టం వస్తే 'మీ భూములు మీవి కావు' అంటూ భయపెట్టే రాతలు
- ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో 'అన్నదాత' వీడియో వైరల్
- ఈటీవీలోనే 4 నెలల కిందట ప్రసారం చేశారని తెలిసి జనం విస్మయం
- కథ అడ్డం తిరిగిందని తెలిసి క్షణాల్లో వీడియోను మాయం చేసిన రామోజీ
- ఆ లింక్‌ను క్లిక్ చేసిన వారికి 'దిసీజ్ ప్రైవేట్ వీడియో' అనే మెసేజ్ ప్రత్యక్షం
- చంద్రబాబు సైతం ఎన్నికల్లో గెలవటానికి 2014లో వందలకొద్దీ హామీలు
- గెలిచాక టీడీపీ వెబ్‌సైట్లోంచి ఏకంగా మేనిఫెస్టోనే మాయం చేసేశారు
- 2019లో ఈ చట్టాన్ని చేసేటపుడు అసెంబ్లీలో మద్దతిచ్చిన తెలుగుదేశం
- ఈ చట్టంతో భూ కబ్జాలకు తెర పడుతుందన్న టీడీపీ నేత పయ్యావుల కేశవ్
- కాలం మారుతోంది కాబట్టి ఇలాంటి చట్టాలు అవసరమని స్పష్టీకరణ
- ప్రభుత్వ చర్యను పూర్తిగా సమర్థిస్తున్నామంటూ బిల్లుకు మద్దతు
- అసెంబ్లీ రికార్డుల్లో సైతం భద్రంగా పయ్యావుల ప్రసంగం
- ఇపుడేమో ఎన్నికల ప్రయోజనాల కోసం 'యూ టర్న్' తీసుకున్న టీడీపీ
- ప్రతి సభలోనూ... మీ భూములు లాక్కుంటారంటూ బాబు అరుపులు
- అసలు అమల్లోకి రాని చట్టంపై ఇంత దుష్ప్రచారమెందుకంటున్న నిపుణులు
- ఎన్నికల వేళ జనాన్ని భయపెట్టడమే ఎజెండాగా చెలరేగుతున్న ఎల్లో ముఠా
- ఈటీవీ వీడియో, కేశవ్ ప్రసంగం బయటపడటంతో పచ్చిగా వెల్లడైన భాగోతం

2లో




'ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో మీ భూమికి భద్రత' అంటూ రామోజీరావు(రారా)కు చెందిన ఈటీవీ అన్నదాత ప్రసారం చేసిన కార్యక్రమం

జగన్ తెలుగు భాషను నాశనం చేయాలని చూస్తున్నారు

అందుకే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు

- బీజేపీ ఉన్నంత వరకు తెలుగు భాషను నిర్వీర్యం కానివ్వం
- ఎన్డీఏ అధికారంలోకి రాగానే తెలుగు భాష పరిరక్షణకు చర్యలు
- రాష్ట్రంలో అవినీతి, మతమార్పిడులను అరికట్టేందుకే టీడీపీ, జనసేనతో పొత్తు
- సీఎం జగన్ తిరుమల పవిత్రతను దెబ్బతీశారు
- ఇండియా కూటమిలో ఎవరు ప్రధాని అభ్యర్థో వారికే స్పష్టత లేదు.. రాహుల్‌గాంధీకి లబ్ధి చేకూర్చేందుకే ఆ కూటమి ఏర్పాటు
- ధర్మవరం ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- సభలో సీఎం జగన్‌పై చంద్రబాబు దూషణలు



ధర్మవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి తెలుగు భాషను నాశనం చేయాలని చూస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. బీజేపీ ఉన్నంత వరకు తెలుగు భాషను నిర్వీర్యం కానివ్వబోమని చెప్పారు. ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగిన సభలో అమిత్‌షా మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే తెలుగు భాష పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలను

మిగతా 12వ పేజీలో ▶

ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తాం

12లో

- మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం
- తెలంగాణలోని కాగజ్‌నగర్, సికింద్రాబాద్ ఎన్నికల ప్రచార సభల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

మేనిఫెస్టో మోసగాడు
ఇవిగో పెట్టుబడులు
సింహపురి సస్యశ్యామలం
బాహుబలుల బరి
- వివరాలు జైత్రయాత్ర పేజీల్లో..

ఏ1 చంద్రబాబు, ఏ2 లోకేశ్

దుష్ప్రచార కుట్రదారు చంద్రబాబే

ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీఐడీ



- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై పథకం ప్రకారమే విష ప్రచారం
- ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి ఎన్నికల లబ్ధికి కుతంత్రం
- ఈసీ ఆదేశాలతో కేసు నమోదు చేసిన సీఐడీ
- నియమావళిని ఉల్లంఘించినట్టు నిర్ధారణ
- టీడీపీ కార్యాలయానికి నోటీసులు జారీ
- నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశం
- చంద్రబాబు, లోకేశ్‌నూ విచారించేందుకు సిద్ధం

2లో



ల్యాండ్ టైట్లింగ్ బిల్లు ఆశయాలు గొప్పవి

దీనిని మేం ఆమోదిస్తున్నాం.. రీ సర్వే సాహసోపేతం

ఈ బిల్లు అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించింది.. రాష్ట్రాలన్నీ అమలు చేయాలని కోరింది

2019 జూలై 29న అసెంబ్లీలో టీడీపీ నేత పయ్యావుల కేశవ్ ప్రసంగం.. ఎన్నికల వేళ ఆనవాయితీగా నాలుక మడతేసిన చంద్రబాబు

3లో

నీట్ యూజీ ప్రశాంతం



ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య విద్య యూజీ కోర్సుల్లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా ఆదివారం జరిగిన నీట్–యూజీ ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 24 లక్షల మందికిపైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఏపీ నుంచి 70 వేల మంది ఈ పరీక్ష రాసినట్టు అంచనాలున్నాయి. ఈ ఏడాది ప్రశ్నపత్రం మధ్యస్తం నుంచి కఠినంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. ఫిజిక్స్ విభాగంలో కఠినంగా, కెమిస్ట్రీ, బయోలజీ విభాగాల్లో ప్రశ్నలు సులువుగా ఉన్నట్లు అభిప్రాయపడ్డారు.

16లో

గుండె ఘోష విన్నారు..

గుండెపోటు మరణాల నియంత్రణకు సీఎం జగన్ ప్రభుత్వం సమర్థవంతంగా అడుగులు

గోల్డెన్ అవర్‌లో చికిత్స కోసం ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ కార్యక్రమం

హబ్ అండ్ స్పోక్ విధానంలో అమలుచేసిన ప్రభుత్వం

ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ కింద 3.67 లక్షల మంది బాధితులకు ఉచితంగా చికిత్స


ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్‌లో భాగంగా నర్సీపట్నంలోని ఆస్పత్రిలో రోగికి చికిత్స

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంభవిస్తున్న మరణాల్లో 32.4 శాతం గుండె సంబంధిత వ్యాధుల కారణంగానే ఉంటున్నాయి. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ)లో గుండె జబ్బులదే అగ్రస్థానం. ఈ క్రమంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కలిగిన సీఎం వైఎస్ జగన్ మునుపెన్నడూలేని రీతిలో ఎన్‌సీడీ నిర్వహణపై పక్కా ప్రణాళికతో అడుగులు వేశారు. ఇందులో భాగంగా.. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో ప్రభుత్వాస్పత్రుల ఆధునీకరణ సహా అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా గుండె జబ్బులు, క్యాన్సర్ తదితర

మిగతా 16వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచారం ఇలా..

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 6న(సోమవారం) మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు బాపట్ల లోక్‌సభ స్థానం పరిధిలోని రేపల్లెలో ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో జరిగే ప్రచార సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు నరసరావుపేట లోక్‌సభ స్థానం పరిధిలోని మాచర్లలో ఉన్న శ్రీనివాస్ మహల్ సెంటర్‌లో జరిగే సభకు సీఎం హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు మచిలీపట్నంలోని వల్లూరి రాజా సెంటర్లో జరిగే ప్రచార సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

డీజీపీని బదిలీ చేసిన ఎన్నికల కమిషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. వెంటనే విధుల నుంచి వైదొలగాలంటూ ఆదివారం ఆదేశాలిచ్చింది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు.. ఎన్నికలతో సంబంధంలేని బాధ్యతలు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించింది. కొత్త డీజీపీ నియామకం కోసం గత ఐదేళ్లుగా ఎటువంటి ఆరోపణలు లేకుండా మంచి పనితీరు కనబరిచిన ముగ్గురు అధికారుల పేర్లను సోమవారం ఉదయం 11 గంటల్లోగా తమకు ఇవ్వాలంటూ పేర్కొంది.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై బాబు, లోకేశ్ దుష్ప్రచారం

ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు కథనాలపై ఈసీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తూ.. సోషల్ మీడియాలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్న చంద్రబాబు, లోకేశ్, ఈనాడు, ఆంధ్రజ్యోతిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఆదివారం ఈసీకి ఫిర్యాదు చేసింది. పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి ఎన్నికల అధికారులకు ఫిర్యాదుచేశారు. చంద్రబాబు, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సోషల్ మీడియాలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ సీఎం జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇది ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని.. చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలూ తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలిపారు. ఆ సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నేతలు కోరారు.

3 రోజులు వానలు!

సాక్షి, విశాఖపట్నం: భానుడి భగభగలకు వరుణుడు చెక్ పెట్టనున్నాడు. మండుటెండలు, వడగాడ్పులతో అల్లాడుతున్న రాష్ట్రానికి ఒకింత ఉపశమనం కలిగించనున్నాడు. సోమవారం నుంచి రాష్ట్రంలో వర్షాలు కురవడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. ద్రోణి, ఉపరితల ఆవర్తనాలు ఏర్పడడం ద్వారా వానలు కురవనున్నాయి. కాగా ఆదివారం నుంచే ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. కొద్దిరోజుల నుంచి 45–48 డిగ్రీల మధ్య నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఆదివారం 46 డిగ్రీల కంటే తక్కువకే పరిమితమయ్యాయి. మరోవైపు సోమవారం నుంచి వర్షాలు మొదలు కానున్నాయి. మంగళ, బుధవారాల్లో ఇవి మరింతగా కురవనున్నాయి. అనంతరం క్రమంగా తగ్గుముఖం పట్టనున్నాయి. సోమవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి.



కనీసం ఇలాంటప్పుడైనా చెప్పుకోవడానికి మీరు ఏదైనా చేసుంటే బావుండేద్సార్!

అఖండ మెజార్టీతో గెలిపించండి

- వేములలో సీఎం వైఎస్ జగన్ సతీమణి భారతమ్మ
- పేదల సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ఈ ప్రభుత్వం రావాలి
- ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థన

వేముల: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని సీఎం వైఎస్ జగన్ సతీమణి భారతమ్మ ప్రజలను కోరారు. వైఎస్సార్ జిల్లా వేములలో ఆదివారం ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వైఎస్ జగన్, వైఎస్ అవినాశ్‌రెడ్డిలను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా వైఎస్ భారతమ్మ, ఆమె సోదరుడు, ప్రముఖ వైద్యుడు ఈసీ దినేశ్‌రెడ్డికి అడుగడుగునా ప్రజలు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. వారిని ఆప్యాయంగా పలకరించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి భారతమ్మపై అభిమానం చూపారు. ఆమెను చూడగానే చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ, తమ ఇంటిలోకి ఆహ్వానించి అభిమానాన్ని చాటుకున్నారు. చాలా రోజుల తర్వాత ఆమెను చూడటంతో సంతోషంతో ఉప్పొంగిపోయారు. వేముల మెయిన్ రోడ్డు, ఎస్సీ కాలనీ, శేషన్నగారిపల్లె, బచ్చయ్యగారిపల్లెల్లో భారతమ్మ, ఈసీ దినేశ్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి సోదరి శ్వేతారెడ్డి.. జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డిలతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక టీసీసీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రచారంలో అవ్వాతాతలను, మహిళలు, పెద్దలను 'అన్న బాగున్నారా.. అవ్వా బాగున్నారా' అంటూ భారతమ్మ ఆప్యాయంగా పలకరించారు. ప్రతి ఇంటి వద్ద వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను ఆప్యాయంగా ఎత్తుకున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని భారతమ్మ చెప్పారు. పేదలు ఉన్నత చదువులు చదివితే ఆ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయని నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేశారన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధనను గ్రామీణ విద్యార్థులకు చేరువ చేశారని తెలిపారు. పేదల సంక్షేమ పథకాలు కొనసాగడానికి మరోసారి వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు.

సీఎం జగన్‌కు మెండుగా ప్రజల ఆశీస్సులు

గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాలపై దృష్టి సారించిందని భారతమ్మ తెలిపారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పాలనను ప్రజల వద్దకే తీసుకొచ్చి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలో ఎన్నో సంస్కరణలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతో పాటు గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేశారన్నారు. ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన వైఎస్ జగన్‌ను ప్రజలు మళ్లీ సీఎంగా కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజల ఆశీస్సులు ఆయనకు మెండుగా ఉన్నాయన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా జగన్ విజయాన్ని ఆపలేరన్నారు. ఎన్నికల ప్రచారంలో పలువురు నేతలు పాల్గొన్నారు.






వైఎస్సార్ జిల్లా వేములలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ సతీమణి భారతమ్మ. (ఇన్‌సెట్‌లో) ఎస్సీ కాలనీలో దివ్యాంగుడు శేఖర్ కష్టాలు వింటున్న భారతమ్మ. అవ్వ గంగులమ్మతో ఆప్యాయంగా..

'మాయ'గాళ్లు

మాయం
నారా మేనిఫెస్టో.. రారా టీవీ వీడియో

- 'ల్యాండ్ టైట్లింగ్ చట్టం' అద్భుతమంటూ ఈటీవీలో స్టోరీ
- నాలుగు నెలల కిందట 'అన్నదాత' కార్యక్రమంలో ప్రసారం
- ఆ చట్టంతో రైతుల భూములకు భద్రత ఉంటుందంటూ ప్రశంస
- ఇపుడేమో ఎన్నికల ముందు బాబు కోసం అడ్డగోలుగా దుష్ప్రచారం

సాక్షి, అమరావతి: ఒకరు నారా... మరొకరు రారా (రామోజీరావు)! ఒకరికి 75... మరొకరికి 87. ఇద్దరికీ ఏళ్లు వచ్చినా బుద్ధి మాత్రం రాలేదు! ముందొక మాట చెప్పి.. ఆ వెంటనే నాలుక మడత పెట్టడంలో ఇద్దరూ ఆరితేరిపోయారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా... మళ్లీ ఎన్నికలొచ్చేసరికి కొత్త వాగ్దానాలు, రంగురంగుల మేనిఫెస్టోతో తయారైపోవటం చంద్రబాబు సహజ లక్షణం. 2014లో వందల హామీలిచ్చేసిన బాబు... ఎన్నికల్లో గెలిచిన వెంటనే వాటిని నెరవేర్చటం తన తరం కాదని తెలిసి ఏకంగా మేనిఫెస్టోనే కనపడకుండా చేసేశారు. ఆఖరికి తన పార్టీ వెబ్‌సైట్లో నుంచి కూడా తీసేశారు. రామోజీరావూ సేమ్ టూ సేమ్! కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెస్తున్న ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రామోజీ గతంలో బాగా ప్రశంసించారు. దీన్లో ఉన్న అంశాలను వివరిస్తూ... ఈ చట్టంతో రైతుల భూమికి భద్రత ఉంటుందని, ఎక్కడైనా ఇబ్బందులొస్తే ప్రభుత్వమే వారికి పరిహారమిచ్చేలా గ్యారంటీ ఇస్తుంది కనుక ఇది చాలా మంచి చట్టమంటూ తన ఈటీవీ 'అన్నదాత' కార్యక్రమంలో ఓ స్టోరీని ప్రసారం చేశారు. ఇపుడు ఎన్నికల వేళ సీఎం జగన్ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఏమీ లేక... ఇంకా అమల్లోకే రాని ల్యాండ్ టైటిలింగ్ చట్టం వచ్చేసిందంటూ, ప్రభుత్వం అందరి భూములూ లాక్కుంటోందంటూ టీడీపీ విష ప్రచారం మొదలెట్టింది. టీడీపీ కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన 'ఈనాడు' శక్తి మేరకు విషం చిమ్ముతోంది. ఈ చట్టం వస్తే 'మీ భూములు మీవి కావు' అంటూ విషపూరిత కథనాలు ప్రచురిస్తోంది. ఇక చంద్రబాబు, లోకేశ్ అయితే 'మీ భూములు జగన్ ప్రభుత్వం లాక్కుంటుంది జాగ్రత్త..!' అంటూ ఐవీఆర్‌ఎస్ కాల్స్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'ఈటీవీ' గతంలో ప్రసారం చేసిన కథనాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం బయటపెట్టారు. వీడియో లింక్‌ను అందరికీ షేర్ చేశారు. దీంతో తన బండారం బయటపడి పోయిందని గ్రహించిన రామోజీరావు.. క్షణాల్లో ఆ వీడియోను యూట్యూబ్ నుంచి డిలీట్ చేయించారు. ఇపుడు ఆ లింకుపై క్లిక్ చేసిన వారికి... 'దిసీజ్ ప్రైవేట్ వీడియో' అనే మెసేజ్ కనిపిస్తోంది. ఇది చూసినవారు బాబు, రామోజీ ఇద్దరూ ఇద్దరే అంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈటీవీని పబ్లిక్‌గా ప్రసారం చేస్తున్నపుడు దాన్లోని వీడియోలు ప్రైవేట్‌వి ఎలా అవుతాయి? ఈ ప్రశ్నకు రామోజీ దగ్గర సమాధానం లేదు.



గుడ్డలిప్పిన గురుశిష్యులు!

కొద్దిరోజులుగా ల్యాండ్ టైట్లింగ్ చట్టం గురించి అడ్డూ అదుపూ లేకుండా విషం చిమ్ముతున్న ఎల్లో మీడియా, చంద్రబాబు పరివారం బట్టలు విప్పుకుని బరి తెగించి చెబుతున్న మాయమాటలు కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పన్నిన మాయోపాయాలేనని తేలిపోయింది. భూ హక్కు చట్టంపై చెబుతున్న బూటకపు కబుర్లన్నీ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే కారు కూతలేనని బయటపడింది. ఈ చట్టం చాలా మంచిదని, రాష్ట్రంలోని రైతులకు ఎంతో మేలు చేస్తుందంటూ స్వయంగా రామోజీ మీడియానే గతంలో అనేక కథనాలు అచ్చేసింది. ఈటీవీలోనూ పలు ప్రత్యేక కార్యక్రమాలను ప్రసారం చేయగా, చట్టం అద్భుతమని కితాబిస్తూ ఈనాడులోనూ కథనాలు రాశారు. రాష్ట్రంలో ల్యాండ్ టైట్లింగ్ చట్టం గురించి ఈటీవీ అన్నదాతలో నాలుగు నెలల క్రితం 'టైటిల్ గ్యారంటీ చట్టంతో మీ భూమికి భద్రత' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేయడం గమనార్హం. ప్రముఖ భూ చట్టాల నిపుణుడు, హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎం.సునీల్‌కుమార్ ఈ చట్టం వస్తే రాష్ట్రంలోని భూముల వ్యవస్థ ఎంతగా మారిపోతుందో చాలా కూలంకషంగా వివరించారు.

చంద్రబాబు కోసం హఠాత్తుగా యూటర్న్

రామోజీ గతంలో తాను ఈ చట్టానికి అనుకూలంగా ప్రసారం చేసిన వీడియోకి విరుద్ధంగా ఎన్నికల్లో చంద్రబాబు లబ్ధి కోసం తాజాగా యూటర్న్ తీసుకున్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి వ్యతిరేకంగా బురద జల్లే బాధ్యత తనపై వేసుకున్నారు. ఈ చట్టం ద్వారా రైతుల భూములకు భద్రత ఉంటుందని చెప్పిన నోటితోనే అది దుర్మార్గమంటూ నిస్సిగ్గుగా నాలుక మడతేశారు. రైతుల భూములు తెల్లారేసరికల్లా ఇతరుల పేరు మీదకు మారిపోతాయని, సీఎం జగన్ ప్రజల స్థిరాస్తులు లాక్కునేందుకే ఈ చట్టం తెచ్చారంటూ బరితెగించి దుష్ప్రచారానికి తెగబడ్డారు. ఈ అడ్డగోలు ప్రచారంతో ప్రజల మెదళ్లను విషపూరితం చేసేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అయితే ల్యాండ్ టైట్లింగ్ చట్టం చాలా మంచిదంటూ ఈటీవీ ప్రసారం చేసిన వీడియో తాజాగా వైరల్ కావడంతో పచ్చ మంద నోట్లో పచ్చి వెలక్కాయ పడింది. అందులో ఈ చట్టాన్ని సమర్థిస్తూ ఇది రాష్ట్రానికి అవసరమని, ఎంతో ప్రయోజనకరమని చెప్పిన అంశాలు చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. భూ హక్కుల చట్టం గురించి అంత గొప్పగా చెప్పి అది వస్తే భూములకు భరోసా వస్తుందని కితాబిచ్చిన రామోజీ ఇప్పుడు సిగ్గు విడిచి భూములు పోతాయని కల్లబొల్లి మాటలు చెప్పడం ఏమిటని అంతా విస్తుపోతున్నారు. చంద్రబాబు హయాంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి వదిలేసిన భూధార్ ప్రాజెక్టుకు ఈ చట్టం కొనసాగింపు అంటూ అదే కథనంలో ఈటీవీ కార్యక్రమంలో ప్రసారం చేశారు. అది అబద్ధమే అయినా సీఎం జగన్‌హయాంలో వచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టం గురించి చెప్పే క్రమంలో చంద్రబాబు చేయలేక వదిలేసిన భూధార్ గురించి ప్రస్తావించారు. ఈ ప్రత్యేక కథనంలో ల్యాండ్ టైట్లింగ్ చట్టం గొప్పదనం, దాని ఆవశ్యకత, రైతులకు చేకూరే ప్రయోజనాలు, భూముల వ్యవస్థలో వచ్చే మార్పుల గురించి సోదాహరణంగా వివరించారు. ఎంతో మంచి చట్టమని కితాబిచ్చిన రామోజీ ఎన్నికల వేళ ఈ స్థాయికి దిగజారడంపై ప్రజల్లో విస్మయం వ్యక్తమవుతోంది. దీనిబట్టి ఈనాడు, ఈటీవీ కార్యక్రమాలన్నీ ప్రజలను మభ్యపుచ్చడం, చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమేనని మరోసారి స్పష్టమైందని పేర్కొంటున్నారు.

ఆదరాబాదరాగా అదృశ్యం..

ఈ వీడియోతో తమ పరువు బజారున పడిందని గ్రహించడంతో నాలుక కరుచుకున్న రామోజీ ఆదరబాదరగా యూట్యూబ్‌లోని ఈటీవీ ఛానల్‌లో దాన్ని ఎవరూ చూడకుండా చేశారు. 2014 ఎన్నికల్లోనూ ప్రజలను మాయ చేసేందుకు చంద్రబాబు ఇష్టం వచ్చినట్లు హామీలిచ్చి మేనిఫెస్టో విడుదల చేశాడు. అనంతరం అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుతుండడంతో వాటి గురించి ఎవరికీ తెలియకూడదనే ఉద్దేశంతో టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించి తన దొంగ బుద్ధిని చాటుకున్నారు. ఇప్పుడు రామోజీ కూడా ఎంతో మంచిదని తాను ప్రసారం చేసిన ల్యాండ్ టైట్లింగ్ చట్టం వీడియోను ఈటీవీ యూట్యూబ్ ఛానల్‌లో కనపడకుండా మాయం చేశారు. తద్వారా రామోజీ, చంద్రబాబు ప్రజా ప్రయోజనాలు పట్టని గురు శిష్యులని మరోసారి స్పష్టంగా రుజువైంది. కాగా 2019లో ల్యాండ్ టైటిలింగ్ చట్టం బిల్లుకు అసెంబ్లీలో టీడీపీ మద్దతివ్వడం గమనార్హం. ఈ చట్టంతో భూ కబ్జాలకు తెర పడుతుందన్న టీడీపీ నేత పయ్యావుల కేశవ్ ప్రభుత్వ నిర్ణయాన్ని తమ పార్టీ పూర్తిగా సమర్థిస్తోందంటూ బిల్లుకు మద్దతు పలికారు. ఇప్పుడు ఎన్నికల ప్రయోజనాల కోసం 'యూటర్న్' తీసుకుని మీ భూములు లాక్కుంటారంటూ ప్రతి సభలోనూ చంద్రబాబు పెడబొబ్బలు పెడుతుండటంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. అసలు అమల్లోకి రాని చట్టంపై ఇంత దుష్ప్రచారమెందుకని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

ఈటీవీ అన్నదాత ప్రోగ్రాంలో ప్రసారం చేసి కొద్ది రోజుల తర్వాత డిలీట్ చేసిన వీడియో ఇక్కడ చూడొచ్చు
https://www.facebook.com/watch/?v=823345162980203

ఈటీవీలో ఏం చెప్పారంటే..

భూ యజమానులకు భద్రత కల్పించే టైటిల్ గ్యారంటీ చట్టం భవిష్యత్తులో రాబోతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే ఇది అమల్లోకి వచ్చింది. మీకు భూమి ఉంటే అది పట్టాదార్ పాస్ పుస్తకంలోగానీ ఆన్‌లైన్ రికార్డులోగానీ నమోదై ఉంటుంది. ప్రస్తుత విధానంలో భూములున్నా సరైన పాస్ పుస్తకాలు, ఇతర హక్కు పత్రాలు లేక రికార్డుల్లో సరైన వివరాలు నమోదు కానందువల్ల భూ యజమానులు ఒక్కోసారి ఇబ్బందులు పడుతున్నారు. కొత్త చట్టాన్ని అనుసరించి భూ యజమానులు తమ వివరాలను నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. టైటిల్ రిజిస్టర్‌లో ఎవరి పేరు ఉంటే ఆ వ్యక్తినే భూ యజమానిగా పరిగణించి ప్రభుత్వం ఆ భూమికి గ్యారంటీ కల్పిస్తుంది.

ఏ1 చంద్రబాబు.. ఏ2 లోకేశ్

- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై పథకం ప్రకారమే విష ప్రచారం
- ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన సీఐడీ
- ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి ఎన్నికల లబ్ధికి కుతంత్రం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసేలా దుష్ప్రచారానికి కుట్ర పన్నినట్లు నిర్ధారణ అయింది. భూములకు సంపూర్ణ భద్రత కల్పించే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను వక్రీకరించి అవాస్తవాలు ప్రచారం చేయడం ద్వారా ఓటర్లను ప్రభావితం చేయాలన్న కుతంత్రం వెనుక ప్రధాన కుట్రదారు చంద్రబాబేనని నిగ్గు తేలింది. టీడీపీ దుష్ప్రచారంపై వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేయడంతో ఎన్నికల కమిషన్ తక్షణం స్పందించింది. ఈ అంశంపై తక్షణం తగిన చర్యలు తీసుకుని తమకు నివేదించాలని సీఐడీని ఆదేశించిన విషయం తెలిసిందే. సీఐడీ చేపట్టిన దర్యాప్తులో ఈ కుట్ర గుట్టు వీడింది. చంద్రబాబు, లోకేశ్ పన్నాగం ప్రకారమే టీడీపీ, ఆ పార్టీ ఎన్నికల ప్రచార బృందాలు ఈ కుట్రకు తెరతీశాయని సీఐడీ నిర్ధారించింది. దాంతో ఏ 1గా చంద్రబాబు, ఏ 2గా లోకేశ్, ఏ 3గా టీడీపీ, ఆ పార్టీ ఎలక్ట్రానిక్ క్యాంపెయిన్ టీమ్‌లతోపాటు పలువురిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. ఐపీసీ సెక్షన్లు 171(ఎఫ్),(జి), 188, 505(2) రెడ్‌విత్ 120 (బి) కింద అభియోగాలు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసింది.

కుట్రదారు చంద్రబాబే..

అవాస్తవాలు, అభూత కల్పనలతో ప్రచారం చేయడం ఎన్నికల నియమావళికి విరుద్ధం. భయభ్రాంతులకు గురి చేయడం, ప్రలోభాలకు గురి చేయడం, సమాజంలో విద్వేషాలను రేకెత్తించేలా ప్రచారం చేయకూడదని ఎన్నికల నియమావళి స్పష్టంగా చెబుతోంది. భూ హక్కు చట్టం (ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్)పై పక్కా పన్నాగంతో చంద్రబాబు దుష్ప్రచార కుట్రకు తెర తీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద చల్లేందుకు పన్నిన కుట్రలన్నీ బెడిసి కొట్టడంతో ఆయనకు దిక్కు తోచడం లేదు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్లు, వృద్ధాప్య పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలపై టీడీపీ చేసిన దుష్ప్రచారం బెడిసికొట్టింది. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని ప్రజలు గుర్తించారు. దీంతో బెంబేలెత్తిన చంద్రబాబు కొత్త కుట్రకు తెరతీశారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై అపోహలు వ్యాప్తి చేయాలని పథకం వేశారు. లోకేశ్, టీడీపీ ఎలక్ట్రానిక్ ప్రచార విభాగంతోపాటు ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు, సాంకేతిక నిపుణులు ఇందులో భాగస్వాములు అయ్యారు. ఈ చట్టం ద్వారా ప్రజల భూములను గుంజుకుంటారని, కబ్జా చేసేస్తారని, పత్రాలు మాయం చేస్తారని, ఇళ్ల నుంచి వెళ్లగొడతారని ప్రజలను బెదిరింపులకు గురి చేసేలా ఈ ముఠా దుష్ప్రచారానికి తెగించింది. ఏకంగా ఓటర్లకు ఫోన్లు చేసి మరీ భయాందోళనలకు గురి చేస్తోంది. మంగళగిరితోపాటు హైదరాబాద్, బెంగళూరు, ఇండోర్, చండీఘడ్ తదితర ప్రాంతాల నుంచి రాష్ట్రంలోని ఓటర్లకు ఫోన్లు చేస్తూ హడలెత్తించేందుకు యత్నించారు. టీడీపీకి వంతపాడే ఈనాడు, ఈటీవీ, ఎల్లో మీడియా పత్రికలు, చానళ్లతోపాటు టీడీపీ సోషల్ మీడియా విభాగం పక్కా పన్నాగంతో ఈ దుష్ప్రచారాన్ని తీవ్రతరం చేశాయి.

ఈసీ ఆదేశాలతో..

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై టీడీపీ దుష్ప్రచారంపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేసింది. ఐవీఆర్ కాల్ రికార్డింగులతోపాటు ఇతర ఆధారాలను అందచేసింది. దీనిపై తీవ్రంగా స్పందించిన ఎన్నికల సంఘం ఈ అంశంపై దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని సీఐడీని ఆదేశించింది. ఐవీఆర్‌ఎస్ కాల్స్, ఇతర ఆధారాలను పరిశీలించి విశ్లేషించిన సీఐడీ దర్యాప్తు అధికారులు ఈ కుట్ర వెనుక చంద్రబాబు, లోకేశ్, టీడీపీ ఎలక్ట్రానిక్ ప్రచార విభాగం కీలక పాత్ర పోషించినట్లు ఆధారాలతో నిగ్గు తేల్చారు.

టీడీపీ కార్యాలయానికి నోటీసులు

ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారం వెనుక చంద్రబాబు, లోకేశ్ తదితర కుట్ర ఉన్నట్లు నిర్ధారణ కావడంతో సీఐడీ దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసులో నిందితులకు నోటీసులు జారీ చేసి విచారించేందుకు సిద్ధమైంది. ఈమేరకు సీఐడీ బృందం ఆదివారం నోటీసులు అందించేందుకు మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయానికి వెళ్లగా ఆ సమయంలో ఎవరూ అందుబాటులో లేరు. పార్టీ ప్రధాన కార్యాలయం వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబుతో సీఐడీ అధికారులు ఫోన్‌లో మాట్లాడి కార్యాలయ సిబ్బందికి నోటీసులు అందించారు. టీడీపీ ఎలక్ట్రానిక్ ప్రచార విభాగం ప్రతినిధులు సోమవారం సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. ఈ కేసులో ఏ1 చంద్రబాబు, ఏ2 లోకేశ్‌తోపాటు ఇతర టీడీపీ నేతలను కూడా విచారించాలని సీఐడీ నిర్ణయించింది. ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో ఈ కేసు దర్యాప్తులో సీఐడీ దూకుడు పెంచింది. త్వరలోనే ఈ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నేరపూరిత కుట్రే.. నియమావళికి విరుద్ధం

కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై టీడీపీ సాగిస్తున్న దుష్ప్రచారం ఎన్నికల నియమావళి ఉల్లంఘనే కాకుండా నేరపూరిత కుట్రగా సీఐడీ నిర్ధారించింది. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి అక్రమంగా ఎన్నికల లబ్ధికి యత్నించడంతోపాటు సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేందుకు టీడీపీ కుతంత్రం పన్నినట్టు నిగ్గు తేల్చింది. ఐపీసీ సెక్షన్లు 171(ఎఫ్),(జి), 188, 505(2) రెడ్‌విత్ 120(బి) కింద అభియోగాలు నమోదు చేసింది.

171(ఎఫ్)(జి): ఎన్నికల్లో అసత్య ప్రచారం, అభ్యంతరకరమైన రీతిలో ప్రచారం ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు కుట్ర పన్నడం.

188: ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం. చట్టాన్ని ఉల్లంఘించి ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు కుట్ర పన్నడం

505(2): అసత్య ప్రచారం ద్వారా సమాజంలో వర్గ విభేదాలు రెచ్చగొట్టడం, సామరస్య వాతావరణానికి విఘాతం కల్పించడం, పరస్పర శతృత్వాన్ని ప్రేరేపించడం.

120(బి): కుట్రపూరితంగా వ్యవహరించడం, నేరానికి పాల్పడటం.

టీడీపీ ఫిర్యాదుపై నివేదిక ఇవ్వండి

తమ పార్టీపై ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ టీడీపీ చేసిన ఫిర్యాదుపై ఎన్నికల సంఘం మర్నాడే స్పందించింది. ఐవీఆర్ కాల్స్ ద్వారా వైఎస్సార్‌సీపీ తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుపై తప్పుడు ప్రచారం చేస్తోందంటూ టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య శనివారం ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలన జరిపి ఎన్నికల నియమావళి మేరకు తగిన చర్యలు తీసుకొని నివేదిక ఇవ్వాలని సీఐడీని ఆదేశించింది.

స్వయంగా లోకేశ్ దుష్ప్రచారం

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచార కుట్రను నారా లోకేశ్ స్వయంగా అమలు చేయడం గమనార్హం. చట్టం గురించి అవాస్తవాలు, అభూత కల్పనలతో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసేలా లోకేశ్ మాట్లాడిన కాల్ రికార్డింగ్స్ ఐవీఆర్ కాల్స్‌గా ఓటర్ల సెల్ ఫోన్లకు వస్తున్నాయి. టీడీపీ పేరిట వస్తున్న ఈ ఐవీఆర్‌ఎస్ కాల్స్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈసీ శనివారం ఆదేశించిన నేపథ్యంలో సీఐడీ ఆదివారం ఉదయం కేసు నమోదు చేసింది. అయినా సరే ఆదివారం రాత్రి కూడా లోకేశ్ మాటలతో ఐవీఆర్ కాల్స్ రావడం గమనార్హం. 7313771502 అనే నంబర్ నుంచి లోకేశ్ కాల్ రికార్డింగులు ఓటర్ల సెల్ ఫోన్లకు వచ్చాయి. ఈసీ ఆదేశాలను ఖాతరు చేయకుండా టీడీపీ ఎంతగా బరితెగించిందో స్పష్టమవుతోంది. లోకేశ్‌ను ఏ2గా పేర్కొంటూ దీనిపై ఇప్పటికే కేసు నమోదు కాగా స్వయంగా లోకేశ్ మాట్లాడి రికార్డ్ చేసిన కాల్స్ రావడంతో ఈ కేసులో తీవ్రత మరింత పెరిగింది.

భూహక్కు చట్టం రద్దు చేస్తామని మోదీతో చెప్పిస్తావా?: మంత్రి వేణు



రాజమహేంద్రవరం రూరల్: నిత్యం అబద్ధాలతో ప్రజలను పట్టి పీడిస్తున్న చంద్రబాబు.. ఇప్పుడు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై విష ప్రచారానికి తెరలేపారని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని నీతి ఆయోగ్ 2019లో ప్రతిపాదించగా, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు పంపిందని చెప్పారు. ఈ చట్టం రాష్ట్రంతోపాటు ఎక్కడా ఇంకా అమలు కావడం లేదని స్పష్టంచేశారు. అయినప్పటికీ బాబు దుష్ప్రచారం మొదలు పెట్టడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయిస్తామని సోమవారం రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీతో బాబు ప్రకటన చేయించగలరా... అని సవాల్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ అమలుకాని చట్టాన్ని రద్దు చేస్తానని బాబు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎప్పుడో వందేళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని, దీనిపై చేపట్టిన రీ సర్వే ఇప్పటివరకు 4వేల గ్రామాల్లో పూర్తయిందని, ఇంకా 13వేల గ్రామాల్లో చేయాల్సి ఉందని చెప్పారు. దీనిపై కూడా ఏదో జరిగిపోతోందని బాబు దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవినీతికి తావులేకుండా పాలన సాగిస్తుంటే తట్టుకోలేక సంక్షేమ పథకాల్లో ఎక్కడా వేలెత్తి చూపలేక, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్, ల్యాండ్ రీ సర్వే గురించి పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజల్లో భయం సృష్టించి లబ్ధి పొందాలని చూడటం బాబు కుటిల రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను సృష్టించిన పాత్రలను వేరే పార్టీల్లోకి పంపించి నీతిలేని అరాచక రాజకీయాలను బాబు కొనసాగిస్తున్నారని మంత్రి వేణు విమర్శించారు. అవ్వాతాతలకు ప్రతి నెలా పెన్షన్లు, ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్ వ్యవస్థపై అక్కసు వెళ్లగక్కి, వారి సేవలను ఆపేసిన బాబు కచ్చితంగా అవ్వాతాతల శాపానికి గురికాక తప్పదన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ నీతి ఆయోగ్ సూచన మాత్రమే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



రాజమహేంద్రవరం సిటీ: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ విషయంలో నీతి ఆయోగ్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచన మాత్రమే చేసిందని, తప్పనిసరి మాత్రం కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. ఆమె ఆదివారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతూ నీతి ఆయోగ్ సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా చట్టాన్ని చేయాలనే నిబంధన లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వమే చర్యలు చేపట్టిందన్నారు. ఈ చట్టంపై అసత్య ప్రచారాలు చేసిన నేపథ్యంలో చంద్రబాబు, లోకేశ్‌లపై ఈసీ కేసు నమోదు చేసిన విషయంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ఈసీ పూర్వాపరాలను పరిశీలిస్తుందని వ్యాఖ్యానించారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై అనవసర రాద్ధాంతం

- వందేళ్ల నాటి చట్టాలతో ఏళ్ల తరబడి భూ వివాదాలు
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఒక మహత్తర చట్టం
- వివాదాలు లేకుండా భూ యజమానులకు శాశ్వత హక్కులు
- సీఎం వైఎస్ జగన్‌పై బురద చల్లడం తగదు
- అఖిల భారత బీసీ సమాఖ్య అధ్యక్షుడు జస్టిస్ వి.ఈశ్వరయ్య



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చేందుకు ప్రతిపాదించిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నారని అఖిల భారత బీసీ సమాఖ్య అధ్యక్షుడు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య అన్నారు. ఆయన ఆదివారం గుంటూరులోని ఐటీసీ హోటల్లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వందేళ్ల కిందట బ్రిటీష్‌కాలంలో భూముల సర్వే చేశారని, అనంతరం మళ్లీ సమగ్రమైన సర్వే జరగలేదని చెప్పారు. భూ యాజమాన్య హక్కులు, హద్దులపై రాష్ట్రవ్యాప్తంగా కోర్టుల్లో వేలాది కేసులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. భూ వివాదాలతో ప్రజలు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఈ తరుణంలో సమగ్ర భూసర్వే ద్వారా భూములకు యజమానులను గుర్తించి, సంబంధిత భూములపై వారికే శాశ్వత రీతిలో హక్కులను కల్పించేందుకు సీఎం జగన్ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ అనే మహత్తరమైన చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. భూములకు సంబంధించిన వివాదాలను పరిష్కరించి, యజమానులకు శాశ్వత హక్కులు కల్పించడంతోపాటు డిజిటల్ రికార్డుల రూపంలో వాటిని భద్రపర్చడం ఎంతో గొప్ప కార్యక్రమమని చెప్పారు. గత ప్రభుత్వాలే కాకుండా దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లో ఇంత గొప్ప కార్యక్రమాన్ని ఏ ముఖ్యమంత్రి చేపట్టలేదని వివరించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై రాజకీయ నేతలు కనీస అవగాహన లేకుండా మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొట్టడం, సీఎం జగన్‌పై బురదచల్లడం తగదన్నారు.

అడ్డగోలుగా ఫిలిం సిటీ కట్టిన రామోజీ

రైతుల భూములు ఆక్రమించి అడ్డగోలుగా ఫిలిం సిటీని నిర్మించిన రామోజీరావు తన ఈనాడు పత్రిక ద్వారా నిత్యం తప్పుడు వార్తలు రాస్తూ సీఎం వైఎస్ జగన్‌పై అభాండాలు వేస్తున్నారని జస్టిస్ ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల భూములు లాగేసుకుంటారంటూ వైఎస్ జగన్ ప్రభుత్వంపై నిత్యం ఈనాడులో తప్పుడు రాతలు రాస్తున్న రామోజీరావు... గతంలో రామోజీ ఫిలింసిటీలో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై హైకోర్టు జడ్జిగా తాను స్టే ఇచ్చిన విషయం మరిచారా.. అని ప్రశ్నించారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెబుతున్న బీజేపీతో జట్టు కట్టిన టీడీపీ, జనసేనలను ప్రజలు నమ్మబోరని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను కూడా రద్దు చేసే ఆలోచనలో బీజేపీ ఉందన్నారు.

బీసీ విద్యార్థులకు న్యాయంచేసిన సీఎం జగన్

వైద్య విద్య సీట్ల కేటాయింపులో సీఎం జగన్ బీసీ విద్యార్థులకు న్యాయంచేశారని జస్టిస్ ఈశ్వరయ్య చెప్పారు. బీసీ కోటాలో సీటు పొంది, ఓపెన్ మెరిట్‌లోకి వెళ్లిన విద్యార్థుల సీట్లను తిరిగి బీసీ కోటాలోనే భర్తీచేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గత ప్రభుత్వంలో చంద్రబాబు అమలు చేయలేదన్నారు. ఫలితంగా బీసీ కోటాలో ఏటా దాదాపు 500 ఎంబీబీఎస్ సీట్లను బీసీ విద్యార్థులు కోల్పోతున్న విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా... బీసీ కోటా సీట్లు బీసీ విద్యార్థులతోనే భర్తీ చేసేవిధంగా ఆదేశాలు ఇవ్వడంతోపాటు సక్రమంగా అమలు చేయిస్తున్నారని వివరించారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతి కోసం పాటుపడుతున్న సీఎం జగన్‌కు బీసీలు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుత ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్నవేనని, అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్ సీఎంగా ఉండాలని జస్టిస్ ఈశ్వరయ్య స్పష్టంచేశారు. హైకోర్టు న్యాయవాది ఠాగూర్ యాదవ్, ప్రభుత్వ మాజీ న్యాయవాది పోకల వెంకటేశ్వర్లు, బీసీ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆ చట్టంపై బాబు దొంగ నాటకం

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- అసెంబ్లీలో ఆ బిల్లుకు టీడీపీ మద్దతిచ్చిందని స్పష్టీకరణ
- ఆనాడు టీడీపీ సభ్యుడు పయ్యావుల ప్రసంగం వీడియో ప్రదర్శన
- ఇప్పుడు ఆ చట్టం పైనే చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- చంద్రబాబు నగ్న స్వరూపాన్ని ప్రజలందరూ గమనించాలని వినతి
- దీనిపై ప్రజాకోర్టులో బాబు సంజాయిషీ ఇచ్చుకోవాలని డిమాండ్



సాక్షి, అమరావతి: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆడుతున్న దొంగ నాటకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సాక్ష్యాధారాలతో బట్టబయలు చేశారు. అసెంబ్లీలో 2019 జూలై 29న ల్యాండ్ టైట్లింగ్ బిల్లుకు ఆమోదం తెలుపుతూ ప్రతిపక్ష టీడీపీ సభ్యుడు పయ్యావుల కేశవ్ చేసిన ప్రసంగం వీడియోను ఆయన ఆదివారం మీడియా ముందు ప్రదర్శించారు. ఈ బిల్లును స్వాగతిస్తున్నామని, ఎవరి భూములపై వారికి భద్రత కల్పించేందుకు కేంద్రం తెచ్చిన చట్టాన్ని ఇప్పటికే కర్ణాటక సర్కార్ భూమి పేరుతో అమలు చేస్తోందని పయ్యావుల కేశవ్ ఆనాడు అసెంబ్లీలో అన్నారని గుర్తు చేశారు. ఈ చట్టం 1858 నుంచి ఆస్ట్రేలియా దేశంలో అమలవుతోందని, ప్రపంచంలో అనేక దేశాల్లో ఉందని కేశవ్ చెప్పారన్నారు. ఆనాడు బిల్లుకు అసెంబ్లీలో మద్దతిచ్చి, ఆమోదించిన ప్రతిపక్ష నేత, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ఆ చట్టంపై దుష్ప్రచారం చేస్తూ, రద్దు చేస్తామని చెబుతూ ఆయన నగ్న స్వరూపాన్నీ ఆయనే బయట పెట్టుకున్నారని, దీనిని ప్రజలందరూ గమనించాలని చెప్పారు. ఎవరి భూములపై వారికి సర్వ హక్కులు, భద్రత కల్పిస్తూ సీఎం జగన్ ఆదర్శప్రాయమైన నిర్ణయం తీసుకుంటే అడ్డగోలుగా ఆరోపణలు చేస్తారా అంటూ మండిపడ్డారు. దీనిపై ప్రజాకోర్టు బోనులో నిలబడి చంద్రబాబు సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాబు స్వార్థ ప్రయోజనాల కోసం 5 కోట్ల మంది ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారని అన్నారు. ప్రపంచంలో ఇంతకంటే నీచులు.. రాజకీయ వ్యభిచారులు ఎవరైనా ఉంటారా అంటూ తూర్పారబట్టారు. సీఎం జగన్‌ను ఎత్తి చూపేందుకు ఏ అస్త్రాలూ లేకపోవడంతో ఎలాగైనా అధికారంలోకి రావాలనే కుట్రతో చంద్రబాబు ఇలా దిగజారి వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి పట్టిన చీడ చంద్రబాబేనని, దీనిని ఆయనే మరోసారి రుజువు చేసుకున్నారని చెప్పారు. కేంద్రం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి టీడీపీ ఏజెంట్‌లా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశమంతా బీజేపీ ఒకలా ఉంటే.. రాష్ట్రంలో మాత్రం టీడీపీ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ రాష్ట్ర విభాగం పనిచేస్తోందని అన్నారు. పురందేశ్వరి రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ల్యాండ్ టైట్లింగ్ ఆశయాలు గొప్పవి

- 2019 జూలై 29న అసెంబ్లీలో టీడీపీ నేత పయ్యావుల ప్రసంగం
- బిల్లుకు అసెంబ్లీలో టీడీపీ ఆమోదం
- రీ సర్వే సాహసోపేతం
- ఎన్నికల వేళ అనవాయితీగా నాలుక మడతేసిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: ప్రతి విషయంలోనూ రెండు నాలుకల ధోరణిని పాటించే ప్రతిపక్ష నేత చంద్రబాబు ల్యాండ్ టైట్లింగ్ చట్టంపైనా అదే రీతిలో వ్యవహరిస్తున్నారు. గతంలో ఈ చట్టానికి అసెంబ్లీలో ఆమోదం తెలిపి సంపూర్ణ మద్దతు ప్రకటించిన చంద్రబాబు ఇప్పుడు బురద చల్లుతుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 జూలైలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ల్యాండ్ టైట్లింగ్ బిల్లును ప్రవేశపెట్టింది. అదే ఏడాది జూలై 29న దీనిపై సభలో జరిగిన చర్చలో టీడీపీ తరఫున పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఈ బిల్లుకు మద్దతు తెలిపి పలు సూచనలు కూడా చేశారు. నాడు పయ్యావుల ఏమన్నారంటే..

బిల్లు అవసరాన్ని కేంద్రం కూడా గుర్తించింది

ఈ బిల్లు తప్పకుండా ఒక పాజిటివ్ డైరెక్షన్‌లో వెళ్లే బిల్లు. బిల్లుని మేం ఆమోదిస్తున్నాం. మంత్రిగారు లక్ష్యాన్ని చాలా స్పష్టంగా చెప్పారు. ఇవాళ భూములు కొనాలంటే భయపడే పరిస్థితులున్నాయి. అది నిజమైన టైటిలా? డిస్ప్యూటెడ్ (వివాదాస్పద) టైటిలా? అనేది తెలియడంలేదు. ఈ పరిస్థితుల్లో ఈ బిల్లు అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించింది. ల్యాండ్ టైటిల్ క్లియర్‌గా లేకుంటే సమస్య అవుతుందనే ఉద్దేశంతో నేషనల్ ల్యాండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ స్కీమ్ ప్రారంభించి రాష్ట్రాలన్నీ అమలు చేయాలని కోరింది.



కర్ణాటకలో భూమి పేరుతో ఈ ప్రాజెక్టు అమల్లో ఉంది. ఈ ప్రాజెక్టు మన దేశానికి కొత్త కావచ్చు కానీ 1858లోనే ఆస్ట్రేలియాలో ఉంది. టోరెన్స్ సిస్టమ్ ఆఫ్ ల్యాండ్ టైట్లింగ్ అనే విధానం.. అంటే టైటిల్‌కి ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది. ఆ తర్వాత చాలా దేశాలు దీన్ని అమలు చేశాయి. రాజస్థాన్–2016లోనే దాదాపు ఇలాంటి చట్టాన్నే పాస్ చేసింది. కానీ ప్రాక్టికల్‌గా అమల్లోకి వెళ్లినట్లు కనపడలేదు. ఆశయాలు మాత్రం చాలా గొప్పవి. ఆచరణలో ఈ ప్రభుత్వమే కాదు.. ఎవరు చేపట్టినా చాలా సమస్యలతో కూడుకున్నది ఇది. చిక్కులను తొలగించేందుకు ఈ ప్రభుత్వానికి చాలా టైమ్ పడుతుంది. దాంట్లో ఏమాత్రం అనుమానం లేదు. ఇది రెండేళ్లలో అవుతుందా? నాలుగేళ్లు పడుతుందా? ఐదేళ్లు పడుతుందా? అనేది పక్కన పెడితే తప్పకుండా ఇదొక పాజిటివ్ డైరెక్షన్‌లో వెళ్లే బిల్లు అవుతుంది.

రీ సర్వే సాహసోపేతం

ల్యాండ్ టైట్లింగ్‌కంటే ముందు సర్వే చేయాలి. సర్వే కూడా ప్రభుత్వం పెద్దఎత్తున చేసే ఆలోచనలో ఉందని తెలిసింది. చాలా బృహత్తర కసరత్తు. 1900 సంవత్సరంలో ల్యాండ్ సర్వే డిపార్టుమెంట్ ఏర్పడితే 1970కి గానీ మనకి అప్‌డేటెడ్ రికార్డులు రాలేదు. మనం రెండేళ్లలో చేస్తామంటున్నాం. టెక్నాలజీ, మ్యాన్ పవర్ ఉన్నా ఇదొక సాహసోపేతమైన చర్య. సరిగ్గా చేయకపోతే ఇదొక దుస్సాహసం అయ్యే పరిస్థితులు కూడా ఉన్నాయి. ప్రజలకు భూమి మీద ఉన్న మమకారం చాలా గొప్పది. కాబట్టి చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేయాలి. నాకు తెలిసి రూ.1500 కోట్లు అవసరమయ్యే ప్రాజెక్టు ఇది. ప్రభుత్వంలో ఎవరున్నా రీ సర్వే 40 ఏళ్లకు ఒకసారి నిర్వహించాలి. ఇది కచ్చితంగా ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే చర్య.

భూహక్కుల పరిరక్షణకే చట్టం

వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి

కావలి: భూహక్కుల పరిరక్షణ కోసం రూపొందించిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు అసత్యాలు ప్రచారం చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి మండిపడ్డారు. ఆయన ఆదివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దగదర్తిలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని పేదలు, ఎస్సీలు, ఎస్టీలు, ఆదివాసీలు, బడుగు, బలహీనవర్గాలవారి భూములను పరిరక్షించి, వారి భూహక్కులను కాపాడాలనే సమున్నత లక్ష్యంతో ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌కు రూపకల్పన చేసిందని విజయసాయిరెడ్డి చెప్పారు. ఈ చట్టం అమల్లోకి వస్తే భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభించడంతోపాటు పేదల భూములకు రక్షణ లభిస్తుందని వివరించారు.



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

భూహక్కుల రక్షణలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ ఉన్నతంగా రూపొందించిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆదివాసీల భూములు అప్పనంగా లాక్కుంటున్న తన సామాజికవర్గం ప్రయోజనాలు దెబ్బతింటాయనే భయంతో తనకు సలహాలిస్తున్న రామోజీరావు సూచనలతోనే చంద్రబాబు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని తెలిపారు. కబ్జాలకు అలవాటుపడిన చంద్రబాబు, రామోజీ బ్యాచ్‌కు నూతన సంస్కరణలు నచ్చడం లేదన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా పేదల భూహక్కుల పరిరక్షణ బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదే అవుతుందని విజయసాయిరెడ్డి స్పష్టంచేశారు. పేదల భూములకు ఇబ్బందులు ఎదురైతే వారి తరఫున ప్రభుత్వమే పోరాటం చేసేలా ఈ చట్టం రక్షణ కల్పిస్తుందని వివరించారు. రాష్ట్రంలోని పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

ఆ చట్టం తెచ్చింది బీజేపీ ప్రభుత్వమే

- మంచిది కాదని ఆ పార్టీ నేతలతో చెప్పించే దమ్ముందా?
- బాబు, పవన్‌లకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు సవాల్



సాక్షి, అమరావతి: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని, ఈ చట్టం అమల్లోకి రాకముందే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పచ్చ మీడియాతో కలసి కుట్రపూరితంగా విషం చిమ్ముతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ చట్టం మంచిది కాదని బీజేపీ నేతలతో చెప్పించే దమ్ముందా.. అని చంద్రబాబు, పవన్‌లకు ఆయన సవాల్ విసిరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం సుధాకర్‌బాబు మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలోని 17వేల గ్రామాలకుగాను కేవలం ఆరు వేల గ్రామాల్లోనే భూముల రీసర్వే పూర్తయింది. అన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తయిన అనంతరం ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుంది. రైతులు, భూయజమానులు అభ్యంతరాలు తెలియజేయవచ్చు. ప్రతి ఒక్కరి అనుమానాలు నివృత్తి చేసి, సమస్యలను పరిష్కరించిన అనంతరమే ఈ చట్టం అమలుచేసే అవకాశం ఉంది. ఇదంతా జరిగేందుకు మరో రెండు, మూడేళ్ల సమయం పడుతుంది. కానీ, ఎన్నికల్లో లబ్ధి కోసం ఇప్పుడు అసత్యప్రచారం చేస్తున్నారు. పేదలు, రైతుల భూములు దోచుకున్న చంద్రబాబు, రామోజీరావులకు అసలు ఈ విషయంపై మాట్లాడే నైతిక హక్కు లేదు. ఫిలింసిటీ కోసం వందల ఎకరాలను రైతుల నుంచి అక్రమంగా దోచుకున్న రామోజీరావు ఇప్పుడు నిస్సిగ్గుగా సీఎం జగన్ పేదల భూములు దోచుకుంటారని విషం చిమ్మడం సిగ్గుచేటు. రాష్ట్రంలోని 31లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన సీఎం జగన్.. పేదల భూములను దోచుకుంటారా? ప్రజలందరూ ఆలోచించాలి. అమిత్‌షా పోలవరం గురించి మాట్లాడటం సిగ్గుచేటు. ఆ ప్రాజెక్టును ఏటీఎంలాబాబు వాడుకున్నారని ప్రధాని మోదీ బహిరంగంగా ప్రకటించారు. మరి ఇవాళ బాబు మంచివాడు అయిపోయారా? అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మబోరు' అని సుధాకర్‌బాబు అన్నారు.

కేంద్రం తెచ్చిన భూహక్కు చట్టాన్ని బాబెలా రద్దు చేస్తారు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: కేంద్రంలో భూహక్కు చట్టం తీసుకొచ్చిన బీజేపీతో కలిసి ఎన్నికల్లోకి వెళుతున్న చంద్రబాబు ఆ చట్టాన్ని ఎలా రద్దు చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజలను మోసగించేందుకే భూ హక్కుల చట్టాన్ని రద్దు చేస్తానని బాబు చెబుతున్నారని ధ్వజమెత్తారు. బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన అబద్ధాల మోదీని, ఆయనతో జతకట్టిన టీడీపీ, జనసేన నేతలను ప్రజలంతా నిలదీయాలని వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీతో కలిసి బాబు ఎలా న్యాయం చేస్తాడో చెప్పాలని ప్రశ్నించారు. ఇండియా వేదికలోని పార్టీల అభ్యర్థులను రాష్ట్రంలో గెలిపించాలని శ్రీనివాసరావు కోరారు.

ఆ చట్టంపై బాబు రాద్ధాంతం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ప్రచారం కోసం ఎక్కడికెళ్లినా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ గురించి చంద్రబాబు మాట్లాడుతున్నారని, అసలు ఆ చట్టం తెచ్చిందే బీజేపీ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీట్ ది ప్రెస్ నిర్వహించారు. ఈఆయన మాట్లాడుతూ ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే బాబు పక్కా కన్ఫ్యూజన్ పొలిటీషియన్ అన్నారు. ఓ వైపు ఆర్‌ఎస్‌ఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలంటుంటే, బాబు ఎన్డీయే కూటమిలో చేరి ముస్లింలకు 4% రిజర్వేషన్ కోసం పోరాడతానని చెబుతున్నారని, అంతగా పోరాడటానికి అసలు ఎన్డీయే కూటమిలో ఎందుకు చేరారో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం ఏం చేయలేదని బాబు చెప్పిన విషయాన్ని రామకృష్ణ గుర్తు చేశారు. ఇప్పుడేమో ఎన్డీయే నుంచి సహకారం వస్తుందని చెబుతున్నాడని, అసలు బాబు అప్పుడు చెప్పింది కరెక్టా? ఇప్పుడు చెబుతోంది కరెక్టా? చెప్పాలని నిలదీశారు.



మీ పిల్లలకు కేవలం ఎలా చదవాలో మాత్రమే బోధించవద్దు.
చదివినదాన్ని ఎలా ప్రశ్నించాలో కూడా చెప్పండి.
– రిచర్డ్ ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 6 మే 2024

వేసవి అభ్యాసం

'జాగ్రత్తమ్మా సుభద్ర... అక్కడకు వెళ్లాక ఆ వైభోగంలో మమ్మల్ని మర్చిపోతావేమో' అంటుంది రేవతి పాత్రధారి ఛాయాదేవి సుభద్ర పాత్రధారైన ఋష్యేంద్రమణితో 'మాయాబజార్'లో. అప్పటికి పాండవుల స్థితి చెడలేదు. ఇంద్రప్రస్థం నుంచి పుట్టిల్లైన ద్వారకకు సుభద్ర రాకపోకలు సాగుతున్నాయి. సోదరులైన బలరాముడు, కృష్ణుడు ఆదరిస్తున్నారు. మేనకోడలైన శశిరేఖను తన కుమారుడైన అభిమన్యుడికి చేసుకోవాలని సుభద్ర తలపోస్తోంది. రేవతి ఉబలాటపడుతోంది. పిల్లలు ముచ్చటపడి ఆశ కూడా పెట్టుకున్నారు. కాని ఒక్కసారిగా పరిస్థితి మారి జూదంలో పాండవుల రాజ్యం పోయింది. అడవుల పాలు కావాల్సి వచ్చింది. ఒకనాడు సుభద్ర రాకకోసం వేయికళ్లతో ఎదురు చూసిన రేవతి ఇప్పుడామె చెడి పుట్టింటికి చేరితే ఏం చేసింది? దొంగ శిరోభారంతో పడకేసింది. పాడ గిట్టనట్టుగా చూసింది. మనుషులు అలా ఉంటారు.

పాండవులకు అన్యాయం జరిగిందని తెలిసి బలరామ పాత్రధారి గుమ్మడి వీరావేశంతో కౌరవుల భరతం పట్టడానికి బయలుదేరినప్పుడు భయంతో దుర్యోధన పాత్రధారి ముక్కామల కంపిస్తే, శకుని పాత్రధారి సి.ఎస్.ఆర్. 'భయమెందుకు? ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి ఉండనే ఉంది' అని ఊరుకోబెడతాడు. వేంచేసిన బలరాముడిపై పూలవర్షం కురిపించి, కన్యకామణుల చేత పన్నీరు చిలకరింపచేసి ప్రసన్నం చేసుకుంటాడు. భరతం పడతానన్న బలరాముడే 'ధర్మజూదంలో జయించడం ధర్మయుద్ధంలో జయించినంత పుణ్యమే' అని రాజ్యం లాక్కున్న కౌరవులను ప్రశంసిస్తాడు. అంతేనా? దుర్యోధనుడి కుమారుడైన లక్ష్మణ కుమారుడికి తన కుమార్తె శశిరేఖను కట్టబెట్టే వరం ఇస్తాడు– చెల్లెలు సుభద్రకు ఇచ్చిన మాట మరిచి. మనుషులు అలా కూడా ఉంటారు.

ధర్మరాజు రాజసూయం చేయడం, మయసభ కట్టడం దుర్యోధనుడికి కంటగింపు అయ్యింది. కయ్యానికి అసలు కారణం అదే. ద్రౌపది నవ్వు మిష. అది గమనించిన శకుని 'తలలో ఆలోచనలు చేతిలో పాచికలు... వీటితో పాండవులను సర్వనాశనం చేస్తాను' అన్నప్పుడు ప్రకృతి కలవరపడి వెర్రిగాలితో వద్దు వద్దు అని సంకేతం ఇస్తుంది. కాని దుర్యోధనుడు వినడు. శకుని విననివ్వడు. సిరిని ప్రదర్శనకు పెట్టి ధర్మరాజు చెడ్డాడు. అది చూసి అసూయతో దుర్యోధనుడు మునిగాడు.

'రాజ్యాలు పోయినా పరాక్రమాలు ఎక్కడికి పోతాయి' అని సుభద్ర అంటుంది కాని పరాక్రమం లేకపోయినా అందలం ఎక్కాలనుకునేవారు ఉంటారు. వారికి భజన చేసి పబ్బం గడుపుకునేవారూ ఉంటారు. లక్ష్మణ కుమారుడు రేలంగి ఎప్పుడూ అద్దం ముందే ఉంటాడు. అలంకరణప్రియుడు వీరుడే కాదు. మరి ఇతని గొప్పతనమో? 'అటు ఇద్దరె ఇటు ఇద్దరె అభిమన్యుని బాబాయిలు. నూటికి ఒక్కరు తక్కువ బాబాయిల సేన తమకు'. ఇతనికి స్తోత్రాలు వల్లించే శర్మ, శాస్త్రులు ఉద్దండ పండితులేగాని 'ప్రభువుల ముందు పరాయి వారిని పొగడకూడదనే' ఇంగితం లేని వారు. అందుకే శకుని 'మీకు పాండిత్యం ఉంది కాని బుద్ధి లేదయ్యా' అని చివాట్లు పెడతాడు. బుద్ధి లేని మనుషులు బుద్ధి ఉన్న మనుషుల్ని పితలాటకంలో పెట్టడమే లోకమంటే.

స్వభావరీత్యా చెడ్డవాళ్లు, పరిస్థితుల రీత్యా చెడ్డతనం ప్రదర్శించేవాళ్లు... వీళ్ల మాత్రమే కిటకిటలాడితే జనులు నిండిన ఈ భూమి భ్రమణాలు చేయకపోవును. కష్టంలో ఉన్నప్పుడు సాయానికి వచ్చే మనుషులు తప్పక ఉంటారు. అడవులు పట్టిన సుభద్ర, అభిమన్యుల కోసం హిడింబి, ఘటోత్కచుడు, చిన్నమయ్య, లంబు, జంబు వీరితోపాటు దుందుభి, దుందుభ, ఉగ్ర, భగ్ర, గందరగోళక, గగ్గోలక తదితర అసుర సేన పరిగెత్తుకొని రాలేదూ? వీరందరి కంటే అందరి మొర వినే మురారి ఉండనే ఉన్నాడాయె. చివరకు కౌరవుల ఆటకట్టి సుభద్ర పౌరుషం నిలిచి శశిరేఖ ఆమె కోడలు కావడంతో 'మాయాబజార్' ముగుస్తుంది.

తెలుగు వారికి మాత్రమే దొరికిన అమూల్యమైన వ్యక్తిత్వ వికాస సంగ్రహం 'మాయాబజార్' చిత్రం. అస్మదీయులను కలుపుకు వెళ్లి, తస్మదీయులతో జాగ్రత్తగా మెసలి, పైకి ఒకలాగా ఆంతర్యాలు వేరొకలాగా ఉండేవారిని కనిపెట్టుకుంటూ, ప్రగల్భాలరాయుళ్లను గమనించుకుంటూ, ఉబ్బేసే వాళ్ల ఊబిలో పడకుండా, దుష్ట పన్నాగాలతో బతికే వారితో దూరంగా ఉంటూ, అనూహ్యంగా మారిపోతూ ఉండే మనుషుల చిత్తాలను అర్థం చేసుకుంటూ, చిన మాయల పెను మాయల నడుమ ముందుకు సాగడం ఎలాగో ఈ సినిమా చెబుతుంది. అది కూడా ఏదో శాస్త్రం చెప్పినట్టుగా 'నిష్కర్షగానూ కర్కశంగానూ' కాదు. 'సౌమ్యంగా సారాంశం' అందేలాగానే.

వేసవి వచ్చింది. నెల సెలవులున్నాయి. పిల్లలకు అందాల్సిన చాలా వాటిని నాశనం చేశాం. దుంప తెంచి ధూపం వేశాం. కనీసం ఈ సినిమా చూపించండి. వారు ఘటోత్కచుణ్ణి చూసి 'హై హై నాయకా' అంటారు. భక్ష్యాలకూ చిత్రాన్నాలకు తేడా తెలుసుకుంటారు. శాకాంబరీ దేవి ప్రసాదాన్ని నాలుక మీద వేసి 'ర' అంటూ లొట్టలు వేస్తారు. తల్పం గిల్పం కంబళి గింబళి చూసి కిలకిలా నవ్వుతారు. ఆ రోజుల్లోనే వీడియో కాల్ చేయగలిగిన 'ప్రియదర్శిని' పెట్టెకు నోళ్లు తెరుస్తారు. 'సత్యపీఠం' అను 'లైడిటెక్టర్'తో సైన్స్ ఊహలు చేస్తారు. 'ముక్కుకు తగలకుండా నత్తును కొట్టే' ప్రావీణ్యం విద్యలో కలిగి ఉండాలని తెలుసుకుంటారు. తియ్యటి తెలుగుల ధారలలో లాహిరీ విహారం చేస్తారు. తెలుగు నేల మీద ఎప్పుడు వేసవి వచ్చినా పిల్లలకు ప్రిస్క్రయిబ్ చేయాల్సిన తొలి అభ్యాసం 'మాయాబజార్'. అది చూసిన పిల్లలకు ఒక వీరతాడు, చూపించిన తల్లిదండ్రులకు రెండు వీరతాళ్లు. మాయాబజార్... నమో నమః

ఇలాగేనా మాట్లాడేది?

కామెంట్



కరణ్ థాపర్

"ఇంతకుముందు వారి (కాంగ్రెస్) ప్రభుత్వం ఉన్నప్పుడు, దేశ సంపదపై మొదటి హక్కు ముస్లింలదే అని చెప్పారు. అంటే దీనర్థం ఈ సంపదనంతా పోగేసి, ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి, చొరబాటుదారులకు పంచుతారని అర్థం. మీరు కష్టపడి సంపాదించిన డబ్బును చొరబాటుదారులకు ఇవ్వాలా? అది మీకు సమ్మతమేనా?'' అని ఒక లౌకికవాద దేశానికి ప్రధానమంత్రి తోటి పౌరుల గురించి మాట్లాడడం తగినదేనా? 'వారు' కూడా సమాన హక్కులు, సమాన స్వేచ్ఛ ఉన్న మనందరిలోని వారు కారా? లేదంటే వారు విదేశీయులు, గ్రహాంతరవాసులూనా? అలా మాట్లాడటాన్ని ఆయన్ని అభిమానించేవారు సమర్థిస్తున్నట్లు అనిపిస్తోంది. లేకుంటే ఆయన అలా అనటాన్ని ఆపి ఉండేవారా? తనను సరిదిద్దుకునేవారా?

ప్రధానమంత్రులు ఎల్లవేళలా సరైన, గౌరవప్రదమైన పనే చేస్తారన్న భావన ఉన్న యుగంలో నేను పెరిగాను. అంతేకాదు, ప్రధాని చెప్పారంటే ఇక అది సరైనది అయినట్లే! మాటల్లో పొల్లుపోవటం అత్యంత సహజం అయినప్పటికీ, జవహర్‌లాల్ నెహ్రూకు కూడా అలా జరిగేదంటే నా తల్లి తండ్రులు అస్సలు నమ్మేవారు కారు. ఆ పాతకాలపు ప్రామాణికతకు ఆయనొక శ్రేష్ఠమైన నమూనాగా పరిగణన పొందారు.

'యాభైలు', 'అరవైల' నుంచి మనం చాలా దూరం ప్రయాణించి వచ్చాం. ఈ రోజుల్లో ఒక రాజకీయ నాయకుడి గురించి మీరు ఊహించరానిదేమీ ఉండదు. ఏ ఉత్కృష్టులైన వారినో పక్కన పెడితే ప్రధానమంత్రులూ ఇక ఏమాత్రం భిన్నమైన వ్యక్తులుగా మిగిలి లేరు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతి దశాబ్దంలో వారి పట్ల కనిపించిన సహజమైన గౌరవభావన, వారంటే ఉండే కొద్దో గొప్పో ఆరాధన పూర్తిగా కనుమరుగయ్యాయి. 'సబ్ చోర్ హై' (అందరూ దొంగలే) అన్నదే ఎక్కువగా వ్యాప్తిలో ఉన్న నమ్మకం అయింది.

ఇప్పటికి కూడా, నా అత్యంత నిరాశావాద, చీకటిమయ మనఃస్థితుల్లో సైతం– తన సొంత, తోటి పౌరులలో ఒక గణనీయమైన వర్గం మీద ఒక ప్రధాని దాడి చేస్తూ, వారిని పిశాచాలుగా చూపటం వింటానని నేనెప్పుడూ అనుకోలేదు. అదేపనిగా అందుకోసం మార్గాలను కనుగొంటారని కూడా! ఆయనను అభిమానించేవారు తెలివిగా దీనిని... అదేపనిగా అని కాక, అనేకసార్లు అని అనవచ్చు. ఆయన అలా చేయటాన్ని వారు ఆనందిస్తున్నట్లు, సమర్థిస్తున్నట్లు, సహేతుకమేనని భావిస్తున్నట్లు అనిపిస్తోంది. లేకుంటే కచ్చితంగా ఆయన అలా చేయటాన్ని ఆపి ఉండేవారా? తనను తను సరిదిద్దుకునేవారా? బహుశా పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేసేవారా? కానీ అలా జరగక పోగా, అవి పునరుద్ఘాటనలు అవుతున్నాయి. బహిరంగంగా, శక్తిమంతంగా, స్థానాలను మార్చుకుంటూ కొనసాగుతున్నాయి.

మొదట చెప్పినదానినే ఉన్నది ఉన్నట్లుగా మళ్లొకసారి చెబుతాను. నా ప్రతిస్పందన అర్థంచేసుకోదగినదా లేక అతిశయోక్తితో కూడినదా అని మీకై మీరు ఆలోచించండి. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలో వచ్చిన దానిని బట్టి హిందీలో ఆయన మాట్లాడిన మాటలు సరిగ్గా ఇవే: ''పెహ్లే జబ్ ఉన్‌కీ సర్కార్ థీ, ఉన్హోనే కహా థా కీ దేశ్ కీ సంపతీ పర్ పెహ్లా అధికార్ ముసల్మానోం కా హై. ఇస్కా మత్లబ్, యే సంపతీ ఇకట్ఠీ కర్‌కే కిస్కో బాటేంగే? జిన్‌కే జ్యాదా బచ్చే హై, ఉన్‌కో బాటేంగే, ఘుస్‌పైఠియోన్ కో బాటేంగే. క్యా ఆప్‌కీ మెహనత్ కీ కమాయి కా పైసా ఘుస్‌పైఠియోన్ కో దియా జాయేగా? ఆప్‌కో మంజూర్ హై యే?'' ('ఇంతకుముందు వారి (కాంగ్రెస్) ప్రభుత్వం ఉన్నప్పుడు, దేశ సంపదపై మొదటి హక్కు ముస్లింలదే అని చెప్పారు. అంటే దీనర్థం ఈ సంపదనంతా పోగేసి, ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి, చొరబాటుదారులకు పంచుతారని అర్థం. మీరు కష్టపడి సంపాదించిన డబ్బును చొరబాటుదారులకు ఇవ్వాలా? అది మీకు సమ్మతమేనా?')



మనవాళ్లు... మన తోటి పౌరులు

మరి, 'ఎక్కువమంది పిల్లలను' కలిగివున్న ఆ వ్యక్తులు ఎవరు? 'చొరబాటుదారులు' అని పిలవబడుతున్న ఈ వ్యక్తులు ఎవరు? స్పష్టంగానే ఉంది కదా, మొదటి వాక్యాన్ని బట్టి ఇంకా స్పష్టంగా లేదా? ఇంకా ఏమైనా సందేహమా? అలాగే పైన పేర్కొన్న 'ముసల్మానులు' ఎవరు? వారు భారతదేశ ముస్లింలు కారా? మన తోటి పౌరులు కారా? సమాన హక్కులు, సమాన స్వేచ్ఛ కలిగి ఉన్న మనందరిలోని వారు కారా? లేదంటే వారు విదేశీయులు, బయటి వ్యక్తులు, గ్రహాంతరవాసులూనా?

ఇప్పుడు చెప్పండి, నా ప్రశ్నకు మీ సమాధానం ఏమిటి? దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తే నేను అమాయకుడిని అవుతానా? ఇంకా చెప్పాలంటే కదిలిపోవటానికి? లేదా ఆ విధమైన ఆరోపణలను మీరు మన ప్రధానులు ఎవరినుంచైనా విని ఉన్నారా?

డోనాల్డ్ ట్రంప్ తరచూ ఇలా మాట్లాడ్డం నాకు తెలుసు. ఆయన అలా మాట్లాడినప్పుడు మనకు వికారం పుడుతుంది. 1960లలో బ్రిటన్‌లో ఇనాక్ పావెల్ ఇలాగే మాట్లాడితే అక్కడి ఆధిపత్య సమాజ సమూహం ఆయన మాటల్ని పట్టించుకోలేదు. కానీ మన తరంలోని ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌లు, సాధ్వీ రుతంభరలు ఇటువంటి వాక్చాతుర్యాన్ని ఆస్వాదిస్తారనడంలో సందేహమే లేదు. అయితే అందుకు వారు తిరిగి పొందేది ధిక్కారాన్ని, ఎగతాళిని మాత్రమే!

నా బోళాతనం బహుశా మీ దృష్టిలో తీవ్రంగా దెబ్బతిని ఉంటుందని నేను అంగీకరిస్తున్నప్పటికీ, ఇప్పటికైతే నన్ను ఆశ్చర్యపరిచే విషయం వేరొకటి ఉంది. అది మన మీడియా స్పందన. ఒకవేళ అలాంటిదేమైనా ఉండివుంటే, నాకైతే ఆందోళన కనబడలేదు, ఏహ్యభావం కనబడలేదన్నదైతే నిశ్చయం. బహుశా నేను చదవాల్సిన పత్రికల్ని చదవలేదేమో! చూడాల్సిన టీవీ చానెళ్లను చూడలేదేమో! కానీ నాకు అనిపించింది ఏమిటంటే, చెప్పినదాన్ని మౌనంగా అంగీకరించారని! అంగీకరించకపోయినా, కనీసం దానిమీద వ్యాఖ్యానించనైనా లేదు. విమర్శ అయితే అసలు చేయలేదు. అది ఖండనార్హమైనది కాదని నేను అనుకుంటే తప్ప నాకది దాదాపుగా నమ్మశక్యంగా లేదు. దీన్ని కూడా మీరు అంగీకరిస్తారా?

క్షమించండి. నేను ఈరోజు చాలా ప్రశ్నలు సంధించి మీకు అతి కొద్ది సమాధానాలు మాత్రమే ఇచ్చాను. కానీ నా అభిప్రాయాలను మీపై రుద్దడం నాకు ఇష్టం లేదు. బదులుగా, మీరేం అనుకుంటున్నారో తెలుసుకోవాలని కోరుకుంటున్నాను. కనుక మరొక చివరి ప్రశ్నకు నన్ను మన్నించండి: ఒక లౌకిక ప్రజాస్వామ్య దేశానికి ప్రధానమంత్రి అయిన వారు భిన్న మత విశ్వాసాన్ని కలిగిన తోటి పౌరుల గురించి ఇలా మాట్లాడడం తగినదేనా? మరింత కచ్చితంగా అడగాలంటే, నైతికంగా సరైనదేనా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



ఇవా ధరలు?



పోయిన నెల నేను స్విట్జర్లాండ్‌లోని రైతులతో ఉన్నప్పుడు, ఇది తెలుసుకొని అత్యంత ఆశ్చర్యానికి గురయ్యాను. 20 ఏళ్ల క్రితం బ్రెడ్ ధర 2.50, గోధుమలు కిలోకు 110. ఇప్పుడు బ్రెడ్ ధర 4.00, కిలో గోధుమల ధర 50 (ధరలు స్విస్ ఫ్రాంక్స్‌లో.) స్వేచ్ఛా మార్కెట్ ఆర్థికవేత్తలు, ఉత్సాహవంతులారా! ఈ వాస్తవాలు ఎదుర్కోండి. మార్కెట్లు ప్రయోజనకరంగా లేవు. అలాగని మార్కెట్లే వద్దని కాదు. నియంత్రణ, పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలి.

– అజయ్ వీర్ జాఖడ్, రైతు–యాక్టివిస్ట్

అందమైన గుడ్ మార్నింగ్



అరబిక్‌లో నాకు బాగా నచ్చే వాక్యాల్లో ఒకటి 'గుడ్ మార్నింగ్'లా చెప్పే 'సబా అల్ వర్ద్'. దీనికి ఉన్నదున్నట్టుగా అర్థం చెబితే, 'నీ ఉదయానికి గులాబీలు/పువ్వులు' అవుతుంది. ఇది చాలా కవితాత్మకంగా, అందంగా ఉంటుంది.

– అమానీ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

అందమైన జీవితం



నేను చిన్నదానిగా ఉన్నప్పుడు, ప్రతి ఆదివారం మా తాతయ్యతో కూర్చుని టీవీలో 'మహాభారత్' చూసేదాన్ని. ఇప్పుడు నేనూ, మా అమ్మాయీ ఆ సంప్రదాయాన్ని తిరిగి నెలకొల్పాం. జీవితం సంపూర్ణ చక్రంలా తిరిగి రావడమనేది ఎంత అందంగా ఉందో!

– నూపుర్ జె. శర్మ, సంపాదకురాలు

అద్భుతమైన శవర్మా



మధ్యప్రాచ్యం లేదా యూరప్ మొత్తంలో ఎక్కడా తిననంత రుచికరమైన శవర్మాను ఇజ్రాయెల్‌లో తిన్నాను. బహుశా దీనికి కారణం భారత మామిడికాయల తొక్కుతో చేసిన అంబా సాస్ కావొచ్చు. ఈ మామిడిని ఇరాకీ యూదులు ఇజ్రాయెల్‌కు తెచ్చారు. దేవుడా, అదెంత బాగుందో!

– యాస్మీన్ మహమ్మద్, రచయిత్రి

ఆ మాత్రం చూసుకోరా?



'నెట్‌ఫ్లిక్స్'లోని సంజయ్ లీలా భన్సాలీ వెబ్ సిరీస్ 'హీరా మండి' 1920ల–40ల లాహోర్‌లోని భారత స్వాతంత్ర్యోద్యమం / బ్రిటిష్ రాజ్ కాలంలో నడుస్తుంది. ఫరీదన్(సోనాక్షీ సిన్హా) ఉర్దూ వార్తాపత్రిక చదువుతుంటుంది. అందులోని హెడ్‌లైన్స్: 'వరంగల్ మున్సిపాలిటీ ఎన్నికలు: టీఆర్ఎస్ టికెట్ల పంపిణీ', '50,000 మాస్కులను పంచే యూత్ కాంగ్రెస్ పథకం ప్రారంభం', ఇదైతే ఇంకా ఆశ్చర్యం: 'కరోనాను జయించడానికి ఆత్మ విశ్వాసమే మందు: రోగులకు పంచాయతీ రాజ్ మంత్రి ఇ. దయాకర్ రావు సూచన.'

– పర్వేజ్ ఆలమ్, బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్

వైజ్ఞానిక వేగుచుక్కలు

చరిత్రలోని గుంటూరు ఆస్పత్రి

పద్నాలుగు దశాబ్దాల క్రితం తెలుగు కోస్తా ప్రాంతపు మహిళారోగ్యానికే తలమానికమైన వైద్యాలయం గుంటూరులోని కుగ్లర్ ఆసుపత్రి. అమెరికాలోని పెన్సిల్వేనియాలో 1856 ఏప్రిల్ 19న జన్మించిన అన్నా సారా దీని ఏర్పాటుకు ప్రధాన కారకులు. 1879లో పెన్సిల్వేనియాలోని ఉమెన్స్ మెడికల్ కాలేజీలో పట్టా పొంది, నారిస్టోన్ హాస్పిటల్‌లో రెండేళ్ల శిక్షణ పొందిన అన్నా వైద్యురాలిగా కాక, విద్యాబోధకురాలిగా మిషనరీ తరపున ఇండియా బయలుదేరారు. వెళుతున్నది చదువు చెప్పడానికైనా, రెబకా వైట్ అనే మిత్రురాలు ఇచ్చిన 100 పౌండ్లతో అవసరమైన వైద్య సామగ్రి, ఔషధాలు తీసుకుని 1883 నవంబర్ 29న ఆమె 18 వేల జనాభా ఉన్న గుంటూరులో అడుగు పెట్టారు. బాలికలకు చదువు చెప్పే ప్రయత్నం ప్రారంభించినా అన్నా మనసు మాత్రం ఆరోగ్యం వైపు లాగుతోంది. అందుకే మిషన్ కాంపౌండ్‌లోనే వైద్యం చేయడం ప్రారంభించారు. అలా మొదటి ఏడాది అక్కడే 276 మహిళలకు, మరో 185 మందికి ఇళ్లకు వెళ్లి వైద్య సాయం చేశారు. 1885 నాటికి లూథరన్ చర్చి కూడా మహిళలకు వైద్యం అందించాల్సిన ప్రాధాన్యాన్ని గమనించి సాయం చేయడానికి ముందుకు వచ్చింది.



అన్నా సారా కుగ్లర్

ఇదే సమయంలో క్రైస్తవం వైద్యం ద్వారా తెలుగు సమాజంలోకి చొచ్చుకొని వచ్చింది. 1886లో గుంటూరులో ఒక మహమ్మదీయుడి ఇంట, మరుసటి ఏడాది మంగళగిరిలోనూ వైద్యసేవలు ప్రారంభమయ్యాయి. 1891లో కొంత భూమిని కొని క్రైస్తవ ప్రార్థనా సమావేశంలో ఆసుపత్రి భవనానికి పునాదిరాయి వేశారు. చివరకు 1897 జూన్ 23న గుంటూరులో మహిళల కోసం 50 పడకల ఆసుపత్రికి శ్రీకారం చుట్టారు. తన భార్య సులువుగా కుమారుడికి జన్మనిచ్చిందని స్థానిక సంస్థానాధీశుడు రాజా ఎం. భుజంగరావు తన 'రావు చిన్నమ్మ గారి సత్రా'న్ని విరాళంగా హిందూ రోగులకు సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తాత్కాలిక నివాస వసతిగా ఇచ్చారు. 1899లో ఈ ఆసుపత్రి సూపర్వైజింగ్ డాక్టర్‌గా అన్నా సారా బాధ్యతలు స్వీకరించి, క్రమంగా మహిళా వార్డు, మెటర్నిటీ వార్డు, ఒక ప్రార్థనా స్థలం (చాపెల్), నర్సులు ఉండడానికి వసతి ఏర్పరిచారు.

దక్షిణ భారతదేశంలో చాలా చోట్ల డిస్పెన్సరీలు రావడానికీ అన్నా సారా కారకులయ్యారు. 1905లోనూ, తిరిగి 1917లోనూ ఆమె సేవలకు బ్రిటిష్ ప్రభుత్వం మెచ్చి 'కైజర్–ఎ–హింద్' పతకాన్ని బహూకరించింది. ఎంతో వైభవం గడించిన కుగ్లర్ ఆసుపత్రికి ప్రస్తుతం జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయి. అన్నా సారా తన జీవన సాఫల్యతను 'గుంటూరు మిషన్ హాస్పిటల్' పేరున ఆత్మకథగా 1928లో అమెరికాలో సెలవు మీద ఉన్నప్పుడు వెలువరించారు. చివరకు 1930 జూలై 26న తన 74వ ఏట గుంటూరులోనే తన ఆసుపత్రిలోనే ఆమె కన్ను మూశారు. అక్కడే ఆమెకు మెమోరియల్ నిర్మించారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

జగన్ మళ్లీ ఎందుకు గెలుస్తారంటే...

అభిప్రాయం



ప్రొ॥ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి

పేదరికం అత్యంత బాధాకరమైనది. ప్రపంచంలో అత్యధికులు పేదవారే. వారిని పేదరికం నుండి బయట పడేయగలదీ, అభివృద్ధి వైపు నడపగలిగేదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలే. దీనిని అర్థం చేసుకొన్నారు కాబట్టే ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారు. ప్రజల విశ్వసనీయతను చూరగొన్నారు. ఇప్పుడు మరోమారు ప్రజా సేవ చేయడానికి అవకాశం ఇవ్వమని ఎన్నికల బరిలో దిగారు. పలు పబ్లిక్ మీటింగులూ, సుదీర్ఘ రాజకీయ యాత్రలతో విజయం వైపు నడుస్తున్నారు.

ఇక ప్రతిపక్ష కూటమి నాయకుడు చంద్రబాబు మాత్రం అభద్రతా భావంతో ఎన్నికల్లో నానా తిప్పలు పడుతున్నారు. చెప్పుకోవడానికి ప్రజలకు తాను చేసింది ఏమీ లేదు కాబట్టి జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నారు. ఆయనకు ప్రజల్లో క్రెడిబిలిటీ లేదు. జనసేన – బీజేపీ నాయకులూ, ఆ యా పార్టీల పరిస్థితీ కూడా ఇదే. అందుకే, టీడీపీ 2024 ఎన్నికల్లో ఘోరంగా మరలా ఓడిపోవడం తథ్యం. పెన్షనర్లలో 90 శాతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఆర్థిక లాభాలు పొందు తున్న 40–60 ఏళ్ల వయస్సు స్త్రీలలో 90 శాతం, డ్వాక్రా మహిళల్లో 80 శాతం, మొత్తంగా స్త్రీలలో 90 శాతం వైఎస్సార్‌సీపీకే ఓటు వేసే పరిస్థితి కనిపిస్తోంది. ఇక ఎస్సీ, ఎస్టీలు, క్రిస్టియన్‌లు, ముస్లింలు, రెడ్లు, బ్రాహ్మణులు, అత్యధిక మంది బీసీలు వైఎస్సార్‌సీపీకే ఓట్లు వేసే పరిస్థితి ఉంది. కొంతమంది మధ్యతరగతి అర్బన్ ఓటర్లు మాత్రమే టీడీపీ కూటమికి ఓట్లు వేస్తారని అంటున్నారు. కాంగ్రెస్‌కు గతం కంటే అర శాతం మాత్రమే ఓట్లు పెరగవచ్చు.

అయోధ్యలో గుడి నిర్మాణం, కొన్ని జాతీయ రహదారులను నిర్మించడం తప్ప బీజేపీ ప్రభుత్వం చేసింది ఏమీ లేదు. ఏపీకి సంబంధించి... ఏపీకి స్పెషల్ స్టేటస్, రాయలసీమ – ఉత్తరాంధ్రకు ప్యాకేజీ, పోలవరానికి నిధులు వంటి అనేక వాగ్దానాలను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నెరవేర్చలేదు. ఇదీ బీజేపీ క్రెడిబిలిటీ!

జగన్ మాత్రం పేదల ముఖ్య అవసరాల్ని తీరుస్తూ, అనేక అభివృద్ధి కార్యక్రమాల్ని కూడా చేపడుతున్నారు. పేదల కొనుగోలు శక్తిని కోవిడ్ లాంటి క్లిష్ట సమయాల్లో కూడా పెంచగలిగారు. అందుకే 2019లో 12 శాతం ఉన్న పేదరికం 2024 నాటికి దాదాపు 4 శాతానికి తగ్గిపోయింది. జీఎస్టీ చెల్లింపుల్లో రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో ఉంచారు జగన్. జగన్ ప్రభుత్వం పేదలకు డీబీటీ కింద రూ. 2,70,000 కోట్లను, నాన్–డీబీటీ కింద ఇండ్లు, స్థలాలు వంటి రూపాల్లో రూ. 1,00,000 కోట్లకు పైగా ఇచ్చారు. మొత్తంగా నాలుగున్నర లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చింది జగన్ ప్రభుత్వం.



అంతేగాక పాలనా వ్యవస్థలో, సంక్షేమ సేవల్లో, అభివృద్ధిలో విప్లవాత్మక మార్పుల్ని తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచేట్లు చేశారు వైఎస్ జగన్. ముఖ్యంగా గ్రామ/వార్డు సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ, ఆరోగ్య శ్రీకి రూ. 25 లక్షల వరకూ ప్రభుత్వ సాయాన్ని పెంచడం, వృద్ధాప్య పింఛన్‌ను రూ. 3 వేల వరకు పెంచడం, స్త్రీ సాధికారత కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టడం; రాజకీయాల్లోనూ, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లోనూ... మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం; వలంటీర్ వ్యవస్థ, రైతుభరోసా, ఉచిత పంటల బీమా, ఆక్వా రైతులకు తక్కువ ధరకు విద్యుత్, అమూల్ ద్వారా ఎక్కువ పాల ధర ఇవ్వడం, భూముల సర్వే, భూపట్టాల ధ్రువీకరణ, నాడు – నేడుతో పాఠశాలల రూపు మార్చడం, ఇంగ్లీష్ మీడియం విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా కానుక... ఇలా ఎన్నో సంక్షేమ పథకాలతో ప్రజల మనసులను జగన్ దోచుకున్నారు.

మరి చంద్రబాబు ఇలాంటి వేటినీ చేపట్టలేదు. ఇలాంటివి ఏ ఒక్కటీ చేశానని ఆయన చెప్పుకోలేని స్థితిలో ఉన్నారు. ఆయన ప్రతి ఎన్నికలప్పుడూ పలు పథకాల్ని ప్రకటించడం, ఎన్నికలు అయిపోయాక వాటి అమలు మరచిపోవడం చేసేవారు. అంతేగాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళల విషయంలో మాట్లాడకూడని మాటలు మాట్లాడేవారు. అందుకే ఆయన జనంతో సంబంధాల్ని మానసికంగా కోల్పోయారు.


రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పి చేయక పోవడం, పొదుపు సంఘాలకు రుణమాఫీ అమలు పరచక పోవడం, కొత్తగా జన్మించిన ఆడబిడ్డకు 'మహాలక్ష్మి' పథకం కింద ఇస్తానన్న డబ్బు ఇవ్వక పోవడం, ఇంటింటికీ ఒక ఉద్యోగం – ఉద్యోగం ఇవ్వలేకుంటే నెలకు రూ. 2 వేలు ఇస్తానని ఇవ్వక పోవడం; పేదలకు మూడు సెంట్ల నేల, ఇల్లు, బీసీలకు సబ్ ప్లాన్, స్త్రీ రక్షణ ఫోర్స్ ఏర్పాటు, పసుపు–కుంకుమ పథకం లాంటి వాటిని అమలు చేయకుండా జనాన్ని మోసగించారు. విద్యను, వైద్యాన్ని వ్యాపారీకరణ చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే బాబు వైఫల్యాలు ఎన్నో!

బాబు ఘోర వైఫల్యం చెందిన అనంతరం పరిపాలనా పగ్గాలు చేపట్టిన జగన్ ఏపీలోని ప్రతి కుటుంబానికీ ఏదో ఒక రూపంలో మేలు చేశారు. అందుకే తాను ఏదైనా మేలు చేశానని నమ్మితేనే తనకు ఓటు వేయమని ఆయన ధైర్యంగా ప్రజలను అడుగుతున్నారు.

వ్యాసకర్త ఎస్వీ యూనివర్సిటీ చరిత్ర శాఖ విశ్రాంత ఆచార్యులు । 98495 84324

హరినామ స్మరణ

మరణ సమయంలో నారాయణ స్మరణ చేస్తే కైవల్యం పొందుతారని పెద్దలు చెపుతారు. కానీ, అప్పుడు దేహాన్ని వ్యాధులు బాధిస్తూ ఉంటాయి. ఆ బాధలు భరించలేక విలపిస్తూ ఉంటారు. మనసు నిలకడగా ఉండదు. కుటుంబ సభ్యులు, బంధువులంతా చుట్టూ చేరుతూ ఉంటారు. పరామర్శలు చేస్తూ ఉంటారు. ధైర్యవచనాలు చెపుతూ ఉంటారు. ఒక్కోసారి ఒంటి మీద స్పృహ ఉండదు. ఇంక, హరినామ స్మరణ ఏం చేస్తారు? మరణ భయం వేధిస్తూ ఉంటే దైవంపై దృష్టి నిలవదు.



అందుకే శేషప్ప కవి 'నరసింహ శతకం'లో 'బతికినంత కాలం నీ భజన తప్పను. మరణ కాలంలో మర్చిపోతానేమో. ఆనాడు యమ దూతలు వచ్చి ప్రాణాలు తీసుకుపోతున్నప్పుడు దిక్కు తెలియక వణుకుతూ ఆయాసపడుతూ నారాయణా అని స్మరించలేను. అప్పటి కోసం ఇప్పుడే నీ నామాన్ని భక్తితో గట్టిగా స్మరిస్తాను విను' అంటాడు. ఈ శరీరమెప్పుడు వదులుతామో తెలియదు. ఏ క్షణంలో నైనా చావు నిజం. తెలివిగల వారు దేహం బాగున్నప్పుడే దేవుని స్మరించాలి అంటాడు. ఇది భక్త జనులందరికీ వర్తిస్తుంది. అంత్య దశలో తమ స్థితి ఎలా ఉంటుందో తెలియదు కాబట్టి నిత్యం హరినామ స్మరణ చేస్తూ ఉండటం మంచిది. జీవితమంతా పాప కర్మలను చేసి, సదాచారాలను విడిచిపెట్టిన అజామీళుడు వృద్ధాప్యం మీద పడి, కంటి చూపు తగ్గిపోయి, దంతాలు ఊడిపోయి, తల వణుకుతుంటే, మరణం సమీపించి యమకింకరులను చూసినప్పుడు భయపడి, తన కొడుకును 'నారాయణ, నారాయణ' అని పిలిచాడు. అప్పుడు విష్ణు దూతలు వచ్చి, అతడు భక్తితో అన్నా, కొడుకు మీద ప్రేమతో పిలిచినా ఎలా చేసినా నారాయణ నామ స్మరణ చేయటం వల్ల స్వర్గానికి అర్హుడని తీసుకువెళ తారు. తెలిసి చేసినా తెలియక చేసినా అంత్య దశలో హరి నామ స్మరణ అత్యుత్తమ ఫలితాన్నిస్తుంది. నిత్యం హరి స్మరణ పుణ్యాన్ని నిక్షిప్తం చేసుకోవటం వంటిది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.త్రయోదశి ప.1.13 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** రేవతి సా.4.40 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.12.22 నుండి 1.11 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** ప.2.25 నుండి 3.56 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.36, **సూర్యాస్తమయం:** 6.17.

రఘురామకు బీజేపీ అభ్యర్థి స్ట్రాంగ్ కౌంటర్

- తనకు పార్టీలు మార్చే.. అప్పులు ఎగ్గొట్టే చరిత్ర లేదంటూ ఎద్దేవా
- చర్చనీయాంశంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మ వ్యాఖ్యలు



పాలకొల్లు సెంట్రల్: 'నీలాగా పార్టీలు మార్చి డబ్బులు పోగేసుకోవడం.. బ్యాంకుల నుంచి కోట్లాది రూపాయలు అప్పులు తెచ్చుకుని ఎగ్గొట్టే చరిత్ర నాకు లేదు..' అంటూ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ పరోక్షంగా టీడీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి కె.రఘురామకృష్ణరాజుపై విమర్శలు గుప్పించారు. ఆయన పేరెత్తకుండానే విమర్శలతో కడిగిపారేశారు. ఆదివారం పశ్చిమ గోదావరిజిల్లా పాలకొల్లు క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించిన క్షత్రియ ఆత్మీయ సమావేశంలో ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మ, పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసవర్మ మాట్లాడుతూ.. 'నరసాపురం పార్లమెంటరీ అభ్యర్థిగా నా పేరు ఖరారైన నాటినుంచీ కొందరు వ్యక్తులు తన వద్ద అంత డబ్బు లేదని.. అభ్యర్థిని మారుస్తారంటూ ప్రచారం చేసి నన్ను మానసికంగా కృంగదీసేందుకు దుష్ప్రచారాలు చేశారు. ఆ ప్రచారం ఎవరు చేశారో.. ఎందుకు చేశారో కూడా నాకు తెలుసు' అన్నారు. 'తనకూ కొంత శక్తి ఉంది. కానీ.. రూ.100 కోట్లు, రూ.150 కోట్లు పెట్టే శక్తి లేదు. ఎందుకంటే.. నేను ఏ బ్యాంకునూ లూటీ చేయలేదు' అని పరోక్షంగా రఘురామకృష్ణరాజును ఉద్దేశించి అన్నారు.

కృష్ణపట్నం పోర్టుకు పర్యావరణ ఎక్సలెన్స్ అవార్డు



ముత్తుకూరు: ఇటీవలే సీఐఐ నుంచి అవార్డు పొందిన అదానీ కృష్ణపట్నం పోర్టు తాజాగా హార్బర్స్, పోర్టు సెక్టార్‌లో అపెక్స్ ఇండియా గ్రీన్‌లీఫ్ ప్లాటినమ్ అవార్డు దక్కించుకుంది. న్యూఢిల్లీలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదాని కృష్ణపట్నం పోర్టు వైస్ ప్రెసిడెంట్ (ఎన్విరాన్‌మెంట్) డాక్టర్ జ్యోతి గణపతి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోర్టు తన కార్యకలాపాలలో సుస్థిరతకు ప్రాధాన్యతనిస్తూ పర్యావరణ అనుకూల పద్ధతులను అమలు చేస్తుందన్నారు. అవార్డు రావడంపై పోర్టు సీఈఓ జీజే రావు హర్షం వ్యక్తం చేశారు.

గుట్టుచప్పుడు కాకుండా 'గోకులం' డ్రామా

పిఠాపురంలో సినీ ఫక్కీలో జనసేన నేతల నాటకం

- మీడియాను, ప్రజల్ని పక్కదోవ పట్టించేలా వ్యూహం
- అందరి దృష్టి మళ్లించేలా చెక్‌పోస్ట్ వద్ద ట్రాఫిక్ స్తంభన
- ఈలోగా బస చేసిన హోటల్ నుంచి డబ్బు తరలింపు



గాజు గ్లాసులు ఉన్న కారును పట్టుకున్న అధికారులు

పిఠాపురం: గోకులం గ్రాండ్ హోటల్‌లో ఏం జరిగింది?. అక్కడి నుంచి డబ్బుల బ్యాగులు ఎక్కడికి వెళ్లాయి? పిఠాపురంలో ఇప్పుడు ఇదో హాట్ టాపిక్. జనసేన నేతలు బస చేసిన హోటల్ నుంచి భారీ మొత్తంలో డబ్బును సేఫ్‌గా ఎలా తరలించారో ఇక్కడి ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో శనివారం రాత్రి సినీ ఫక్కీలో జరిగిన సీన్‌లో అసలు కథ ఏంటంటే.. ఇక్కడ ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎవ్వరూ ఆపకుండానే ఓ కారు వచ్చి ఆగింది. రోడ్డుకు అడ్డంగా పెట్టి ట్రాఫిక్ స్తంభించేలా చేశాడు ఆ కారు డ్రైవర్. ట్రాఫిక్ ఆగిపోవడంతో చెక్‌పోస్టు సిబ్బంది వెంటనే అప్రమత్తమై, వాహనాలను క్లియర్ చేసే పనిలో పడ్డారు. ఇదే సమయంలో అడ్డంగా పెట్టిన కారులో నుంచి కనిపిస్తున్న పెద్ద అట్టపెట్టెలపై తనిఖీ సిబ్బంది దృష్టి పడింది. అనుమానం వచ్చి సోదా చేయగా.. అందులో 17 అట్టపెట్టెల్లో జనసేన గుర్తుతో ఉన్న గాజు గ్లాసులు కనిపించాయి. వెంటనే వాటిని స్వాధీనం చేసుకున్న అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇది తెలిసి మీడియా అంతా అటు దృష్టి పెట్టింది. పోలీసులు కారును, గాజు గ్లాసులను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

పక్కదోవ పట్టించేలా పక్కా వ్యూహం

తనిఖీ అధికారులు, పోలీసులు కారులోని గాజు గ్లాసులకు ఎటువంటి బిల్లులూ లేకపోవడంతో స్వాధీనం చేసుకుంటున్న సమయంలో ముందస్తు పథకం ప్రకారం.. కారును తనిఖీ చేస్తున్న ప్రదేశానికి కొందరు జనసేన నేతలు వచ్చి, అధికారులతో వాగ్వాదానికి దిగారు. సరిగ్గా అదే సమయంలో అక్కడకు కిలోమీటర్ దూరంలో ఉన్న గోకులం హోటల్‌లో ప్రత్యేక బృందాలు తనిఖీ చేపట్టాయి. అక్కడ క్లీన్ చిట్ ఇచ్చేంత వరకూ జనసేన నేతలు వాగ్వాదం కొనసాగించారు. అధికారులు కారులో గ్లాసులు స్వాధీనం చేసుకున్నప్పుడు ఎటువంటి బిల్లులూ లేవని చెప్పిన జనసేన నేతలు.. హోటల్‌లో తనిఖీలు పూర్తి కాగానే ఆ గ్లాసులకు బిల్లులు తీసుకువచ్చి పోలీసులకు చూపించడం పక్కా ప్లాన్ ప్రకారమే చేశారని అర్థమవుతోంది. సినీ నటులు, సహాయ నటులు ఉన్న జనసేనకు ఇలాంటి సీన్లు క్రియేట్ చేయడం పెద్ద పనేమీ కాదని, భవిష్యత్‌లో ఇలాంటివి ఇంకెన్ని చూడాలో అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అసలేం జరిగిందంటే..

పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలో గోకులం గ్రాండ్ అనే హోటల్‌ను నెల క్రితం జనసేన అగ్ర నేతలు అద్దెకు తీసుకుని ఇక్కడి నుంచి నియోజకవర్గం పార్టీ ఎన్నికల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అయితే భారీ నగదు ఉంది అనే సమాచారంతో స్పెషల్ పార్టీ ఎన్నికల తనిఖీ అధికారులు శనివారం రాత్రి హఠాత్తుగా ఈ హోటల్ వద్దకు వెళ్లారు. సుమారు రెండు గంటల పాటు అధికారులు తనిఖీలు చేసి అక్కడ ఏమీ లేవని తేల్చేశారు. జనసేన నేతలకు క్లీన్ చిట్ ఇచ్చేశారు. ఇక్కడే ఉంది అసలు ట్విస్ట్.. ఈ హోటల్‌పై ఎన్నికల అధికారులు దాడులకు వస్తున్నారనే సమాచారం జనసేన అగ్ర నేతలకు ముందే తెలిసింది. వెంటనే కారు డ్రామాకు ప్లాన్ చేశారు. చెక్‌పోస్టు వద్దకు పంపి ట్రాఫిక్‌ను ఆపి హైడ్రామా క్రియేట్ చేశారు. దీంతో మీడియా ఫోకస్ అటు మళ్లింది. ఈలోపు భారీ మొత్తంలో ఉన్న డబ్బును బ్యాగుల్లో నింపి కిటికీల్లో నుంచి కిందకు పడేసి అక్కడి నుంచి వాటిని తరలించారని విశ్వసనీయంగా తెలిసింది. స్థానికులు, మీడియా, పోలీసుల దృష్టి ట్రాఫిక్‌కు అడ్డంగా పెట్టిన కారుపైకి మళ్లించి.. డబ్బును రహస్య ప్రాంతానికి మళ్లించారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

టీడీపీ కార్యకర్త దాష్టీకం

- ప్రచారం పేరుతో ఇంట్లోకి చొరబడి మహిళతో అనుచిత ప్రవర్తన, దాడి
- బోడె ప్రసాద్, పార్థసారథి అనుచరుడు గుమ్మడి కిరణ్ వీరంగం



పెనమలూరు టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్‌తో కిరణ్

కంకిపాడు: టీడీపీ కార్యకర్తలు పేట్రేగిపోతున్నారు. నేతల అండ చూసుకుని దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. అధికారంలోకి రానివ్వండి తేలుస్తాం.. అంటూ పెనమలూరు నియోజకవర్గంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. తాజాగా పెనమలూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్త ప్రచారం పేరుతో ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లోకి చొరబడి దాష్టీకం ప్రదర్శించాడు. ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేయడమేగాక ఆమెపై దాడిచేసి తీవ్రంగా కొట్టాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట్లో హల్‌చల్ అవుతోంది. కంకిపాడుకు చెందిన గుమ్మడి కిరణ్ నియోజకవర్గంలోని ఓ గ్రామంలో టీడీపీ ప్రచారం పేరుతో.. మహిళ ఒంటరిగా ఉన్న ఇంట్లోకి చొరబడ్డాడు. నువ్వు ఫోన్ చేస్తే వచ్చానని, ఫోన్‌లో డబ్బులు వేశానని అంటూ ఆమెతో అనుచితంగా ప్రవర్తించాడు. సామగ్రి ధ్వంసం చేసి భయాందోళనలకు గురిచేశాడు. అతడి చేష్టల్ని వీడియోలో చిత్రీకరిస్తున్న ఆమెను తిడుతూ.. తనకు యార్లగడ్డ, బోడె, పార్థసారథి అండ ఉందని హెచ్చరించాడు. ఆమెపై దాడిచేసి కొట్టాడు. తెలుగుదేశం వర్గీయుల దౌర్జన్య వ్యవహారాలు నియోజకవర్గంలో చర్చనీయాంశమయ్యాయి.

టీడీపీ నేతల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ నేత మృతి

మృతుని కుటుంబాన్ని ఓదార్చిన మంత్రి పెద్దిరెడ్డి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రఘుపతినాయుడు (ఫైల్)

చౌడేపల్లె (చిత్తూరు జిల్లా): తెలుగుదేశం పార్టీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్సపొందుతున్న బోయకొండ క్రాసుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రఘుపతినాయుడు (48) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, పాల ఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లడ్డూ రమణ బావమరిది రఘుపతినాయుడిపై గత నెల 30 వతేదీ మంగళవారం రాత్రి తెలుగుదేశం పార్టీ నాయకులు రాడ్లు, కట్టెలతో దాడికి పాల్పడ్డారు. ఘటనపై మృతుడి అక్క ఆదిలక్ష్మి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆదివారం తెల్లవారుజామున చికిత్సపొందుతూ మృతి చెందిన రఘుపతినాయుడు కుటుంబాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఫోన్‌లో కుటుంబసభ్యులను ఓదార్చారు. సోమవారం బోయకొండ క్రాసు సమీపంలో రఘుపతినాయుడుకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

మొగల్తూరు/పెనుగొండ/నూజివీడు/తిరుపతి మంగళం: పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులోని పెదపల్లవపాలెంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో 50 మంది టీడీపీ సానుభూతిపరులు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పెనుగొండ మండలం తూర్పుపాలెంలో శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకువాడ సమక్షంలో పార్టీలో చేరాయి. సిద్ధాంతంలో శెట్టిబలిజ సంఘ నేత కుడిపూడి సత్యనారాయణ పార్టీలో చేరారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్ రాజు సమక్షంలో ఆచంట రావిగుంటకు చెందిన శెట్టిబలిజ, గౌడ సంఘాల నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన యాదవులు, ఎస్సీలు కలిపి 50 కుటుంబాలు, నూజివీడు మండలం మీర్జాపురంలో పలువురు టీడీపీ నేతలు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ కుమారుడు చంటినాయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. తిరుపతి 32, 33వ వార్డుల్లో టీడీపీ నుంచి 108 మంది యాదవులు ఎమ్మెల్యే భూమన సమక్షంలో పార్టీలో చేరారు.



తిరుపతిలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే భూమన



తూర్పుపాలెంలో శ్రీరంగనాథరాజు సమక్షంలో పార్టీలో చేరికలు



మొగల్తూరులో పార్టీలో చేరిన వారితో ముదునూరి ప్రసాదరాజు

నేడు రాష్ట్రానికి ప్రధాని మోదీ

రాజమండ్రి, అనకాపల్లి బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించనున్న నరేంద్ర మోదీ

సాక్షి, అమరావతి/సాక్షి, అనకాపల్లి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం రాష్ట్రంలో పర్యటించనున్నారు. రాజమండ్రి, అనకాపల్లిల్లో జరిగే ఎన్నికల ప్రచార బహిరంగసభల్లో ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 2.55 గంటలకు రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకునే ప్రధాని 3.30 గంటలకు వేమగిరిలో, 5.45 గంటలకు రాజుపాలెంలో జరిగే బహిరంగసభల్లో పాల్గొంటారు. అక్కడి నుంచి విశాఖ విమానాశ్రయానికి వెళ్లి అహ్మదాబాద్ వెళతారు. ఈ సభల్లో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పాల్గొంటారు.

8న మళ్లీ రాష్ట్రానికి..

ప్రధానమంత్రి మోదీ ఈనెల 8వ తేదీ (బుధవారం) మరోసారి రాష్ట్రంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకునే ప్రధాని రాజంపేట సమీపంలోని కలికిరి చేరుకుంటారు. మధ్యాహ్నం 3.45 గంటల నుంచి సాయంత్రం 4.35 గంటల వరకు అక్కడ బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం 6.25 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు విజయవాడలో రోడ్‌షో నిర్వహిస్తారు. తరువాత గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీ వెళతారు.



నిప్పుతో చెలగాటమా!

కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన రాజ్‌నాథ్ సింగ్



ఇంటర్వ్యూ

- రిజర్వేషన్ల పేరిట హిందువులు, ముస్లింల మధ్య చిచ్చు పెడుతోంది
- పాక్ మంత్రి రాహుల్‌గాంధీని పొగడటం ఆందోళనకరం
- రక్షణ మంత్రి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: రిజర్వేషన్ల పేరిట హిందువులు, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి కాంగ్రెస్ నిప్పుతో చెలగాటం ఆడుతోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. బీజేపీ ఈసారి 400 స్థానాల్లో గెలిచి కొన్ని రాష్ట్రాల్లో మరింత మెరుగైన రాజకీయప్రతిభ కనబరచనుందని వ్యాఖ్యానించారు. పీటీఐతో ప్రత్యేక ఇంటర్వ్యూ సందర్భంగా ప్రస్తావించిన అంశాలు, అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

రాహుల్ గాంధీలో ఫైర్ లేదు

'' రాహుల్ గాంధీలో గొప్ప నాయకత్వ లక్షణం(ఫైర్)లేదుగానీ హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి విద్వేష మంటలు రాజేసే ఫైర్ చాలా ఉంది. ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ సామాజిక సామరస్యాన్ని నాశనంచేస్తోంది. మత విద్వేషాలకు కారణమవుతోంది. ముస్లింలను కేవలం ఓటు బ్యాంక్‌గా చూస్తోంది. మేం గెలిస్తే ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం ఒకే ఎన్నికలు వంటి నిర్ణయాలను అమలు చేస్తాం. రాజ్యాంగపీఠికను బీజేపీ ఎన్నటికీ మార్చబోదు. రాజ్యాంగాన్ని సవరిస్తామంటూ కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్సే ఇప్పటికి 80 సార్లు రాజ్యాంగసవరణలు చేసింది. ఎమర్జెన్సీ కాలంలో రాజ్యాంగ పీఠికలోనూ మార్పులు చేశారు. జనాల్లో భయాలు పెంచి వారి మద్దతు సాధించాలని కాంగ్రెస్ ఆశిస్తోంది. రిజర్వేషన్లు తొలగిస్తామని మాపై అబద్ధాల బురద చల్లుతోంది''

ప్రశంసలో ఆంతర్యమేంటి?

''పాకిస్తాన్ మాజీ మంత్రి చౌదరి ఫవాద్ హుస్సేన్ ఇటీవల రాహుల్ గాంధీని నెహ్రూతో పోలుస్తూ ప్రశంసల్లో ముంచెత్తడం నిజంగా ఆందోళనకర విషయమే. భారత్‌ను అస్థిరపరచాలని చూసే శత్రుదేశం నేత రాహుల్‌ను ప్రశంసించడంలో ఉన్న ఆంతర్యమేంటో? అసలు పాక్‌తో కాంగ్రెస్‌కు ఉన్న సంబంధమేంటి? సంపద పంపిణీ విషయంలో శనివారం కూడా ఆయన పొగిడారు. ఆయన మాటల వెనుక బలమైన కారణం ఉండి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా వివరణ ఇవ్వాలి. లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేద్దామని పాక్ ప్రయత్నిస్తోంది. కానీ పాక్‌కు అంత సత్తా లేదు''

400 సీట్లు ఖాయం

''ఈసారి ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి 400 సీట్లు సాధిస్తుంది. బీజేపీ 370కిపైగా స్థానాల్లో గెలుస్తుంది. పశ్చిమబెంగాల్‌లో మరిన్ని సీట్లు సాధిస్తాం. తమిళనాడులోనూ మెరుగవుతాం. కేరళలో బోణీ కొడతాం. ఒడిశా, అస్సాం, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ మెరుగైన సీట్లు సాధిస్తాం. ఛత్తీస్‌గఢ్‌లో క్లీన్‌స్వీప్ చేస్తాం. ఉత్తరప్రదేశ్‌లో 75 సీట్లదాకా గెలుస్తాం. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీ చీలికలు, సీట్ల సర్దుబాటు, ఇతరత్రా కారణాల వల్ల తక్కువ సీట్లు సాధిస్తాం. తొలి రెండు దశల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదవ్వడం వల్ల బీజేపీకి వచ్చిన నష్టమేమీ లేదు''

సంపద పునఃపంపిణీ సరికాదు

'' కాంగ్రెస్ చెబుతున్నట్లు సంపదను పునఃపంపిణీ చేస్తామన్న విధానం సహేతుకం కాదు. అర్జెంటీనా, వెనిజులా దేశాలు దీనిని అమలుచేసి చేతులుకాల్చుకున్నాయి. విపరిణామాలను ఎదుర్కొన్నాయి. కాంగ్రెస్ ఇలా చేస్తే భారత ఆర్థికవ్యవస్థ కుప్పకూలి వెనిజులా మాదిరిగా ద్రవ్యోల్బణం కట్టుతప్పుతుంది. భారత్‌పై పెట్టుబడిదారులు విశ్వాసం కోల్పోతారు''

పాక్ ఆక్రమిత కశ్మీర్ మనదే

'' పాక్ ఆక్రమిత కశ్మీర్ ముమ్మాటికీ మనదే. అంతమాత్రాన పీఓకేను బలవంతంగా ఆక్రమించాల్సిన అవసరం లేదు. జమ్మూకశ్మీర్‌లో సాకారమైన అభివృద్ధిని చూశాక పీఓకే ప్రజలే భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారు. జమ్మూకశ్మీర్‌లో సాయుధబలగాల ప్రత్యేక అధికారాల(ఏఎఫ్‌ఎస్‌పీఏ) చట్టంను తొలగించాల్సిన సమయం దగ్గరపడింది. దీనిపై కేంద్ర హోం శాఖ త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోనుంది. అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తాం. అయితే ఖచ్చితంగా ఎప్పుడు అనేది ఇప్పుడే చెప్పలేం''

సరిహద్దు చర్చలు సానుకూలం

'' తూర్పు లద్దాఖ్‌లో చైనా, భారత్ జవాన్ల ఘర్షణ తర్వాత నెలకొన్న ఉద్రిక్తతను సద్దుమణిగేలా చేసేందుకు చర్చల ప్రక్రియ సానుకూల వాతావరణంలో కొనసాగుతోంది. సమస్యకు పరిష్కారం లభిస్తుందని భారత్ నమ్మకం పెట్టుకుంది. చైనా కూడా అదే నమ్మకంతో చర్చలకు ముందుకొచ్చింది. సరిహద్దు వెంట మౌలికవసతుల పటిష్టానికి త్వరితగతిన ప్రాజెక్టుల్ని పూర్తిచేస్తున్నాం. సరిహద్దు త్వరలో మరింత సురక్షితంగా ఉండబోతోంది''

ఆ బెత్తం దెబ్బలు మర్చిపోలేను..

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ: పిల్లల పట్ల మన ప్రవర్తన వారి మనసుపై జీవితాంతం లోతైన ప్రభావం చూపుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. అలాంటి అనుభవం తనకు కూడా ఉందని వెల్లడించారు. చిన్నప్పుడు టీచర్‌తో బెత్తం దెబ్బలు తిన్నానని, ఆ విషయం ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నానని చెప్పారు. నేపాల్ రాజధాని ఖాట్మండులో నేపాల్ సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో 'జువెనైల్ జస్టిస్'పై నిర్వహించిన సదస్సులో జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడారు. ''ఐదో తరగతిలో జరిగిన ఆ సంఘటనను ఎప్పటికీ మర్చిపోలేను. స్కూల్‌లో క్రాఫ్ట్ నేర్చుకుంటున్నా. క్రాఫ్ట్‌వర్క్ కోసం సరైన సైజు గల సూదులు తీసుకురానందుకు టీచర్ నా చేతిపై బెత్తంతో గట్టిగా కొట్టారు. చేతిపై తప్ప ఇంకెక్కడైనా కొట్టాలని పదేపదే కోరినా టీచర్ వినిపించుకోలేదు. ఆ దెబ్బలకు నా కుడిచేయి కందిపోయింది. పది రోజులపాటు చేయిని ఎవరికీ చూపించలేదు. టీచర్ కొట్టారని నా తల్లిదండ్రులకు కూడా చెప్పలేదు. కొంతకాలానికి గాయం నయమైందిగానీ ఆ సంఘటన నా మనసులో ముద్రించుకుపోయింది. నాపై ఎంతో ప్రభావం చూపింది. ఇప్పుడు కూడా ఏదైనా పని చేస్తున్నప్పుడు ఆ బెత్తం దెబ్బలు గుర్తుకొస్తుంటాయి' అని చంద్రచూడ్ అన్నారు.

ఇజ్రాయెల్‌లో అల్–జజీరా కార్యాలయాల మూసివేత

టెల్ అవీవ్: తమ దేశంలో అల్–జజీరా మీడియా సంస్థకు చెందిన స్థానిక కార్యాలయాలన్నీ మూసివేస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ చెప్పారు. అల్–జజీరా ఆఫీసులను ఎప్పటినుంచి మూసివేస్తారన్నది వెల్లడించారు. ఇది తాత్కాలికమా? శాశ్వతమా? అనేది బయటపెట్టలేదు. ఖతార్‌కు చెందిన అంతర్జాతీయ మీడియా సంస్థ అల్–జజీరా గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ దాడులను మొదటినుంచీ వ్యతిరేకిస్తోంది. గాజాలో కాల్పుల విరమణ కోసం ఇజ్రాయెల్, హమాస్ మధ్య శాంతి చర్చలకు ఖతార్ చొరవ చూపుతోంది. ఇరువర్గాలను ఒప్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఖతార్‌కు చెందిన మీడియా సంస్థ కార్యాలయాలను మూసివేస్తూ ఇజ్రాయెల్ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

తెల్ల టీ–షర్టు ఎందుకు ధరిస్తానంటే...

పారదర్శకత, నిరాడంబరత కోసమే: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సాధారణంగా తెల్ల టీ–షర్టులోనే కనిపిస్తుంటారు. భారత్ జోడో యాత్ర మొదలైనప్పటి నుంచి ఇది ఆయనకు ట్రేడ్ మార్క్‌గా మారిపోయింది. దీనికి కారణమేంటో తెలిసిపోయింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రెండు నిమిషాల నిడివి గల ఒక వీడియోను విడుదల చేసింది. ఇందులో ప్రజలు అడిగిన పలు ప్రశ్నలకు రాహుల్ ఇచ్చిన సమాధానాలున్నాయి. ఎల్లప్పుడూ తెల్ల రంగు టీ–షర్టులోనే ఎందుకు కనిపిస్తుంటారు? అని ఒకరు ప్రశ్నించగా.. ''పారదర్శకత, నిరాడంబరత కోసమే తెల్ల టీ–షర్టు ధరిస్తుంటా. దుస్తుల విషయంలో నాకు పెద్దగా పట్టింపు ఉండదు. ఖరీదుగా కనిపించాలన్న ఆసక్తి లేదు. సాధారణంగా ఉండడమే నాకు ఇష్టం'' అని రాహుల్ బదులిచ్చారు.

రాజస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకే కుటుంబంలోని ఆరుగురు మృతి

జైపూర్: రాజస్తాన్‌లోని సవాయ్ మాధోపూర్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృత్యువాతపడ్డారు. ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్ వేలోని బనస్ నది వంతెనపై ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. సికార్ జిల్లా ఖండేలాకు చెందిన ఓ కుటుంబం సవాయ్ మాధోపూర్‌లోని గణేశ్ ఆలయంలో పూజల కోసం కారులో బయల్దేరింది. బనస్ నది వంతెనపై యూటర్న్ తీసుకునే సమయంలో గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి వారి కారును ఢీకొట్టి, వెళ్లిపోయింది. ప్రమాద తీవ్రతకు కారు తునాతునకలుగా కాగా అందులోని ఆరుగురు అక్కడికక్కడే చనిపోయారు. గాయపడిన మరో ఇద్దరు చిన్నారులను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. మృతులను మనీశ్ శర్మ దంపతులు, కైలాశ్ శర్మ దంపతులు, కైలాశ్ శర్మ కుమారుడు, కోడలుగా గుర్తించారు. మనీశ్ శర్మ కుమారుడు(10), కూతురు(6) తీవ్ర గాయాలతో సవాయ్ మాధోపూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కర్కరేను చంపింది కసబ్ కాదు..

- ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన పోలీస్ అధికారి
- మహారాష్ట్ర కాంగ్రెస్ నేత వడెట్టివార్ వివాదాస్పద వ్యాఖ్య

ముంబై: 2008 ముంబై ఉగ్రదాడుల సమయంలో పోలీసు అధికారి హేమంత్ కర్కరేను పొట్టనబెట్టుకున్నది ఉగ్రవాది కసబ్ కాదని, ఆర్‌ఎస్‌ఎస్ విశ్వాసిగా ఉన్న ఓ పోలీస్ అధికారి అంటూ మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత వీఎస్ వడెట్టివార్ చేసిన వ్యాఖ్య తీవ్ర దుమారం రేపుతోంది. అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రస్తుతం ముంబై నార్త్ సెంట్రల్ బీజేపీ అభ్యర్థి ఉజ్వల్ నికమ్ లక్ష్యంగా వడెట్టివార్ తీవ్ర ఆరోపణలు సంధించారు. 'బిర్యానీ అంశం తీసుకువచ్చి నికమ్ కాంగ్రెస్‌పై బురదచల్లారు. కసబ్‌కు బిర్యానీ ఎవరైనా ఇస్తారా? తర్వాత నికమ్ ఇదే విషయాన్ని అంగీకరించారు. ఈయనేం లాయర్? కసబ్ తుపాకీ నుంచి దూసుకొచ్చిన బుల్లెట్‌తో హేమంత్ కర్కరే నేలకొరగలేదు. ఆర్‌ఎస్‌ఎస్ అనుకూలుడైన ఓ అధికారి కాల్పుల్లోనే కర్కరే ప్రాణాలు విడిచారు' అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దాచిపెట్టిన మోసగాడు నికమ్‌కు బీజేపీ టికెట్ ఇచ్చిందని ఆరోపించారు. వడెట్టివార్ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే స్పందించారు. ఆ వర్గం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఎంతటి నీచానికైనా దిగుజారుతుందని మండిపడ్డారు. ఉగ్రవాదులకు వంతపాడేందుకు కాంగ్రెస్ నేతలకు సిగ్గనిపించడం లేదా? అని నిలదీశారు. అనంతరం వడెట్టివార్ తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. మాజీ ఐజీపీ ఎస్ఎం ముష్రిఫ్ రాసిన పుస్తకంలోని అభిప్రాయాలనే తాను ఇక్కడ ప్రస్తావించానని ఆయన సమర్థించుకున్నారు. ఉగ్రదాడులను ప్రతి ఘటిస్తూ వీరమరణం పొందిన కర్కరే హీరోగా కీర్తి తెచ్చుకున్నారు. మరణానంతరం ప్రభుత్వం 'అశోక చక్ర' అవార్డును ప్రకటించింది. కాగా, తమ అభ్యర్థి నికమ్‌పై బురద జల్లేలా వడెట్టివార్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. వాస్తవాలతో కాకుండా ఉద్వేగాలను రెచ్చగొట్టేలా అసత్యాలు మాట్లాడిన వడెట్టివార్‌పై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు బీజేపీ ముంబై అధ్యక్షుడు ఆశిష్ శేఖర్ వెల్లడించారు.

నాకు బిడ్డలు లేరు.. ప్రజల బిడ్డల కోసమే నా తపన

ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ఉద్ఘాటన

ఎటావా/సీతాపూర్: కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు వారసత్వ రాజకీయాలు చేస్తున్నాయని, ప్రజలను పక్కనపెట్టి, కేవలం సొంత కుటుంబాల బాగు కోసమే ఆరాటపడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. రాబోయే తరాల కోసం మెరుగైన భవిష్యత్తును నిర్మించడానికి తాను శ్రమిస్తున్నానని చెప్పారు. తనకు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు బిడ్డలు లేరని, ప్రజల బిడ్డల శ్రేయస్సు కోసం తాము తపన పడుతున్నామని వివరించారు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని ఎటావా, దౌరాహ్రాలో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. రాబోయే 1,000 సంవత్సరాల పాటు భారత్ శక్తివంతమైన దేశంగా కొనసాగడానికి పునాది రాయి వేస్తున్నానని ప్రకటించారు. తాను ఉన్నా, లేకున్నా భారత దేశం ఉంటుందని, అందుకే దేశాన్ని శక్తివంతంగా మార్చాలని సంకల్పించానని స్పష్టం చేశారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల నాయకులు కేవలం సొంత భవిష్యత్తు, వారి పిల్లల భవిష్యత్తు కోసమే ఎన్నికల్లో నెగ్గాలనుకుంటున్నారని మోదీ ధ్వజమెత్తారు. ఆ రెండు పార్టీల నేతలు వారి కుటుంబాలకు, ఓటు బ్యాంక్‌కు మాత్రమే లబ్ధి చేకూర్చాలని తహతహలాడుతున్నారని మండిపడ్డారు. బహిరంగ సభల్లో ప్రధానమంత్రి ఇంకా ఏం మాట్లాడారంటే...

మోదీ వారసత్వం అంటే ఇదే..

''వారసత్వ పార్టీల నేతలు సాధించేదేమిటి? కార్లు, బంగళాలు, రాజకీయ పలుకుబడి సంపాదించుకోవడం తప్ప వారికి ప్రజా సంక్షేమం, అభివృద్ధి గురించి ఏం తెలుసు? ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి, కన్నౌజ్, ఎటావా లోక్‌సభ స్థానాలను కొందరు వారి సొంత సామ్రాజ్యాలు అనుకుంటున్నారు. మరికొందరు అమేథీ, రాయ్‌బరేలీని వారి సొంత జాగీర్లుగా భావిస్తున్నారు. నా వారసత్వం ప్రజలందరికీ చెందుతుంది. 2047లో పేద ప్రజల కుమారులు, కుమార్తెలు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు కావాలన్నదే నా కోరిక. రాజకుటుంబాల వారసులు మాత్రమే



ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి అయ్యే దుష్ట సంప్రదాయాన్ని ఈ చాయ్‌వాలా బద్ధలు కొట్టాడు. సమాజంలో దురాచారాలపై నిషేధం కోసం పోరాడిన రాజారామ్ మోహన్ రాయ్‌ను ఇప్పటికీ స్మరించుకుంటున్నాం. పాత సంప్రదాయానికి చరమగీతం పాడేసి, పేదల బిడ్డలు సైతం ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి అయ్యేలా కృషి చేసిన ప్రధానమంత్రి ఉండేవాడు, ఆయన ఒక చాయ్‌వాలా అని భవిష్యత్తు తరాలు చెప్పుకొనే రోజు వస్తుంది. మోదీ వారసత్వం అంటే పేదలకు పక్కా ఇళ్లు, కోట్లాది మంది మహిళలకు మరుగుదొడ్లు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు విద్యుత్, గ్యాస్ కనెక్షన్, కుళాయి నీళ్లు.

ఓటు బ్యాంక్ కాంట్రాక్టర్లను ముస్లింలు నమ్మట్లేదు

కాంగ్రెస్‌తోపాటు విపక్ష 'ఇండియా' కూటమి తమను పావులుగా వాడుకుంటున్నాయని ముస్లింలు ఇప్పుడు అర్థం చేసుకుంటున్నారు. బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి వారు విపక్షాలకు దూరంగా ఉంటున్నారు. ఓటు బ్యాంక్ కాంట్రాక్టర్లను ముస్లింలు నమ్మడం లేదు. ఎలాంటి వివక్షకు తావు లేకుండా ప్రభుత్వ పథకాలతో మైనార్టీలూ లబ్ధి పొందుతున్నారు. దూరమవుతున్న ముస్లిం ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవడానికి ప్రతిపక్షాలు కొత్త ఆట మొదలుపెట్టాయి. బుజ్జగింపు వ్యవహారాలకు దిగుతున్నాయి. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వొద్దని బాబా సాహెబ్ అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ స్పష్టం చెప్పారు. కానీ, ప్రతిపక్షాలు మాత్రం మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని మొండిగా వాదిస్తున్నాయి.

కృష్ణుడికి పూజలు చేయడం కూడా తప్పేనా?

కాంగ్రెస్ రాజకుమారుడు ఐదేళ్ల క్రితం ఎన్నికల సమయంలో ఆలయాల చుట్టూ తిరిగాడు. కోటుపై జంధ్యం కూడా ధరించాడు. ఈసారి మాత్రం ఆయన ఆలయాలకు వెళ్లడం మానేశారు. అయోధ్యలో 500 ఏళ్ల తర్వాత ఆలయం నిర్మించుకున్నాం. దేశ ప్రజలంతా సంతోషించారు. రామమందిర ప్రాణప్రతిష్ఠకు హాజరు కావాలంటూ ఆహ్వానం పంపిస్తే కాంగ్రెస్ నాయకులు తిరస్కరించారు. నేను ద్వారకలో సముద్రగర్భంలో కృష్ణుడికి పూజలు చేయడాన్ని కాంగ్రెస్ రాజకుమారుడు విమర్శించాడు. కృష్ణుడికి పూజలు చేయడం కూడా తప్పేనా?'' అని ప్రధాని మోదీ ఆక్షేపించారు.

అయోధ్య బాలరాముడి సేవలో మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అయోధ్య భవ్య రామమందిరంలో బాలరాముడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది జనవరి 22న జరిగిన ఆలయ ప్రాణప్రతిష్ఠ తర్వాత బాలరాముడిని మోదీ దర్శించుకోవడం ఇదే మొదటిసారి. అనంతరం అయోధ్యలో రోడ్ షోలో మోదీ పాల్గొన్నారు.

ముగిసిన మూడో దశ ప్రచార పర్వం

92 స్థానాలకు రేపు పోలింగ్

అహ్మదాబాద్/బెంగళూరు: అధికార ఎన్‌డీఏ కూటమి, విపక్షాల 'ఇండియా' కూటమి ఓటరు మహాశయుడిని ప్రసన్నం చేసుకునేందుకు పోటాపోటీగా కొనసాగించిన మూడో దశ ఎన్నికల ప్రచారపర్వం ఆదివారంతో ముగిసింది. మూడో దశ కింద 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 92 లోక్‌సభ స్థానాలకు మే ఏడో తేదీన పోలింగ్ జరగనుంది. వాస్తవానికి అనంత్‌నాగ్–రాజౌరీ స్థానానికి పోలింగ్ జరగాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదాపడింది. అక్కడ పోలింగ్‌ను ఏడో దశకు మార్చారు. కర్ణాటకలో జేడీఎస్ యువ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచారపర్వం తోడవంతో బీజేపీ, కాంగ్రెస్ మధ్య విమర్శల మంటలు ఎగిసి మూడో విడత ప్రచారాన్ని మరింత రక్తికట్టించాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్ కోటాను ముస్లింలకు పంచబోమని కాంగ్రెస్ రాతపూర్వక హామీ ఇవ్వాలని ప్రచారంవేళ ప్రధాని మోదీ సవాల్ విసిరారు. మేమొస్తే 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తేస్తామని, మీకు ఆ దమ్ముందా? అని కాంగ్రెస్ ప్రతిసవాల్ చేసి ప్రచారోష్ణాన్ని పెంచేసింది. మూడో దశ పోలింగ్ ఉన్న 92 స్థానాల్లో 120 మంది మహిళలుసహా మొత్తంగా 1,300కుపైగా అభ్యర్థులు బరిలో నిలిచారు. కేంద్ర మంత్రులు అమిత్ షా(గాంధీనగర్), జ్యోతిరాదిత్య సింధియా(గుణ), మన్‌సుఖ్ మాండవీయ(పోర్‌బందర్), పురుషోత్తం రూపాలా(రాజ్‌కోట్), ప్రహ్లాద్ జోషి(ధార్వాడ్), ఎస్పీ సింగ్ బఘేల్(ఆగ్రా) ఈసారి తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్(విదిష), మరో మాజీ సీఎం దిగ్విజయ్‌సింగ్(రాజ్‌గఢ్), కర్ణాటక మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై(హావేరీ), బద్రుద్దీన్ అజ్మల్(ధుబ్రి), ములాయం సింగ్ యాదవ్ కుటుంబసభ్యులు కొందరు ఈసారి బరిలో నిలిచారు.

రాష్ట్రం	పోలింగ్ జరిగే స్థానాలు
గుజరాత్	25
కర్ణాటక	14
మహారాష్ట్ర	11
ఉత్తరప్రదేశ్	10
మధ్యప్రదేశ్	8
ఛత్తీస్‌గఢ్	7
బిహార్	5
అస్సాం	4
బెంగాల్	4
గోవా	2
దాద్రానగర్, హవేలీ, దయ్యూడామన్	2



ఎన్నికల విచిత్రం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల గుర్తులు, జెండాలే ఇతివృత్తంగా తయారు చేసిన రకరకాల మిఠాయిలను దుకాణంలో అమ్మకానికి పెట్టిన దృశ్యం. ఆదివారం పశ్చిమబెంగాల్‌లోని హౌరాలో క్లిక్‌మనిపించిన ఫొటో ఇది.

ఎలక్షన్ బీట్

కశ్మీర్‌లో ఉగ్రదాడి బీజేపీ ఎన్నికల స్టంట్

కాంగ్రెస్ నేత, పంజాబ్ మాజీ సీఎం చన్నీ వ్యాఖ్య

చండీగఢ్: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో శనివారం వైమానిక దళ కాన్వాయ్‌పై జరిగిన దాడిలో ఒక జవాను నేలకొరగ్గా మరో నలుగురు తీవ్రంగా గాయపడటం తెలిసిందే. ఈ ఘటనపై కాంగ్రెస్ నేత, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జీత్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రణాళిక ప్రకారం చేయించిన స్టంట్‌గా పేర్కొన్నారు. 'ఇదొక స్టంట్. అందులో నిజం లేదు. ప్రజల ప్రాణాలు, శరీరాలతో బీజేపీ ఆడుకుంటోంది. ఎన్నికలొచ్చిన ప్రతిసారీ ఓట్ల కోసం బీజేపీ ఇలాంటివి చేయిస్తూ ఉంటుంది' అని పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మాత్రం కశ్మీర్‌లో ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. అమరుడైన జవానుకు నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఆయన ఆదివారం 'ఎక్స్'లో ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు మళ్లీ షాక్

భోపాల్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన బినా అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే నిర్మలా సప్రే ఆదివారం బీజేపీలో చేరారు. మార్చి 16న ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాక కాంగ్రెస్‌ను వీడిన మూడో ఎమ్మెల్యే ఈమె. సాగర్ జిల్లా రాహత్‌గఢ్‌లో జరిగిన బీజేపీ ర్యాలీలో ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ సమక్షంలో నిర్మలా సప్రే కాషాయ కండువా కప్పుకున్నారు. మార్చి 29న కమ్లేశ్ షా, ఏప్రిల్ 30న రామ్‌నివాస్ రావత్ అనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ తీర్థం పుచ్చుకోవడం తెల్సిందే.

మోదీ కనుసన్నల్లోనే ఈసీ: మమత

బోల్పూర్: మోదీ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ప్రధాని మోదీ ఫొటోతో ప్రింట్ మీడియాలోని ఓ వర్గం పూర్తి పేజీ ప్రకటనలు ఇస్తున్నప్పటికీ ఈసీ పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు తమనే గెలిపిస్తారని నమ్మకం ఉంటే పత్రికల్లో ఫొటోలు వేయించుకోవడం ఎందుకని మోదీని ఆమె ప్రశ్నించారు. వీటిపై ఈసీ ఎందుకు మౌనంగా ఉందని విమర్శించారు. 'అదే మేమైతే రవీంద్రనాథ్ ఠాకూర్ జయంతి రోజున ఆయన విగ్రహానికి పూలమాల వేయాలన్నా ఈసీ అనుమతి తీసుకోవాల్సిందే' అని ఆమె వ్యాఖ్యానించారు.

ప్రజ్వల్‌ను రప్పించేదాకా ప్రశ్నిస్తూనే ఉంటాం

- సెక్స్ కుంభకోణంపై మోదీ మౌనం వీడాలి
- ఆలిండియా మహిళా కాంగ్రెస్ చీఫ్ డిమాండ్

న్యూఢిల్లీ/బెళగావి: కర్ణాటకలో సంచలనం రేపిన సెక్స్ కుంభకోణంపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడాలని ఆలిండియా మహిళా కాంగ్రెస్ డిమాండ్‌చేసింది. ఈ మేరకు ఆలిండియా మహిళా కాంగ్రెస్ చీఫ్ అల్కా లాంబా ఆదివారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మాట్లాడారు. '' జర్మనీ నుంచి ప్రజ్వల్‌ను రప్పించి మోదీ కర్ణాటక ప్రభుత్వానికి అప్పజెప్పేదాకా దేశం నలుమూలలా మహిళా కాంగ్రెస్ ప్రశ్నిస్తూనే ఉంటుంది. ప్రజ్వల్ సెక్స్ కుంభకోణంపై ప్రధాని మోదీ మాట్లాడాలి. స్పందించేదాకా ప్రతిచోటా మిమ్మల్ని ఘెరావ్ చేస్తాం. మీ అధికారం, పోలీసులకు మేం భయపడం. మేమే కాదు దేశంలోని మహిళాలోకమంతా తమ గొంతుకను వినిపిస్తుంది. ప్రజ్వల్ ఘోరాలు తెలిసి కూడా మోదీ వెనకేసుకొస్తున్నట్లు అనిపిస్తోంది. ప్రతి విషయంపై ఠక్కున స్పందించే కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రి స్మృతి ఇరానీ ఈ అంశంపైనా మాట్లాడాలి. తగిన చర్యలు తీసుకోవాలని ఏప్రిల్ 30న జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మను కలిశాం. ఇన్నిరోజులైనా మహిళా కమిషన్ నుంచి స్పందన రాలేదు. దీనిపై రేఖ మాట్లాడాల్సిందే'' అని డిమాండ్‌చేశారు.

బాధిత మహిళలకు సర్కార్ ఆర్థిక సాయం

ప్రజ్వల్ ఉదంతంలో బాధితులైన మహిళలకు కర్ణాటక ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుందని కాంగ్రెస్ ఆదివారం తెలిపింది. బెళగావిలో సీఎం సిద్ధరామయ్య సమక్షంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, పార్టీ కర్ణాటక ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సూర్జేవాలా ఈ విషయం చెప్పారు. '' రేప్ బాధితులకు ప్రభుత్వం ఆర్థికసాయం చేయనుంది. ఇలాంటి కేసు గత 75 ఏళ్లలో ఎన్నడూ జరగలేదు. ప్రజ్వల్ గురించి తెల్సి కూడా జేడీఎస్‌తో బీజేపీ పొత్తు ఎందుకు పెట్టుకుంది? పారిపోకుండా విదేశాంగ శాఖ ఎందుకు అడ్డుకోలేదు? ప్రజ్వల్ దౌత్య పాస్‌పోర్ట్‌ను ప్రధాని ఎందుకు రద్దుచేయలేదు?' అని సూర్జేవాలా ప్రశ్నించారు.

గొంతు నొక్కేందుకే జైల్లో వేశారు

సునీతా కేజ్రీవాల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ గొంతు వినిపించకూడదనే కుట్రతోనే మోదీ సర్కార్ ఆయనను జైలుపాలు చేసిందని కేజ్రీవాల్ భార్య సునీత ఆరోపించారు. సౌత్ ఢిల్లీ ఆప్ ఎంపీ అభ్యర్థి సాహీరాం పహల్వాన్‌కు మద్దతుగా ఆదివారం దేవలీ ప్రాంతంలో ఎన్నికల రోడ్‌షోలో ఆమె మాట్లాడారు. '' దేశంలో పట్టపగ్గాల్లేని నియంతృత్వ పాలన కొనసాగుతోంది. ఎన్నికల్లో ప్రతిపక్ష నేతల గొంతు వినడం కూడా ఢిల్లీ పాలకులకు ఇష్టంలేదు. అందుకే కేజ్రీవాల్ గొంతు మీదాకా చేరకుండా ఆయనను జైల్లో పడేశారు. నియంతృత్వానికి అంతం పలికేందుకు, ప్రమాదంలో పడ్డ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఈసారి ఓటేయండి'' అని సునీత పిలుపునిచ్చారు. '' కేజ్రీవాల్ చక్కగా చదువుకున్నారు. నిజాయతీపరుడు. దేశభక్తుడు. మా వివాహమై 30 ఏళ్లు. ఈ 30 ఏళ్లూ అవే విలువలు ఆయనలో చూశా. మాకు వివాహం నిశ్చయమయ్యాక నన్నో ప్రశ్న అడిగారు. సమాజ సేవ చేస్తే నీకేం అభ్యంతరం లేదుగా? అని. సాధారణ ప్రజల బతుకులు బాగుచేయడం కోసం ఆయన ఎంతో తపించారు'' అని సునీత చెప్పారు.

హిందూ–ముస్లిం విభేదాలే మోదీ రాజకీయాలకు పునాది

కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీ రాజకీయ చరిత్రకు హిందూ–ముస్లింల వివాదాలే పునాదిగా ఉన్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. రాజ్‌గఢ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న దిగ్విజయ్ ఆదివారం ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పీటీఐ ప్రతినిధితో ప్రత్యేకంగా ముచ్చటించారు. 'మోదీ రాజకీయ చరిత్రకు హిందూ–ముస్లిం వివాదాలే ఆధారంగా ఉన్నట్లు అర్థమవుతుంది. దీనివల్ల లాభమెవరికి, నష్టం జరిగేదెవరికి? అనే విషయాలపై ఆయన ఒకసారి ఆత్మపరిశీలన చేసుకుంటే మంచిది' అని అన్నారు. ప్రజల వాస్తవ సమస్యలపై కాకుండా బీజేపీ జాతి, మతం ఆధారంగానే ఎన్నికల్లో పోటీ చేస్తోందని ఆరోపించారు.

ఈవీఎంలపై అనుమానాలున్నాయి..

ఈసారి 400పైగా స్థానాలను గెలుచుకుంటామన్న బీజేపీ నినాదంపై దిగ్విజయ్ స్పందిస్తూ.. ఎన్నికల్లో బీజేపీ విజయం వెనుక ఈవీఎంల పాత్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. 2014, 2019 ఎన్నికల్లో గెలవబోయే సీట్ల సంఖ్యను అటూఇటుగా బీజేపీ ముందుగానే ఊహించి చెప్పిందని ఆయన అన్నారు. '2014 ఎన్నికల్లో బీజేపీ 272పైగా సీట్లు గెలుస్తామని చెప్పి, 284 చోట్ల నెగ్గింది. 2019 ఎన్నికల్లో 300పైగా అనే నినాదంతో వచ్చి అంతకుమించి 303 స్థానాలను దక్కించుకుంది. వీటిని బట్టి చూస్తే బీజేపీ గెలుపు వెనుక ఈవీఎంల పాత్ర ఉందని నాకనిపిస్తోంది. ఈవీఎంల విషయంలో సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నాకు సంతృప్తి కలిగించలేదు. దీనిపై ఎన్నికల తర్వాత మాట్లాడతా'అని దిగ్విజయ్ వివరించారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి మొదటి రెండు విడతల పోలింగ్‌లో ఓట్ల శాతం తగ్గుదలపై ఆయన..'తమ ఓటును ఈవీఎంలు సరిగ్గా నమోదు చేసుకుంటున్నాయా లేదా అనే విషయంలో ఓటర్లకు అనుమానాలున్నాయి. ఓటు హక్కు వినియోగంపై ప్రజలపై ఎంతో ఒత్తిడి ఉంటోంది అందుకే వారు ఓటేసేందుకు రావడం లేదు. ఎండ తీవ్రత వల్ల కూడా కొందరు బయటకు రావడం లేదు' అని వ్యాఖ్యానించారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
సోమవారం : 6 : మే : 2024



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మను ఐపీఎస్ అధికారి టి.కె. రాణా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈవో రామరావు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలను అందజేశారు.



ఆర్టీసీకి ఎండ దెబ్బ

నందిగామ: భానుడి ప్రభావం ఆర్టీసీపై కనిపిస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటిపోయాయి. మధ్యాహ్న వేళ ఆర్టీసీ బస్సులు దాదాపుగా ఖాళీగా కనిపిస్తున్నాయి.



	కనిష్టం	గరిష్టం
మచిలీపట్నం	30	37
గుడివాడ	30	40
నందిగామ	29	42.2
జగ్గయ్యపేట	31	42

న్యూస్‌రీల్

'నీట్'కు 92 శాతం హాజరు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశ వ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశాలకు నిర్వహించే నీట్ యూజీ–2024 పరీక్ష ఆదివారం ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లాలో 15 వేలమంది విద్యార్థులను కేటాయించగా అందులో 92 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు కోఆర్డినేటర్ బర్నోబస్ తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లాలో 26 పరీక్ష కేంద్రాలు కేటాయించారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకూ పరీక్ష కొనసాగింది. విద్యార్థులను 11.30 గంటల నుంచి పరీక్ష జరిగే ప్రాంగణాల్లోకి అనుమతించారు. అభ్యర్థుల హాల్‌టికెట్‌తో పాటుగా ఇతర గుర్తింపు కార్డుల ఉంటేనే లోపలకు అనుమతించారు. పరీక్షను మొత్తం 34 మంది పరిశీలకులు పర్యవేక్షించారు.

సమర్థతను చూసి ఓటు వేయాలి



ఉంగుటూరు: ప్రలోభాలకు లొంగకుండా సమర్థులను ఎన్నుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆదివారం శిక్షణార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు పెద్ద ఆయుధమని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. తాము ఓటు వేయడంతోపాటు ఇతరులతో కూడా ఓటు వేయించడం బాధ్యతగా భావించాలని సూచించారు. డబ్బు, కులం, మతం చూడకుండా గుణం, సమర్థత చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను యువత వినియోగించుకోవాలని పేర్కొన్నారు. స్వయం సమృద్ధి సాధించే లక్ష్యంతో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నవారిని చూస్తుంటే సంతోషంగా ఉందని శిక్షణ పొందుతున్న యువతతో అన్నారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ఏపీ శాసనసభ సెక్రటరీ జనరల్ రామాచార్యులు, ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న ఎన్నికల అబ్జర్వర్



గుడివాడ టౌన్: గుడ్లవల్లేరు మండలం వేమవరంలో వేంచేసియున్న కొండలమ్మవారిని ఎన్నికల అబ్జర్వర్ ఆకునూరి ప్రసాద్ ప్రహ్లాద్ దర్శించుకున్నారు. పాలకవర్గం ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికింది. అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి ఆయనను సత్కరించారు. అమ్మవారి కటాక్షం ప్రజలందరిపై ఉండాలని ప్రసాద్ ప్రహ్లాద్ అన్నారు.

ఉద్యోగులంతా జగన్‌మోహన్‌రెడ్డి వైపే..

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ ఉద్యోగులంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైపే ఉన్నారని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉద్యోగులు ఎప్పుడూ అవమానపడలేదన్నారు. చంద్రబాబు పాలనలో ఉద్యోగస్తులు మానసిక వేదనకు గురయ్యారని గుర్తు చేశారు. ప్రస్తుతం 1 నుంచి 10వ తేదీలోపు ఉద్యోగుల వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు మేనిఫెస్టో ద్వారా ఏడాదికి రూ. 1.50 లక్షల కోట్ల వరకు సంక్షేమ పథకాలకు చెల్లించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తమకు జీతాలు వస్తాయా లేదా అని ఉద్యోగస్తులు చర్చించుకుంటున్నారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసి రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చారని చెప్పిన ప్రతిపక్షాలు, చంద్రబాబు హామీలతో రాష్ట్రంలో ఇంకేమి అవుతుందోనని ఉద్యోగుల్లో ఆందోళన మొదలైందన్నారు. మచిలీపట్నంలో నాలుగు వేల మందికి పైగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును మూడు రోజుల పాటు వినియోగించుకోనున్నారన్నారు.



జైత్రయాత్ర.. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు జోరుగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం ఎంపీ అభ్యర్థి కేశినేని నానితో కలిసి సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ నుంచి రోడ్ షో నిర్వహించారు. - అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్)



సామాన్యుడే.. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ అసిఫ్ ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం పాతబస్తీలోని ముఠా కార్మికులతో కలియ తిరుగుతూ వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. - వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

ప్రచార పర్వం



అవు'రూప' బహుమతి.. విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రముఖ సినీ నటి శ్యామలతో కలిసి 14వ డివిజన్‌లో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పెనమలూరులో తుఫ్యాన్

- ప్రచారంలో దూసుకెళ్తున్న పార్టీ అభ్యర్థి జోగి రమేష్
- ఆరోపణల ఉచ్చులో టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్
- టీడీపీకి కలిసిరాని జనసేన, బీజేపీ వర్గాలు

కంకిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సమయం సమీపించే కొద్దీ పెనమలూరులో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. గెలుపుపై వైఎస్సార్ సీపీలో ధీమా వ్యక్తమవుతుండగా, టీడీపీ డీలా పడుతోంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. గ్రామగ్రామాన ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాల లబ్ధి, అభివృద్ధి కార్యక్రమాలతో వైఎస్సార్ సీపీకి అడుగడుగునా అపూర్వ ఆదరణ లభిస్తోంది. ప్రజలంతా పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. కూటమి విధానాలు నచ్చక టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీ నాయకుల్లో ఆందోళన మొదలైంది. ప్రచారంలో బీజేపీ అంటీముట్టనట్టు ఉండటం, జనసేనలోని వర్గాలు కలిసిరాకపోవడంతో టీడీపీ నాయకుల వెన్నులో వణుకు మొదలైంది.

నాలుగోసారి నియోజకవర్గానికి ఎన్నికలు


పెనమలూరు నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య కృష్ణా జిల్లాలోనే అత్యధికం. ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు తాజాగా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,94,928 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,42,349 మంది, మహిళలు 1,52,577 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. నియోజకవర్గ పునర్విభజన ప్రక్రియతో 2009లో కంకిపాడు, ఉయ్యూరు, పెనమలూరు మండలాలతో పెనమలూరు నియోజకవర్గం ఏర్పాటైంది. ఆయా మండలాలతో పాటుగా ఉయ్యూరు నగర పంచాయతీ, తాడిగడప మునిసిపాలిటీ కూడా ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 2009, 2014, 2019లో ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు నాలుగో సారి ఎన్నికలు జరుగుతున్నాయి. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలుసు పార్థసారథి 177 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ 31,448 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 2019లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి 11,317 ఓట్ల మెజార్టీతో విజయం దక్కించుకున్నారు. ఈ దఫా పెనమలూరు స్థానం కోసం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ బరిలో నిలిచారు. టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్‌తో పాటు మరో తొమ్మిది మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.



జోగి రమేష్, వైఎస్సార్ సీపీ అభ్యర్థి



పెనమలూరు నియోజకవర్గం మ్యాప్



బోడె ప్రసాద్, టీడీపీ అభ్యర్థి

బోడె.. నీకో దండం

'టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ వ్యవహారశైలిలో ఇప్పటికీ మార్పులేదు. కనీసం కార్యకర్తలను ఆత్మీయంగా పలకరించడంలేదు' అని ఆ పార్టీ శ్రేణులు వాపోతున్నాయి. ఇదెక్కడి గోల. ఆయనకో దండం. ఇష్టం లేకున్నా కొనసాగుతున్నాం అంటూ ఆ పార్టీ శ్రేణులే మధనపడుతున్న పరిస్థితి. కూటమి నేతృత్వంలో చేపడుతున్న ప్రచారానికి స్పందన అంతంత మాత్రంగా ఉంటోంది. అధికారం లేకున్నా ఐదేళ్లు ప్రజలతోనే ఉన్నానని అండగా నిలవాలని ప్రచారంలో గొప్పగా చెప్పుకొంటున్నారు. 2014 నుంచి 2019 వరకూ కేవలం కొద్ది మంది అనుయాయులను పక్కనపెట్టుకుని అందలం ఎక్కించారంటూ పలువురు పెదవి విరుస్తున్నారు. ఇసుక విక్రయాలు, మట్టి అక్రమ వ్యాపారం, సెక్స్ రాకెట్, కాల్ మనీ, బిల్డర్ల నుంచి అక్రమ వసూళ్ల వంటి అనేక ఆరోపణలు బోడె ప్రసాద్ చుట్టూ ఉచ్చులా బిగుస్తున్నాయి. స్వపక్షంలోనూ విపక్షం ఉండటం, నాయకులు కలిసినా మనసులు కలవకపోవడంతో కూటమి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. బీజేపీలోని ఓ వర్గం ఇప్పటికే దూరంగా ఉంటోంది. జనసేన వర్గాలు పూర్తిగా కలిసి పని చేయటం లేదు. సీనియర్ నాయకుడు చలసాని వెంకటేశ్వరరావు (పండు) వర్గానికి అన్యాయం జరగడంతో ఆయన కుమార్తె చలసాని స్మిత, గౌతమ్, ఆమె వర్గం టీడీపీకి షాక్ ఇచ్చింది. వారంతా వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచారు. స్థానికుడు అన్న ఒక్క అనుకూలం తప్ప బోడె ప్రసాద్‌కు మిగిలినవన్నీ ప్రతికూల అంశాలే. తొలుత సీటు ఖరారు కాక అధిష్టానంపై ధిక్కార స్వరం వినిపించి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తాననడం, ఆఖరికి ఎన్ఆర్ఐల వృణ్యమాని సీటు తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందంటూ ఆ పార్టీ నేతలు గుసగుసలాడుతున్నారు. ఎలాగూ ఎదురుగాలి వీస్తుండటంతో ఇండెంట్ వేసి చందాలు రాబడుతూ దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టే పనిలో నేతలు ఉన్నారన్న వ్యాఖ్యలు బలంగా వినిపిస్తున్నాయి.

జోగికి ప్రజాదరణ

సిట్టింగ్ ఎమ్మెల్యే పార్థసారథి టీడీపీలోకి ఫిరాయించటంతో వైఎస్సార్ సీపీ అధిష్టానం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌కు పెనమలూరు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించింది. అంతేకాకుండా పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిపింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ఇప్పటికే జోగి రమేష్ ప్రజలకు చేరువయ్యారు. ఆయన పార్టీలోని అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ విస్తృతంగా ప్రజల్లోకి చొచ్చుకెళ్తున్నారు. వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ జోగి కుటుంబం యావత్తూ ప్రచారాన్ని సాగిస్తూ ప్రజాదరణ చూరగొంటోంది. సమస్యలు విన్న వెంటనే 'నేనున్నా.. పరిష్కరించే బాధ్యత నాది' అని జోగి భరోసా ఇస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ విధానాలు నచ్చి, టీడీపీ, జనసేన పక్షాల్లో ఇమడలేక అనేక మంది ద్వితీయ శ్రేణి నాయకులు ఇప్పటికే వైఎస్సార్ సీపీలో చేరి పార్టీ బలోపేతంలో ప్రధాన పాత్ర వహిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీతో పాటు ఇవ్వని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అర్హులందరికీ అందించింది. పాలనను గ్రామస్థాయికి తీసుకొచ్చింది. వలంటీరు వ్యవస్థ ద్వారా సంక్షేమాన్ని గడపకు చేర్చి అన్ని వర్గాల సంక్షేమానికి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పాల్పడుతోంది. ఇవన్నీ జోగికి అనుకూల అంశాలు.

దుర్గమ్మ ఆలయానికి విరాళాలు



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ ఆలయంలో నిత్యాన్నదానానికి విజయవాడ కొత్తపేటకు చెందిన ఎస్‌బీపీ రామగుప్త కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ పర్యవేక్షకుడు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

బంగారు తాపడం పనులకు..

దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు విజయవాడ మొగల్రాజపురం రత్నమాంబ వీధికి చెందిన యార్లగడ్డ లక్ష్మీ చారుమతి, రాజేశ్వరరావుల పేరిట రూ. లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ అధికారులు అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో వారిని సత్కరించారు.



బంగారం తాపడం పనులకు విరాళం ఇచ్చిన దాతలను సత్కరిస్తున్న అధికారులు

రెండో రోజూ సజావుగా పోస్టల్ బ్యాలెట్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ రెండో రోజూ ప్రశాంతంగా కొనసాగింది. వేసవి దృష్ట్యా స్టేడియంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సరళిని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రీకృత ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలో తొలిరోజు శనివారం చిన్నచిన్న సమస్యలు ఎదురైనా.. వాటిని వెంటనే సరిదిద్ది ప్రక్రియ సాఫీగా సాగేలా చేశామన్నారు. రెండోరోజు ఆదివారం మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, సిబ్బంది ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 9,704 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారన్నారు. ఇతర జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఆయా జిల్లాలకు పోస్టల్ బ్యాలెట్ పంపామన్నారు. ఈనెల 4న పీవో, ఏపీవోలు తమ శిక్షణ కేంద్రం వద్దే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఉపయోగించుకున్నారని.. ఇదే విధంగా 6వ తేదీన కూడా అవకాశం ఉంటుందన్నారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంపై ఒత్తిడి తగ్గించేందుకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలోనూ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. అవసరాన్ని బట్టి అదనపు సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు.



స్టేడియంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

7న అత్యవసర సేవల సిబ్బందికి..

ఈ నెల 7న ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. డాక్టర్లు, వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది, ఆర్‌టీసీ, రైల్వే తదితర అత్యవసర సేవల సిబ్బంది ఆ రోజున పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. 7, 9 తేదీల్లో హోం ఓటింగ్ ప్రక్రియను ప్రత్యేక బృందాల ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. హోం ఓటింగ్‌కు 1,052 మంది దరఖాస్తు చేసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట జేసీ పి.సంపత్ కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎస్‌ఈవో యూవీ సుబ్బారావు, డ్వామా పీడీ కె.సునీత, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ ఉన్నారు.

జైనులను గుర్తించిన ఏకైక సీఎం జగన్



రాజస్థానీ తలపాగాలను ధరించి సమ్మేళనంలో పాల్గొన్న అసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి తదితరులు

విజయవాడ వెస్ట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ అసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో జైనులను గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ అసిఫ్ అన్నారు. ఏపీ జైన్ అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి ఆధ్వర్యంలో రాజస్థానీయుల ఆత్మీయ సమ్మేళనం నగరంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అసిఫ్ మాట్లాడుతూ జైనులను గుర్తించి వారికి ప్రత్యేకంగా దేశంలోనే మొదటిగా ఏపీ జైన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. దేశంలో కులమతాలకు అతీతంగా పేదరికమే ప్రాతిపదికను అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేదరిక నిర్మూలనకు పాటుపడిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అటువంటి ముఖ్యమంత్రిని మరోసారి ఎన్నుకోవాల్సిన అవసరాన్ని, ఆవశ్యకతను అందరూ గుర్తించాలన్నారు. జైనులు ఇతర రాజస్థానీయులు విజయవాడ నగరంలో అనేక దశాబ్దాలుగా స్థిర నివాసం ఏర్పరచుకొని అన్నదమ్ముల్లా జీవిస్తున్నారన్నారు. శాంతియుత జీవితాలను అందరం గడుపుతున్నామన్నారు. అటువంటి చక్కని శాంతియుత జీవనం కావాలంటే మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. తాను కార్పొరేటర్‌గా, ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేశానని, ఇప్పుడు ఎమ్మెల్యే సీటును ఇచ్చి సీఎం వైఎస్ జగన్ తనను గౌరవించారాని చెప్పారు. స్థానికుడనైన తాను ఎమ్మెల్యేగా అందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు.

అభివృద్ధిని చూడండి..

ఎంపీ కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేత మాట్లాడుతూ తన తండ్రి నాని పదేళ్లగా ఎంపీగా ఉంటూ విజయవాడ పార్లమెంట్ పరిధిలో సుమారు ఎనిమిది వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. వాటిని ఓటేయాలన్నారు.

జగన్‌కు అండగా ఉంటాం..

సభకు అధ్యక్షత వహించిన ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని జైన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి తమను గౌరవించిన జగన్‌కు తామందరం అండగా ఉంటామన్నారు. ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లో జైన్ కార్పొరేషన్ల కోసం అక్కడ ఉన్న జైనులు అక్కడి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా మహావీర్ భగవానుడికి, జైనులకు అనేక రూపాల్లో మేలు చేసి తమను గత ప్రభుత్వాలకు భిన్నంగా ఆదరించి అక్కున చేర్చుకున్నారని వివరించారు. తమకు కావాల్సిన గుర్తింపు మాత్రమే కాకుండా తమ రిజర్వేషన్లను సైతం కాపాడుకునేందుకు అవసరమైన పత్రాలను జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమే మొదటి సారిగా జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ బండి పుణ్యశీల, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, మహాదేవు అప్పాజీరావు, నాయకులు పాల్గొన్నారు.

నేడు సీఎం జగన్ మచిలీపట్నం రాక

- మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల బహిరంగ సభ
- ఏజే కళాశాల మైదానంలో హెలీప్యాడ్
- ట్రయల్ రన్ నిర్వహణ

మచిలీపట్నం టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 6వ తేదీ సోమవారం జిల్లా కేంద్రం మచిలీపట్నం విచ్చేస్తున్నారు. మధ్యాహ్న 3 గంటలకు నగరంలోని వల్లూరి రాజా సెంటర్‌లో జరిగే ఎన్నికల ప్రచార బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణించే హెలికాప్టర్ ల్యాండ్ అయ్యేందుకు స్థానిక రాజుపేటలోని ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను వినియోగించనున్నారు. ఆ కళాశాల ఆవరణను పోలీసులు ఇప్పటికే స్వాధీనం చేసుకుని పహారా కాస్తున్నారు. కళాశాల చుట్టూ భద్రతా చర్యలు చేపట్టారు. హెలీప్యాడ్ నుంచి బహిరంగ సభాస్థలి వరకూ వివిధ శాఖల అధికారులు సీఎం కాన్వాయ్‌తో పాటు సీఎం పయనించే ప్రచార బస్సుతో ఆదివారం మధ్యాహ్నం ట్రయల్ రన్ నిర్వహించారు. సీఎం ప్రయాణించే మార్గంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి వివిధ శాఖల అధికారులు చర్యలు తీసుకున్నారు.



మచిలీపట్నంలో సీఎం పర్యటన సందర్భంగా ట్రయల్ రన్ నిర్వహిస్తున్న సిబ్బంది



ఆంధ్రజాతీయ కళాశాల మైదానంలో సిద్ధమైన హెలీప్యాడ్

ముమ్మరంగా మైక్ ప్రచారం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ప్రజలు తరలిరావాలని కోరుతూ ఎమ్మెల్యే పేర్ని నాని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) మైక్ ప్రచారం చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఈ మైక్ ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు.

క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం అమ్మ వారి సన్నిధిలో సూర్యోపాసన సేవ జరుగుతోంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు తమ నామ గోత్రాలతో పూజ జరిపించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాల వితరణ జరిగింది. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

కారుఢీకొని ఇద్దరు మహిళలు మృతి



నందిగామ: సత్యమ్మను దర్శించుకునేందుకు రోడ్డు దాటుతూ ఇద్దరు మహిళలు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి నందిగామ మండలంలోని అంబారుపేట వద్ద జాతీయ రహదారిపై జరిగింది. ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు కథనం మేరకు.. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలకు చెందిన బొప్పన స్వరూప రాణి (60) అనారోగ్యానికి గురయ్యారు. ఆమెకు వైద్యం చేయించేందుకు కుమారుడు బొప్పన తారక శ్రీరామకృష్ణ, బంధువైన మరో మహిళతో కలిసి కారులో హైదరాబాద్ బయలుదేరారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడుకు చెందిన మరో బంధువు వేగి పద్మజ (50) కారులో ఎక్కించుకున్నారు. నందిగామ మండలం అంబారుపేట వద్ద సత్యమ్మ అమ్మవారికి కొబ్బరికాయ కొట్టేందుకు బొప్పన స్వరూప రాణి, వేగి పద్మజ కారు దిగి 65వ నంబర్ జాతీయ రహదారి దాటుతున్నారు. అదే సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో కారు వారిని అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వారు ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది వారిని హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వారు ఇద్దరూ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రలోభాల పన్నాగం

ఓటర్లకు మద్యం ఎర

- భారీగా డంప్ చేసిన మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత అనుచరులు
- పక్కా సమాచారంతో పట్టుకున్న ఎస్ఈబీ పోలీసులు
- రూ. 30లక్షల విలువైన 400కేస్‌లు స్వాధీనం
- పోలీసుల అదుపులో నలుగురు టీడీపీ కార్యకర్తలు



మామిడితోటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న భారీ మద్యం డంపు



టీడీపీ అభ్యర్థి వసంత పక్కన మామిడితోట యజమాని చేబ్రోలు కృపారాజు(ఫైల్)

జి.కొండూరు: టీడీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకటకృష్ణప్రసాద్ ఎన్నికలలో ఎలాగైనా గెలవాలని అడ్డదారులు తొక్కుతున్నారు. ఇప్పటికే నాయకులను తన వైపు తిప్పుకునేందుకు తాయిలాలు ఎరవేస్తున్న వసంత, ఓటర్లను సైతం ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియలో డబ్బు పంపిణీ చేసేందుకు 2వేల మంది తన కంపెనీలలో పని చేసే ఉద్యోగులను రంగంలోకి దింపిన వసంత, ఇప్పుడు మద్యాన్ని సైతం పంపిణీ చేసేందుకు తన అనుచరులు, కార్యకర్తలను రంగంలోకి దింపారు. ఈ క్రమంలోనే ఎన్నికలలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తెలంగాణ నుంచి మైలవరం నియోజకవర్గంలోకి మద్యం బాటిళ్లను రవాణా చేస్తూ వసంత వెంకటకృష్ణప్రసాద్ అనుచరులు ఐదుగురు ఆదివారం తెల్లవారుజామున పోలీసులకు పట్టుబడ్డారు.

దొరికారు ఇలా..

మైలవరం నియోజకవర్గంలోకి భారీగా తెలంగాణ మద్యం సరఫరా అవుతోందని ఉన్నతాధికారుల సమాచారం మేరకు మైలవరం డివిజన్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సి. భార్గవ నేతృత్వంలో ఎస్ఈబీ సీఐ నాగవల్లి, మైలవరం డీటీపీ ఎస్ఐ ఎల్. రమాదేవి, ఎస్ఐ సుబ్బిరెడ్డి తమ సిబ్బందితో కలిసి మైలవరం మండల పరిధి అనంతవరం వద్ద ఆదివారం తెల్లవారుజామున ఐదుగంటల సమయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో వసంత వెంకటకృష్ణప్రసాద్ ప్రధాన అనుచరుడు రెడ్డిగూడెం మండల పరిధి రెడ్డిగుంటకు చెందిన చేబ్రోలు రాజు, అదే మండల పరిధి ముచ్చనపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త కారంకుల కేశవ, శ్రీరాంపురానికి చెందిన టీడీపీ కార్యకర్తలు విసనపల్లి రాంబాబు, పొట్లపు ఆంజిబాబు, చిన్ని దుర్గారావులు మద్యం తరలిస్తూ పోలీసులకు చిక్కారు. ఈ ఐదుగురు నిందితుల నుంచి ఒక కారు, ఒక ట్రక్కు వాహనంలో తెలంగాణ నుంచి మైలవరం నియోజకవర్గంలోకి తరలిస్తున్న 150కేస్‌ల మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రెడ్డిగుంటలో భారీ డంపు స్వాధీనం..

ఈ ఐదుగురు నిందితులను విచారించిన అనంతరం వారిచ్చిన సమాచారం మేరకు రెడ్డిగూడెం మండల పరిధి రెడ్డిగుంటలోని చేబ్రోలు కృపారాజుకి చెందిన మామిడితోటలో భారీగా డంపు చేసిన 250కేస్‌ల మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మామిడితోట యజమాని చేబ్రోలు కృపారాజు సైతం వసంతకు ప్రధాన అనుచరుడు కావడంతో పాటు ఈ కేసులో ప్రధాన నిందితుడు చేబ్రోలు రాజుకి బంధువు కావడం గమనార్హం.

అన్న క్యాంటీన్ నడుపుతున్న నిందితుడు..

ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన ఐదుగురు టీడీపీ కార్యకర్తలలో ఒకడైన చేబ్రోలు రాజు రెండేళ్లుగా మైలవరంలో అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నాడు. గతంలో దేవినేని ఉమామహేశ్వరరావుకి ప్రధాన అనుచరుడిగా ఉన్న రాజు, వసంత వెంకటకృష్ణప్రసాద్‌ను అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచి ఆయన పంచన చేరి మద్యం సరఫరా బాధ్యతలను తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా మద్యం బాటిళ్లను డంపు చేసిన మామిడితోట సైతం రాజు బంధువు చేబ్రోలు కృపారాజుకు చెందినది కావడం, ఆయన కూడా వసంతకు ప్రధాన అనుచరుడు కావడం, పట్టుబడిన మిగిలిన నలుగురు నిందితులు కూడా టీడీపీ కార్యకర్తలు కావడంతో వసంత వెంకట కృష్ణ ప్రసాదే ఈ మద్యంను డంపు చేయిస్తున్నారు అనడానికి బలం చేకూరింది.

మద్యం విలువ రూ.30లక్షలు..

పట్టుబడిన మద్యం విలువ రూ.30లక్షలు ఉంటుందని మైలవరం డివిజన్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సి. భార్గవ విలేకరుల సమావేశంలో తెలిపారు. మద్యం రవాణా చేస్తున్న రెడ్డిగూడెం మండల పరిధి రెడ్డిగుంటకు చెందిన చేబ్రోలు రాజు, అదే మండల పరిధి ముచ్చనపల్లికి చెందిన కారంకుల కేశవ, శ్రీరాంపురానికి చెందిన విసనపల్లి రాంబాబు, పొట్లపు అంజిబాబు, చిన్ని దుర్గారావులను ఆదివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి ఒక కారు, ఒక ట్రక్కు వాహనం, 150కేస్‌లు మద్యం బాటిళ్లు, డంపు చేసిన మరో 250కేస్‌ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎన్నికలలో ఈ మద్యం బాటిళ్లను పంపిణీ చేసేందుకే తెలంగాణ నుంచి నియోజకవర్గంలోకి తీసుకొస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని చెప్పారు.

జగనన్నతోనే రాష్ట్రానికి మేలు

- వైఎస్సార్ సీపీలో టీడీపీ మాజీ కౌన్సిలర్ సహా పలువురు చేరిక
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఉప్పాల రమేష్ (రాము)



టీడీపీ మాజీ కౌన్సిలర్ సుబ్రహ్మణ్యంనకు వైఎస్సార్ సీపీ కండువా కప్పుతున్న రాము

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని గుర్తించి, ఆయన అమలు చేసే సంక్షేమ ఫలాలు నిరుపేదలకు నేరుగా అందుతున్న తీరుకు మెచ్చి పలువురు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పార్టీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. పట్టణంలోని 14వ వార్డు టీడీపీ సీనియర్ కౌన్సిలర్ ఉమ్మిలేటి సుబ్రహ్మణ్యం, వార్డు నాయకుడు అంగత సాంబశివరావు కుమారుడు అంగత రామాంజనేయులు, సేనాపతి రాంబాబు, సోమ శేఖర్ తదితరులు పార్టీలో చేరారు. కూడూరులోని తన ఇంటి వద్ద వారందరికీ ఉప్పాల రమేష్ (రాము) కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని వారిని రాము కోరారు. బళ్ల సాంబశివరావు, ఉమా, రామకృష్ణ, బండారు మల్లి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రకాశం బ్యారేజీ వద్ద మెయిన్ కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మెయిన్ కెనాల్ లాకులు సమీపంలో కెనాల్ ఒడ్డున నీటిలో ఒక వ్యక్తి మృతదేహం ఉదని ఆదివారం ఉదయం పది గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ఆ మృతదేహాన్ని కెనాల్ నుంచి వెలికితీసి పురుషుడిదిగా గుర్తించారు. మృతుని వద్ద ఊరు, పేరు వంటి ఆధారాలు ఏమీ లభించలేదు. మృతుని వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, వంటిపై రెడ్ కలర్ టీషర్టు, బ్లూ షార్ట్ ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

13 నుంచి త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలు

- విజయవాడలో వారం రోజుల పాటు నిర్వహణ
- దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరుకానున్న విద్వాంసులు



త్యాగరాజ స్వామి

విజయవాడ కల్చరల్: 'సంగీత జ్ఞానమో', 'ఎందరో మహానుభావులు', 'సద్గురువులు లేక ఎటువంటి గుణికి తెలియగ బోదు'.. వంటి కీర్తనలతో శ్రీ రామచంద్ర మూర్తిని భక్తిగా సేవించిన సద్గురు త్యాగరాజ స్వామి తమిళనాట స్థిరపడినా అచ్చతెలుగు వాడు కావడం మన అదృష్టం. ఆయన రచించిన కీర్తనలను భక్తిగా పాడుకుంటూ తరించే భక్తులు లక్షల మంది కనిపిస్తారు. సద్గురువులను సేవించడం కూడా భగవంతుని సేవగా భావిస్తూ విజయవాడ నగరానికి చెందిన శ్రీ సద్గురు సంగీత సభ ఈ నెల 13వ తేదీ నుంచి వారం రోజులపాటు గాంధీనగర్‌లోని శివరామకృష్ణ క్షేత్రంలో త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలు, సంగీత సభలను నిర్వహిస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సంగీత విద్వాంసులు హాజరై సంగీత సేవ చేసుకోనున్నారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటలకు సంగీత సభలు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగుతాయి. తిరిగి సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు కొనసాగుయి.


ప్రత్యేక కార్యక్రమాలు ఇలా..

ముప్పవరపు సింహాచల శాస్త్రి 13వ తేదీ రాత్రి ఏడు గంటలకు త్యాగరాజ స్వామి దివ్య చరిత్ర హరికథా గానం చేస్తారు. 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు సంగీత విద్వాంసుడు బుచ్చాయ్యాచార్యులు భక్తి నివేదన చేస్తారు. అదే రోజు త్యాగరాజ స్వామి సంకీర్తనల నృత్య రూపకాన్ని కళాకారులు ప్రదర్శిస్తారు. అదే రోజు ఉదయం 11 గంటలకు త్యాగరాజ స్వామి రచించిన ఘనరాగ పంచరత్న కీర్తనల గోష్టిగానం ఉంటుంది. 200 మంది సంగీత విద్వాంసులు పాల్గొంటారు. రాత్రి తొమ్మిది గంటలకు డోలోత్సవం జరుగుతుంది.



త్యాగరాజ స్వామి రచించిన ఘనరాగ పంచరత్న కీర్తనల గోష్టిగానం(ఫైల్)

వైభవంగా జయంతి ఉత్సవాలు



సంగీత మూర్తి త్రయంలో ఒకరైన సద్గురు త్యాగరాజ స్వామి సంగీత విద్వాంసులకు పూజ్యనీయుడు. ఆ మహనీయుడి జయంతి ఉత్సవాలను నగరంలో 15 ఏళ్లుగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నాం. ఈ ఉత్సవాల్లో సంగీత భవితను కాపాడే చిన్నారులకు వేదికపై అవకాశం కల్పిస్తున్నాం. వారితో పాటు లబ్ధప్రతిష్టులైన విద్వాంసులతో కచేరీలు నిర్వహిస్తాం.

– పోపూరి గౌరీనాథ్, సంగీత సభ ప్రధాన కార్యదర్శి

దుర్గమ్మ సన్నిధిలో ఆర్జిత సేవలకు డిమాండ్



అమ్మవారి ఉత్సవ మూర్తి



కుంకుమార్చన నిర్వహిస్తున్న ఉభయదాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. వేసవి సెలవులు, తీర్థయాత్రలలో భాగంగా ఇంద్రకీలాద్రికి భక్తులు, యాత్రికుల రద్దీ పెరిగింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు విశేష సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరో వైపున అమ్మవారికి తెల్లవారుజామున నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణం, చండీహోమం, ఇతర ఆర్జిత సేవలలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. అమ్మవారితో పాటు మల్లేశ్వర స్వామి వారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. మరో వైపున అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఉన్న రద్దీ మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత తగ్గింది. సాయంత్రం ఆరు గంటల తర్వాత రద్దీ మళ్లీ పెరిగింది.

డబ్బు కోసం కక్కుర్తి పడితే అవమానాలే మిగిలాయి

- కాంగ్రెస్, వైఎస్సార్ సీపీలను వీడి వచ్చినందుకు బుద్ధి చెప్పారు
- సుజనా చౌదరి చెంత చేరిన నగరాల నాయకులు ఆవేదన
- అడ్డూరి శ్రీరామ్‌పై రెచ్చిపోయిన బేసు, పైలా, పోతిన
- మాయమాటలు చెప్పి జారుకున్న సుజనా కుమారుడు కార్తీక్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి క్యాంప్‌లో ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన నగరాల రచ్చ రసవత్తరంగా సాగుతోంది. తమకు గుర్తింపు ఇచ్చిన పార్టీలను వదిలి డబ్బు కోసం కక్కుర్తిపడి వస్తే అవమానాలే మిగిలాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను నమ్ముకుని వెంట తిరుగుతున్నవారు డబ్బులు అడుగుతుంటే ఏం సమాధానం చెప్పాలో కూడా అర్థం కావడం లేదని వాపోతున్నారు. వలసవాది సుజనా చౌదరి ఆకర్ష పథకం కింద పైలా సోమినాయుడు, పోతిన వెంకటేశ్వరరావు, బేసు కంతేశ్వరుడు తదితరులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. బీజేపీలో చేరితే అన్ని లక్షలు ఇస్తాం.. ఇన్ని లక్షలు ఇస్తామని ఊరించి వారికి టోకెన్ అడ్వాన్స్ ఇచ్చి కాషాయం కండువా కప్పేశారు. అంతే తాంబూలాలిచ్చేశాం.. తన్నుకు చావండి అన్న రీతిలో వారిని విస్మరించి సుజనా చౌదరి వ్యవహరిస్తుండటంతో కుడితిలోపడ్డ ఎలుకలా తయారైంది వారి పరిస్థితి. సుజనా కొడుకు యలమంచిలి కార్తిక్‌చౌదరి వన్‌టౌన్‌లోని గోల్డ్‌మెడల్ సంస్థకు చెందిన వ్యక్తికి సంబంధించిన కాంప్లెక్స్‌లో ఒక ఫ్లోర్ మొత్తం తీసుకుని డబ్బు ఇచ్చి పుచ్చుకునే వ్యవహారాలను చూస్తున్నాడని వారికి తెలిసింది. విషయం తెలుసుకున్న నగరాల వలస పక్షులు అక్కడకి వెళ్లి కలుద్దామని నిర్ణయించారు. అతనికి ఫోన్ చేస్తే అక్కడున్నా ఇక్కడున్నా అంటూ తప్పించుకుంటున్నాడు. ఇలా కాదని కార్తీక్ రాకపోకలు తెలుసుకుని తమకు సమాచారం ఇచ్చేందుకు ఒక వ్యక్తిని ఏర్పాటు చేసుకున్నారు. ఎట్టకేలకు శనివారం సాయంత్రం కార్తీక్ ఆఫీస్‌లో ఉన్నాడని తెలుసు కున్నారు. ఇంకేముంది నగరాల ప్రముఖులు డైరెక్ట్ ఎటాక్ చేయడంతో కార్తీక్ దొరికిపోయాడు. అసలు మీరంతా ఎవరని అతను అడగటంతో వారు కంగుతిని తేరుకున్నాక అసలు విషయాన్ని బయటపెట్టారు. ఇటువంటి వ్యవహారాన్నీ అడ్డూరి శ్రీరామ్ చూస్తున్నాడని, అతను వచ్చేవరకు ఉండండి, ఇప్పుడే తిరిగి వస్తానని చెప్పి కార్తీక్ చౌదరి తెలివిగా అక్కడ నుంచి తప్పుకొన్నాడు. చాలా సేపటి తరువాత వచ్చిన అడ్డూరి శ్రీరామ్(నగరాలు)పై వారంతా విరుచుకుపడ్డారని, ఒక దశలో కుర్చీలు లేపి గందరగోళం సృష్టించారని విశ్వసనీయ సమాచారం. చిట్టిగారి కాంగ్రెస్ ఆఫీస్ మూసేసి వచ్చానని ఒకరు, పీసీసీ అధ్యక్షుడిగా చేశానని మరొకరు ఇలా తమ గత చరిత్ర చెప్పుకుని, అవన్నీ వదిలేసి ఇక్కడికి వస్తే డబ్బు కోసం తిప్పుతారా అంటూ రెచ్చిపోయారట. 'మీ డబ్బు మీరు తీసేసుకుని సైలెంట్‌గా ఉంటే మా పరిస్థితి ఏమిటి? మా వెనుక తిరిగే వారు అడిగితే ఏం సమాధానం చెప్పాలి?' అంటూ నిలదీశారు. 'మా సీనియారిటీ ముందు నువ్వెంత?' అంటూ అడ్డూరి శ్రీరామ్‌ను చెడుగుడు ఆడుకున్నారని తెలిసింది. వారి దాడికి అడ్డూరి ఉక్కిరిబిక్కిరై సుజనా చౌదరితో మాట్లాడి సెటిల్ చేస్తానని నచ్చజెప్పుకుని బతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకున్నాడని సమాచారం.

టీడీపీ మూకల రాళ్ల దాడి

- గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త
- పరామర్శించిన ఎమ్మెల్సీ అరుణకుమార్



గాయపడిన సూరిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

వీరులపాడు: తెలుగుదేశం పార్టీ మూకల దాడిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని దాచవరం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. మండలంలోని దాచవరం గ్రామానికి చెందిన బెల్లపు సూరిబాబు వైఎస్సార్ సీపీ నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తరఫున తన ఆటోతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సూరిబాబు చేస్తున్న ఆటో ప్రచారాన్ని తట్టుకోలేని గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రామిశెట్టి సుబ్బయ్య, రామిశెట్టి వెంకటకృష్ణ, కామిశెట్టి తిరుపతమ్మ, కామిశెట్టి గోపి, కామిశెట్టి పుల్లమ్మ ఒక్కసారిగా అతనిపై రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన సూరిబాబును గ్రామస్తులు హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన సుబ్బయ్య, వెంకటకృష్ణ, తిరుపతమ్మ, గోపి, పుల్లమ్మపై కేసు నమోదు చేశామని ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. రామిశెట్టి సుబ్బయ్య ఫిర్యాదు మేరకు బెల్లపు హరీష్, సూరిబాబుపై కూడా కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. టీడీపీ మూకల దాడిలో గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సూరిబాబును ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పరామర్శించి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. ఓటమి భయంతోనే టీడీపీ రౌడీ మూకలు దాడులకు పాల్పడుతున్నాయని అరుణకుమార్ విమర్శించారు.

ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



సమావేశానికి హాజరైన అధికారులు



సూచనలు ఇస్తున్న కలెక్టర్ బాలాజీ

విమానాశ్రయం(గన్నవరం): విజయవాడలో ఈ నెల ఎనిమిదో తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విమానాశ్రయంలో ప్రధాని పర్యాటన ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల ఎనిమిదో తేదీ సాయంత్రం ప్రత్యేక విమానంలో ఇక్కడికి చేరుకుంటారని తెలిపారు. విజయవాడ పర్యటన అనంతరం తిరిగి విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీ బయలుదేరి వెళ్తారని వివరించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో నిబంధనల మేరకు కాన్వాయ్‌లో వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కాన్వాయ్ వెళ్లే మార్గంలో అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక పరికరాలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. విమానాశ్రయంలో లైఫ్ సపోర్ట్ వైద్య సదుపాయాలతో అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం, పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో ఆధునిక వైద్య సదుపాయలను అందుబాటులో ఉంచాలని సూచించారు. విమానాశ్రయంలో వీఐపీ లాంజ్‌లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జాగ్రత్త వహించాలని స్పష్టంచేశారు. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.ఎల్.కె.రెడ్డి, గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి, డీఎంహెచ్ఓ డాక్టర్ జె.గీతాబాయి, డీటీసీ సురేందర్, పౌరసరఫరాల శాఖ డీఎం తోట సతీష్, ఆర్అండ్‌బీ డీఈ బలరాం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో దుర్గగుడి ఉద్యోగి

పామర్రు: విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం (దుర్గగుడి)లో పనిచేస్తున్న ఉద్యోగి జిడుగు అశోక్‌కుమార్ పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజాకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. దేవదాయశాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం నిషేధం. పామర్రు నియోజకవర్గంలోని పామర్రు, పమిడిముక్కలో జరిగిన ఎన్నికల ప్రచారంలో అశోక్ కుమార్ నిబంధనలకు విరుద్ధంగా పాల్గొనడం చర్చనీయాంశమైంది.



టీడీపీ అభ్యర్థి కుమార్ రాజా తరఫున ప్రచారం చేస్తున్న దుర్గగుడి ఉద్యోగి అశోక్‌కుమార్

'కొండ'ంత అభిమానం..

చీరాల: సార్వత్రిక ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్ గెలవాలని ఆయన వీరాభిమాని మల్లెల రవీంద్రబాబు ఆదివారం విజయవాడ గుణదల కొండను మోకాళ్లపై ఎక్కి తన అభిమానాన్ని చాటుకున్నాడు. చీరాల 9వ వార్డుకు చెందిన రవీంద్రబాబు తన అభిమాన నాయకుడు ఎమ్మెల్యే కావాలని గుణదల మేరిమాతకు మొక్కుకున్నాడు. మోకాళ్లపై కొండ ఎక్కి తన అభిమానాన్ని చాటాడు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని మొక్కుకున్నాడు.



క్లుప్తంగా

జగనన్నతోనే ప్రతి ఇంటా సంక్షేమం



కృష్ణలంక(విజయవాడతూర్పు):ప్రతి ఒక్క కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమ లబ్ధి చేకూరిందని, పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి క్రాంతి అన్నారు. కృష్ణలంక, 21వ డివిజన్‌లోని కల్పనా ప్రింట్స్ రోడ్డు ప్రాంతంలో ఆదివారం ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కరపత్రాలు పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా పేదలకు ఆర్థిక భరోసా కల్పించిన వ్యక్తి సీఎం జగన్ అని చెప్పారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా దేవినేని అవినాష్‌ను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పుప్పాల కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించిన ఘనత ప్రభుత్వానిదేనని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి చెప్పారు. స్థానిక 6వ డివిజన్ గుమ్మడి వారి వీధి కొండపై ప్రాంతంలో ఆదివారం సాయంత్రం క్రాంతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి, వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాల గురించి ఆమె ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందచేసి వివరించారు. స్థానిక కార్పొరేటర్ అమర్నాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.

భవానీపురంలో రామ్‌రాజ్ షోరూమ్ ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ భవానీపురం స్వాతీ రోడ్‌లో రామ్‌రాజ్ కాటన్ కంపెనీ తమ నూతన షోరూమ్‌ను ఆదివారం ప్రారంభించింది. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానము కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధర రావు, పాపులర్ షూమార్ట్ మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి విజయకుమార్ కలిసి ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌రాజ్ కాటన్ సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన రామ్‌రాజ్ ధోతీలు, చొక్కాలు అత్యంత ఆకర్షణీయ బ్రాండ్ జాబితాలో స్థానం పొందిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయుల కోసం ఆన్‌లైన్‌లో విక్రయాలను ప్రారంభించామని, శ్రీలంక, సింగపూర్, మలేషియా వంటి ఇతర దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని రక్షించడానికి రామ్‌రాజ్ కొత్తగా యాంటీ-బ్యాక్టీరియల్ ధోతీలను ప్రవేశపెట్టిందన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు నృత్యకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మసన్నిధిలో గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన కళ్యాణి డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. చిన్నారుల నృత్య ప్రదర్శనను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు కళావేదిక వద్దకు విచ్చేశారు. నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించడమే కాకుండా చిన్నారులతో కలిసి సెల్ఫీలు, ఫొటోలు దిగారు. అనంతరం చిన్నారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

గద్దెకు గుణపాఠం తప్పదు!

- పదేళ్లలో ఏమీ చేయలేదంటున్న తూర్పు ప్రజలు
- అన్ని వర్గాలనూ మోసం చేశారని ధ్వజం
- అభివృద్ధి విస్మరించి, సొంత ప్రచారానికే ప్రాధాన్యం



లబ్బీపేటలో నిర్మాణంలో ఉన్న షాదీఖానా భవనం

లబ్బీపేట(విజయవాడతూర్పు): టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రజల సమస్యలను గాలికొదిలేసి పదేళ్ల పాటు పట్టించుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యేగా ఆయన ప్రజలకు ఏం చేశారో కూడా చెప్పుకోలేని దుస్థితి ఉందని అంటున్నారు. ప్రజల వద్దకు వచ్చినప్పుడు మంచిగా మాట్లాడటం, కార్యాలయానికి వెళితే చీదరించుకుంటారని వాపోతున్నారు. గత టీడీపీ పాలనలో ఎవరికీ ఒక సెంటు ఇళ్ల స్థలంగానీ ఇళ్లు గానీ ఇవ్వలేదని చెబుతున్నారు. నేడు యువ నాయకుడు దేవినేని అవినాష్ ఎమ్మెల్యే కాకున్నా ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపించారంటున్నారు. ప్రజలను నయవంచన చేసిన గద్దెకు తగిన గుణపాఠం చెబుతామంటున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని గిరిపురం, న్యూగిరిపురం, బాడవపేట, నెహ్రూనగర్, ఉడ్‌పేట, ఫకీరుగూడెం, జార్జిపేట, ఇస్రాయేల్‌పేట, పిటింగెల్‌పేట వంటి 14 కాలనీల శ్మశానాల విషయంలో దళితులను మోసం చేశారంటున్నారు. ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నాడని దళిత నేతలు ధర్నా చేస్తే అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని గుర్తు చేసుకుంటున్నారు. జన్మభూమి సభల్లో శ్మశానం గురించి ప్రశ్నించకుండా వందలాది మంది పోలీసులతో దళితులను అడ్డుకునే వారంటున్నారు. నియోజకవర్గంలో దాదాపు 30 వేల మంది ముస్లింలు ఉన్నారని, వారికోసం షాదీఖానా నిర్మించాలని కోరగా అదిగో ఇదిగో అంటూ మోసం చేశారని ముస్లింలు అంటున్నారు. లబ్బీపేట బందరు కాల్వ ఒడ్డున అనువైన స్థలం ఉందని చెప్పినా పట్టించుకోలేదంటున్నారు.

ఎన్నికలు మరో ఆరు నెలల్లో వస్తున్నాయనగా పదిహేను రోజులకోసారి వచ్చి కొలతలు పేరుతో ఒకసారి, సర్వే పేరుతో మరోసారి , ముస్లిం నేతలతో చర్చలంటూ ఇంకోసారి ఫొటోలు తీసి పేపర్‌లలో రాయించుకోవడం మినహా చేసిందేమీ లేదని ముస్లింలు అంటున్నారు. చివరికి సమస్య పరిష్కరించకుండానే వారిని నయవంచన చేయడంతో ప్రస్తుత ముస్లింలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

పోలీసు కాలనీని పట్టించుకోలేదు....

రాష్ట్రంలో 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ స్థలాలపై ల్యాండ్ సీలింగ్ విధించారు. ఆ సమయంలో ఇరిగేషన్ నుంచి రిజర్వ్ పోలీసులు కొనుగోలు చేసిన పోలీస్ కాలనీ స్థలం కూడా సీలింగ్‌లోకి వెళ్లింది. అన్ని ఆధారాలతో కాలనీ వాసులు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వద్దకు వెళ్లి సమస్యను వివరించినట్లు చెబుతున్నారు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసారే కానీ సమస్యను పట్టించుకోలేదని, వాళ్లు ఎన్నిసార్లు ఆయన చుట్టూ తిరిగినా పనిచేయలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్టీఆర్ కాలనీని వదిలేశారు...

ఎన్నికల్లో ఎన్టీఆర్ కాలనీ వాసుల్లో టీడీపీ సానుభూతి పరులే ఎక్కువగా ఉన్నారు. దీంతో తమ కాలనీలో రోడ్డు వేయాలని పలుమార్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చుట్టూ తిరిగారు. ఎన్నిసార్లు తిరిగినా అదిగో ఇదిగో అన్నాడే కానీ పట్టించుకోలేదంటున్నారు. . అనంతరం వారికి మొఖం చాటేశారు. దీంతో ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇదేమి తీరంటూ కాలనీ వాసులు తిట్టుకుంటున్నారు.

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ చేయలేదు..

కృష్ణలంక భ్రమరాంబపురంలో ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణ చేయాలంటూ మహిళలు పటుమార్లు గద్దే రామ్మోహన్ చుట్టూ తిరిగారు. ఎప్పుడు అడిగినా చూద్దాం చేద్దాం అన్నాడే కానీ అసలు పట్టించుకోలేదని మహిళలు అంటున్నారు. కార్యాలయానికి వెళితే సమాధానం కూడా చెప్పేవారు కాదంటున్నారు. ఇలా సుమారు 6 వేల మంది జనాభా సమస్యను గాలికొదిలేశాడని చర్చించుకుంటున్నారు.

దమ్మున్న నేతగా అవినాష్...

తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జిగా దేవినేని అవినాష్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాధించారు. గద్దే విస్మరించిన పనులన్నింటినీ అవినాష్ పూర్తి చేశాడు.

- లబ్బీపేటలో రూ.2 కోట్లతో షాదీఖానా పనులు జరుగుతున్నాయి.
- పోలీస్‌కాలనీ స్థలం ల్యాండ్ సీలింగ్ నుంచి తొలగించేలా చేశారు.
- దళితుల శ్మశాన వాటికను రూ. కోటితో అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చారు.
- భ్రమరాంబపురంలో 1200 పట్టాలతో పాటు, తూర్పులోని బాడవపేట, ఉడ్‌పేట, పటమట లాంటి ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు క్రమబద్ధీకరించేలా ప్రభుత్వంతో ఆదేశాలు జారీ చేయించారు.
- ఎన్టీఆర్ కాలనీలో రూ.4.50 కోట్లతో రోడ్లు వేయించారు.
- రూ.650 కోట్లుతో అభివృద్ధి పనులు చేపట్టారు.
- రూ. వెయ్యి కోట్లుతో సంక్షేమ పథకాలు.
- 32211 మందికి కొత్తగా ఇళ్ల స్థలాలు అందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపే ప్రాంతాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు):విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో మొగల్రాజపురం సెక్షన్, లబ్బీపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఎంజీ రోడ్డు, కృష్ణనగర్, టిక్కిల్‌రోడ్, ఎ రామారావు రోడ్డు, డీవీమానర్ ఏరియా, రెవిన్యూ కాలనీ, ఫర్చ్యూన్ మురళీపార్క్ రోడ్డు, వైవీరావు ఆస్పత్రి రోడ్డు, జమ్మిచెట్టు సెంటర్, వాటర్ ట్యాంక్ రోడ్, ఉడ్‌పేట, బాడవపేట ప్రాంతాల్లో ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

● మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు ప్రకటనలో తెలిపారు. డీవీ మ్యానర్ రోడ్డు, శ్యామ్ నగర్, టిక్కిల్ రోడ్డు, మానర్ ఫుడ్ ప్లాజా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

సత్యనారాయణ స్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆదివారం వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు వ్రతానికి హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వర రావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించిన భక్తులకు ఉచితంగా పూజా సామగ్రిని అందజేశారు. ఆలయ అర్చకుడు చక్రవధానుల సీతారామాచార్యులు నేతృత్వంలో శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు.

జగనన్న హయాంలోనే విజయవాడ అభివృద్ధి





14వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న దేవినేని అవినాష్, అపార్ట్‌మెంట్ వాసులతో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): సొంతగా ఎజెండా, మేనిఫెస్టోను కూడా రూపొందించుకోలేనంతంగా టీడీపీ దిగజారిపోయిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. పటమట14వ డివిజన్, ఎన్టీఆర్ సర్కిల్, ఈ సేవ రోడ్, ఎస్ఎస్ఎం స్కూల్ ఓడ్డు, శాంతి నగర్, చరిత్ర స్కూల్ రోడ్ ప్రాంతాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో పొందుపరచిన నవరత్నాలను నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని చెప్పారు. మేనిఫెస్టోలో పొందుపరచి వాటిని వెంటనే తొలగించే ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. జగనన్న ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందని చెప్పారు. చంద్రబాబు విజయవాడకు చేసిందేమీలేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను కూడా దారి మళ్లించి నగరాభివృద్ధిని అడ్డుకున్నారని తెలిపారు. అవ్వా తాతలకు ప్రతినెలా గడపలోనే పింఛన్ ఇప్పించింది వైఎస్సార్ సీపీనేని చెప్పారు. దీన్ని టీడీపీ అడ్డుకోవటం సిగ్గుచేటన్నారు. 14వ డివిజన్‌లో నాడు-నేడు ద్వారా రూ. కోటిపైగా వెచ్చించి పాఠశాలను అభివృద్ధి చేశామని వెల్లడించారు. పదో తరగతి ఇంగ్లీష్ మీడియంలో రాష్ట్రంలోనే ఫస్ట్ ఈ పాఠశాల విద్యార్థికి రావటం జగన్ విద్యా వ్యవస్థకు ఇస్తున్న ప్రాధాన్యం ప్రజలు తెలుసుకోవాలని కోరారు. డివిజన్‌లో అభివృద్ధికి ఇప్పటి వరకు రూ. 50 కోట్లు వెచ్చించామని వివరించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు ప్రతి గడపలోనూ మహిళలు తమకు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తుందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)కి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతల సాంబయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):నియోజకవర్గంలోని ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. స్థానిక 8వ డివిజన్ పరిధిలోని రాధామాధవ్ అపార్ట్‌మెంట్ వాసులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అవినాష్ మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తూర్పు నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు మంజూరు చేశారని చెప్పారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో డ్రెయిన్, రోడ్డు నిర్మాణంతో పాటుగా పరిసర ప్రాంతాల్లోని అన్ని రహదారులను సీసీ రోడ్లుగా మార్చామని చెప్పారు. ఈ డివిజన్‌లో పార్కులను కూడా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేయడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందచేశామని వివరించారు. ఈ అపార్ట్‌మెంట్ వాసులకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని తెలిపారు. ఎన్నికల గుర్తు అయిన ఫ్యాన్‌కు ఓట్లు వేసి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)ను గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులతో పాటుగా కేశినేని నాని కుమార్తె కేశినేని హైమ కూడా ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.

● సజావుగా పోస్టల్ బ్యాలెట్





విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సజావుగా సాగుతోంది. ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కేంద్రానికి తరలివచ్చి ఓటు వేశారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సైతం తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేసే అవకాశం పొందారు. కలెక్టర్ ఢిల్లీరావు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ప్రజా పాలనకు మరోసారి పట్టం కట్టండి

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్



ఎన్నికల ప్రచారం చేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు):రానున్న ఎన్నికల్లో ప్రజా సంక్షేమ పాలనకు మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లోని పలు వీధుల్లో ఆదివారం ఆయన స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయడమే జగన్‌మోహన్‌రెడ్డి ఎజెండా అని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. ఈ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ అభివృద్ధి చేశామని, వ్యాయామశాల భవనం, రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని తెలిపారు. వరద ముంపు నుంచి రక్షణగా రిటైనింగ్ వాల్ నిర్మించి తారకరామనగర్ వాసులకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. రూ.80 కోట్ల సంక్షేమం ప్రజలకు అందించామని పేర్కొన్నారు. 10 ఏళ్లు ఒక అసమర్థ ఎమ్మెల్యేకి అవకాశం ఇచ్చారని ఇప్పుడు తనకు ఒక్క అవకాశం ఇస్తే ఇంకా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మీకు మంచి జరిగిందని పిస్తే ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే తనను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ను భారీ మెజారిటీతో గెలిపించి సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాని కోరారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన వారిని ఆదరించండి



పున్నమ్మతోటలో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని సుధీర, పార్టీ నేతలు



16వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అవినాష్ సతీమణి సుధీర

లబ్బీపేట(విజయవాడతూర్పు):నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు మేలు చేసిన వారిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని దేవినేని అవినాష్ సతీమణి సుధీర కోరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, పార్లమెంటు అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌ల విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం పున్నమ్మతోట, అమెరికన్ ఆస్పత్రి, ఇందిరాటవర్స్, కాల్వగట్టు ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఐదేళ్లుగా సంక్షేమ పథకాలు అందిస్తూ , నిరంతరం ప్రజల్లోనే ఉండే నాయకులను గెలిపించాలని కోరారు. అనంతరం సుధీర మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా అండగా ఉండే వారిని మంచి మనస్సుతో ఆదరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో రెంటు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ రెహానా నాహీద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, పార్టీ జిల్లా కార్యదర్శి చింతగుంట విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్‌రావు, రంగా, సుభానీ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలని వినతి

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సతీమణి సుధీర ఆదివారం సాయంత్రం 16వ డివిజన్ బూపేష్‌గుప్తానగర్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌కు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 16వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక, మాజీ కార్పొరేటర్ బహదూర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా తూర్పు కాపుల చేరిక



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న దేవినేని అవినాష్



సమావేశంలో మాట్లాడుతున్న అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు):వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తూర్పు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. ఆదివారం కృష్ణలంకలోని నక్షత్ర హోటల్‌లో తూర్పు కాపు నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా అవినాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 22వ డివిజన్‌లో టీడీపీకి చెందిన జి అన్నవరం ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 100 కుటుంబాల తూర్పు కాపులు, కరిముల్లా ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితులై అవినాష్ సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ అవినాష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగనన్న తూర్పు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారికి రాజకీయంగా, సామాజికంగా ఉన్నత స్థాయి కల్పించారన్నారు. నాడు స్వర్గీయ దేవినేని నెహ్రూ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఉన్న తూర్పు కాపు సోదరులందరూ వెన్నంటే నడిచారని, నేడు ఆయన తనయుడిగా మీరంతా నాకు మద్దతు తెలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో కూడా మీ మద్దతు ఇలాగే ఉండాలని మీకు ఏ అవసరం వచ్చిన తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ టి.కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

చిట్టేల(వత్సవాయి): శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండవరోజు ఆదివారం పుణ్యావాహచన, భేరీపూజ, ద్వాజపట, యాగశాల, వాస్తుశుద్ధి ధ్వజపట ప్రతిష్ట అధివాస త్రయము, అధివాస హోమము, ధ్వజారోహణము కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అర్చకులు హరి శివరామప్రసాదుశాస్త్రి, సిరికొండ వెంకటసాయి కృష్ణమాచార్యులు నిర్వహించారు. ఆలయ నిర్మాణ ధర్మకర్త మారెళ్ల పుల్లారెడ్డి దంపతులు గోపూజ, తులసీపూజ, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



మచిలీపట్నం రైల్వేస్టేషన్

సాగర తీరంలో ప్రాచీన 'పట్నం'

- నాడు బ్రిటీష్, ఫ్రెంచ్, డచ్ పాలకులకు అనువైన పట్టణం
- స్వాతంత్య్ర ఉద్యమం, క్రియాశీలక రాజకీయాలకు నెలవు
- బందరు లడ్డూ, హల్వా, రోల్డ్ గోల్డ్ నగల తయారీకి ప్రసిద్ధి
- పోర్టు, వాణిజ్య వ్యాపారాలకు సరైన ప్రాంతంగా గుర్తింపు
- మచిలీపట్నం పార్లమెంట్ 'ముఖ చిత్రం'

మహిళలు మెచ్చే రోల్డ్ గోల్డ్ నగలు.. దేశ విదేశీయుల మనసు దోచిన కలంకారీ వస్త్రాలు.. మత్స్యకారుల ఉపాధికి చేయూత ఇచ్చే హార్బర్.. విదేశీ వర్తకానికి కేంద్రంగా మారనున్న పోర్టు.. ఇలా ఎన్నో విశిష్టతలు కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం సొంతం. అంతేకాదు చవులూరించే బందరు తొక్కుడు లడ్డూ, హల్వా, బాదంపాలు అంటే ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. నాలుగు శతాబ్దాల కిందటే బ్రిటీష్, ఫ్రెంచ్, డచ్ దేశీయుల వర్తక కేంద్రంగానూ మచిలీపట్నం ఖ్యాతి చెందింది.

సాక్షి, మచిలీపట్నం: దేశ చరిత్రలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన నగరం మచిలీపట్నం. సముద్ర తీరంలో, కృష్ణా నదికి సమీపంలో ఈ నగరం ఉంది. దీనిని బందరు అని కూడా పిలుస్తారు. బ్రిటీష్ పాలకులకు ఎంతో అనువైన మచిలీపట్నానికి ప్రాచీన చరిత్ర ఉంది. దేశంలోనే పూణే, భీమిలి తరువాత మూడో మునిసిపాలిటీగా దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం లిఖించుకుంది. ఈ ప్రాంతానికి చెందిన పలువురు దేశ స్వాతంత్య్రం కోసం సాగిన పోరులో పాల్గొనడంతో పాటు రాజకీయ, సినీ, సామాజిక రంగాల్లో రాణించి పేరు పొందారు. సముద్ర తీరంలో పోర్టు, బందరు లడ్డూ, హల్వా, బాదం పాలు, ముంత మసాలా మిక్చర్, రోల్డ్‌గోల్డ్ నగల తయారీ పరిశ్రమ మచిలీపట్నం శాశ్వత చిరునామాగా నిలిచింది. ఎన్నో విశిష్టతలు కలిగిన మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గంపై ప్రత్యేక కథనం ఇది.

'కృష్ణా' తీరంతో పేరు

కృష్ణా నది తీరంలో ఉన్న ప్రాంతం కావడంతో ఈ జిల్లాకు 'కృష్ణా జిల్లా' అని పేరు వచ్చింది. ఉమ్మడి కృష్ణాకు తొలి జిల్లా కేంద్రం మచిలీపట్నం కావడంతో ఇక్కడి నుంచే పాలన సాగింది. 2022 ఏప్రిల్ నాలుగో తేదీన జిల్లా పునర్విభజన చేసి మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిని కృష్ణా జిల్లాగా, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాగా మార్చారు. మరో ఎమిమిది మండలాలను ఏలూరు జిల్లాలో కలిపారు. వరి, మినుము, మొక్క జొన్న, పెసర, చెరకు, నూనె గింజలు, వైజ్ఞానిక పరికరాలు ఇక్కడి ప్రధాన ఉత్పత్తులు.



మంగినపూడి బీచ్

ఘన చరిత్ర

మూడో శతాబ్ద కాలంలో కృష్ణా జిల్లా శాతవాహనుల కాలం నుంచే మచిలీపట్నం ప్రాచుర్యంలో ఉందని చరిత్ర చెబుతోంది. మచిలీపట్నాన్ని బందరు అని కూడా పిలిచేవారు. గతంలో సముద్రపు ఒడ్డున ఉన్న కోట ద్వారం దగ్గర ఒక చేప (హిందీలో మచిలీ అంటారు) విగ్రహం ఉండేదని, దీంతో ఈ పట్టణానికి మచిలీపట్నం అని పేరొచ్చిందని చెబుతారు. మరో పరిశీలనలో... ఈ పట్టణం గురించి మసపోలియా అని గ్రీకు రచయిత రాశారని, అసలు పేరు మహాసాలి పట్నం, మసిలిపట్నం, మచిలీపట్నంగా కాలక్రమంగా వాడుకలోకి వచ్చిందని అంటారు. ఇక్కడి నుంచి చేనేత వస్త్రాలను రోమ్ నగరానికి ఎగుమతి చేసే వారు. తీర పట్టణం కావడంతో 17వ శతాబ్దంలో బ్రిటీష్, ఫ్రెంచ్, డచ్ వారు ఇక్కడి నుంచి వర్తకం జరిపేవారు. 1659లో బ్రిటీషర్లు ఫ్రెంచి వారిని నాటి మసూలిపట్టణం ముట్టడిలో ఓడించి, వారి స్థావరాలను ఆక్రమించుకున్నారు. కృష్ణాజిల్లాను ముందు 'మచిలీపట్నం జిల్లా' అని పిలిచేవారు. 1859లో గుంటూరు జిల్లాలోని కొన్ని తాలూకాలను ఈ జిల్లాలో కలిపి 'కృష్ణా జిల్లా'గా పేరు మార్చారు. 1925లో ఈ జిల్లాను కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలుగా విభజించారు.

కొత్త జిల్లా సమాచారం

మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం(కృష్ణా జిల్లా) పరిధిలో అవనిగడ్డ, గుడివాడ, గన్నవరం, మచిలీపట్నం, పెడన, పామర్రు, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 25 మండలాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 4.93 లక్షల కుటుంబాలు నివసిస్తున్నాయి.

ప్రాముఖ్యత ఇలా..

- బందరులో 150 సంవత్సరాల క్రితం స్థిరపడిన సింగ్‌ల కుటుంబాలు 'బందరు లడ్డూ' సృష్టికర్తలుగా చెపుతారు. బొందిలీలు అని కూడా పిలిచే సింగ్‌ల కుటుంబాలు బందరులో ఇప్పుడు చాలా తక్కువగా ఉన్నాయి. ఆ కుటుంబాల వద్ద పని చేసి, లడ్డూ తయారీ నేర్చుకున్న కొందరు ఆ వ్యాపారాన్ని కొనసాగిస్తూ, గత 50 ఏళ్లుగా ఈ వ్యాపారంలో రాణిస్తున్నారు.
- విజయవాడ తరువాత రాజకీయాలకు పెట్టింది పేరు గుడివాడ. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం కలిగి ఉంటే.. కాబోయే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే అడ్డా అవనిగడ్డ. కలంకారీ వస్త్ర వ్యాపారానికి పెడన ప్రసిద్ధి. పంట ఉత్పత్తులకు పామర్రు, విజయవాడకు సమీపంలో ఉన్న పెనమలూరు విద్యా సంస్థలకు చిరునామా గా నిలిచింది.



మచిలీపట్నం రైల్వేస్టేషన్

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఇలా...

1957 నుంచి 2019 వరకు మచిలీపట్నం పార్లమెంట్ (లోక్ సభ) స్థానానికి 16 సార్లు జరిగిన ఎన్నికలు జరిగాయి. ఫలితాలను పరిశీలిస్తే... కాంగ్రెస్ తొమ్మిది సార్లు, టీడీపీ ఐదు సార్లు, ఇండిపెండెంట్ ఒకసారి, వైఎస్సార్ సీపీ ఒకసారి గెలుపొందాయి. 2019లో వైఎస్సార్ సీపీ తరఫున వల్లభనేని బాలశౌరి 5,71,436 ఓట్లు పొంది టీడీపీ అభ్యర్థిపై 60,141 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

2019 పార్లమెంట్ ఎన్నికల్లో లోక్ సభ ఫలితాలు (10వేలకు పైగా ఓట్లు వచ్చిన వారి వివరాలు):

అభ్యర్థి పేరు	పార్టీ	పోలైన ఓట్లు
వల్లభనేని బాలశౌరి	వైఎస్సార్ సీపీ	5,71,436
కొనకళ్ల నారాయణరావు	టీడీపీ	5,11,295
బండ్రెడ్డి రామకృష్ణ	జనసేన	1,32,92
నోటా	-	14,077
గొల్లు కృష్ణ	కాంగ్రెస్	12,284



పాండురంగస్వామి



చిలకలపూడిలోని పాండురంగస్వామి ఆలయం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి

వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ముఖ్యంగా రోడ్లు, వంతెనలు, డ్రెయిన్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, జగనన్న కాలనీలు, డిజిటల్ లైబ్రరీలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, నాడు- నేడు కింద పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చేందుకు కావాల్సిన నిధులు మంజూరు చేసింది. పనులను నాణ్యతగా నిర్ణీత గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టి పురోగతి చూపింది. ఈ ఐదేళ్లలో కృష్ణా జిల్లాలో 6,974 అభివృద్ధి పనులకు రూ.2,043.55 కోట్లు మంజూరు చేసింది.

రూ.11వేల కోట్లతో 'బందరు పోర్టు'

ఎంతో ప్రాచీన చరిత్ర ఉన్న బందరు పోర్టును గత పాలకులు పట్టించుకోలేదు. వాణిజ్య, వ్యాపార రంగాలు పురోగతిలో ఉండాలంటే రవాణా వ్యవస్థ మెరుగుపడాలి. రోడ్డు, రైలు మార్గాలకు భిన్నంగా సముద్ర మార్గాన రవాణా చాలా కీలకమైందని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బందరు ఒడ్డున పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బ్రిటీష్ కాలం నాటి ఈ పోర్టును గత తెలుగుదేశం ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గత ఎన్నికలకు కేవలం నెల రోజుల ముందు ఎలాంటి అనుమతులు లేకుండా హడావిడిగా టెంకాయ కొట్టేసి వదిలేసింది. కానీ ఈ పోర్టు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని అనుమతులు పొంది, రూ.11,464 కోట్ల పూర్తి వ్యయంతో ప్రారంభించి పనులు వేగంగా చేసింది.

'పట్నం'లోనే వైద్య విద్య

పేదల వైద్య విద్య కలను నిజం చేసేందుకు ప్రభుత్వం మచిలీపట్నంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఇందుకు కావాల్సిన భవనాలు, తరగతి గదులు, లైబ్రరీ, అడ్మినిస్ట్రేషన్ భవనం, బాయ్స్ హాస్టల్, గరల్స్ హాస్టల్ తదితర నిర్మాణాల కోసం రూ.550 కోట్లు మంజూరు చేసి పూర్తి చేశారు. దీంతో ప్రతి ఏటా కొత్తగా 150 మంది ఎంబీబీఎస్ చేసే అవకాశం రాగా వీరంతా అన్ని వసతులతో వైద్య విద్య అభ్యసిస్తున్నారు.

మత్స్య కారులకు హార్బర్‌తో అండ

సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు వేట సమయంలో తమ బోట్‌లు నిలుపుకొనేందుకు వీలుగా బందరుతీరంలో కొత్తగా హార్బర్ నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. దీని కోసం రూ.422 కోట్లు ఖర్చు చేస్తుండగా 3,300 మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూరనుంది.

91 వేల మంది పేదలకు సొంతిళ్లు

ఇళ్లు లేని ప్రతి కుటుంబానికి సొంత పక్కా గృహం ఉండాలని ప్రభుత్వం జగనన్న కాలనీ పథకాన్ని తీసుకొచ్చింది. కృష్ణా జిల్లాలో 91,295 ఇళ్లను మంజూరు చేసింది. దీని కోసం స్థల సేకరణ, మంచినీరు, విద్యుత్, రోడ్డు, డ్రైనేజీ, ఇళ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు తదితర వాటి కోసం రూ.1,646.31కోట్లు మంజూరు చేసింది.

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం వారు ఆర్థికంగా ఎదిగేందుకు అనేక పథకాలు తెచ్చింది. ఎవరి సిఫార్సు లేకుండా.. అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోనే నగదును జమ చేస్తూ వచ్చారు. ఇలా కృష్ణా జిల్లాలో ఏకంగా 22,58,735 మంది ఖాతాలోకి వివిధ సంక్షేమ పథకాల కింద రూ.7,170.82 జమ చేశారు.

మచిలీపట్నం పార్లమెంట్‌లో వివిధ సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, లబ్ధిదారుల సంఖ్య వివరాలు

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు (రూ. కోట్లలో)
ఆసరా	3,03,694	884.51
అమ్మఒడి	1,62,899	537.37
అమ్మఒడి (ఇతరులు)	1,51,928	38.71
అర్చకులు	819	0.41
చేదోడు	12,243	27.04
క్రాప్ ఇన్సూరెన్స్	58,595	128.85
ఈబీసీ నేస్తం	11,414	30.47
హౌసింగ్ (డీబీటీ)	33,662	323.58
ఇమామ్స్	36	0.02
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	85,909	69.43
జగనన్న చేదోడు (వడ్డీ)	30,791	1.30
జగనన్న చేదోడు (రుణాలు)	49,992	78.84
జగనన్న వసతి దీవెన	96,849	112.08
జగనన్న విద్యాదీవెన	1,68,196	354.66
కళ్యాణమస్తు	786	6.21
కాపునేస్తం	2,8204	95.86
లా నేస్తం	53	0.32
మత్స్యకార భరోసా	18,229	44.13
నేతన్న నేస్తం	5,040	35.13
పాస్టర్స్	1,982	0.99
రైతుభరోసా	1,72,821	777.60
సున్నా వడ్డీ రుణాలు	61,943	14.92
సున్నా వడ్డీ	3,71,662	85.38
వాహనమిత్ర	14,409	41.04
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	39,246	28.38
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	61,050	266.26
వైఎస్సార్ బీమా	4,916	72.08
వైఎస్సార్ చేయూత	1,18,546	531.44
వైఎస్సార్ పించను కానుక	2,81,373	2611.20
జగనన్న విదేశీ విద్యాదీవెన	24	2.59
జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం	106	1.00
మొత్తం	22,58,735	రూ.7170.82

1957 నుంచి ఎవరు ఎప్పుడు గెలిచారంటే...

సంవత్సరం	గెలుపొందిన అభ్యర్థి	పార్టీ	పోలైన ఓట్లు	ద్వితీయ స్థానంలో నిలిచిన అభ్యర్థి	పార్టీ	పోలైన ఓట్లు	మెజార్టీ
1957	మండలి వెంకట కృష్ణారావు	కాంగ్రెస్	1,23,242	యలమంచిలి నాగభూషణం	ఇండిపెండెంట్	1,15,691	7,551
1962	మండలి వెంకటస్వామి	ఇండిపెండెంట్	1,53,720	మండలి వెంకటకృష్ణారావు	కాంగ్రెస్	1,49,508	4,215
1967	యార్లగడ్డ అంకినీడు ప్రసాద్	కాంగ్రెస్	1,99,885	మోటూరి హనుమంతరావు	సీపీఎం	1,22,293	77,592
1971	మేడూరి నాగేశ్వరరావు	కాంగ్రెస్	2,78,514	మండల వెంకటస్వామి	స్వతంత్ర పార్టీ	73,640	2,04,874
1977	మాగంటి అంకినీడు	కాంగ్రెస్	2,62,551	వడ్డె శోభనాద్రీశ్వరరావు	లోక్‌దళ్	1,85,622	76,929
1980	మాగంటి అంకినీడు	కాంగ్రెస్ (ఐ)	2,49,444	బూరగడ్డ నిరంజనరావు	జనతా పార్టీ	1,15,108	1,34,336
1984	కావూరి సాంబశివరావు	కాంగ్రెస్	2,72,513	వడ్డె రంగారావు	టీడీపీ	2,63,420	9,093
1989	కావూరి సాంబశివరావు	కాంగ్రెస్	3,54,533	బొప్పన గంగాధరచౌదరి	టీడీపీ	3,11,044	43,489
1991	కె.పి.రెడ్డియ్య	టీడీపీ	2,98,348	కావూరి సాంబశివరావు	కాంగ్రెస్	2,71,026	27,322
1996	కైకాల సత్యనారాయణ	టీడీపీ	2,75,713	కె.పి. రెడ్డియ్య	కాంగ్రెస్	1,94,206	81,507
1998	కావూరి సాంబశివరావు	కాంగ్రెస్	3,55,030	కైకాల సత్యనారాయణ	టీడీపీ	2,73,938	81,092
1999	అంబటి బ్రాహ్మణయ్య	టీడీపీ	3,87,533	కావూరి సాంబశివరావు	కాంగ్రెస్	3,04,537	82,996
2004	బాడిగ రామకృష్ణ	కాంగ్రెస్	3,87,127	అంబటి బ్రాహ్మణయ్య	టీడీపీ	3,36,789	50,338
2009	కొనకళ్ల నారాయణరావు	టీడీపీ	4,09,939	బాడిగ రామకృష్ణ	కాంగ్రెస్	3,97,480	12,459
2014	కొనకళ్ల నారాయణరావు	టీడీపీ	5,87,280	కొలుసు పార్థసారథి	వైఎస్సార్ సీపీ	5,06,223	81,057
2019	వల్లభనేని బాలశౌరి	వైఎస్సార్ సీపీ	5,71,436	కొనకళ్ల నారాయణరావు	టీడీపీ	5,11,295	60,141

అంకెల్లో జిల్లా

రెవెన్యూ డివిజన్లు 3 (మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు)

మొత్తం జనాభా 17.35 లక్షలు

పురుషులు 8.69 లక్షలు

స్త్రీలు 8.66 లక్షలు

అక్షరాస్యులు 11.84 లక్షలు

ఓటర్ల వివరాలు: మొత్తం ఓటర్ల 15,39,460 | పురుషులు 7,46,071 | స్త్రీలు 7,93,332

శ్రామికులు 8.07 లక్షలు. | రెవెన్యూ గ్రామాలు 502 | గ్రామ పంచాయతీలు 497 | థర్డ్ జెండర్స్ 57

ఓటర్ల వివరాలు (తుది జాబితా)

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
గన్నవరం	1,34,226	1,44,816	12	2,79,054
గుడివాడ	97,710	1,06,550	11	2,04,271
పెడన	83,008	84,556	0	1,67,564
మచిలీపట్నం	94,788	1,01,881	11	1,96,680
అవనిగడ్డ	1,04,568	1,07,745	18	2,12,331
పామర్రు (ఎస్.సి.)	89,422	95,207	3	1,84,632
పెనమలూరు	1,42,349	1,52,577	2	2,94,928
మొత్తం	7,46,071	7,93,332	57	15,39,460

వీడిన ఇనాం భూముల చిక్కుముడి

- ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చొరవతో పరిష్కారం
- ఎట్టకేలకు వెంకటాపురం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు
- గతేడాది ఇనాం భూములకు కలెక్టర్ ప్రత్యేక ఉత్తర్వులు
- 400 మంది రైతులకు ఊరట

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఐదు దశాబ్దాలుగా వేధిస్తున్న వెంకటాపురం ఇనాం భూముల సమస్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పరిష్కారమైంది. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రత్యేక చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లటంతో ఇనాం భూముల సాగుదారులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందాయి. గతేడాది జూలైలో కలెక్టర్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయటంతో సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితా నుంచి ఈ భూములను తొలగించటంతో రైతుల సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. తాజాగా ఈ భూములను సాగు చేస్తున్న దాదాపు 400 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా జారీ అయ్యాయి.



వెంకటాపురంలోని ఇనాం భూములు

ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కృషితో...

బాపులపాడు మండలం వెంకటాపురంలో 489 ఎకరాలు రెవెన్యూ రికార్డులలో ఇనాం భూమిగా నమోదు కావటంతో రైతులు చాలా కాలంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలుగా సిరివాడ గ్రామానికి చెందిన పేద రైతులు ఈ భూములను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇనాం భూములను రద్దు చేస్తూ గతంలో చట్టం వచ్చినప్పటికీ వెంకటాపురం భూముల చిక్కుముడి వీడలేదు. ఈ నేపథ్యంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లటంతో రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చింది. గ్రామానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నిషేధిత భూముల జాబితా సెక్షన్ 22ఏ నుంచి వెంకటాపురం భూములను తొలగించారు.

400 మందికి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ

దశాబ్దాలుగా వెంకటాపురం భూములను సాగు చేస్తున్న రైతులకు భూమి రిజిస్ట్రేషన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందటం లేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ భూముల సమస్యపై ప్రత్యేకంగా విచారణ చేపట్టి పరిష్కరించటంతో ఎట్టకేలకు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ అయ్యాయి. దాదాపు 400 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందాయి.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చొరవతో ఈ సమస్య పరిష్కారం కావటం ఆనందంగా ఉంది. పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు పట్టాలు జారీ చేశారు.

– రెల్లు అప్పారావు, రైతు

జగన్, వంశీలకు రుణపడి ఉంటాం



ఇనాం భూములు సాగు చేస్తున్న పేదరైతుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో ఇనాం భూములకు సమస్యకు పరిష్కారం లభించింది. ఇనాం భూముల సాగుదారులంతా సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే వంశీలకు రుణపడి ఉంటాం.

–సింగవరపు రామశివ నాగేశ్వరరావు, రైతు

వంశీమోహన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ లో చేరిక

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 42 మంది ఎస్సీ, ఎస్టీలు ఆదివారం గన్నవరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కోటకట్ట సెంటర్‌లో మాజీ ఎంపీటీసీ బాణావతు దుర్గాప్రసాద్, బాణావతు ప్రేమ్, కోట కిరణ్ ఆధ్వర్యంలో వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ వల్లభనేని వంశీ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు యర్కారెడ్డి నాగిరెడ్డి, జీతం శ్రీనివాసరావు, పలువురు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ లో చేరిన టీడీపీ, కాంగ్రెస్ కార్యకర్తలు

వంశీ విజయాన్ని కాంక్షిస్తూ ఓంకారేశ్వర్‌లో పూజలు

గన్నవరం: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఆయన అభిమాని పవిత్ర నర్మదా నది పుష్కరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని దావాజీగూడెంలోని పామర్తినగర్‌కు చెందిన గొంతెన రాజ్‌కుమార్ వంశీమోహన్‌కు వీరాభిమాని. మహారాష్ట్రలోని ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగాల్లో జరుగుతున్న నర్మదా నది పుష్కరాలకు వెళ్లిన రాజ్‌కుమార్ వేద పండితులతో వంశీ విజయం కోసం పూజలు చేయించారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న వంశీమోహన్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ కొట్టాలని ఓంకారేశ్వరుని వేడుకున్నట్లు రాజ్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా...

సీఎం వైఎస్ జగన్ సాయం మరువలేం

- ఏపీ టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి



కొరిటెపాడు (గుంటూరు): వస్త్ర వ్యాపారులు, దుకాణాల్లో పనిచేసే వర్కర్లకు సీఎం వైఎస్ జగన్ పాలనలో ఎంతో మేలు చేకూరిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి తెలిపారు. గుంటూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తమను మోసం చేశాయన్నారు. నేత కార్మికుల సంక్షేమాన్ని గురించి ఆలోచించిన ఏకైక నేత వైఎస్ జగన్ మాత్రమేనని, మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసి రుణం తీర్చుకుంటామని ప్రకటించారు. వ్యాట్ రద్దుపై గత టీడీపీ ప్రభుత్వం కేబినెట్‌లో పెట్టి చర్చిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. చీరాల, మంగళగిరి, ప్రొద్దుటూరు, ధర్మవరం ప్రాంతాల్లో నేతన్నలు, కార్మికులు పడే బాధలు చూసి వైఎస్ జగన్ చలించిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం జగన్ వస్త్ర తయారీ, విక్రయాలపై జీఎస్టీని తగ్గించాల్సిందిగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసి స్లాబ్‌ను తగ్గించగలిగారని వివరించారు. వ్యాట్ వసూళ్లను నిలిపివేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. అధికారులు అక్రమ దాడులను నిలిపివేసి ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకునే విధంగా వీలు కల్పించారని చెప్పారు. నేతన్నలకు, కార్మికులకు నెలకు రూ.2 వేలు పింఛన్ అందించి వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారని తెలిపారు.

పవన్ పెయిడ్ స్టార్

- సినీ నటుడు, కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు



అరసవల్లి: 'సినిమాల్లో మాత్రమే పవన్‌కళ్యాణ్ పవర్ స్టార్.. రాజకీయాల్లో మాత్రం పెయిడ్, ఫెయిల్యూర్ స్టార్' అని సినీ నటుడు, రాష్ట్ర కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు అన్నారు. ఆయన ఆదివారం శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వెలుపల 'సాక్షి'తో మాట్లాడుతూ..పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఏదో అద్భుతం చేస్తాడనుకుంటే.. చంద్రబాబును సీఎంను చేస్తానంటూ పెయిడ్ ఆర్టిస్ట్‌గా మారిపోయాడు. సీఎం అవుతా అని కేకలు వేసి.. ఇప్పుడు తాను పిఠాపురంలో గెలిస్తే చాలనుకుంటున్నాడన్నారు.

ఓటమి భయంతోనే బాబు అసత్యప్రచారం

- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత రావెల కిషోర్‌బాబు



సాక్షి, అమరావతి: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై టీడీపీ, జనసేన, పచ్చ మీడియా కలిసి కుట్రపూరితంగా అసత్యప్రచారం చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'ఓటమి భయంతోనే టీడీపీ, జనసేన అసత్యాలను పదేపదే ప్రచారం చేస్తున్నాయి. 1908లో రిజిస్ట్రేషన్ చట్టం చేసిన తర్వాత మార్పులకు అనుగుణంగా చట్టాలను మార్చాల్సిన అవసరం ఉంది. కాబట్టే ఈ రోజు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఆలోచన వచ్చింది. నీతి ఆయోగ్ సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ చట్టానికి రూపకల్పన చేసింది. అయినా భూములను దోచుకుంటున్నారు... భూములు కబ్జా అవుతాయి... ఎవరో ఎత్తికెళ్లిపోతున్నారంటూ ప్రజల్లో భయోత్పాతాలు సృష్టిస్తున్నారు. వాస్తవానికి ఈ చట్టం ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. భూమిపై సంపూర్ణ హక్కులు లభిస్తాయి. టీడీపీ కూటమి చెప్పే మాయమాటలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను.' అని రావెల కిషోర్‌బాబు అన్నారు.

డ్రగ్, ల్యాండ్ మాఫియాలకు అడ్డాగా రాష్ట్రం

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



కోవూరు: రాష్ట్రంలో డ్రగ్, ల్యాండ్ మాఫియాలు అధికమయ్యాయని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరులో ఆదివారం నిర్వహించిన రోడ్ షోలో ఆమె మాట్లాడారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు డ్రగ్, ల్యాండ్ మాఫియాలుగా మారారని ఆరోపించారు. మద్యం ఏ రకం అమ్ముతున్నారు? ఎంతకు అమ్ముతున్నారు? ఎంత టాక్స్ చెల్లిస్తున్నారనే వివరాలు లేవన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలు అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే భర్తీచేస్తానని ఎన్నికల సమయంలో చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. రాజశేఖర్‌రెడ్డి బీజేపీ వ్యతిరేకి అయితే జగన్‌మోహన్‌రెడ్డి వారితో సంబంధం పెట్టుకుని వారు పెట్టిన ప్రతి బిల్లును ఆమోదించారని చెప్పారు.

పోస్టల్ ఓటింగ్‌లోనూ..
టీడీపీ కుట్ర రాజకీయాలు

ఓటమి భయంతో పచ్చదండు అకృత్యాలు.. యథేచ్ఛగా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు

- అడుగడుగునా ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరించిన టీడీపీ శ్రేణులు
- పోలింగ్ కేంద్రాల సమీపంలోనే నగదు పంపిణీ
- అడ్డుకునేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడికి యత్నాలు
- గతంలో యూనియన్ నేతలుగా పనిచేసిన వారితో ఉద్యోగులకు ఫోన్లు చేయించి బెదిరింపులు
- పోలింగ్ అధికారులు, పోలీసులకు సైతం హెచ్చరికలు



విశాఖలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల వద్ద ఓటర్లకు పంచేందుకు డబ్బులు లెక్కిస్తున్న టీడీపీ నేతలు



బద్వేలులో డబ్బు పంచుతున్న టీడీపీ నాయకుడు షేక్‌హుస్సేన్

సాక్షి నెట్‌వర్క్: ఓటమి భయం వెంటాడుతుండటంతో టీడీపీ నేతలు కుట్ర రాజకీయాలకు తెరలేపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు హాజరయ్యే ఉద్యోగులను ప్రలోభపెట్టేలా.. ఎన్నికల నియమావళి యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ అకృత్యాలకు తెగబడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్ ఆదివారం ప్రారంభమైంది. ఈ నెల 10వ తేదీ వరకు ఈ ప్రక్రియ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసింది. వివిధ ప్రాంతాల్లోని ఫెసిలిటేషన్ కేంద్రాలకు పోలీసులు, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఓటుహక్కు వినియోగించుకునేందుకు రాగా.. వారిని సామ, దాన, దండోపాయాలతో లోబర్చుకునేందుకు టీడీపీ నేతలు ప్రయత్నించారు. పోలింగ్ కేంద్రాల సమీపంలోనే నగదు పంపిణీ చేశారు. అడ్డుకునేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై పచ్చదండు దాడులకు యత్నించింది. టీడీపీ హయాంలో ఉద్యోగ సంఘాల నేతలుగా పనిచేసిన వారితో ఉద్యోగులకు ఫోన్లు చేయించి బెదిరింపులకు దిగారు. కొన్నిచోట్ల పోలింగ్ అధికారులను, పోలీసులను సైతం బెదిరించారు.

విశాఖలో ఇలా..

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ఏయూ తెలుగు, ఆంగ్ల మాధ్యమం పాఠశాలల్లో చేపట్టారు. పోలింగ్ కేంద్రం ఎదురుగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు వెలగపూడి రామకృష్ణ బాబు, గంటా శ్రీనివాసరావు అనుచరులు హల్‌చల్ చేశారు. వెలగపూడి అనుచరుడు కాళ్ల శంకర్, టీడీపీ నాయకుడు పోతన్న రెడ్డి, మాజీ కార్పొరేటర్ బొట్ట వెంకట రమణ అక్కడే ఉండి ప్రత్యక్షంగా టీడీపీకి ప్రచారం చేశారు. వెలగపూడికి చెందిన రెండు ప్రచార వాహనాలు ఏయూ ఇన్‌గేట్, అవుట్ గేట్ మధ్యలో భారీ శబ్దంతో కూడిన మైక్‌లను పెట్టుకుని అటూఇటూ తిరుగుతూ ప్రచారం చేశారు. కొంత మంది ఓటర్లకు డబ్బులు పంపిణీ, మరికొందరికి గూగుల్‌పే, ఫోన్ పే చేస్తూ ప్రలోభాలకు గురి చేశారు.

చిత్తూరులోనూ ఇదే పద్ధతి

తిరుపతిలో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం పేరుతో టీడీపీ నేతలు హల్‌చల్ చేశారు. పోలింగ్ కేంద్రాలకు అత్యంత సమీపంలోనే కొందరు ఓటర్లకు బలవంతంగా నగదు పంపిణీకి యత్నించారు. ఎన్నికల అధికారులను, పోలీసుల హెచ్చరికలను సైతం ఏమాత్రం లెక్కచేయలేదు. ఉద్యోగ సంఘ మాజీ నేతలు కొందరు ప్రలోభాల పర్వానికి సహకరించారు. చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరులో టీడీపీ ప్రచార వాహనాలు యథేచ్ఛగా తిరిగినా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారు. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోనూ పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు పెద్దఎత్తున ప్రలోభాలకు గురి చేశారు. పుంగనూరులో ఓటర్లను బెదిరించారు. పూతలపట్టులో విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేశారు. పలమనేరులోని ఓ హోటల్‌లో ఉద్యోగులకు విందు ఏర్పాటు చేశారు. నగరిలో ఉపాధ్యాయులకు యూనియన్ మాజీ నేతల ద్వారా ఫోన్లు చేయించి బెదిరింపులకు దిగారు.

పులివెందులలో అధికారికి బెదిరింపు

వైఎస్సార్ జిల్లా పులివెందులలో పోలింగ్ ట్రైనింగ్ అధికారి సంగం మహేశ్వరరెడ్డిపై టీడీపీ నాయకులు అక్కులుగారి విజయ్‌కుమార్‌రెడ్డి, దర్బార్‌బాషా, అంజుగట్టు రవితేజారెడ్డి దౌర్జన్యానికి దిగారు. ఆయనను దుర్భాషలాడుతూ బయటకు నెట్టివేశారు. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకుని వివాదాన్ని సర్దుబాటు చేశారు. టీడీపీ నాయకులు అధికారులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగకుండా ఇలాంటి వివాదాలకు పాల్పడుతున్నట్టు అవగతమవుతోంది. బద్వేలులోని జెడ్పీ హైస్కూల్‌లోని ఫెసిలిటేషన్ సెంటర్‌కు సమీపంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో తిష్టవేసిన టీడీపీ నేతలు ఓటర్లకు డబ్బు పంపిణీచేశారు. కాశినాయన మండలం నరసాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు షేక్‌హుస్సేన్ ఓటర్లకు డబ్బులు పంచుతూ కెమెరాకు చిక్కాడు.

తిరుపతిలో తాయిలాల ఎర

తిరుపతి జిల్లాలోని 7 నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లోని ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద టీడీపీ, జనసేన అభ్యర్థులు హల్‌చల్ చేశారు. ముందురోజు రాత్రే కొందరు ఉద్యోగులకు తాయిలాల ఎర చూపారు. శ్రీకాళహస్తిలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సెంటర్ వద్ద టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ హడావుడి చేశారు. నిబంధనల్ని ఉల్లంఘించిన ఆయనను పోలీసు అధికారులు ప్రశ్నించడంతో సుధీర్ మీ అంతు చూస్తా అంటూ బూతు పురాణం అందుకున్నారు.

గుంటూరులో తికమకపెట్టేలా..

గుంటూరులో ప్రభుత్వ ఉద్యోగులను తికమకపెట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో టీడీపీ నేతలు పోస్టింగ్‌లు పెట్టారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా.. అధికారుల మధ్య సమన్వయలోపం, అవగాహన రాహిత్యం బట్టబయలయ్యాయి. పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి కార్యాలయం నుంచి బ్యాలెట్ ఓటింగ్ వద్ద గొడవ జరుగుతోందని, రెచ్చగొట్టే విధంగా మెసేజ్‌లు పెట్టారు.

ఫ్యాన్ జోరు..

- తొలి రోజే భారీగా పోస్టల్ ఓటుహక్కు వినియోగించుకున్న ఉద్యోగులు, పోలీసులు
- మండుటెండలోనూ ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ఉద్యోగుల బారులు
- టీడీపీ కూటమి ప్రలోభాలకు లొంగని ఉద్యోగులు, పోలీసులు
- సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వానికే ఓట్లు వేశామని బాహాటంగా వ్యాఖ్యానించిన ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు
- పోలింగ్ సరళిని పరిశీలిస్తే అత్యధిక శాతం మంది ఫ్యాన్‌కే ఓట్లేసినట్టు అంచనా
- ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వడంతో టీడీపీ కూటమిలో నిస్తేజం



గుంటూరులో పోస్టల్ బ్యాలెట్ కోసం వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులు

సాక్షి, అమరావతి: పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్‌లో తొలిరోజే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు భారీఎత్తున తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచే పోలింగ్ నిర్వహించే ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని పరిశీలిస్తే పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్‌లో వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యత కనిపించింది. ఓటుకు గరిష్ఠంగా రూ.7 వేల నుంచి కనిష్ఠంగా రూ.3 వేలు ఇస్తూ టీడీపీ కూటమి ప్రలోభాలకు గురిచేసినా ఉపాధ్యాయులు, పోలీసులు, ఉద్యోగులు లొంగలేదు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వానికే తమ మద్దతు అని.. వైఎస్సార్‌సీపీకే ఓట్లు వేశామని పలువురు ఉపాధ్యాయులు, పోలీసులు, ఉద్యోగులు బాహాటంగా చెప్పడం కనిపించింది. సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు తదితరులు 5.50 లక్షల మందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల కేంద్రాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించింది.

ఈ నెల 10 వరకూ అవకాశం

పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్‌ను ఆదివారం నుంచి 10వ తేదీ వరకూ నిర్వహిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. కడప పార్లమెంటరీ స్థానం పరిధిలో 13,536 మందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఎన్నికల సంఘం కల్పించగా.. ఆదివారం ఒక్కరోజే 11,208 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే కడప పార్లమెంట్ స్థానంలో 82.50 శాతం పోస్టల్ బ్యాలెట్లు తొలిరోజే పోలైనట్టు స్పష్టమవుతోంది. పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక వివరాలను వెల్లడిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు.

పదేళ్ల తర్వాత కాంగ్రెస్‌కు నామరూపాలుండవు

- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



ఎర్రగుంట్ల/ఆదోని టౌన్: భారతదేశంలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ నామరూపాల్లేకుండా పోతుందని భారత దేశ రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల మండలంలోని తిప్పలూరు గ్రామంలో ఎకేఆర్ కల్యాణ మండపంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. తాను మొదటిసారిగా కడప వచ్చానని, కడప సంస్కృతి, ఇక్కడి వారి మనసు తనకు తెలుసన్నారు. బాహుబలి చిత్రం మాదిరిగా ఏపీలో జరుగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా లేరని చెప్పారు. సీఎం సొంత జిల్లాలోనే శాంతిభద్రతలు దారుణంగా ఉన్నాయని, పరిపాలన చేసే అర్హత సీఎం వైఎస్ జగన్‌కు లేదని చెప్పారు. రూ.13.5 లక్షల కోట్లు అప్పులు తెచ్చి రాష్ట్రంలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. త్వరలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఎన్‌డీఏ ప్రభుత్వం రానుందని, ఇక్కడ అభివృద్ధి చేసి చూపుతామని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. కాగా, కర్నూలు జిల్లా ఆదోని రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ అంటే ఎంతో గొప్ప పేరు ఉండేదని, అయితే తెలంగాణ రాష్ట్రం విడిపోవడం వల్ల బలహీన పడిందన్నారు. ఏపీని అన్నివిధాలా అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని తెలిపారు.

సంక్షేమ పథకాలు జగన్ సొత్తు కాదు

- పొన్నూరు, తుని సభల్లో పవన్




పొన్నూరు/తుని: సంక్షేమ పథకాలు వైఎస్ జగన్ సొత్తుకాదని.. అవి ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా పొన్నూరు, కాకినాడ జిల్లా తునిలో ఆదివారం జరిగిన ఎన్నికల సభల్లో ఆయన మాట్లాడారు. తాను పొన్నూరు వస్తున్నానని తెలిసి హెలీప్యాడ్ ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. ఈ విషయంలో వైఎస్సార్‌సీపీ నేతలను వదిలిపెట్టే ప్రసక్తేలేదన్నారు. తాను పుట్టింది బాపట్ల అని, తనతో గొడవ పెట్టుకుంటే గుంటూరు కారం పొగరు చూపిస్తానని హెచ్చరించారు. 2021 మార్చిలో ఇప్పటం సభలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వనని చెప్పానని.. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలనే ఆ పిలుపునిచ్చానన్నారు. కూటమి అధికారంలోకి రాగానే అంబటి రాంబాబు కొమ్ములు విరిచేస్తామన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దుచేస్తామన్నారు. తుని రైలు దహనం ఘటన తనను ఎంతో కలచివేసిందని, అందుకే 2018లో విజయవాడ నుంచి రైలుయాత్ర చేశానని పవన్ చెప్పారు. మంత్రి దాడిశెట్టి రాజా తుని అభివృద్ధి కంటే ఆదాయం కోసం మాఫియాను నడిపారని ఆరోపించారు.

జనంలేక కూటమి శ్రేణులు నిరాశ

ఇక పొన్నూరులో పవన్ సభకు స్పందన కరువైంది. ఆశించిన స్థాయిలో ప్రజాదరణ కనిపించకపోవడంతో కూటమి శ్రేణులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మధ్యాహ్నం పవన్ హెలికాప్టర్ దిగడంతోనే ఆయన్ను చూసిన జనం వెంటనే ఇంటి బాటపట్టారు. దీంతో సభా ప్రాంగణం వెలవెలబోయింది. అలాగే, ఎండలో వేచిఉన్న కార్యకర్తలు, ప్రజలకు కనీసం తాగునీరు అందించడంలో కూటమి నేతలు విఫలమయ్యారు.

నవ మాఫియాలే జగన్ నవరత్నాలు

- పదవి కోసం జగన్ ఎంతకైనా తెగిస్తాడు
- శవ రాజకీయాలు చేసే దుర్మార్గుడు
- పెద్దిరెడ్డి కొమ్ములు విరుస్తా
- అంగళ్లు, అనంతపురం ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు



బి.కొత్తకోట/అనంతపురం క్రైం: నవ మాఫియాలే జగన్ నవరత్నాలు అని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. నవరత్నాల్లో మొదటిది ఇసుక మాఫియా, రెండోది మద్యం మాఫియా, మూడోది భూమాఫియా, నాలుగోది మైనింగ్ మాఫియా, ఐదోది హత్యా రాజకీయాలు, ఆరోది ప్రజల ఆస్తుల కబ్జా, ఏడోది ఎర్ర చందనం స్మగ్లింగ్, ఎనిమిదోది దాడులు, కేసులు, తొమ్మిదోది శవ రాజకీయాలని ఎద్దేవా చేశారు. పదవి కోసం జగన్ ఎంతకైనా తెగిస్తాడని విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి పదవి కోసం ముసలోళ్లను చంపేసి శవ రాజకీయాలు చేసే దుర్మార్గుడు జగన్ అని దుయ్యబట్టారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లు, అనంతపురంలలో ఆదివారం చంద్రబాబు ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. '2014లో తండ్రి లేని బిడ్డని అంటూ వచ్చాడు.. 2019లో బాబాయిని గొడ్డలితో చంపేసి వచ్చాడు, కోడికత్తి డ్రామా రక్తికట్టించాడు. నిన్న గులకరాయి డ్రామా ఆడాడు. రాయి కనపడలేదు.. దెబ్బ మాత్రం తగిలింది' అని ఎద్దేవా చేశారు. ఆయన సొంత చెల్లే జగన్‌రెడ్డి మానసిక స్థితి బాగో లేదని చెప్పిందని గుర్తుచేశారు. 1.50 లక్షల మంది సచివాలయ సిబ్బందిలో ప్రతి ఒక్కరు 40 మందికి పింఛన్లు ఇస్తే ఒక్క రోజులోనే పంపిణీ పూర్తవుతుందన్నారు. కానీ, జగన్ వృద్ధులను ఇబ్బందిపెట్టి 33 మంది పండుటాకులను చంపేశారని ఆరోపించారు. ఎన్నికల సంఘం స్పందించి సక్రమంగా పింఛన్ల పంపిణీ చేయాలంటే.. వృద్ధుల మీద కక్షతో బ్యాంకుల్లో నగదు వేశారన్నారు. ఈసారి మరో 20మంది వృద్ధులను చంపేశారని విమర్శించారు. పెద్దిరెడ్డి, ఆయన తమ్ముడు, కుమారుడు ముగ్గురు కలిసి తంబళ్లపల్లెను దోచేశారని ఆరోపించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన తాను తలచుకుని ఉంటే పెద్దిరెడ్డి పుంగనూరులో తిరిగేవాడా? అని నిలదీశారు. 'పెద్దిరెడ్డి పెద్ద మొనగాడివా.. నీ కొమ్ములు విరుస్తా.. ఈ రాష్ట్రం నీ బాబు జాగీరా, తంబళ్లపల్లె నీ తాతా జాగీరా' అంటూ ధ్వజమెత్తారు. చిత్రగుప్తుడిలా అందరి పాపాలు లెక్కగడుతున్నానని.. వడ్డీతో సహా చెల్లిస్తానని హెచ్చరించారు.

షర్మిలకు పిచ్చి ముదిరింది

- సీఎం జగన్‌ను అద్దంలో చూసుకోవాలని చెప్పడం దారుణం
- మేకప్ తీసి అద్దంలో చూసుకుంటే షర్మిల అసలు స్వరూపం కనిపిస్తుంది
- షర్మిల భర్త అడిగిన రూ.1,000 కోట్ల పని జగన్ చేయనన్నారు
- అందుకే వారి మధ్య దూరం పెరిగింది..వైఎస్సార్ తనయగా ఆమె పక్కకు జరిగింది
- వైఎస్సార్ పేరును చెడగొట్టే హక్కు షర్మిలకు లేదు
- ఎన్నికల తర్వాత షర్మిల బతుకు బజారున పడక తప్పదు
- వైఎస్సార్ తెలంగాణ పార్టీ వ్యవస్థాపకుడు కొండా రాఘవరెడ్డి

కడప కార్పొరేషన్: పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు పిచ్చి ముదిరి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ వ్యవస్థాపకులు కొండా రాఘవరెడ్డి ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్‌ను అద్దంలో చూసుకోవాలని చెప్పడం దారుణమన్నారు. షర్మిల మేకప్ తీసి అద్దంలో చూసుకుంటే ఆమె అసలు స్వరూపం బయటపడుతుందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, పవన్ ఇచ్చిన స్క్రిప్టు ప్రకారం అంతూ పొంతూ లేకుండా మాట్లాడుతోందన్నారు. షర్మిల వ్యాఖ్యలకు సీఎం వైఎస్ జగన్ గానీ, సజ్జల రామకృష్ణారెడ్డి గానీ స్పందించరని, తానే ఆమెకు సమాధానం చెబుతానని అన్నారు. ఆయన ఆదివారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై షర్మిల చేస్తున్న వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్రావు హైకోర్టులో పిటిషన్ వేస్తే వైఎస్సార్, వైఎస్ జగన్‌లపై కేసు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించిందని, ఎర్రన్నాయుడు, అశోక్ గజపతి రాజు అందులో ఇంప్లీడ్ అయ్యారని తెలిపారు. పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వైఎస్సార్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారని షర్మిల అనడం దారుణమన్నారు. సీఎం వైఎస్ జగన్ జాతీయ చానెళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూపైన కూడా ఆమె మాట్లాడటం దారుణమన్నారు. షర్మిల భర్త, ఆయన పార్ట్‌నర్లు దొంగల ముఠాగా ఏర్పడి రూ.1,000 కోట్ల పని చేయాలని సీఎం వైఎస్ జగన్‌ను కోరారని, ఇలాంటివి చేయనని ఆయన కరాఖండిగా చెప్పారని, అప్పటి నుంచే వారి మధ్య దూరం పెరిగిందని తెలిపారు. ప్రజా సేవకే తప్ప కుటుంబ సభ్యులకు మేలు చేసేందుకు సీఎం కాలేదని వైఎస్ జగన్ స్పష్టంగా చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్సార్ పేరును చెడగొట్టే హక్కు షర్మిలకు లేదని చెప్పారు. వైఎస్ జగన్ పెళ్లికి చంద్రబాబు వద్దకు వైఎస్సార్ వెళ్లి ఆహ్వానించారని చెప్పడం శుద్ధ అబద్ధమన్నారు. షర్మిల దుర్మార్గంగా మాట్లాడుతున్నందువల్లే వైఎస్సార్ చెల్లెలు విమలమ్మ, ఇద్దరు తమ్ముళ్లు ఆమె వెంట లేరన్నారు.

వైఎస్ వివేకా అంటే షర్మిలకు పడేది కాదు

వైఎస్ వివేకానందరెడ్డి బతికి ఉన్నప్పుడు ఆయనంటే షర్మిలకు పడేది కాదని కొండా రాఘవరెడ్డి చెప్పారు. ఆమె ఎన్నోసార్లు వివేకాను గల్లా పట్టుకుందన్నారు. పాదయాత్రలో షర్మిల వెంట వివేకా నడవలేకపోతుంటే తాను వెళ్లి చిన్నాన్న నడవలేకపోతున్నారని, నిదానంగా నడవాలని చెబితే ఆ దరిద్రుడు అలాగే నడుస్తాడులే అని అన్న మాటలు తనకింకా గుర్తున్నాయన్నారు. వివేకా చనిపోయిన ఐదేళ్లలో ఎన్నిసార్లు ఆయన వర్ధంతి, జయంతికి హాజరయ్యారో చెప్పాలని నిలదీశారు. ఇవాళ వివేకాపై ప్రేమ ఒలకబోస్తూ మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. వైఎస్ అవినాశ్‌రెడ్డిపై సీబీఐ చార్జిషీట్‌లో చెప్పిన అంశాలనే మాట్లాడుతున్నామని షర్మిల, సునీత అబద్ధాలు చెబుతున్నారన్నారు. చార్జిషీట్‌ను తాను క్షుణ్ణంగా చదివానని, అది తీసుకొని వైఎస్సార్ సమాధి వద్దకు వస్తే వివేకా హత్య ఎలా జరిగింది, ఇప్పుడు జరుగుతున్నది ఏమిటో చర్చిద్దామని సవాల్ విసిరారు. వివేకా హత్య కేసులో అన్ని వేళ్లు సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డివైపు చూపుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ బిడ్డనంటూ అక్కడి ప్రజలను మోసం చేసి, అక్కడి నుంచి పారిపోయి వచ్చి రాయలసీమ బిడ్డనని చెప్పుకోవడం వింతగా ఉందన్నారు. నోరు అదుపులో ఉంచుకోకపోతే వైఎస్సార్ అభిమానులు ఆమెను ఏపీ నుంచి తరిమి కొడతారని హెచ్చరించారు.

బాబు చేతిలో షర్మిల కీలుబొమ్మ

కుమారుడి పెళ్లికి ఆహ్వానించడానికి చంద్రబాబు ఇంటికి షర్మిల పసుపు చీరలో వెళ్లినప్పుడే వారి మధ్య బేరం కుదిరిందని కొండా రాఘవరెడ్డి ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌ను నేరుగా ఎదుర్కొనే దమ్ములేక కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్షనేత చంద్రబాబు రహస్య ఎజెండాతో షర్మిలను రంగంలోకి దించారని, వారి చేతుల్లో ఆమె కీలుబొమ్మగా మారిందని అన్నారు. ఆమె కుదుర్చుకున్న ప్యాకేజీ ఎన్నికల్లోపే తీసుకోవాలని, లేకపోతే చంద్రబాబు ఇవ్వడని చెప్పారు. ఎన్నికల తర్వాత షర్మిల బతుకు బజారున పడుతుందని, ఆమె అమెరికాకు పారిపోక తప్పదని హెచ్చరించారు. వైఎస్ విజయమ్మ మాట వినకుండా ఏపీలో పీసీసీ అధ్యక్షురాలైనప్పుడే షర్మిల వైఎస్సార్ తనయగా పక్కకు జరిగిందని చెప్పారు.

కుటుంబ వివాదాలను రాజకీయం చేయటం దుర్మార్గం

- నా అల్లుడి మాటల వెనుక పవన్, చంద్రబాబు: అంబటి



సత్తెనపల్లి: సత్తెనపల్లిలో తాను గెలుస్తున్నాననే ప్రచారం జరుగుతున్న కీలక సమయంలో కుటుంబ వివాదాలను రాజకీయం చేస్తున్న తీరు దుర్మార్గమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు చెప్పారు. ఆయన అల్లుడు గుండబోలు గౌతమ్ విడుదల చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తుండగా ఆ విషయాన్ని పొన్నూరు రాజకీయసభలో పవన్‌కళ్యాణ్ ప్రస్తావించడంతో మంత్రి అంబటి రాంబాబు స్పందించారు. సత్తెనపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇది పూర్తిగా కుటుంబ విషయమని చెప్పారు. తన అల్లుడు మాట్లాడిన అంశంలో తాను స్పందించేవాడిని కాదని, పవన్‌కళ్యాణ్ దీన్ని రాజకీయం చేయడంతో మాట్లాడుతున్నానని తెలిపారు. 'గత మూడున్నర, నాలుగేళ్లుగా విడాకుల వివాదం కోర్టులో ఉంది. ఈ అంశంలో నేను నా కూతుర్నే సపోర్ట్ చేస్తున్నా. తన కాళ్లమీద తాను నిలబడేలాగా తనను చదివిస్తూ ప్రోత్సహిస్తున్నా. తండ్రిగా ఇది నా బాధ్యత. నా అల్లుడు గౌతమ్ మాట్లాడినట్టు దుర్మార్గుడిని నేను కాదు. నా కూతుర్ని, తన కూతురిని, కుమారుడిని వదిలేసిన అతడే దుర్మార్గుడు. గతంలోను గౌతమ్.. పవన్, చంద్రబాబును కలుస్తానని నా కూతుర్ని బెదిరించేవాడు. ఈ సమయంలో నా అల్లుడి మాటలు వెనక పవన్, చంద్రబాబు ఉన్నారు. అయినా కుటుంబ వివాదాలు ఎవరికిలేవు? చిరంజీవి, నాగబాబు, పవన్‌కళ్యాణ్, కన్నా కుటుంబాల్లో లేవా? మరొక్కసారి చెబుతున్నా.. ఎన్నికల సమయంలో నా దృష్టిని మరల్చాలని మీరు చేస్తున్న ప్రయత్నాలకు బెదిరిపోను. దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలి.' అని అంబటి అన్నారు.

క్లుప్తంగా...

పింఛన్‌పై వంచన హామీలు ఎందుకు బాబూ?

గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ధ్వజం



సాక్షి, అమరావతి: ప్రజలు అమాయకులని ఏం చెప్పినా నమ్ముతారని చంద్రబాబు భావిస్తున్నట్లు ఉందని, అందుకే పింఛన్‌పైన వంచన హామీలిచ్చాడని గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ ఆదివారం ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళల్లో 50 ఏళ్లు నిండిన వారికి రూ.4000 పెన్షన్ ఇస్తానని, అదే మాదిరిగా 18 –59ఏళ్ల లోపు వయసున్న మహిళలకు నెలకు రూ. 1500 ఇస్తామంటున్నారని.. ఈ పథకాలకు అర్హత ఉన్న మహిళలకు నెలకు రూ.5,800 చెల్లిస్తారా అని ప్రశ్నించారు. మాయ మాటలు చెబుతున్న చంద్రబాబును బహుజన మహిళా లోకం గుణపాఠం చెప్పాలని కోరారు.

మరోసారి జగన్‌ను సీఎం చేసుకోవాలి

నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్ అప్పలకొండమ్మ

కృష్ణలంక (విజయవాడ తూర్పు): నాగవంశీయులను అన్నివిధాలా గౌరవించిన సీఎం జగన్‌కి ఎన్నికల్లో నాగవంశీయులందరూ అండగా నిలవాలని నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ పిలుపునిచ్చారు. జగన్‌ను మరోసారి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విజయవాడ రాణిగారితోట, 17వ డివిజన్‌లో రాష్ట్ర నాగవంశం సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు అధ్యక్షతన ఆదివారం నాగవంశీయుల ఆత్మీయ సమావేశం జరిగింది. అప్పలకొండమ్మ మాట్లాడుతూ నాగవంశీయులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి గౌరవించిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుంటే నాగవంశీయులకు మరింత ప్రాధాన్యత లభిస్తుందన్నారు.

సీఎం రమేష్‌పై ఈసీకి ఫిర్యాదు చేస్తాం

సీపీఎం నేత డి.వెంకన్న

దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తనకు మద్దతుగా వేలాది మంది విద్యార్థులతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పిల్లలతో మండుటెండల్లో గ్రామాల్లో ప్రచారం చేయించడం రాజ్యాంగ విరుద్ధమని, ఈ విషయమై ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. చదువునే పిల్లలకు పాఠశాలలకు సెలవులు కావడంతో ఆడ పిల్లలతో సైతం ప్రచారం చేయిస్తున్నారన్నారు. తక్షణమే ఎలక్షన్ కమిషన్ జోక్యం చేసుకుని పిల్లలతో ప్రచారానికి అడ్డుకట్ట వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'బూడి' ఇంటిపై డ్రోన్ ఎగరేసిన నలుగురిపై కేసు

దేవరాపల్లి: అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తారువలో డిప్యూటీ సీఎం, అనకాపల్లి లోక్‌సభ స్థానం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ఇంటిపై డ్రోన్ ఎగురవేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు దేవరాపల్లి ఎస్‌ఐ డి.నాగేంద్ర ఆదివారం విలేకరులకు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన డ్రోన్ ఆపరేటర్ చిలకల పాండురంగారావు, అసిస్టెంట్ ఆపరేటర్ పొట్టి సాయికృష్ణ (హైదరాబాద్), చొప్ప గంగాధర్, కొమర అప్పారావులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. తన హత్యకు కుట్రలో భాగంగా తన ఇంటి చుట్టూ డ్రోన్‌తో రెక్కీ నిర్వహించారని డిప్యూటీ సీఎం బూడి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే తనను బూడి, ఆయన వర్గీయులు కొట్టారన్న చొప్ప గంగాధర్ ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేశామన్నారు. తారువలో పరామర్శకు వెళ్తే డిప్యూటీ సీఎం, ఆయన వర్గీయులు తమపై తిరగబడ్డారని బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

'బీసీల భవిష్యత్ కోసం మళ్లీ జగనే రావాలి'



కదిరి: 'బీసీల కోసం నేను ఎన్నో ఉద్యమాలు చేశాను. కానీ బీసీల వాటా బీసీలకు ఇస్తానని చేసి చూపించిన దమ్మున్న నాయకుడు మన సీఎం వైఎస్ జగన్. అందుకే రాష్ట్రంలోని బీసీలంతా మన పిల్లల భవిష్యత్ కోసం ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలి. బీసీల ఆత్మబంధువు వైఎస్ జగన్‌ను మరోసారి మనమంతా కలిసి సీఎం పీఠంపై కూర్చోబెట్టాలి' అని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీల ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ..'బడ్జెట్‌లో, రాజకీయాల్లో, విద్యలో ఇలా ప్రతి దాంట్లో బీసీలకు 50 శాతం వాటా ఇచ్చి సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించిన నేత సీఎం వైఎస్ జగన్. రాష్ట్రంలో ఇన్నేళ్లూ దోపిడీకి, అణచివేతకు గురవుతున్న బీసీలకు విద్య ద్వారా సామాజిక ఎదుగుదలకు తోడ్పడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్' అని ఆర్.కృష్ణయ్య ప్రశంసించారు.

ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తాం

మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

కాగజ్‌నగర్, సికింద్రాబాద్ ఎన్నికల ప్రచార సభల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

సాక్షి, హైదరాబాద్/ఆసిఫాబాద్: తాము తిరిగి అధికారంలోకి వస్తే దేశంలో ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తేల్చిచెప్పారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని కుండబద్దలు కొట్టారు. కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ అధికారంలోకి వస్తే మతపరమైన రిజర్వేషన్లు రద్దు చేసి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పెంచుతామని తెలిపారు. మోదీ, బీజేపీ ఉన్నంతవరకు ఈ దేశం నుంచి ఎవరినీ రిజర్వేషన్లు తొలగించనీయబోమన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగ విరుద్ధమైన ముస్లిం రిజర్వేషన్లు రద్దుచేసి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కల్పిస్తామని ఇటీవల తాను ఓ సభలో చెబితే.. ఆ వీడియోను ఎడిట్ చేసి రిజర్వేషన్లు తొలగిస్తారని ప్రజల్లో దుష్ప్రచారం చేశారన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్ షా తెలంగాణలోని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్, సికింద్రాబాద్‌ల్లో ఆదివారం నిర్వహించిన సభల్లో మాట్లాడారు. ఇప్పటికే దేశంలో రెండు దశల్లో ఎన్నికలు పూర్తయ్యాయని.. రెండు దశల్లో బీజేపీ 100 సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మూడో దశ ఎన్నికల తర్వాత బీజేపీ సీట్ల సంఖ్య 200లకు చేరుతుందన్నారు. ఇక తెలంగాణలో 10 స్థానాలకన్నా ఎక్కువ గెలుస్తామని తెలిపారు. ఈసారి ఎన్నికలు మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి మధ్యే జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ కుంభకోణాలు ఖాయమన్నారు. తెలంగాణ నుంచి రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి (ఆర్ఆర్) ట్యాక్స్ వసూలు చేసి దేశవ్యాప్తంగా ఎన్నికలకు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణను రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ఏటీఎంగా మార్చేశారని మండిపడ్డారు.

జగన్ తెలుగు భాషను నాశనం చేయాలని చూస్తున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

అంతం చేసేందుకు, మతమార్పిడులను అరికట్టేందుకు తాము టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తామని గత ఎన్నికల్లో చెప్పి మాట తప్పారన్నారు. పోలవరాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. అంతులేని అవినీతి వల్లే పోలవరం ప్రాజెక్టు పనులు ఆలస్యమయ్యాయన్నారు. ప్రజలంతా ఈ ఎన్నికల్లో ఎన్డీఏను బలపరచాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని అన్నారు.

ఇండియా కూటమి ఎటువంటి సిద్ధాంతాలూ లేకుండా అనైతికంగా ఏర్పడిందని, వారిలో ఎవరు ప్రధాని అభ్యర్థో వారికే స్పష్టత లేదని విమర్శించారు. వారసత్వ రాజకీయాల్లో భాగంగా రాహుల్ గాంధీకి లబ్ధి చేకూర్చేందుకు వారంతా ఏకమయ్యారని అన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 400కు పైగా సీట్లు సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, ప్రధాని మోదీ నాయకత్వంలో మరిన్ని సంస్కరణలతో దేశం అభివృద్ధి దిశగా పయనిస్తుందని తెలిపారు. దేశంలో అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందించిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ఉచిత బియ్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అందించి పేదలను ఆదుకున్నామన్నారు. దేశంలోని 130 కోట్ల మంది పేద ప్రజలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించి కరోనా కట్టడిలో ప్రధాన మంత్రి మోదీ విజయవంతమయ్యారని తెలిపారు. మహిళలకు లోక్‌సభలో 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న కేంద్రహోం మంత్రి అమిత్‌షా

ఆ భూములు ఏమైనా అమ్మ మొగుడు ఇచ్చాడా: బాబు

ఈ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో ప్రైవేటు భూములను కాజేయాలని సీఎం జగన్ ప్లాన్ వేశారని ఆరోపించారు. రైతుల భూములలో జగన్ ఫొటో ఎందుకు పెడతారని, ఆ భూములు ఏమైనా జగన్ అమ్మ మొగుడు ఇచ్చాడా లేక అమ్మమ్మ మొగుడు ఇచ్చారా అంటూ దూషించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా రైతుల భూములకు పాసు పుస్తకాలు కాకుండా జిరాక్స్ పేపర్ ఇస్తారని చెబుతున్నారని, ఆ పేపర్ ముడ్డి తుడుచుకునేందుకు కూడా పనికి రాదని అన్నారు. వివేకా హత్య కేసు నిందితులను జగన్ కాపాడుతున్నారని ఆరోపించారు. 'హూ కిల్డ్ బాబాయ్'కు జగన్ సమాధానం చెప్పాలన్నారు. ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా మార్చారన్నారు. రాయలసీమలో సాగు, తాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని చెప్పారు. సిండికేట్ చేసి మద్యం వ్యాపారం చేశారని, జే బ్రాండ్ల పేరుతో నాసిరకం మద్యంతో పేదల ప్రాణాలు తీశారని, కోట్లాది రూపాయలు ఆర్జించారని ఆరోపించారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత, హిందూపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశా..

వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఒంగోలు: బ్రాహ్మణ సంక్షేమం కోసం తాను అహర్నిశలు కృషి చేస్తుంటానని, వారి పిల్లల చదువు కోసం వేద పాఠశాల నిర్వహిస్తున్నానని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి తెలిపారు. ఒంగోలు పట్టణంలోని రంగారాయుడు చెరువు సమీపంలో శంకరనారాయణ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో చెవిరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తాను ఐదుగురు చిన్నారులతో వేద పాఠశాల ప్రారంభించానని, ఇప్పుడు 160 మంది చిన్నారులు చదువుతున్నారని చెప్పారు. ఈ వేద పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో సుమారు 520 మంది చదువుకునేలా రూ.52 కోట్లతో నిర్మిస్తున్నానని తెలిపారు. అంతేకాక పాఠశాలలో చేరిన ప్రతి చిన్నారి పేరుమీద రూ.2 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ వేశానని రేపు చదువు పూర్తయ్యాక ఒకవేళ ఉద్యోగం రాకపోతే ఈ డబ్బుపై వచ్చే వడ్డీ ఆసరాగా ఉంటుందన్నారు. తన ఇంటిలో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటిలో గోశాల ఉంటుందని, కానీ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇంటిలో గోశాల ఉంటుందా అని ప్రశ్నించారు. బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని అర్చకులకు చంద్రబాబు రిటైర్‌మెంట్ విధిస్తే జగనన్న రిటైర్‌మెంట్ లేకుండా పనిచేయగలిగినంత కాలం ఉద్యోగంలో ఉండేలా జీవో తెచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 3,500 కొత్త ఆలయాలు నిర్మించారని, 6,752 ఆలయాలకు ఆర్థిక సహాయం చేస్తున్నారని కొనియాడారు. ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ మల్లాది విష్ణు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ మీడియంపై ఇంతలేసి మాటలా?

- అమిత్ షా పిల్లలు, మనుమలు ఏ మీడియంలో చదివారు?
- తెలుగు భాషను చంద్రబాబు ఉద్ధరించిందేమీ లేదు
- సీఎం జగన్ తెలుగు భాష అభ్యున్నతికి కృషి చేస్తున్నారు
- ఇంగ్లిష్ మీడియం వల్ల తెలుగు భాష ప్రాభవం ఎక్కడా తగ్గలేదు
- పెత్తందార్లే ఇంగ్లిష్ మీడియంను జీర్ణించుకోలేకపోతున్నారు
- అమిత్ షా టీడీపీ స్క్రిప్టునే చదివారు
- పోలవరం ఆలస్యానికి చంద్రబాబు పాపాలే కారణం
- టీడీపీ, జనసేనతో బీజేపీ కలిసిన తర్వాతే రాష్ట్రానికి అన్యాయం మొదలైంది
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పేదల పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో చదువు చెప్పడాన్ని అమిత్ షా తప్పు పట్టడం శోచనీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. 'పేద పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో బోధనపై ఇంతలేసి మాటలంటున్న అమిత్ షా, ఇతర నేతల పిల్లలు, మనుమలు ఏ మీడియంలో చదువుతున్నారని నిలదీశారు. సజ్జల ఆదివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'తెలుగు భాషను చంద్రబాబు ఉద్ధరించిందీ లేదు.. వైఎస్ జగన్ ప్రభుత్వం తగ్గించిందీ లేదు. ఇంకా సీఎం జగన్ తెలుగు భాష అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే చేస్తే 94 శాతానికి పైగా తల్లిదండ్రులు వారి బిడ్డలు ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవాలని ఆకాంక్షించారు. కానీ, ఇంగ్లిష్ మీడియం పేదల పిల్లలకు అందని ద్రాక్షలా మారింది. పేద తల్లిదండ్రులు వారి పిల్లలను ఇంగ్లిష్ మీడియంలో చదివించాలంటే భారీగా అప్పులు చేయాల్సి వచ్చేది. సీఎం వైఎస్ జగన్ ఈ దుస్థితి నుంచి వారిని బయటపడేశారు. విప్లవాత్మక నిర్ణయాలతో విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చేశారు. నాణ్యమైన విద్యను హక్కుగా అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని తీసుకొచ్చి, విజయవంతంగా కొనసాగిస్తున్నారు. అయినా ఎక్కడైనా తెలుగు ప్రాభవం తగ్గిందా? ఇళ్లలో తెలుగులో మాట్లాడుకోవడం మానేశారా? ఎంత ఇంగ్లిష్ నేర్చుకున్నా మన తల్లిభాష ఎక్కడికిపోదు. ఇంగ్లిష్ మీడియాన్ని ఒక సెక్షన్ ఆఫ్ మాఫియా అడ్డుకుంటోంది. అట్టడుగు, వెనుకబడిన వర్గాల వారు తమతో సమానంగా ఉండటాన్ని జీర్ణించుకోలేని పెత్తందార్లు అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. సామాన్యులకు ఇంగ్లిష్ అందుబాటులోకి వస్తే పెత్తందార్లకు మాతృ భాషపై ఎక్కడలేని ప్రేమ పుట్టుకొస్తోంది. ఈ పెత్తందార్లందరూ కుటుంబ సభ్యులతో తెలుగులో తప్ప మిగిలిన అన్ని భాషల్లో మాట్లాడుకుంటారు. విద్యా రంగంలో సీఎం జగన్ సంస్కరణల కారణంగా మన విద్యార్థులు ఐక్యరాజ్య సమితిలో ప్రజెంటేషన్ ఇచ్చే స్థాయికి ఎదిగారు' అని చెప్పారు.

పోలవరం పాపాలు చంద్రబాబువే..

బీజేపీ నేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సైతం చంద్రబాబు స్క్రిప్టునే వల్లెవేస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. భూ దోపిడీలకు కేరాఫ్ అయిన చంద్రబాబును పక్కన పెట్టుకుని జగన్ ప్రభుత్వంపై అవినీతి బురద జల్లడం సరికాదని హితవు పలికారు. 2014 ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకపోగా.. మరోసారి ఏ ముఖం పెట్టుకుని జట్టు కట్టారని నిలదీశారు. బాబు పాపాల వల్లే పోలవరం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. పోలవరాన్ని బాబు ఏటీఎంలా పిండేస్తున్నారని 2019లో ప్రధాని మోదీయే చెప్పలేదా అని నిలదీశారు. '2017లో బాబు పోలవరం కాంట్రాక్టర్‌ను తప్పించి, రామోజీరావు వియ్యంకుడికి చెందిన నవయుగకు కట్టబెట్టారు. 2013 – 14 రేట్లకు పనులు చేస్తామని కాంట్రాక్టర్ ఒప్పుకున్నా, ప్రజాధనం దోపిడీ లక్ష్యంగా చంద్రబాబు 2015-16 రేట్లకు కాంట్రాక్టు ఇచ్చారు. మట్టి పనులే చేసి కోట్లు దోచేశారు. పనులు చేయకుండానే బిల్లులు చెల్లించేశారు. స్పిల్ వే, స్పిల్ ఛానల్ పూర్తి చేయలేదు. కాఫర్ డ్యాం సగం కట్టి వదిలేశారు. దీంతో వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతింది. పనులు జాప్యానికి ఇదే కారణం. దీనికి బాబే బాధ్యుడు. సీఎం జగన్ పోలవరంలో రూ.850 కోట్లు ఆదా చేశారు. స్పిల్‌వే పూర్తి చేశారు. డయా ఫ్రం వాల్ మరమ్మతులు చేస్తే తప్ప కాఫర్ డ్యామ్ పూర్తి కాదు. కేంద్రం నిధులు సరిగా ఇస్తే సీఎం జగన్ రెండేళ్లకంటే ముందే పూర్తి చేసి చూపిస్తారు. సీఎం జగన్ కేంద్రం నిధులు ఇచ్చే వరకు చూడకుండానే పోలవరం పనులు చేశారు. ఇప్పటికీ కేంద్రం నుంచి రూ.2,700 కోట్లు రీయింబర్స్‌మెంట్ రావాల్సి ఉంది. కూటమి కట్టడంతోనే రాష్ట్రానికి అన్యాయం మొదలైంది. ఈ ఏడాది మార్చి 7కి పోలవరం ఫేజ్–1 కింద మొత్తం రూ. 12,900 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించి నప్పటికీ, టీడీపీ–జనసేనతో బీజేపీ పొత్తు కుదరడంతో ఆ నిధులు ఆగిపోయాయి. షా ఇప్పుడు హామీ ఇవ్వడం కాదు.. విభజన చట్టంలోనే కేంద్రం పోలవరాన్ని పూర్తి చేయాలని ఉంది. ఇదేమీ దానం, ధర్మం కాదు' అని చెప్పారు.

లెక్కలు చూసుకోండి..

'సీఎం జగన్ ఐదేళ్లలో రూ.2.70 లక్షల కోట్లు డీబీటీ ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 31 లక్షల ఇళ్ల స్థలాలు ఇస్తే 9 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయింది. రూ. 34 వేల కోట్లతో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలను మార్చారు. ఇవన్నీ వైఎస్ జగన్ ప్రభుత్వం సృష్టించిన ఆస్తులు. ప్రతి రూపాయికీ లెక్కలున్నాయి. అవినీతికి, వివక్షకు తావులేని పాలన చేస్తుంటే అవినీతి ముద్ర ఎలా వేస్తారు? ప్రభుత్వం చేసిన ప్రతి ఖర్చుకు లెక్కలన్నీ కేంద్రం వద్దే ఉంటాయి. అమిత్ షా వాటిని చూసి మాట్లాడాలి' అని అన్నారు.

చంద్రబాబు, రామోజీ భూ దందా బయటపడుతుందనే!

'ఎవరి భూములపై వారికి సర్వ హక్కులు కల్పించి, భద్రత చేకూర్చేందుకు కేంద్రమే ప్రతిపాదించిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తెస్తుంటే.. టీడీపీ, ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారం అమిత్‌షాకు ఎందుకు కనిపించట్లేదు? చంద్రబాబు, రామోజీరావు భూదందాలు బయటపడతాయనే భయంతోనే వారిద్దరూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ విషయంలో బురద జల్లుతున్నారు. గతంలోనే ఈనాడు అన్నదాతలో ఈ చట్టాన్ని గొప్పగా కీర్తించి (ఈనాడు ప్రసారం చేసిన వీడియోలను ప్రదర్శించారు), ఇప్పుడు భూములు దోచేస్తారంటూ ప్రచారం చేస్తోంది. ఇలా వ్యవస్థలపై ప్రజలకున్న నమ్మకాన్ని దెబ్బతీయడం పెద్ద నేరం. రెండు నాల్కల ధోరణి బయటపడటంతో రామోజీరావు పాత వీడియో లింక్‌లను యూట్యూబ్ నుంచి తొలగించారు. భూముల అక్రమాలు ఎన్ని రకాలుగా చేయొచ్చో రామోజీ ఫిల్మ్ సిటీలోకి వెళ్లి చూస్తే తెలుస్తుంది. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వస్తే రామోజీ వంటి నేరగాళ్లు ఎంతో మంది బయటకొస్తారు' అని తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన టీడీపీ

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్



దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): తెలుగుదేశం పార్టీ బీజేపీతో జతకట్టి రాష్ట్ర ప్రయోజనాలను మోదీకి తాకట్టు పెట్టిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ ధ్వజమెత్తారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రత్యేక హోదాను ప్యాకేజీ పేరుతో పక్కన పెట్టిందని.. కనీసం పోలవరం ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఆదివారం విశాఖలోని సీపీఎం కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఇండియా కూటమి తరఫున కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా పి.సత్యారెడ్డి, సీపీఐ తరఫున విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అత్తిలి విమల, సీపీఎం తరఫున గాజువాక నుంచి పోటీ చేస్తున్న ఎం.జగ్గునాయుడును విశాఖ ప్రజలు గెలిపించుకోవాలని బృందాకారత్ పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 2018లో మోదీ విశాఖపట్నం వచ్చి ఎన్నో హామీలు ఇచ్చారని, నేటికీ రైల్వేజోన్ పూర్తి కాలేదన్నారు. బీజేపీ వాషింగ్ మిషన్ విధానాన్ని అవలంబిస్తోందని మండిపడ్డారు. ఎవరైనా ఎదురు తిరిగితే వారిపై కేసులు పెట్టి, పార్టీలో జాయిన్ అయిన తర్వాత వాటిని ఎత్తేస్తున్నారని చెప్పారు. బాక్సైట్ భూములు దోచుకునేందుకే.. ఇల్లీగల్ మైనింగ్ కేసుల చరిత్ర ఉన్న అభ్యర్థికి ప్రచారం చేసేందుకు మోదీ ఈ ప్రాంతానికి వస్తున్నారని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రావాల్సిన కోకింగ్ కోల్‌ను బ్లాక్ చేసి స్టీల్‌ప్లాంట్‌ను మూసేందుకు కేంద్ర ప్రభుత్వానికి గంగవరం పోర్టు సహకరిస్తుందన్నారు.

కాపుల ఓట్లు ఎలా అడుగుతావు బాబూ!

- కాపు రిజర్వేషన్లపై చంద్రబాబు మాటమార్చి మోసం చేస్తున్నారు
- చంద్రబాబుకు కాపు ఐక్యవేదిక బహిరంగ లేఖ
- బాబు మోసపూరిత హామీలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

సాక్షి, అమరావతి: కాపులను దగా చేసిన చంద్రబాబు ఎన్నికల్లో వారి ఓట్లు ఎలా అడుగుతారని కాపు ఐక్యవేదిక ప్రశ్నించింది. ఈ మేరకు కాపు ఐక్య వేదిక ఆదివారం బహిరంగ లేఖ రాసింది. ఆ లేఖను వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిపల్లి అయ్యప్ప, కో–చైర్మన్లు మెర్ల నాగసత్యనారాయణ, వంగా ఆంజనేయులు, కన్వీనర్ పెద్దిరెడ్డి మహేష్, కో–కన్వీనర్ పంచాది రంగారావు మీడియాకు విడుదల చేశారు. పవన్‌ను అడ్డుపెట్టుకుని కాపుల ఓట్లు పొందాలని చంద్రబాబు చూస్తున్నారే తప్ప కాపుల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు.. అమలు చేయకుండా మోసం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కొత్తగా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు అంటూ మరో కొత్త మోసానికి తెరలేపారని విమర్శించారు. ప్రజలను గందరగోళానికి గురిచేసి ఓట్లు దండుకుని మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను మోసం చేయకుండా ఉన్నది ఉన్నట్టు చెబుతున్న సీఎం వైఎస్ జగన్ వైఖరి కరెక్టా? నిత్యం నయవంచనతో కాపులను మోసం చేస్తున్న చంద్రబాబు వైఖరి కరెక్టా? రాష్ట్ర ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని లేఖలో పేర్కొన్నారు.

చంద్రబాబుపై ఈసీకి ఫిర్యాదు

మోసపూరిత హామీలిస్తున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనాకు కాపు ఐక్యవేదిక ఆదివారం ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను కాపు ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ పెద్దిరెడ్డి మహేష్ తదితరులు మీడియాకు విడుదల చేశారు. చంద్రబాబు కుల, మత ప్రాతిపదికగా ఆచరణ సాధ్యం కానీ హామీలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టేలా మేనిఫెస్టోలో హామీలిచ్చి మోసపూరితంగా ఎన్నికలలో గెలవాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. సామాజిక పింఛన్ పథకాన్ని కూడా టీడీపీ మేనిఫెస్టోలో కులాలు, మతాలు వారీగా వర్తింపజేయడం ప్రజలను మోసం చేయడానికేనని స్పష్టం చేశారు. పేదరికం, వృద్ధాప్యం ప్రాతిపదికగా ఇవ్వాల్సిన పింఛన్‌ను కొన్ని కులాలకు 50 ఏళ్లకే వర్తిస్తూ ఆయా కులాలను ప్రలోభపెట్టే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. కాపులను, అగ్రవర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వెలమ, ఆర్యవైశ్య, కమ్మ, రెడ్డి కులాల్లో పేదరికమే లేదన్నట్టు టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించి., పింఛన్ పథకంలో పక్షపాత బుద్ధితో వ్యవహరించారన్నారు. కుల వివక్షతతో కూటిన సామాజిక పింఛన్ పథకాన్ని అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడం మోసపూరిత చర్య అని, తమ ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కాపు ఐక్యవేదిక నేతలు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు కాపీని భారత ఎన్నికల సంఘానికి కూడా పంపించారు.



ఈ–స్టాంపింగ్‌పై పవన్ విషప్రచారం

- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్
- ఈ–స్టాంపింగ్ విధానంలో రిజిస్ట్రేషన్‌తో ప్రభుత్వం జిరాక్స్ ఇస్తుందంటూ అబద్ధాలు
- పిఠాపురంలో ఈ–స్టాంపింగ్ విధానంలోనే పవన్ ఎన్నికల అఫిడవిట్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి ఈ–స్టాంపింగ్ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తే దానిపై పవన్‌కళ్యాణ్ విషప్రచారానికి పూనుకున్నారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్ కోసం ఉపయోగిస్తున్న నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్ల స్థానంలో అత్యాధునికమైన భద్రతా ఫీచర్లతో ఈ–స్టాంపింగ్ వ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. ఈ–స్టాంపింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రజల ఆస్తులన్నీ ప్రభుత్వపరమైపోతాయని, రిజిస్ట్రేషన్ చేసుకున్న కొనుగోలుదారులకు కేవలం జిరాక్స్ పేపర్లు మాత్రమే ప్రభుత్వం ఇస్తుందని, ఈ విధానం లోపభూయిష్టమైనదని చంద్రబాబు తరఫున పవన్‌కళ్యాణ్ విషప్రచారం చేస్తున్నారు. ఒకసారి ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే జనసేన తరఫున కాకినాడ ఎంపీగా పోటీచేస్తున్న తంగెళ్ల ఉదయశ్రీనివాస్ నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్‌పైన ఎన్నికల అధికారులకు అఫిడవిట్ ఇచ్చారు. పిఠాపురంలో పోటీచేస్తున్న పవన్‌కళ్యాణ్ తన అప్‌డేట్‌ను ఈ–స్టాంప్‌పై దాఖలు చేశారు. పవన్ చెబుతున్నట్టు ఈ–స్టాంపింగ్ వ్యవస్థ ద్వారా రిజిస్ట్రేషన్ జరిగితే ఆ భూములన్నీ ప్రభుత్వానికి చెందేటట్లయితే ఆయన అదే ఈ–స్టాంపింగ్ ఉపయోగించుకుని ఎన్నికల అఫిడవిట్ ఎందుకు దాఖలు చేశారు? ఈ–స్టాంపింగ్ వ్యవస్థపై ఇంత విషప్రచారం చేస్తూ ఆ విధానంలోనే అఫిడవిట్ ఇచ్చిన పవన్‌కళ్యాణ్ ఎన్నికల్లో పోటీకి అర్హుడా?.. ఆయనే చెప్పాలి. ఈ–స్టాంపింగ్ వ్యవస్థపై పవన్ చేస్తున్న ఆరోపణలు వాస్తవాలని ప్రజలు అనుకోవాలంటే.. ఆ విధానంలో అఫిడవిట్ ఇచ్చిన ఆయన ఎన్నికల నుంచి స్వచ్ఛందంగా వైదొలగాలి. లేదా ఈ–స్టాంపింగ్ వ్యవస్థపై ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నందుకుగాను ముక్కు నేలకురాసి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌తో సీఎం జగన్ ప్రజల భూములు లాక్కుంటున్నాడని చంద్రబాబు అండ్ కో విషప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండగా బడుగు, బలహీనవర్గాల ప్రజలకు, దళితులకు ఒక్క ఎకరా భూమి కూడా పంపిణీ చేయలేదు. కానీ సీఎం జగన్ ముఖ్యమంత్రిగా ఐదేళ్ల పరిపాలనలోనే 27, 41, 698 ఎకరాలను 15,21,160 మంది బడుగు, బలహీనవర్గాల రైతులకు పంపిణీ చేసి వారి జీవితాల్ని బాగుచేశారు. భూసంస్కరణలు అమలు జరగాలన్నా, బడుగు, బలహీనవర్గాల ఆత్మగౌరవ కేతనం ఎగరాలన్నా రాష్ట్ర ప్రజలు తిరిగి వైఎస్ జగన్‌ని సీఎంగా చేసుకోవాలి.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
సోమవారం ॥ 6-5-2024

మంచిమాట



నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది అంటారు పెద్దలు. నోరు చేసే పనులు రెండు ఉన్నా, ఎక్కువగా మాట్లాడటం అనే అర్థంలోనే ప్రయోగిస్తూ ఉంటారు. మంచిది అంటే బాగా అందంగా ఉంది అని కాదు అర్థం. మాట మంచిదై ఉండాలి అని అర్థం. అప్పుడు ఊరు అంటే చుట్టుపక్కలవారు కూడా ఆ వ్యక్తితో మంచిగా ఉంటారు. ఆత్మీయంగా ప్రవర్తిస్తారు. అవసరానికి ఆదుకుంటారు.

నోరు మంచిదైతే...

ఏ భాషలో అయినా అన్నిమాటలూ మంచివే! మంచివి కానివి కూడా ఉంటాయా? సందర్భాన్ని బట్టి, మాట్లాడిన తీరుని బట్టి, ముఖకవళికలని బట్టి మాట మంచిదా? కాదా? అని నిర్ణయించబడుతుంది.

నిజానికి అన్ని సందర్భాలూ అందరికీ అనుకూలంగా ఉండవు. సద్దుకుపోవటానికి కూడా కుదరదు. కోపం పెల్లుబుకుతూ ఉంటుంది. తనకు ఆ విషయం నచ్చలేదు అని నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా చెప్పవచ్చు. కానీ, ఆ చెప్పటంలో కోపాన్ని వ్యక్తపరచే అసభ్యపదాలు వాడకూడదు. తప్పు చేసిన వ్యక్తి గురించి పెద్దగా పది మందికి తెలియదు. కానీ, నోరు చేసుకున్న వ్యక్తి వాడిన పదజాలం ప్రచారమై మనిషి పైన చులకన భావాన్ని కలిగిస్తుంది. కనుక చెప్పే విషయం ఎట్లాంటిదైనా భాషను స్వరాన్ని కొద్దిగా అదుపులో ఉంచుకోగలిగితే తనను, ఎదుటివారిని జయించినట్టే!

"మీరు చేసిన పని ఏ మాత్రం సరైనది కాదు. మీ వంటి తెలివైన వారు ఇట్లా చేయవచ్చా?" అని చెప్పిన దానికి "నువ్వు చేసిన పని ఛండాలంగా ఉంది. బుద్ధి ఉన్నవాడు ఇట్లా చేస్తాడా?" అన్నదానికి ఎంత తేడా ఉంది! దీనిని మనం కోర్టులో చేసే వాదనల్లో గమనించవచ్చు. ప్రతిపక్ష న్యాయవాది పరమ మూర్ఖుడు అని తెలిసినా "మై లెర్నెడ్ ఫ్రండ్" అని మాత్రమే సంబోధిస్తారు. కొంతమంది మంచి విషయం చెప్పినా ఏదో తిట్టినట్టో, కొట్టినట్టో ఉంటుంది. ప్రేమగా మాట్లాడినా విసుక్కున్నట్టే ఉంటుంది.

ఎంత గట్టిగా మాట్లాడినా మనసు మంచిదైతే, ఉద్దేశం సవ్యమైనదయితే, చెడ్డ మాట కాకపోతే తోటివారికి సహాయం చేసే స్వభావం కూడా ఉంటే మంచివారుగానే పరిగణించబడతారు వారిని గురించి తెలిసిన వారి చేత. "గొంతు పెద్దది గాని మనసు వెన్న" అంటారు.

కొంతమంది ఊతపదంగా అసభ్యపదాలు వాడేస్తూ ఉంటారు. వినటానికి ఇబ్బందిగా ఉంటుంది. వాతావరణాన్ని ప్రతికూలంగా చేస్తాయి. మరికొంత మంది నోటి నుండి పొరపాటున కూడా ఒక్క మంచిమాట రాదు. ఎంతసేపు ప్రతికూలంగానే మాట్లాడుతూ ఉంటారు.. మనస్సులో దురుద్దేశం ఉండవచ్చు ఉండకపోవచ్చు. అదీ చికాకే.

కొంతమంది మాట్లాడుతున్నప్పుడు, వెళ్ళిన తరువాత కూడా ఏదో అశాంతిగా అనిపిస్తుంది. ఎవరైనా అనారోగ్యంతో ఉన్నప్పుడు చూడటానికి వెళ్ళి, ఆ వ్యాధి ఎంత భయంకరమైనదో, ఎంతమందిని పొట్టన పెట్టుకున్నదో ఏకరవు పెట్టి ఆ ఇంటివారందరి మనస్సులలో దిగులు నింపుతారు. మరి కొందరు ఆ వ్యాధి నుండి బయట పడిన వారి వివరాలు చెప్పి మనస్సులలో ఆశలని చిగురింప చేస్తారు.

విషయమేదైనా మంచిగా, వింటున్న వారికి సంతోషం కలిగేట్టు మాట్లాడితే వచ్చే నష్టమేముంటుంది? ముఖ్య గమనిక: అది అసత్యం కాకూడదు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

మంచి మాటలే ఎందుకు?

ఒక మాట ఉచ్చరించటానికి కొన్ని ధ్వనులు చేయవలసి ఉంటుంది. ధ్వని తరంగాల రూపంలో ఉంటుంది. ధ్వని తరంగాలకి వాతావరణాన్ని, తద్వారా మనస్సుని ప్రభావితం చేసే శక్తి ఉంటుంది. మంచి మాటలని ఉచ్చరించేప్పుడు వెలువడే ధ్వని తరంగాలు సానుకూల ప్రకంపనలని కలిగించి, వాతావరణాన్ని అనుకూలంగా ఉండేట్టు చేస్తాయి. అందుకే బాధలో ఉన్న వారికి ఓదార్పు మాటలు పలకగానే కాస్త ఉపశమనం కలిగినట్టు అనిపిస్తుంది.

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

ఏడడుగుల అనుబంధం



గృహస్థాశ్రమ ప్రవేశం చేయడానికి యువతీ యువకులకు ఉండవలసిన సాధారణ లక్షణాలు ఐదింటిని రామాయణం నిర్దేశించింది. వాటిలో వ్యక్తిత్వం ఒకటి. భార్య ప్రవర్తన దగ్గరికి వచ్చేసరికి... ఆమె నీతో కలిసి పుట్టలేదు. నీతో కలిసి పెరగలేదు. వేరొకరి ఇంట పుట్టింది. ఎవరికో కూతురు. ఆమెకూ ఆశలు ఉంటాయి. కోరికలున్నాయి, సంతోషం కావాలి, ఆమె నీ ఇంటి కోడలిగా వచ్చింది. ఆమె సంతోషంగా ఉండేటట్టు చూడవలసిన మొట్టమొదటి కర్తవ్యం మామగారిది. తరువాత భర్తది. రామాయణంలో మామగారి పేరు చెప్పగానే ఆయన ఆప్యాయతను తలచుకుని సీతమ్మ పరవశించిపోతుంది. ఇది మానవీయ సంబంధాలకు భారతదేశం చేసిన పట్టాభిషేకం.

అందుకే సప్తపది మంత్రాల్లో ఒక విశిష్టమైన విషయాన్ని చెప్పారు. సప్తపది అయితే తప్ప వివాహ తంతు పూర్తి అయినట్టు కాదు.. అంటారు. ఏడడుగులు నడిచిన తరువాత వరుడు – వధువుతో ఒక మాట అంటాడు. 'నీవు నాతో కలిసి ఏడు అడుగులు నడిచావు కాబట్టి ఇకపైన 'నీవు నాకు మంచి స్నేహితురాలివికా. నా మనసు ఎరిగి ప్రవర్తించు' అంటాడు. అంటే – జన్మతః అనుబంధం కాదు. కానీ ఇప్పుడు జీవితంలో మధ్యలో ప్రవేశించింది. ఇక జీవితానికి నిర్ణయాత్మక శక్తి ఆమెయే.




బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

స్నేహమంటే మనసు మనసుతో కలవాలి. ఒకరు మరొకరికి అర్థం కావాలి. వారి సంతోషం కోసం... ఇవతలివారి వైపు నుంచి కొంత త్యాగం ఉంటుంది. అలాగే వీరి సంతోషం కోసం అవతలివారి వైపునుండి కొంత త్యాగం ఉంటుంది. ఇలా జరిగితేనే దాంపత్యం సంతోషంగా సాగుతుంది. అలా కాక నీకిది సంతోషం కాకపోయినా నాకిది ఇష్టం, నేనిది చేస్తాను.. అన్నప్పుడు గృహస్థాశ్రమం అర్థం ఏమిటి? దాంపత్య లక్ష్యం నీరుకారిపోతుంది. అది కాదు... ఒకరి సంతోషానికి మరొకరు కారణం కాగలగాలి. సుమనస్క... అంటారు. అంటే నీవు మంచి మనసుతో ప్రవర్తించు, నేను మంచి మనసుతో ప్రవర్తిస్తా. అలా మనిద్దరం అరమరికలు లేకుండా సఖ్యంగా సంతోషంగా మంచి స్నేహితులుగా ఉందాం. నాకున్న బలహీనతలేమిటో, బలమేమిటో నీవు తెలుసుకోవాలి. అలాగే నీ బలాలు, బలహీనతలు నేను తెలుసుకోవాలి. వాటికి తగిన విధంగా మనం నడుచుకుంటూ, తప్పులు చేస్తే మన్నించుకుని సర్దుకుపోతూ ప్రేమగా ఉండాలి. అంతే తప్ప ఒకరి తప్పులు మరొకరు వెతకడమే ధ్యేయంగా సంసారం చేస్తూ, ఇద్దరి పరువును, కుటుంబ గౌరవాన్ని, వంశ ప్రతిష్ఠను బజారుకీడ్చవద్దు. ఒకరిపట్ల మరొకరు అవగాహనతో, ఆప్యాయతతో, ప్రేమతో సంతోషంగా బతకడానికి ఇంటిని శాంతి స్థానం చేసుకుందాం. బయట ఎన్ని ఒత్తిడులున్నా, ఎన్ని కష్టాలు పడుతున్నా... ఇంటికొచ్చి ఒకరి ముఖం మరొకరం చూసుకోగానే ఉపశమనం పొందగలగాలి. సాహచర్యంలో పరస్పరం శాంతి పొందాలి. ఒకరం తప్పు చేస్తే మరొకరం ప్రేమతో మందలించుకోగలగాలి. అరమరికలొద్దు. వాటిని అర్థం చేసుకుని ఎవరికి వారం సంస్కరించుకుందాం." అనుకోవాలి.

అంటే నిజానికి గృహస్థాశ్రమ ప్రవేశం చేసేటప్పుడు ఇద్దరి మధ్య ఎంత అవగాహనతో ప్రారంభం కావాలో, సుఖమయమైన సంసార జీవితానికి ప్రేమ ఎంత అవసరమో పెద్దలు తెలియపరుస్తారు.

తాత్త్వికథ

ద.. ద.. ద



ప్రజాపతి దగ్గర సురలు, అసురులు, మానవులు తమ బ్రహ్మవిద్యాశిక్షణ పూర్తయిన తరువాత ప్రజాపతిని కలసి సందేశాత్మక ఆశీర్వాదాలు తీసుకోవాలనుకున్నారు. ప్రజాపతిని కలసి గురుదేవా "మీ నుంచి మేం నేర్చుకున్నది మా జీవితాల్లో అలవరుచుకుంటూనే విధులు, బాధ్యతలు నిర్వహించదలచాము" అన్నారు. ప్రజాపతి ధర్మపథంలో నడవమని ఆదేశించారు. దేవతలు ముందుకొచ్చి, "మీ ఆదేశానుసారం మేము విధులను ధర్మపథంలో నిర్వహిస్తాం. మీ ఆశీస్సులతో పాటు మంచి సందేశమివ్వమని కోరారు. అప్పుడు ఒక మెరుపు ఆకాశంలో మెరుస్తూ 'ద' అనే శబ్ద సంకేతాన్నిచ్చింది. అప్పుడు ప్రజాపతి మీకు ఆ మెరుపు సంకేతం ఏమి అర్థమయిందని? దేవతలన్నారు మేము 'ద' ని దమ్యత అంటే స్వయంనిగ్రహంగా అర్థం చేసుకున్నాం. మా మనస్సాక్షి చెబుతున్నదేమంటే సుఖ, సౌఖ్య జీవనాన్ని అనుభవించేటపుడు లేదా ఆ వాంఛలు కలిగినపుడు స్వయంనిగ్రహం కావాలని. ప్రజాపతి సంతసించి బాగా అర్థం చేసుకున్నారు అన్నారు.

తదుపరి ఇది చూసి మనుష్యులు కూడా ప్రజాపతిని దివ్య ఆశీస్సులతో కూడిన వీడ్కోలు సందేశాన్ని కోరారు. అప్పుడు మళ్ళీ ఆకాశంలో మెరుపు 'ద' ధ్వనితో కనిపించింది. దాని సంకేతాన్ని మీరు ఎలా అర్థం చేసుకున్నారు అని అడగ్గా మనుషులన్నారు "మేము 'ద' ని దత్త గా అర్థం చేసుకున్నాము. దత్త అంటే ఇవ్వు లేదా దానంచెయ్యి అని అర్థం. మేము స్వార్థపరులం. మేము మా గురించే ఆలోచిస్తుంటాం. ఇతరులను పట్టించుకోం. కనుక మాకు అదొక దివ్యసంకేతం. మేము మాకున్నది అభాగ్యులకు దానం చేసేందుకు ప్రయత్నిస్తాం" అన్నారు. ప్రజాపతి సంతోషించి, మీరు బాగా అర్థం చేసుకున్నారు అన్నారు. చివరగా అసురులు వచ్చారు. అప్పుడు ఆకాశంలో మెరుపు 'ద' ధ్వనితో మెరిసింది. దాన్ని మీరు ఎలా అర్థం చేసుకున్నారు అని అడగగా మేము 'ద' ని దయాగుణంగా అర్థం చేసుకున్నాము. అనగా దయాగుణం కలిగి ఉండడం. మాది క్రూరస్వభావం. మా మనసు చెబుతున్నదేమంటే, ఇతరుల ఎడ ఎక్కువ దయ, జాలి కలిగి ఉండాలని, తద్వారా ప్రశాంతంగా, సంతోషంగా వుండాలని. మనం గమనిస్తే మనిషిలో ఒక్కొక్కప్పుడు దైవత్వం, మరొకప్పుడు రాక్షసత్వం కనబడతాయి.

మెరుపు నుంచివచ్చిన 3 రహస్యసంకేతాలూ ద ద ద మనిషికి చక్కగా అన్వయించబడతాయి. మనలో దేవత్వం కనిపించినపుడు స్వయం నిగ్రహం పాటించాలి. అది మనకు సమయాన్ని, శక్తిని, అస్థిత్వాన్నీ ఇస్తుంది. మనం మన శక్తిని, అస్థిత్వాన్ని ఇతరులతో పంచుకోవచ్చు. మనం యితరులతో పంచుకుంటుంటే, అది మనలో దయను కలిగించి ఇతరులలో ఎంతో మానవత్వాన్ని పరిమళింప చేస్తుంది.

– డా. విశ్వేశ్వరవర్మ భూపతిరాజు

సినిమా

చలో వైజాగ్



ఎన్టీఆర్

వైజాగ్ వెళ్లనున్నారట 'దేవర' టీమ్. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'దేవర'. జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, నరైన్, సైఫ్ అలీఖాన్, టామ్ షైన్ చాకో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ వైజాగ్‌లో ప్రారంభం కానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అయితే ఈ షెడ్యూల్‌లో తొలుత ఎన్టీఆర్ పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరిస్తారట మేకర్స్. ప్రస్తుతం ముంబైలో హిందీ చిత్రం 'వార్ 2'తో బిజీగా ఉన్నారు ఎన్టీఆర్. ఆ సినిమా తాజా షెడ్యూల్ పూర్తయిన తర్వాత 'దేవర' సెట్స్‌లో ఎన్టీఆర్ జాయిన్ అవుతారట. కల్యాణ్‌రామ్, కె.హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న 'దేవర' రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా ఈ సినిమా తొలి భాగాన్ని ఈ ఏడాది అక్టోబరు 10న రిలీజ్ చేస్తామని చిత్ర యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మూవీకి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

ఇట్స్ డ్యాన్సింగ్ టైమ్



రవితేజ

ఇట్స్ డ్యాన్సింగ్ టైమ్ అంటున్నారు మిస్టర్ బచ్చన్. హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునాహోగా' అనేది ట్యాగ్‌లైన్. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జగపతి బాబు ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్, హైదరాబాద్‌లో ఈ సినిమాకు సంబంధించిన మేజర్ టాకీ పార్ట్ చిత్రీకరణ జరిపారు మేకర్స్. కాగా ఈ సినిమాలోని పాటల చిత్రీకరణ కోసం ఈ వారంలో అమెరికా వెళ్లాలని యూనిట్ ప్లాన్ చేస్తోందని ఫిల్మ్‌నగర్ సమాచారం. హరీష్ శంకర్ ఆల్రెడీ అమెరికా వెళ్లి లొకేషన్స్ పరిశీలిస్తున్నారని తెలిసింది. పనోరమా స్టూడియోస్, టి-సిరీస్ సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ స్వరకర్త. ఇదిలా ఉంటే హిందీ హిట్ మూవీ 'రైడ్' (2018)కు తెలుగు రీమేక్‌గా 'మిస్టర్ బచ్చన్' తెరకెక్కుతోందని సమాచారం.

దాసరిగారి పేరు చిరస్థాయిగా ఉంటుంది



మురళీ మోహన్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోదండ రామిరెడ్డి, మోహన్ బాబు, బీఎస్ఎన్ సూర్యనారాయణ

– మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

"దాసరి నారాయణరావుగారి సినిమాలు ఎక్కువగా చూసేవాళ్లం. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా.. ఇలా ఆయన చేయని విభాగం లేదు. పేద కుటుంబం నుంచి వచ్చి ఈ స్థాయికి చేరుకున్న దాసరిగారి పేరు సినిమా ఇండస్ట్రీ ఉన్నంత వరకూ చిరస్థాయిగా ఉంటుందనుకుంటున్నాను" అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. దర్శకరత్న దాసరి నారాయణరావు 77వ జయంతి వేడుకలు 'దర్శకరత్న డి.ఎన్. ఆర్.ఫిల్మ్ అవార్డ్స్' కమిటీ కన్వీనర్ బీఎస్ఎన్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'దర్శకరత్న డి.ఎన్. ఆర్.ఫిల్మ్ అవార్డ్స్' పేరిట తెలుగు సినిమా రంగానికి చెందిన వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరచినవారికి అవార్డులు అందించారు. ఈ వేడుకకి ముఖ్య అతిథిగా విచ్చేసిన **కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ–** "దాసరిగారి గురించి చిన్నప్పటి నుంచి వింటూ.. ఈ రోజు 77వ జయంతి వేడుకల్లో పాల్గొనడం, ఆయన్ని స్మరించుకోవడం సంతోషంగా ఉంది. ఇండస్ట్రీకి ఎంతో మేలు చేసిన ఆయన తక్కువ వయసులోనే అనారోగ్యంతో చనిపోవడం బాధాకరం" అన్నారు. 'దర్శకరత్న డి.ఎన్.ఆర్.ఫిల్మ్ అవార్డ్స్' జ్యూరీ కమిటీ అధ్యక్షుడు **తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ–** "దాసరిగారు కెరీర్ ప్రారంభంలో చెప్పులేకుండా చెన్నై వచ్చారని విన్నాను. అలాంటి ఆయన రాఘవగారి ఆఫీసులో ఉంటూ చిన్న ఉద్యోగం చేస్తూ తర్వాత ఏ స్థాయికి ఎదిగారో మనమందరం చూశాం. ఆయన ఎంత కష్టపడి పైకి వచ్చారన్నది మనం చూడాలి. ఆయన్ని మనమంతా ఆదర్శంగా తీసుకోవాలి. ఆయనకు వంద మంది శిష్యులు ఉన్నారు. ప్రపంచంలో ఎవరికీ అంతమంది శిష్యులు లేరు" అన్నారు.

డైరెక్టర్ ధవళ సత్యం మాట్లాడుతూ– "దాసరి నారాయణరావు, నేను గురు శిష్యులం కాదు.. క్లాస్‌మేట్స్. ఒరేయ్ అని తిట్టుకుంటూ కష్టాలు పడ్డాం. ఆ తర్వాత సుఖాలు అనుభవించాం. సంపాదించాం.. పోగొట్టాం. కళాశాల రోజుల నుంచి చనిపోయేవరకూ ఇద్దరం కలిసే ఉన్నాం" అన్నారు. **డైరెక్టర్ రేలంగి నరసింహారావు మాట్లాడుతూ–** "1971లో మా గురువు దాసరి నారాయణరావుగారి వద్ద నేను చేరాను. అప్పటికి ఆయన డైరెక్టర్ కాలేదు. డైలాగ్ రైటర్‌గా పనిచేస్తున్నారు. 1980లో నన్ను డైరెక్టర్ చేసింది గురువుగారే" అన్నారు. **నటి రోజారమణి మాట్లాడుతూ–** "దాసరిగారు తీసిన 'ఎవరికి వారే యమునా తీరే, భారతంలో ఒక అమ్మాయి, బలి పీఠం' సినిమాల్లో నేను నటించడం నా అదృష్టం" అన్నారు.

'బెస్ట్ లెజెండరీ యాక్టర్' అవార్డు అందుకున్న **మంచు మోహన్‌బాబు మాట్లాడుతూ–** "దర్శక కులానికి గౌరవం తెచ్చిన గొప్ప వ్యక్తి దాసరిగారు. ఆయన పేరిట నెలకొల్పిన అవార్డు అందుకోవడం గర్వంగా ఉంది" అన్నారు. 'లెజెండరీ ప్రొడ్యూసర్' అవార్డు అందుకున్న **అల్లు అరవింద్ మాట్లాడుతూ–** "నేను చిత్ర పరిశ్రమకు రావటానికి ప్రోత్సహించినవారిలో దాసరిగారు మొదటి వ్యక్తి. నిర్మాతగా నా మొదటి చిత్రం 'బంట్రోతు భార్య'కి ఆయన దర్శకత్వం వహించారు. ఆయన లేకుండా నా ప్రయాణం లేదు.. ఆయనకు కృతజ్ఞతలు" అన్నారు. 'ద లెజెండరీ డిస్ట్రిబ్యూటర్' అవార్డును అందుకున **'దిల్' రాజు మాట్లాడుతూ–** "సినిమా ఇండస్ట్రీ అన్నది మా అందరికీ ఎంతో ఇచ్చింది. కానీ, దాసరిగారు మాత్రం ఇండస్ట్రీకి ఎంతో ఇచ్చారు" అన్నారు. 'బెస్ట్ క్యారెక్టర్ ఆర్టిస్ట్' అవార్డు అందుకున్న **వీకే నరేశ్ మాట్లాడుతూ–** "ఇండియన్ సినిమాకి దాసరిగారు గాడ్‌ఫాదర్. మా అమ్మ విజయ నిర్మలగారిని చెల్లెమ్మ అని ఎంతో ప్రేమగా పిలిచే ఏకైక వ్యక్తి ఆయన. ఆయన అవార్డుని అందుకోవడం హ్యాపీ" అన్నారు. **బీఎస్ఎన్ సూర్యనారాయణ మాట్లాడుతూ–** "దాసరి గారితో మూడు దశాబ్దాల ప్రయాణం నాది. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఈ వేడుక నిర్వహించడాన్ని గౌరవంగా భావిస్తున్నా" అన్నారు.

'దర్శకరత్న డి.ఎన్. ఆర్.ఫిల్మ్ అవార్డ్స్'లో భాగంగా లెజెండరీ డైరెక్టర్ అవార్డును కోదండ రామిరెడ్డి, లెజెండరీ డైలాగ్ రైటర్ అవార్డును సత్యానంద్, లెజెండరీ ఫిలాంత్రఫిస్ట్ అవార్డును మురళీమోహన్, లెజెండరీ స్టోరీ రైటర్స్ అవార్డుని పరుచూరి బ్రదర్స్, లెజెండరీ లిరిసిస్ట్ అవార్డుని చంద్రబోస్, లెజెండరీ ఎగ్జిబిటర్ అవార్డుని సునీల్ నారంగ్, లెజెండరీ జర్నలిస్ట్ అవార్డును మాడభూషి శ్రీధర్ అందుకున్నారు. అలాగే 'బెస్ట్ ఫిల్మ్ అవార్డ్స్, బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డ్స్, స్పెషల్ అప్రిషియేషన్ అవార్డ్స్'లను కూడా అందించారు.

ఈ వేడుకలో నిర్మాతలు అట్లూరి పూర్ణచంద్రరావు, అచ్చిరెడ్డి, దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్, రామ సత్యనారాయణ, ఎస్కేఎన్, దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి, ఎన్.శంకర్, వీరశంకర్, 'దర్శకరత్న డి.ఎన్. ఆర్.ఫిల్మ్ అవార్డ్స్' అవార్డుల జ్యూరీ కమిటీ కార్యదర్శి సి. కళ్యాణ్, సభ్యులు ప్రభు, ధీరజ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

భలే ఉన్నాడే మంచి కాన్సెప్ట్ ఫిల్మ్ - దర్శకుడు మారుతి



రాజ్‌తరుణ్, మారుతి

రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా జె. శివ సాయి వర్ధన్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'భలే ఉన్నాడే'. మారుతి టీమ్ సమర్పణలో ఎన్వీ కిరణ్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది.ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు అతిథిగా విచ్చేసిన మారుతి మాట్లాడుతూ–"మన మధ్య జరిగే ఓ కథలా ఈ సినిమా ఉంటుంది. మంచి కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న ఈ సినిమా ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పిస్తుందని భావిస్తున్నాను. చిన్న సినిమాగా విడుదలై, పెద్ద సినిమా కాబోతుంది. రాజ్‌తరుణ్‌తో నేను ఎప్పట్నుంచో సినిమా చేయాలనుకుంటున్నాను. దర్శకుడు సాయికి ఈ సినిమా పాయింట్ చెబితే చాలా చక్కగా డిజైన్ చేసుకుని తీసుకువచ్చాడు. నేనూ చిన్న సినిమాలతోనే వచ్చాను. అందుకే ఇప్పుడు ఎంత పెద్ద సినిమాలు చేస్తున్నా.. చిన్న సినిమాలతోనూ ట్రావెల్ అవుతున్నాను" అన్నారు. "నేను ఎప్పట్నుంచో మారుతితోనే ఓ సినిమా చేద్దామనుకున్నాను. అది ఈ సినిమాతో కుదిరినందుకు సంతోషంగా ఉంది" అన్నారు రాజ్ తరుణ్. "మారుతిగారి సలహా వల్లే దర్శకుడిని కావాలన్న నా కల నెరవేరింది" అన్నారు జె. శివ సాయివర్ధన్. "సినిమా బాగా వచ్చింది. ప్రేక్షకులకు నచ్చుతుంది" అన్నారు కిరణ్‌కుమార్. ఈ చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్‌చంద్ర మాట్లాడారు.

నవ్వులు పండించడం కష్టం


– తేజ సజ్జా



శ్రీను, తేజ సజ్జా

"నవ్వులు పండించడం కష్టమైన పని. కామెడీ చేసే వాళ్లు ఏడిపిస్తే ఎంత అద్భుతంగా ఉంటుందో బ్రహ్మానందంగారు చేస్తే చూశాం. ఇప్పుడు 'రాజు యాదవ్' మూవీలో గెటప్ శ్రీను కామెడీ చేయబోతున్నారు. ఇది నవ్విస్తూ మనసుని హత్తుకునే చిత్రం. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ప్రోత్సహించాలి" అని 'హనుమాన్' మూవీ ఫేమ్ తేజ సజ్జా అన్నారు. నటుడు గెటప్ శ్రీను హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించిన ఈ మూవీలో అంకిత ఖరత్ హీరోయిన్‌గా నటించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 17న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ని తేజ సజ్జా లాంచ్ చేశారు. గెటప్ శ్రీను మాట్లాడుతూ–"అందరూ 'రాజు యాదవ్' మూవీని చూసి మమ్మల్ని ప్రోత్సహించాలి" అన్నారు. "వాస్తవ కథతో సహజసిద్ధంగా ఈ సినిమాని తీశాం. భావోద్వేగాలు, వినోదం ఆకట్టుకుంటాయి" అన్నారు కృష్ణమాచారి. "మా సినిమాని ఆదరించి యూనిట్‌ని సపోర్ట్ చేయాలి" అన్నారు ప్రశాంత్ రెడ్డి, అంకిత ఖరత్.

టైటానిక్ నటుడు బెర్నార్డ్ హిల్ ఇకలేరు



హాలీవుడ్ సీనియర్ నటుడు బెర్నార్డ్ హిల్ (79) ఇకలేరు. హాలీవుడ్ చిత్రపరిశ్రమలో దాదాపు ఐదు దశాబ్దాల పాటుగా కొనసాగిన బెర్నార్డ్ హిల్ ఆదివారం కన్నుమూశారు. మాంచెస్టర్‌లోని బ్లాక్లీలో 1944 డిసెంబరు 17న బెర్నార్డ్ జన్మించారు. థియేటర్ ఆర్టిస్టుగా ఆయన కెరీర్ మొదలైంది. 'మిస్టర్ టోడ్స్ వైల్డ్ రైడ్ (1996)', 'టైటానిక్'(1997), 'ఏ మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్ (1999)', 'ట్రూ క్రైమ్ (1999)', 'ది స్కార్పియన్ కింగ్ (2002), 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్: ది రిటర్న్ ఆఫ్ ది కింగ్ (2003), 'వాల్కైరీ (2008)', 'పారా నార్మన్ (2012) వంటి హాలీవుడ్ సినిమాల్లో నటించారాయన. ముఖ్యంగా పదకొండు ఆస్కార్ అవార్డులు గెలుచుకున్న 'టైటానిక్ (కెప్టెన్ ఎడ్వర్డ్ స్మిత్ పాత్రలో..), 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్: ది రిటర్న్ ఆఫ్ ది కింగ్ (కింగ్ థియోడెన్ పాత్రలో..)' చిత్రంలో ఆయన నటనకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మంచి ప్రశంసలు దక్కాయి. అంతేకాదు.. పదకొండు ఆస్కార్ అవార్డులు దక్కించుకున్న రెండు సినిమాల్లో భాగమైన ఏకైక నటుడు బెర్నార్డ్ హిల్‌నే కావడం విశేషం. ఆయన సినిమాల్లోనే కాదు...'బాయ్స్ ఫ్రమ్ ది బ్లాక్ స్టఫ్ (1982)', 'ఏ వెరీ సోషియల్ సెక్రటరీ' వంటి టెలివిజన్ హిట్ సిరీస్‌లలో కూడా నటించారు. బెర్నార్డ్ హిల్‌కు భార్య మరియానా హిల్, కుమారుడు గ్యాబ్రియేల్ ఉన్నారు. ఇక ఆయన మృతిపట్ల హాలీవుడ్ చిత్రపరిశ్రమ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



చైనా ‘డబుల్’ ధమాకా... థామస్ కప్, ఉబెర్ కప్ టైటిల్స్ సొంతం

ప్రపంచ బ్యాడ్మింటన్‌లో తమకు తిరుగులేదని చైనా జట్లు మరోసారి చాటుకున్నాయి. థామస్ కప్, ఉబెర్ కప్ టీమ్ టోర్నమెంట్‌లో విజేతగా అవతరించాయి. సొంతగడ్డపై ఆదివారం ముగిసిన ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో చైనా మహిళల జట్టు ఉబెర్ కప్‌ను 16వ సారి... చైనా పురుషుల జట్టు థామస్ కప్‌ను 11వ సారి సొంతం చేసుకున్నాయి. ఇండోనేసియాతో జరిగిన ఉబెర్ కప్ టైటిల్ పోరులో చైనా 3-0తో గెలిచింది. తొలి మ్యాచ్‌లో చెన్ యు ఫె 21-7, 21-16తో మరిస్కాపై... రెండో మ్యాచ్‌లో చెన్ కింగ్ చెన్-జియా యి ఫాన్ 21-11, 21-8తో సితి ఫాదియా-రిబ్కా సుగియార్తోలపై... మూడో మ్యాచ్‌లో హి బింగ్‌జియావో 10-21, 21-15, 21-17తో ఎస్టెర్‌పై గెలిచారు. థామస్ కప్ ఫైనల్లో చైనా 3-1తో ఇండోనేసియాను ఓడించింది. తొలి మ్యాచ్‌లో షి యు కి 21-17, 21-6 తో జిన్‌టింగ్‌పై, రెండో మ్యాచ్‌లో లియాంగ్-వాంగ్ చాంగ్ 21-18, 17-21, 21-17తో ఫజర్-అర్దియాంతోలపై నెగ్గడంతో చైనా 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో మ్యాచ్‌లో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) 21-16, 15-21, 21-17తో లీ షి ఫెంగ్‌ను ఓడించాడు. నాలుగో మ్యాచ్‌లో హి జి టింగ్-జియాంగ్ 21-11, 21-15తో ఫిక్రి-మౌలానాలపై నెగ్గి చైనాకు 3-1తో టైటిల్‌ను ఖరారు చేశారు.



భారత్ తొలి పోరు న్యూజిలాండ్‌తో

మహిళల టి20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

దుబాయ్: బంగ్లాదేశ్‌లో ఈ ఏడాది అక్టోబర్ 3 నుంచి 20వ తేదీ వరకు జరిగే మహిళల టి20 ప్రపంచకప్ షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆదివారం విడుదల చేసింది. గ్రూప్ ‘ఎ’లో భారత్, డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్తాన్, క్వాలిఫయర్-1 జట్లు... గ్రూప్ ‘బి’లో ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, క్వాలిఫయర్-2 జట్లున్నాయి. భారత్ తమ తొలి మ్యాచ్‌ను అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో ఆడుతుంది. ఆ తర్వాత అక్టోబర్ 6న పాకిస్తాన్‌తో, 9న క్వాలిఫయర్-1తో, 13న ఆస్ట్రేలియాతో తలపడుతుంది. లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక రెండు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుతాయి. తొలి సెమీఫైనల్ అక్టోబర్ 17న, రెండో సెమీఫైనల్ 18న జరుగుతాయి. అక్టోబర్ 20న జరిగే ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది.

స్టార్ రెజ్లర్ బజరంగ్‌పై తాత్కాలిక నిషేధం



న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియాపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తాత్కాలిక నిషేధం విధించింది. మార్చి 10వ తేదీన సోనెపట్‌లో నిర్వహించిన జాతీయ రెజ్లింగ్ ట్రయల్స్ సందర్భంగా బజరంగ్ సెమీఫైనల్లో ఓడిపోయాక డోపింగ్ పరీక్షకు హాజరుకాకుండానే బయటకు వెళ్లిపోయాడు. దాంతో ‘నాడా’ ఏప్రిల్ 23న బజరంగ్‌పై తాత్కాలిక నిషేధం విధించింది. డోపింగ్ పరీక్షకు ఎందుకు హాజరుకాలేదో వివరణ ఇవ్వాలని కోరుతూ మే 7వ తేదీ వరకు బజరంగ్‌కు గడువు ఇచ్చింది. మరోవైపు తాను డోపింగ్ పరీక్షకు హాజరయ్యేందుకు నిరాకరించలేదని... ‘నాడా’ అధికారులు ఆరోజు గడువు తీరిన కిట్స్‌తో తన నుంచి శాంపిల్స్ సేకరించేందుకు వచ్చారని బజరంగ్ ఆరోపించాడు. ‘నాడా’ అధికారులకు తన న్యాయవాది సమాధానం ఇస్తాడని బజరంగ్ తెలిపాడు.

రవీంద్రజాలం...

జడేజా ఆల్‌రౌండ్ షో

- చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆరో విజయం
- 28 పరుగులతో ఓడిన పంజాబ్ కింగ్స్



ధర్మశాల: ఐపీఎల్ టోర్నీలో వరుసగా ఆరోసారి చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించాలనుకున్న పంజాబ్ కింగ్స్ ఆశలను రవీంద్ర జడేజా వమ్ము చేశాడు. 2021 నుంచి పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయిన డిఫెండింగ్ చాంపియన్ చెన్నై ఆరోసారి మాత్రం గెలుపు బావుటా ఎగురవేసింది. ధర్మశాలలో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో చెన్నై 28 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై గెలిచి గత బుధవారం పంజాబ్ చేతిలోనే ఎదురైన ఓటమికి బదులు తీర్చుకుంది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ రవీంద్ర జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెన్నై విజయంలో ముఖ్య పాత్ర పోషించాడు. ముందుగా జడేజా 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 43 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బంతితోనూ మెరిసి 4 ఓవర్లలో 20 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు.

టాస్ గెలిచిన పంజాబ్ కెప్టెన్ స్యామ్ కరన్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 167 పరుగులు సాధించింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (21 బంతుల్లో 32; 4 ఫోర్లు, 1 సిక్స్), డరైల్ మిచెల్ (19 బంతుల్లో 30; 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి రెండో వికెట్‌కు 57 పరుగులు జోడించారు. అయితే ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్లో రాహుల్ చహర్ వరుస బంతుల్లో రుతురాజ్, శివమ్ దూబే (0)లను అవుట్ చేయగా... మిచెల్‌ను హర్షల్ పటేల్ పెవిలియన్‌కు పంపించాడు. దాంతో చెన్నై 69/1 నుంచి 75/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో ఇతర బ్యాటర్ల సహకారంతో జడేజా చెన్నైను ఆదుకున్నాడు. జడేజా కీలక ఇన్నింగ్స్‌తో చెన్నై స్కోరు 160 దాటింది. పంజాబ్ బౌలర్లలో రాహుల్ చహర్ (3/23), హర్షల్ పటేల్ (3/24) రాణించారు. 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 139 పరుగులే చేసి ఓడిపోయింది. తుషార్ పాండే (2/35) ఇన్నింగ్స్ రెండో ఓవర్లో బెయిర్‌స్టో, రోసోలను అవుట్ చేసి పంజాబ్‌ను దెబ్బ కొట్టాడు. ఆ తర్వాత ప్రభ్‌సిమ్రన్, కరన్, అశుతోష్‌లను జడేజా... శశాంక్‌ను సాన్‌ట్నర్ అవుట్ చేయడంతో పంజాబ్ గెలుపుపై ఆశలు వదులుకుంది.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (సి) రబడ (బి) అర్ష్‌దీప్ 9; రుతురాజ్ (సి) జితేశ్ (బి) చహర్ 32; మిచెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్షల్ 30; శివమ్ దూబే (సి) జితేశ్ (బి) చహర్ 0; మొయిన్ అలీ (సి) బెయిర్‌స్టో (బి) స్యామ్ కరన్ 17; జడేజా (సి) స్యామ్ కరన్ (బి) అర్ష్‌దీప్ 43; సాన్‌ట్నర్ (సి) స్యామ్ కరన్ (బి) చహర్ 11; శార్దుల్ (బి) హర్షల్ 17; ధోని (బి) హర్షల్ 0; తుషార్ (నాటౌట్) 0; గ్లీసన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 167. వికెట్ల పతనం:** 1-12, 2-69, 3-69, 4-75, 5-101, 6-122, 7-150, 8-150, 9-164. **బౌలింగ్:** రబడ 3-0-24-0, అర్ష్‌దీప్ 4-0-42-2, స్యామ్ కరన్ 4-0-34-1, హర్‌ప్రీత్ బ్రార్ 1-0-19-0, రాహుల్ చహర్ 4-0-23-3, హర్షల్ పటేల్ 4-0-24-3.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి) సబ్-సమీర్ రిజ్వీ (బి) జడేజా 30; బెయిర్‌స్టో (బి) తుషార్ 7; రోసో (బి) తుషార్ 0; శశాంక్ (సి) సిమర్జీత్ (బి) సాన్‌ట్నర్ 27; స్యామ్ కరన్ (సి) సాన్‌ట్నర్ (బి) జడేజా 7; జితేశ్ (సి) ధోని (బి) సిమర్జీత్ (బి) 0; అశుతోష్ శర్మ (సి) సిమర్జీత్ (బి) జడేజా 3; బ్రార్ (నాటౌట్) 17; హర్షల్ (సి) సబ్-సమీర్ రిజ్వీ (బి) సిమర్జీత్ 12; చహర్ (బి) శార్దుల్ 16; రబడ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 139. వికెట్ల పతనం:** 1-9, 2-9, 3-62, 4-68, 5-69, 6-77, 7-78, 8-90, 9-117. **బౌలింగ్:** సాన్‌ట్నర్ 3-0-10-1, తుషార్ దేశ్‌పాండే 4-0-35-2, గ్లీసన్ 4-0-41-0, జడేజా 4-0-20-3, సిమర్జీత్ 3-0-16-2, శార్దుల్ 2-0-12-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	11	8	3	16	1.453
రాజస్తాన్	10	8	2	16	0.622
చెన్నై	11	6	5	12	0.700
హైదరాబాద్	10	6	4	12	0.072
లక్నో	11	6	5	12	-0.371
ఢిల్లీ	11	5	6	10	-0.442
బెంగళూరు	11	4	7	8	-0.049
పంజాబ్	11	4	7	8	-0.187
గుజరాత్	11	4	7	8	-1.320
ముంబై	11	3	8	6	-0.356

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై × హైదరాబాద్
వేదిక: ముంబై
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

నరైన్ మెరుపులు

39 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లతో 81

- కోల్‌కతాకు ఎనిమిదో విజయం
- పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి
- 98 పరుగులతో ఓడిన లక్నో



‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ నరైన్

లక్నో: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఐపీఎల్ టోర్నీలో ఎనిమిదో విజయం నమోదు చేసింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు 98 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. గతంలో రెండుసార్లు ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచిన కోల్‌కతా తాజా విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. రాజస్తాన్, కోల్‌కతా జట్లు 16 పాయింట్లతో సమంగా ఉన్నప్పటికీ... మెరుగైన రన్‌రేట్‌తో కోల్‌కతా టాప్ ర్యాంక్‌ను అందుకుంది. టాస్ గెలిచి లక్నో జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 235 పరుగులు సాధించింది. ఓపెనర్ సునీల్ నరైన్ (39 బంతుల్లో 81; 6 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరిపించాడు. ఫిల్ సాల్ట్ (14 బంతుల్లో 32; 5 ఫోర్లు, 1 సిక్స్), రమణ్‌దీప్ సింగ్ (6 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కూడా దూకుడుగా ఆడారు. అనంతరం 236 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన లక్నో జట్టు 16.1 ఓవర్లలో 137 పరుగులకే కుప్పకూలింది. స్టొయినిస్ (21 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా ఇతర బ్యాటర్లు విఫలమయ్యారు.

ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఫిల్ సాల్ట్, సునీల్ నరైన్ మరోసారి కోల్‌కతా జట్టుకు శుభారంభాన్నిచ్చారు. తొలి బంతి నుంచే వీరిద్దరు లక్నో బౌలర్ల భరతం పట్టారు. మోసిన్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో నరైన్ చెలరేగిపోయాడు. వరుసగా మూడు ఫోర్లతోపాటు ఒక సిక్స్ కూడా బాదడంతో ఈ ఓవర్లో 20 పరుగులు వచ్చాయి. ఐదో ఓవర్లో సాల్ట్ అవుట్‌కాగా, పవర్‌ప్లే ముగిసేసరికి కోల్‌కతా 70 పరుగులు సాధించింది. పవర్‌ప్లే తర్వాత కూడా నరైన్ తన జోరు కొనసాగించాడు. 27 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. స్టొయినిస్ వేసిన ఇన్నింగ్స్ 11వ ఓవర్లో నరైన్ మూడు సిక్స్‌లు కొట్టాడు. రవి బిష్ణోయ్ వేసిన 12వ ఓవర్లో ఒక సిక్స్ కొట్టిన నరైన్ ఆ తర్వాత మరో భారీ షాట్‌కు యత్నించి అవుటయ్యాడు. నరైన్ వెనుదిరిగాక... శ్రేయస్, రమణ్‌దీప్ దూకుడును కొనసాగించడంతో కోల్‌కతా స్కోరు 230 దాటింది.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 32; నరైన్ (సి) సబ్-పడిక్కల్ (బి) బిష్ణోయ్ 81; రఘువంశీ (సి) రాహుల్ (బి) యుధ్‌వీర్ 32; రసెల్ (సి) సబ్-గౌతమ్ (బి) నవీనుల్ 12; రింకూ సింగ్ (సి) స్టొయినిస్ (బి) నవీనుల్ 16; శ్రేయస్ అయ్యర్ (సి) రాహుల్ (బి) యశ్ ఠాకూర్ 23; రమణ్‌దీప్ సింగ్ (నాటౌట్) 25; వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 235. వికెట్ల పతనం:** 1-61, 2-140, 3-167, 4-171, 5-200, 6-224. **బౌలింగ్:** స్టొయినిస్ 2-0-29-0, మోసిన్ ఖాన్ 2-0-28-0, నవీనుల్ హక్ 4-0-49-3, యశ్ ఠాకూర్ 4-0-46-1, కృనాల్ పాండ్యా 2-0-26-0, రవి బిష్ణోయ్ 4-0-33-1, యుధ్‌వీర్ సింగ్ 2-0-24-1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: కేఎల్ రాహుల్ (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ 25; అర్షిన్ (సి) రమణ్‌దీప్ (బి) స్టార్క్ 9; స్టొయినిస్ (సి) హర్షిత్ (బి) రసెల్ 36; దీపక్ హుడా (ఎల్బీడబ్ల్యూ) (బి) వరుణ్ 5; పూరన్ (సి) సాల్ట్ (బి) రసెల్ 10; బదోని (సి) స్టార్క్ (బి) నరైన్ 15; టర్నర్ (సి అండ్ బి) వరుణ్ 16; కృనాల్ పాండ్యా (సి) సాల్ట్ (బి) హర్షిత్ 5; యుధ్‌వీర్ (సి) రసెల్ (బి) వరుణ్ 7; బిష్ణోయ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్షిత్ 2; నవీనుల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (16.1 ఓవర్లలో ఆలౌట్) 137. వికెట్ల పతనం:** 1-20, 2-70, 3-77, 4-85, 5-101, 6-109, 7-125, 8-129, 9-137, 10-137. **బౌలింగ్:** వైభవ్ 2-0-21-0, స్టార్క్ 2-0-22-1, నరైన్ 4-0-22-1, హర్షిత్ రాణా 3.1-0-24-3, వరుణ్ చక్రవర్తి 3-0-30-3, రసెల్ 2-0-17-2.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏయూ విశాఖపట్నంలో ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్శిటీ, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లాజిస్టిక్స్ కౌన్సిల్‌తో కలిసి 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి సెల్ఫ్ సపోర్టెడ్ విధానంలో రెండేళ్ల ఎంబీఏ(లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం సీట్ల సంఖ్య:** 60
- **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ప్రాధాన్యతనిచ్చే కేటగిరి:** ఆర్మ్‌డ్ ఫోర్సెస్ పర్సనల్స్/డిపెండెండ్స్/వార్డ్ ఆఫ్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్.
- **కోర్సు ఫీజు:** డిఫెన్స్ పర్సనల్స్, డిపెండెంట్లకు రూ.40,000, ఇతరులకు రూ.60,000.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయం, ఆంధ్ర యూనివర్శిటీ, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 18.06.2024.
- **సీట్ల కేటాయింపు:** 20.06.2024.
- **వెబ్‌సైట్:** https://audoa.andhrauniversity.edu.in

ఏఐఏపీజీఈటీ-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. దేశవ్యాప్తంగా ఆయుష్ కాలేజీలు/సంస్థల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయుర్వేదం, యునానీ, సిద్ధ, హోమియోపతి వైద్య విభాగాల్లో ఎండీ, ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆల్ ఇండియా ఆయుష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(ఏఐఏపీజీఈటీ)-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- **అర్హత:** బీఏఎంఎస్/బీయూఎంఎస్/బీఎస్ఎంఎస్/బీహెచ్ఎంఎస్/గ్రేడెడ్ బీహెచ్ఎంఎస్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఏడాది ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 15.05.2024.
- **పరీక్ష ఫీజు చెల్లింపుకు చివరితేది:** 16.05.2024.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 17.05.2024 నుంచి 19.05.2024 వరకు.
- **అడ్మిట్ కార్డ్ విడుదల తేది:** 02.07.2024.
- **పరీక్ష తేది:** 06.07.2024.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, మహబూబ్‌నగర్, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/AIAPGET

టీటీడీలో సంప్రదాయ కలంకారీ కళలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు

తిరుమల తిరుపతి దేవస్థానాలు(టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప కళాశాల.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల డిప్లొమా, రెండేళ్ల సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత భోజనం,వసతి కల్పిస్తారు. శిక్షణలో చేరిన విద్యార్థి పేరు మీద టీటీడీ రూ.లక్ష బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తుంది. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి ఆ మొత్తాన్ని అందిస్తోంది.

కోర్సుల వివరాలు

- నాలుగేళ్ల డిప్లొమా కోర్సు(సంప్రదాయ కలంకారీ కళ), రెండేళ్ల సర్టిఫికెట్ కోర్సు(సంప్రదాయ కలంకారీ కళ).
- **విభాగాలు:** శిలా శిల్ప, సుధా(సిమెంట్) శిల్ప, ఆలయ నిర్మాణం, దారు(కొయ్య) శిల్ప, లోహ శిల్ప, సంప్రదాయ చిత్రలేఖనం.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 15 నుంచి 20 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, మౌఖిక పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. టీటీడీ వెబ్‌సైట్‌లో సూచించిన దరఖాస్తు నమూనాను పూర్తిచేసి ప్రధానోపాధ్యాయుడు, శ్రీ వెంకటేశ్వర సాంప్రదాయ ఆలయ శిల్ప కళాశాల, అలిపిరి రోడ్, తిరుపతి చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తు ప్రారంభతేది:** 01.05.2024.
- **దరఖాస్తులకు చివరితేది:** 17.06.2024.
- **వెబ్‌సైట్:** https://www.tirumala.org

ఐకార్-ఐఏఆర్ఐ, న్యూఢిల్లీలో 15 పోస్టులు

న్యూఢిల్లీలోని ఐకార్-ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐఏఆర్ఐ) ఒప్పంద ప్రాతిపదికన రీసెర్చ్ అసోసియేట్, సీనియర్ రీసెర్చ్ ఫెలో, యంగ్ ప్రొఫెషనల్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
- **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్(ఆర్ఏ)-04, సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్)-06, యంగ్ ప్రొఫెషనల్2-05.
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హత, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి తర్వాత ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తులకు చివరితేది:** 12.05.2024.
- **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** dpp.mpp2022@-gmai.com
- **వెబ్‌సైట్:** https://iari.res.in

ఫార్మసీ పీజీకి జీప్యాట్



» జీప్యాట్-2024 నోటిఫికేషన్ విడుదల
» జీప్యాట్ స్కోర్‌తో ఎం.ఫార్మసీలో ప్రవేశం
» నైపర్-జేఈఈకి అర్హత పరీక్షగా జీప్యాట్
» ఫార్మ రంగంలో అవకాశాలకు మార్గం

దేశంలో విస్తరిస్తూ యువతకు అవకాశాలు కల్పిస్తున్న రంగాల్లో కీలకమైంది.. ఫార్మాస్యూటికల్స్! ఈ రంగంలో ప్రయోగాలు, పరిశోధనలు, సరికొత్త ఔషధాల ఆవిష్కరణలకు ఎంతో అవకాశముంది. అందుకే ఫార్మసీలో ఉన్నత విద్యను అభ్యసించిన వారికి ఫార్మా సంస్థలు అవకాశాలు కల్పిస్తున్నాయి. ఫార్మసీ పీజీలో చేరాలనుకునే వారికి చక్కటి మార్గంగా నిలుస్తోంది.. గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీప్యాట్)! ఈ టెస్ట్ స్కోర్‌తో దేశంలోని ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్, యూనివర్సిటీల్లో.. ఎం ఫార్మసీలో ప్రవేశం పొందొచ్చు. తాజాగా జీప్యాట్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఈ పరీక్షకు దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు తదితర వివరాలు..

బీఫార్మసీ విద్యార్థులు.. జీప్యాట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే.. దేశ వ్యాప్తంగా ఉన్న ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎం.ఫార్మసీ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం జీప్యాట్ స్కోర్ ఆధారంగా వేయికిపైగా ఇన్‌స్టిట్యూట్స్ అడ్మిషన్ కల్పిస్తున్నాయి. జీప్యాట్ ఫలితాలు వెలువడిన తర్వాత ఆ స్కోర్ కార్డ్ ఆధారంగా.. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న ఇన్‌స్టిట్యూట్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నిర్వహణ ఎన్‌బీఈఎంఎస్

గత ఏడాది వరకు జీప్యాట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించేది. తాజాగా ఈ ఏడాది నుంచి నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్).. జీప్యాట్ నిర్వహణ బాధ్యతలు చేపడుతోంది. అదేవిధంగా ఫార్మసీ విద్య నిర్వహణ బాధ్యతలను ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు కల్పించారు.

అర్హతలు

జీప్యాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు నాలుగేళ్ల బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి. 2024, 2025లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బీటెక్/బీఈ (ఫార్మాస్యుటిల్ అండ్ ఫైన్ కెమికల్ టెక్నాలజీ) విద్యార్థులు సైతం దరఖాస్తుకు అర్హులే.

నైపర్ జేఈఈకి మార్గం

నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఫార్మసీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్) క్యాంపస్‌లకు దేశంలో ఫార్మసీ విద్యను అందించడంలో ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌గా గుర్తింపు ఉంది. వీటిల్లో ప్రవేశానికి నిర్వహించే నైపర్-జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(నైపర్ -జేఈఈ)కు అర్హతగా జీప్యాట్ ఉత్తీర్ణతను పరిగణనలోకి తీసుకుంటారు. అదేవిధంగా రాష్ట్రాల స్థాయిలో ఫార్మసీ కళాశాలల్లో ఎం.ఫార్మసీ సీట్ల భర్తీలో ముందుగా జీప్యాట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఇస్తారు. ఈ స్కోర్ ద్వారా సీట్లు భర్తీ అయిన తర్వాత మిగిలిన సీట్లనే పీజీఈసెట్‌లో ర్యాంకు సాధించిన వారికి కేటాయిస్తారు.

రెండేళ్లపాటు స్కాలర్‌షిప్

జీప్యాట్ స్కోర్ ఆధారంగా రెండేళ్ల ఎం.ఫార్మసీలో ప్రవేశం పొందిన వారికి నెలకు రూ.12,400 చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తారు. విద్యార్థులు పుస్తకాలు, ట్యూషన్ ఫీజు, విద్యాభ్యాసానికి సంబంధించిన ఇతర వనరులు సమకూర్చుకునేందుకు ఈ స్కాలర్‌షిప్ సదుపాయం ఉపయోగపడుతుంది.

నాలుగు విభాగాలు.. 500 మార్కులు

జీప్యాట్ పరీక్షను మొత్తం నాలుగు విభాగాల్లో 500 మార్కులకు నిర్వహించనున్నారు. ఇందులో ఫార్మాస్యుటికల్ కెమిస్ట్రీ, అనుబంధ సబ్జెక్ట్‌లు 38 ప్రశ్నలు-152 మార్కులు, ఫార్మాస్యుటిక్స్ 38 ప్రశ్నలు-152 మార్కులు, ఫార్మకోగ్నసీ 10 ప్రశ్నలు-40 మార్కులు,ఫార్మకాలజీ28 ప్రశ్నలు-112 మార్కులు, ఇతర సబ్జెక్టులు 11 ప్రశ్నలు-44 మార్కులకు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది.పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మే 8
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: 2024, మే 11 - మే 14
- అడ్మిట్ కార్డ్ జారీ: 2024, జూన్ 3
- జీప్యాట్ పరీక్ష తేదీ: 2024, జూన్ 8
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://natboard.edu.in, https://www.pci.nic.in

బెస్ట్ స్కోర్‌కు.. మార్గమిదే

ఫార్మకోగ్నసీ

ఇది పూర్తిగా థియరీతో కూడిన విభాగం. కాబట్టి అభ్యర్థులు పాఠ్యాంశాలను క్షుణ్నంగా చదివి షార్ట్ నోట్స్ రాసుకోవాలి. ఆయా ఔషధాలకు సంబంధించిన భావనలు, విధానాలు, ప్రభావాలు, ఉపయోగాల గురించి అధ్యయనం చేయాలి. ముఖ్యంగా..గ్లైకోసైడ్స్,ఆల్కలాయిడ్స్, వాలటైల్ ఆయిల్స్, రెసిన్స్, టానిన్స్, కార్బొహైడ్రేట్స్, టిష్యూ కల్చర్, హెర్బల్ డ్రగ్స్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

ఫార్మకాలజీ

అభ్యర్థుల్లో ఎక్కువ మందికి ఫార్మకాలజీ విభాగంపై ఆసక్తి ఉంటుంది. జీప్యాట్‌లో దీనికి అధిక వెయిటేజీ దక్కుతోంది. ఇందులో డ్రగ్ ఇంటరాక్షన్, మెకానిజమ్స్, డ్రగ్స్-సైడ్ ఎఫెక్ట్స్‌ను అధ్యయనం చేయాలి. డ్రగ్స్‌ను సంక్షిప్త నామాల్లో గుర్తుంచుకొనేందుకు డ్రగ్స్ వర్గీకరణ పాఠ్యాంశం ఉపయోగపడుతుంది. అంకాలజీ (కీమోథెరపీ డ్రగ్స్, నూతన టెక్నాలజీలు తదితరం), న్యూరో ఫార్మకాలజీ, అరుదైన వ్యాధులు, కార్డియోవస్కులర్ అండ్ బ్లడ్ ప్రొడక్ట్స్ తదితర ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

ఫార్మాస్యూటికల్ అనాలసిస్

జీప్యాట్‌లో ఇతర విభాగాలతో పోల్చితే కొంత సులభంగా ఉండే విభాగం.. ఫార్మాస్యూటికల్ అనాలసిస్. దీనికి సంబంధించి భావనలను అర్థం చేసుకోవాలి. అదేవిధంగా వీటిపైనన్ని ఎక్కువ సమస్యలు సాధించాలి. ఫార్ములాలను నోట్ చేసుకోవాలి. యూవీ, ఐఆర్, ఎన్ఎంఆర్, మాస్ స్పెక్టోస్కోపీ, క్రొమాటోగ్రఫీ, పోలరోగ్రఫీ అండ్ పొలారిమెట్రీ, ఫ్లేమ్ ఫోటోమీటర్, కండక్టోమెట్రీ, ఆంపెరోమెట్రీ, పొటెన్షియోమెట్రీ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ

ఈ విభాగంలో ప్రశ్నలు ప్రాథమిక స్థాయిలో ఉంటాయి. కాన్సెప్టులపై అవగాహనతో సదరు ప్రశ్నలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు. ముఖ్యంగా ఈ విభాగంలో కర్బన రసాయన శాస్త్రంపై దృష్టిపెట్టాలి. ఎస్ఏఆర్ ఆఫ్ స్టెరాయిడ్స్, నామ్‌నిక్లేచర్ అండ్ కెమికల్ మొయిటీ ఆఫ్ ది మెడికల్ డ్రగ్స్ గురించి అధ్యయనం చేయాలి.

ఫార్మాస్యుటిక్స్

ఈ విభాగం అధ్యయనాన్ని రసాయనాలు, టాబ్లెట్ల సూత్రీకరణతో మొదలుపెట్టాలి. సూక్ష్మజీవులను హతమార్చే(స్టెరిలైజేషన్) నైపుణ్యాలు, న్యూమరికల్ ప్రాబ్లమ్స్‌పై ప్రధానంగా దృష్టిపెట్టాలి. సర్ఫేస్ అండ్ ఇంటర్ ఫేషియల్ ఫినామినా, రియాలజీ, కైనటిక్స్ అండ్ డ్రగ్స్ స్టెబిలిటీ, బయో ఫార్మాటిక్స్ అండ్ ఫార్మకోకైనటిక్స్ అంశాలను ప్రత్యేక దృష్టితో చదవాలి.వీటితోపాటు స్పెక్ట్రోస్కోపీ-మాస్ స్పెక్ట్రోస్కోపీ, యూవీ, ఐఆర్, ఎన్ఎంఆర్ స్పెక్ట్రోస్కోపీ చాప్టర్లను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. క్లాసిఫికేషన్ ఆఫ్ డ్రగ్స్, షెడ్యూల్స్ ఆఫ్ డ్రగ్స్ చాప్టర్లకు నోట్సు రాసుకోవాలి. జీప్యాట్‌లో న్యూమరికల్ ప్రాబ్లమ్స్ సంఖ్య పెరుగుతున్న విషయాన్ని గుర్తించి ఈ తరహా ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. ముఖ్యంగా బయో ఫార్మాస్యుటిక్స్, డిప్రెషన్ ఇన్ ఫ్రీజింగ్ పాయింట్, అలిగేషన్ మెథడ్, డోస్ ఆన్ ది బేసిస్ ఆఫ్ బాడీ వెయిట్ అండ్ ఏజ్ టాపిక్స్‌పై ప్రాబ్లమ్స్ ఎక్కువగా అడుగుతున్నారు.

కౌన్సెలింగ్ ఆధారంగా ప్రవేశం

జీప్యాట్‌లో ఉత్తీర్ణత సాధించిన తర్వాత అభ్యర్థులు సదరు స్కోర్ ఆధారంగా ఆయా ఇన్‌స్టిట్యూట్‌లకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు ఈ స్కోర్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి నేరుగా సీట్లు భర్తీ చేస్తున్నాయి. మరికొన్ని ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు మలి దశలో గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలను కూడా నిర్వహిస్తున్నాయి.

ఎం.ఫార్మసీలో స్పెషలైజేషన్లు

జీప్యాట్ స్కోర్ ఆధారంగా ఎం.ఫార్మసీలో పలు స్పెషలైజేషన్లలో చేరే అవకాశం ఉంది. పీజీలో ఫార్మకాలజీ, ఫార్మాస్యుటిక్స్, టాక్సికాలజీ, ఫార్మా మేనేజ్‌మెంట్, ఫార్మకోగ్నసీ స్పెషలైజేషన్‌లు పూర్తి చేసిన వారికి జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. వీరు డ్రగ్ డిస్కవరీ సంస్థలు, డ్రగ్ ఫార్ములేషన్ సంస్థలు, బల్క్ డ్రగ్ ప్రొడక్షన్ సంస్థల్లో అవకాశాలు అందుకోవచ్చు. జీప్యాట్‌తో పీజీ పూర్తి చేసిన తర్వాత పీహెచ్‌డీలో చేరితే ఉజ్వల కెరీర్ అవకాశాలు లభిస్తాయి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
733	172
73,878	22,475

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	16,156	△	315
డోజోన్స్	38,676	△	450
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,213	△	41
డాక్స్	17,994	△	97
షాంఘై (మంగళవారం ముగింపు)	3.105	▽	8
నికాయ్ (గురువారం ముగింపు)	38,236	▽	38

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	81.84	85.13
£	బ్రిటన్ పౌండ్	[illegible]	102.36	106.93
€	యూరో	[illegible]	87.44	91.55
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	43.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	52.71	56.97
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.29	63.53
SAR	సౌదీ రియాల్	[illegible]	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.85	23.62
¥	చైనా యువాన్	[illegible]	10.39	12.39

ఏ వయసు వారికైనా ఆరోగ్య బీమా



హెల్త్ ఇన్సూరెన్స్.. కొంత ఊరట!
- ఐదేళ్ల తర్వాత క్లెయిమ్ చెల్లించాల్సిందే!
- మూడేళ్లకు తగ్గిన వెయిటింగ్ పీరియడ్
- ముందస్తు వ్యాధుల విషయంలో ఊరట
- ముందుగా చెప్పలేదనడం కుదరదిక
- కీలక మార్పులు చేసిన ఐఆర్‌డీఏఐ

వైద్య ఖర్చులు గణనీయంగా పెరిగిపోయిన నేటి రోజుల్లో ఆరోగ్య బీమా ఎన్నో కుటుంబాలకు మెరుగైన రక్షణ కల్పిస్తుందనడంలో సందేహం లేదు. కానీ, మన దేశంలో సగం మంది ఇప్పటికీ ఆరోగ్య బీమా రక్షణ పరిధిలో లేరన్నది వాస్తవం. 2047 నాటికి అందరికీ బీమాను చేరువ చేయాలన్న లక్ష్యంలో భాగంగా బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఇటీవలే నిబంధనల్లో కొన్ని కీలక మార్పులు తీసుకొచ్చింది. హెల్త్ ఇన్సూరెన్స్ విషయంలో పాలసీదారులకు ప్రయోజనం కలిగించే మార్పులకు శ్రీకారం చుట్టింది. హెల్త్ ఇన్సూరెన్స్ విషయంలో '65 ఏళ్ల' పరిమితిని తొలగించింది. ముందస్తు వ్యాధుల కవరేజీకి వేచి ఉండాల్సిన కాలాన్ని తగ్గించింది. క్లెయిమ్ తిరస్కరణ నిబంధనలను మరింత అనుకూలంగా మార్చింది. వీటివల్ల పాలసీదారులకు ఒరిగే ప్రయోజనం, ప్రీమియం భారం గురించి తెలుసుకుందాం

హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు సమయంలో తమ ఆరోగ్య సమస్యలు, ఆరోగ్య చరిత్ర గురించి ప్రతి ఒక్కరూ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటికే ఏదైనా అనారోగ్యం బారిన పడ్డారా?, ఆరోగ్య సమస్యలు ఉన్నాయా? అని బీమా సంస్థ పాలసీ దరఖాస్తులో అడుగుతుంది. అప్పటికే ఏవైనా ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటే, అవి ముందస్తు వ్యాధుల కిందకు వస్తే (పీఈడీ) నిర్ణీత కాలం పాటు ఆయా వ్యాధుల కవరేజీ కోసం వేచి ఉండాలి. ఈ వెయిటింగ్ పీరియడ్ ముగిసే వరకు వాటికి సంబంధించిన క్లెయిమ్‌లకు బీమా సంస్థ చెల్లింపులు చేయదు. పాలసీదారులు సొంతంగా చెల్లించుకోవాలి. ఈ వెయిటింగ్ పీరియడ్ అనేది గరిష్టంగా 48 నెలలు (నాలుగేళ్లు) ఉండగా, దీనిని ఐఆర్‌డీఏఐ తాజాగా 36 నెలలకు (మూడేళ్లు) తగ్గించింది. కాకపోతే ఒక్కో బీమా సంస్థలో ఈ కాలం ఒక్కో మాదిరిగా ఉండొచ్చు. అదనపు ప్రీమియం చెల్లిస్తే ఈ వెయిటింగ్ కాలాన్ని కొన్ని బీమా సంస్థలు తగ్గిస్తున్నాయి కూడా. మరి అదనపు ప్రీమియం భరించలేని వారికి తాజా నిబంధన సంతోషాన్నిచ్చేదే. తాజా పరిణామంతో బీమా సంస్థలు ముందు నుంచి ఉన్న వ్యాధులకు మూడేళ్లకు మించి కొర్రీలు పెట్టడం కుదరదు. ఇది బీమా వ్యాప్తిని పెంచుతుందని పాలసీబజార్ హెల్త్ ఇన్సూరెన్స్ విభాగం బిజినెస్ హెడ్ సిద్ధార్థ్ సింఘాల్ అభిప్రాయపడ్డారు. ''ముందస్తు వ్యాధులకు మూడేళ్లకంటే తక్కువ వెయిటింగ్ పీరియడ్‌తో పాలసీలను కొన్ని సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి. కానీ, తక్కువ వెయిటింగ్ పీరియడ్ పాలసీని ఎంపిక చేసుకోవడం పాలసీదారుల అవసరం, అవగాహనపైనే ఆధారపడి ఉంటోంది. తక్కువ వెయిటింగ్ పీరియడ్ పాలసీదారులకు అనుకూలం''అని నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ ఉత్పత్తులు, క్లెయిమ్‌లు, అండర్‌రైటింగ్ డైరెక్టర్ బసుతోష్ మిశ్రా చెప్పారు. ఒక ఏడాది తగ్గించడం వల్ల ముందస్తు వ్యాధుల పేరుతో బీమా సంస్థల నుంచి క్లెయిమ్ తిరస్కరణలు తగ్గిపోతాయని నిపుణుల విశ్లేషణ.

మొదటి రోజు నుంచే

అదనపు ప్రీమియం చెల్లిస్తే మొదటి రోజు నుంచే ముందస్తు వ్యాధులకు కవరేజీ ఇచ్చే పాలసీలు కూడా ఉన్నాయి. ''మధుమేహం, రక్తపోటు, ఉబ్బసం, కొలెస్ట్రాల్ తదితర ముందు నుంచి ఉన్న వ్యాధులకు పాలసీదారులు మొదటి రోజు నుంచే కవరేజీ పొందొచ్చు. కాకపోతే ఇందు కోసం 10–15 శాతం అదనపు ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది''అని పాలసీబజార్ హెల్త్ ఇన్సూరెన్స్ హెడ్ సిద్ధార్థ్ సింఘాల్ తెలిపారు.

ముందు నుంచి అంటే ఎంత కాలం..?

పాలసీ తీసుకునే తేదీ నాటి నుంచి దానికి ముందు 36 నెలల కాలంలో డాక్టర్ ఏదైనా సమస్యని నిర్ధారించడం.. అందుకు గాను చికిత్స లేదా ఔషధాలు సూచించినా అది పీఈడీ కిందకు వస్తుందిన నిజానికి ఇప్పటి వరకు ఇది 48 నెలలుగా ఉండేది. అంటే పాలసీ తీసుకునే నాటికి ముందు నాలుగేళ్ల కాలంలో ఏదైనా ప్రత్యేక ఆరోగ్య సమస్య ఎదుర్కొంటే దాన్ని పీఈడీగా పరిగణించే వారు. ఇప్పుడు మూడేళ్లకు ఐఆర్‌డీఏఐ తగ్గించింది. దశాబ్దం క్రితం ఐదారేళ్ల పాటు వెయిటింగ్ పీరియడ్ ఉండేది. బీమా రంగంలో పోటీ పెరగడం, పాలసీ కొనుగోలుదారులు విస్తరించడంతో గణనీయంగా తగ్గుతూ వస్తోంది. భవిష్యత్తులోనూ మరింత తగ్గే అవకాశాలు లేకపోలేదు.

ఈ తప్పు చేయొద్దు

పాలసీ కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ పీఈడీల గురించి వెల్లడించాల్సిందే. ఉదాహరణకు ఒక వ్యక్తి చిన్న డోస్‌తో రక్తపోటును నియంత్రించుకోవచ్చు. ఇవి పరీక్షల్లో బయటపడేవి కావని చెప్పి చాలా మంది తమకు ఈ సమస్యలు ఉన్నట్టు పాలసీ దరఖాస్తులో వెల్లడించరు. కానీ, ఇది పెద్ద తప్పు. తాము ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నదీ, వాటికి ఏవేవి మందులు వాడుతున్నది తప్పకుండా వెల్లడించాలి. దీనివల్ల పాలసీ డాక్యుమెంట్‌లో మీ ఆరోగ్య సమస్యలు నమోదు అవుతాయి. దీనివల్ల ఆ తర్వాతి కాలంలో క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు చెల్లింపుల పరంగా వివాదాలు తగ్గిపోతాయి. కానీ, ఆరోగ్య సమస్యలను బయట పెడితే కంపెనీలు పాలసీ జారీకి నిరాకరిస్తారయన్న భయంతో కొందరు వెల్లడించరు. కానీ, థైరాయిడ్, కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు, గుండె జబ్బులకు సైతం అండర్‌రైటింగ్ విషయంలో (పాలసీ జారీ) బీమా సంస్థలు సౌకర్యంగానే ఉంటాయి. కనుక నిజాయితీగా వెల్లడించడమే మంచిదని నిపుణుల వ్యాఖ్య.

వ్యాధుల వారీగా వెయిటింగ్

కొన్ని అనారోగ్యాలకు చికిత్స కవరేజీని బీమా సంస్థలు మొదటి రోజు నుంచే ఆఫర్ చేయవు. వీటి కోసం 'ప్రత్యేకమైన వెయిటింగ్ పీరియడ్'ను అమలు చేస్తుంటాయి. నిబంధల ప్రకారం ఈ కాలాన్ని గరిష్టంగా 4 సంవత్సరాలకు మించి అమలు చేయకూడదు. ఇప్పుడు ఈ కాలాన్ని మూడేళ్లకు ఐఆర్‌డీఏఐ తగ్గించింది. నిజానికి కొన్ని బీమా సంస్థలు రెండేళ్లకే ఈ వెయిటింగ్ పీరియడ్‌ను అమలు చేస్తున్నాయి. పాలసీ వర్డింగ్స్ డాక్యుమెంట్‌లో ఈ వ్యాధుల వివరాలు పూర్తిగా ఉంటాయి. నిర్ణీత వెయిటింగ్ కాలం ముగిసిన తర్వాతే వీటికి సంబంధించిన క్లెయిమ్‌కు అర్హత లభిస్తుంది. క్యాటరాక్ట్, సైనసైటిస్, అడినాయిడ్స్, టాన్సిలైటిస్ చికిత్సలు, కిడ్నీలో రాళ్ల తొలగింపు, కీళ్ల మార్పిడి చికిత్సలకు సాధారణంగా వెయిటింగ్ పీరియడ్ అమలవుతుంటుంది. ఈ వెయిటింగ్ పీరియడ్ తగ్గింపు కొత్త వారికే కాకుండా పాత పాలసీదారులకూ వర్తిస్తుంది.

మారటోరియం పీరియడ్‌ను 8 సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాలకు తగ్గించడం మరో ముఖ్యమైన నిర్ణయం. పాలసీ తీసుకుని, క్రమం తప్పకుండా ఐదేళ్ల పాటు ప్రీమియం చెల్లిస్తే.. ఆ తర్వాతి కాలంలో ఎలాంటి కారణం చూపుతూ బీమా సంస్థ క్లెయిమ్ తిరస్కరించడం కుదరదు. పాలసీదారు మోసం చేసినట్టు నిరూపిస్తే తప్పించి క్లెయిమ్‌ను ఆమోదించాల్సిందే. ఒకేసారి 8 ఏళ్ల నుంచి 5ఏళ్లకు తగ్గించడం వల్ల పాలసీదారులకు ఎంతో వెసులుబాటు లభించినట్టయింది. దరఖాస్తులో ఆరోగ్య సమాచారం పూర్తిగా వెల్లడించలేదనో, తప్పుడు సమాచారం ఇచ్చారనే పేరుతో బీమా సంస్థలు కొన్ని సందర్భాల్లో క్లెయిమ్‌లకు చెల్లింపులు చేయకుండా నిరాకరిస్తుంటాయి. ఉదాహరణకు మధుమేహం, ఆస్తమా తదితర

ఐదేళ్లు పూర్తయితే చాలు..

వ్యాధులు ముందు నుంచి ఉన్నా కానీ వెల్లడించలేదంటూ క్లెయిమ్‌లు తిరస్కరించిన కేసులు ఎన్నో ఉన్నాయి. కానీ, పాలసీదారు మోసపూరితంగా సమాచారం వెల్లడించిన సందర్భాల్లోనే ఐదేళ్లు ముగిసిన తర్వాత కూడా క్లెయిమ్ తిరస్కరించడానికి ఇక మీదట కూడా బీమా సంస్థలకు అధికారం ఉంటుంది. ఈ ఐదేళ్లు అన్నది సదరు వ్యక్తి ఆ పాలసీ మొదటి సంవత్సరం నుంచి వర్తిస్తుంది. ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి పోర్టబులిటీ ద్వారా మారినప్పటికీ, అంతకుముందు సంస్థల్లోని కాలం కూడా కలుస్తుంది. అలాగే, ఈ మారటోరియం అన్నది మొదట తీసుకున్న బీమా కవరేజీకే ఐదేళ్లు వర్తిస్తుంది. ఇది ఎలా అంటే ఉదాహరణకు ఆరంభంలో రూ.5 లక్షలకు తీసుకున్నారని అనుకుందాం. ఐదేళ్ల తర్వాత రూ.10 లక్షలకు పెంచుకున్నారని అనుకుందాం. అప్పుడు ఐదేళ్లు ముగిసిన మొదటి రూ.5 లక్షల కవరేజీకి మారటోరియం తొలగిపోతుంది. పెంచుకున్న కవరేజీ అప్పటి నుంచి ఐదేళ్లు ముగిసిన తర్వాతే మారటోరియం పరిధిలోకి వస్తుంది. ''ఇది పాలసీదారుల అనుకూల నిర్ణయం. ఎనిమిదేళ్ల మారటోరియం అన్నది చాలా సుదీర్ఘమైనది. పాలసీ తీసుకునే ముందే ఏవైనా వ్యాధులు ఉంటే అవి బయట పడేందుకు ఐదేళ్లు సరిపోతుంది. ఏదైనా మోసం ఉంటే దాన్ని నిరూపించాల్సిన బాధ్యత బీమా సంస్థపైనే ఉంటుంది''అని ఇన్సూరెన్స్ సమాధాన్ సంస్థ సీఈవో శిల్పా అరోరా పేర్కొన్నారు.

ప్రీమియం భారం

వృద్ధులకూ ఆరోగ్య బీమా కవరేజీని విస్తతం చేయడమే ఐఆర్‌డీఏఐ తాజా చర్య వెనుక ఉద్దేశ్యం. దీంతో బీమా సంస్థలు ఇప్పుడు ఏ వయసు వారికైనా బీమా పాలసీలను ఆఫర్ చేయాల్సి ఉంటుంది. మార్కెట్లో పోటీ ఎలానూ ఉంటుంది. కనుక ఇక మీదట వృద్ధుల కోసం బీమా సంస్థలు మరిన్ని నూతన ఉత్పత్తులను తీసుకురానున్నాయి. అదే సమయంలో వీటి ప్రీమియం 10–15 శాతం వరకు పెరగొచ్చని నిపుణులు భావిస్తున్నారు. అంతే కాదు, ఇతర పాలసీదారులపైనా ప్రీమియం భారం పడనుంది. వెయిటింగ్ పీరియడ్ తగ్గించడం వల్ల బీమా సంస్థలకు క్లెయిమ్‌లు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా అన్ని పాలసీల ప్రీమియంను బీమా సంస్థలు సవరించొచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం సామాన్య, మధ్యతరగతి వాసులకు భరించలేని స్థాయికి చేరగా, ఇప్పుడు మరో విడత పెంపుతో ఈ భారం మరింత అధికం కానుంది.

65 ఏళ్ల పరిమితి లేదిక

2016 నాటి ఆరోగ్య బీమా మార్గదర్శకాల ప్రకారం బీమా సంస్థలు 65 ఏళ్లలోపు వారికి తప్పనిసరిగా హెల్త్ కవరేజ్ ఆఫర్ చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక కారణాలు ఉంటే తప్పించి ఈ వయసులోపు వారికి కవరేజీని తిరస్కరించరాదన్నది నిబంధనల్లోని ఉద్దేశ్యం. 65 ఏళ్లు దాటిన వారికి హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఇవ్వడం, ఇవ్వకపోడం బీమా కంపెనీల అభీష్టంపైనే ఆధారపడి ఉండేది. అంతేకానీ, 65 ఏళ్లు నిండిన వారికి సైతం ఆరోగ్య బీమా కవరేజీ ఇవ్వాలని బీమా సంస్థలపై ఇప్పటి వరకు ఎలాంటి ఒత్తిడి లేదు. తాజా నిబంధనల్లో 65 ఏళ్లను ఐఆర్‌డీఏఐ ప్రస్తావించలేదు. అంటే వృద్ధుల విషయంలో బీమా కంపెనీలకు మరింత స్వేచ్ఛనిచ్చినట్టు పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. వివిధ వయసుల వారి అవసరాలకు తగ్గట్టు ప్రత్యేకమైన ఫీచర్లతో పాలసీలను బీమా సంస్థలు తీసుకురావచ్చంటున్నారు. 65 ఏళ్లకు మించిన వారికి సైతం హెల్త్ ఇన్సూరెన్స్ ఇచ్చేందుకు ఐఆర్‌డీఏఐ అనుమతించిందన్న వార్తలు వాస్తవం కాదు. నిబంధనల్లో 65 ఏళ్ల పరిమితిని తొలగించింది అంతే. ఈ ఏడాది మార్చి వరకు అమల్లో ఉన్న మార్గదర్శకాల ప్రకారం కూడా 65 ఏళ్లు దాటిన వారికి ఆరోగ్య బీమా ఆఫర్ చేయడంపై ఎలాంటి నిషేధం లేదు. అందుకే 65 ఏళ్లు దాటిన వారికి సైతం కొన్ని బీమా సంస్థలు ప్రత్యేక ఆరోగ్య బీమా పాలసీలను ఇప్పటికే మార్కెట్లో విక్రయిస్తున్నాయి. ''ఇప్పటి వరకు ఉన్న 65 ఏళ్ల పరిమితిని ఆసరాగా తీసుకుని.. అంతకుమించిన వయసు వారికి ఆరోగ్య బీమా కవరేజీ ప్రతిపాదనలను కొన్ని బీమా సంస్థలు నిరాకరించేవి. ఇప్పుడు దీన్ని తొలగించడం వల్ల ఇక మీదట అలా చేయడం కుదరదు. వివిధ వయసుల వారికి అనుగుణమైన బీమా ఉత్పత్తులను రూపొందించి, ప్రీమియం నిర్ణయించాల్సిందే''అని రాయల్ సుందరం జనరల్ ఇన్సూరెన్స్ హెల్త్ ఇన్సూరెన్స్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ నిఖిల్ ఆప్టే పేర్కొన్నారు. సాధారణంగా వృద్ధులకు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం ఇతరులతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉంటుంది. ఆ వయసులో అనారోగ్యాల ముప్పు ఎక్కువగా ఉండడం ఇందుకు కారణం.

క్లుప్తంగా...

ప్రశాంతంగా ముగిసిన ఏపీ ఆర్‌సెట్

- 86 శాతం హాజరు.. ఈ నెల 15న ఫలితాలు
- జూన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం
- కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాద రాజు వెల్లడి



సాక్షి, అమరావతి/తిరుపతి సిటీ: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశానికి చేపట్టిన ఏపీ ఆర్‌సెట్ 2024–25 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాద రాజు వెల్లడించారు. ఆదివారం వర్సిటీలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ నుంచి ఈ పరీక్షలు హైదరాబాద్, రాష్ట్రంలోని 16 కేంద్రాల్లో నిర్వహించినట్లు చెప్పారు. పరీక్షలకు 10,050 మంది దరఖాస్తు చేసుకోగా 8,651 మంది హాజరయ్యారన్నారు. దీంతో 86.5 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. ఫలితాలు ఈ నెల 15వ తేదీ విడుదల చేస్తామన్నారు. జూన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామని వివరించారు.

ఏయూఈఈటీ పరీక్షకు 90.87 శాతం హాజరు

రేపు ఫలితాల విడుదల



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కోర్సుల్లో సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ప్రవేశాలకు నిర్వహించిన ఏయూ ఈఈటీ 2024 ప్రవేశ పరీక్షకు 90.87 శాతం హాజరు నమోదైందని ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు 4,349 మంది దరఖాస్తు చేయగా, 3,952 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడపలోని ఎనిమిది ప్రాంతీయ కేంద్రాల పరిధిలో పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఫలితాలు ఈ నెల 7వ తేదీన విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. విశాఖలోని పలు పరీక్ష కేంద్రాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పరిశీలించారని తెలిపారు.

నీట్ యూజీ–2024 ప్రశాంతం

కఠినంగా ఫిజిక్స్, సులువుగా కెమిస్ట్రీ, బయాలజీ ప్రశ్నలు

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య విద్య యూజీ కోర్సుల్లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా ఆదివారం జరిగిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్–యూజీ) ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 557 నగరాలు, దేశం వెలుపల 14 నగరాల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఈ పరీక్ష నిర్వహించింది. పెన్ అండ్ పేపర్ మోడ్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5:20 గంటల వరకు పరీక్ష కొనసాగింది. దేశవ్యాప్తంగా 24 లక్షల మందికిపైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఏపీ నుంచి 70 వేలమంది ఈ పరీక్ష రాసినట్టు అంచనాలున్నాయి.

ఈసారి ర్యాంక్‌లపై ఫిజిక్స్ ప్రభావం

ఈ ఏడాది ప్రశ్నపత్రం మధ్యస్తం నుంచి కఠినంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. ఫిజిక్స్ విభాగంలో కఠినంగా, కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో



విశాఖలోని కేంద్రీయ విద్యాలయంలో నీట్ పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు


ప్రశ్నలు సులువుగా ఉన్నట్లు శ్రీ చైతన్య నీట్ కోచింగ్ నిపుణులు కె. రవీంద్ర కుమార్ వెల్లడించారు. అయితే ఈసారి ర్యాంకులపై ఫిజిక్స్ ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. బోటనీలో ఓ ప్రశ్న వివాదాస్పదంగా ఉన్నట్టు పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి కెమిస్ట్రీ విభాగంలో ప్రశ్నలు సులువుగా ఉన్నాయన్నారు. ఎన్సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుంచి నేరుగా, వాటి ఆధారంగా ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని రవీంద్రకుమార్ తెలిపారు. మొత్తంగా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రశ్నపత్రం కొంచెం కష్టంగా ఉందని వివరించారు. ఫిజిక్స్‌లో రెండు ప్రశ్నలకు సమాధానాలు గందరగోళంగా ఉన్నాయనీ, ఏ ఆప్షన్ కరెక్ట్ అనేదానిపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఇక బయాలజీలో 6 బొమ్మలు, మూడు డైరెక్షన్ ఆధారిత ప్రశ్నలు, 30 మ్యాచ్‌ది ఫాలోయింగ్, 17 స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలు ఉన్నాయి. 30శాతం ప్రశ్నలు మ్యాచ్ ది ఫాలోయింగ్ రూపంలో ఉన్నందున కొంతమంది విద్యార్థులు పేపర్ లెంగ్తీగా ఉందని గుర్తించారు.

కటాఫ్‌లు మారే అవకాశం...

గతేడాది కటాఫ్‌లు జనరల్/ఈడబ్ల్యూఎస్ 137, ఓబీసీ/ఎస్సీ, ఎస్టీ 107, అన్‌రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్, పీహెచ్‌డీ అభ్యర్థులకు 121, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌డీ 107 కటాఫ్‌లు ఉండగా, ఈ ఏడాది కొంత అటుఇటుగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

గుండె ఘోష విన్నారు

▶ మొదటి పేజీ తరువాయి



పెద్ద జబ్బులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. కార్డియాలజీ, కార్డియో వాస్క్యులర్ సేవలను మరింతగా విస్తృతం చేసి, ప్రజలకు చేరువ చేస్తూ ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ (ఈసీసీ) కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా గుండెపోటు బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించి బాధితుల ప్రాణాలను కాపాడింది. నగరాలకు దూరంగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు గుండెపోటు బారినపడితే తొలి 40 నిమిషాల్లోనే ఈ కార్యక్రమం ద్వారా ప్రాథమిక వైద్య సేవలు లభించేలా చర్యలు తీసుకున్నారు. హబ్ అండ్ స్పోక్ విధానంలో ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నారు.

సామాన్యులకూ అందుబాటులోకి హార్ట్‌కేర్ సర్వీసులు..

తిరుపతి రుయా ఆస్పత్రిలో 2022 జనవరి నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఈ ఈసీసీ నడుస్తోంది. గతేడాది సెప్టెంబర్‌లో గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం జీజీహెచ్‌లను హబ్‌లుగా తీర్చిదిద్ది కార్యక్రమాన్ని విస్తరించారు. నాలుగు చోట్ల కార్డియాలజిస్ట్ వైద్యులతోపాటు, క్యాథ్‌ల్యాబ్ సౌకర్యం ఉంది. హబ్‌లకు ఆయా జిల్లాల పరిధిలోని 69 స్పోక్స్ (సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఆస్పత్రులు)ను అనుసంధానం చేసి హార్ట్‌కేర్ సర్వీసులను సామాన్యులు, గ్రామీణులకు అందుబాటులోకి తెచ్చారు. అనంతరం అన్ని జీజీహెచ్‌లను హబ్‌లుగా, సెకండరీ హెల్త్ ఆస్పత్రులను స్పోక్స్‌గా తీర్చిదిద్ది రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చారు. స్పోక్స్‌గా వ్యవహరించే ఆస్పత్రుల్లో ఛాతి నొప్పి, ఇతర గుండెపోటు లక్షణాలతో వచ్చిన వ్యక్తులకు వెంటనే ఈసీజీ తీస్తున్నారు. ఆ ఫలితాన్ని హబ్‌లో ఉన్న కార్డియాలజిస్ట్‌కు పంపుతున్నారు. కార్డియాలజిస్ట్‌లు సంబంధిత కేసు గుండెపోటుదా కాదా అని నిర్ధారించి గుండె రక్తనాళం ఎంత శాతం పూడుకుపోయిందో పరిశీలించి థ్రాంబోలైసిస్ థెరపీని సూచిస్తున్నారు. ఇలా సూచించిన కేసుల్లో రూ.40 వేల విలువ చేసే థ్రాంబోలైసిస్ ఇంజక్షన్‌ను బాధితులకు ఉచితంగా ఇస్తున్నారు. గతేడాది సెప్టెంబరు 29 నుంచి ఇప్పటివరకూ 3 వేల మందికి పైగా ఛాతినొప్పితో స్పోక్స్‌కు రాగా వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో గుండె రక్తనాళం 100 శాతం పూడిపోవడంతో వచ్చే ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియాల్ ఇన్‌ఫార్క్షన్ (స్టెమీ) సమస్యతో బాధపడుతున్న 489 మందికి వెంటనే థ్రాంబోలైసిస్ నిర్వహించారు. వీరిలో 424 మంది క్షేమంగా ఉన్నారు. సకాలంలో వైద్యసాయం అందకపోయినట్లయితే వీరందరూ కూడా మృత్యువాత పడేవారని వైద్యులు చెబుతున్నారు.

2019 నుంచి ఆరోగ్యశ్రీ కింద గుండె సంబంధిత చికిత్సల వివరాలు.. (నిధులు రూ.కోట్లలో)

సంవత్సరం	వ్యాధిగ్రస్తులు	ప్రొసీజర్లు	నిధులు
2019–2020	23,797	24,027	79.69
2020–2021	24,243	24,599	77.06
2021–2022	36,724	37,645	116.10
2022–2023	66,333	86,398	303.91
2023–2024	71,474	1,09,519	393.41
మొత్తం :	2,22,571	2,82,188	970.17
కార్డియాక్, కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగంలో..			
2019–2020	35,903	50,144	305.89
2020–2021	25,779	37,614	217.37
2021–2022	35,815	53,504	298.94
2022–2023	34,159	48,975	300.63
2023–2024	13,078	14,878	136.22
మొత్తం :	1,44,734	2,05,115	1,259.05

భవిష్యత్‌లోనూ మరింత రక్షణ..

మరోవైపు.. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా బీపీ, షుగర్, ఇతర ఎన్‌సీడీ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షించారు. గుండె జబ్బులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఐదేళ్లలో 3.67 లక్షల గుండె పోటు బాధితులకు ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు చేశారు. ఇందుకు రూ.2,300 కోట్లకు పైగా వెచ్చించారు. మరింత సమర్థవంతంగా గుండెపోటు మరణాలను నియంత్రించడానికి ఈసీసీని అమలులోకి తెచ్చారు. ఇక వచ్చే ప్రభుత్వంలో గుండె సంబంధిత వైద్యసేవల కోసం విశాఖ, కర్నూలు, గుంటూరుల్లో హబ్‌లు ఏర్పాటుచేస్తామని వైఎస్సార్‌సీపీ 2024 మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది.

ఏ 'ఉద్యోగి' ఓటు హక్కును తిరస్కరించరాదు

జిల్లా ఎన్నికల అధికారులకు, ఆర్వోలకు ఆదేశాలు జారీ చేసిన సీఈవో మీనా



సాక్షి,అమరావతి/విజయనగరం అర్బన్: ఎన్నికల విధుల్లో ఉన్న ఏ ఉద్యోగి ఓటు హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించవద్దని, స్పాట్ లోనే ఫారం–12 ను స్వీకరించి అర్హులైన ఉద్యోగులందరికీ ఓటు హక్కును కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులు, ఆర్వోలను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్న కొందరు ఓటర్లు ఫారం–12ను సకాలంలో సమర్పించలేకపోవడంతో తమ ఓటును వినియోగించుకోలేకపోతున్నారనే అంశం తమ దృష్టికి వచ్చిందని, ఎన్నికల విధుల్లో ఉన్న ఏ ఉద్యోగి ఓటు హక్కును తిరస్కరించరాదని పునరుద్ఘాటించారు. అనివార్య పరిస్థితుల్లో ఎన్నికల విధుల్లో ఉన్న ఓటరు 1 మే 2024 లోపు ఫారం–12ను సమర్పించలేకపోతే, ఏ ఆర్వో పరిధిలో ఆ ఉద్యోగి ఓటరుగా నమోదు అయ్యారో, ఆ ఆర్వో కు ఫారం–12 సమర్పించేందుకు, ఆ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అనుమతించాలని ఆదేశించారు. ఈ నెల 7, 8 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆ ఫెసిలిటీషియన్ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. పోస్టల్ ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారు, ఓటు కోసం దరఖాస్తు చేసుకోని వారు సైతం తమ ఎన్నికల డ్యూటీ ఆర్డర్, గుర్తింపు కార్డును ఫెసిలిటేషన్ సెంటర్‌కు తీసుకువెళ్లి, ఓటు పొందవచ్చన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల్లో ఏమైనా తేడా వస్తే అందుకు ఆర్వోలు బాధ్యత వహించాల్సి ఉంటుందని, అటువంటి అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

ఎన్నికల నిబంధనలు పాటించకుండా ప్రసారాలు చేసే సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా వేసినట్లు, ఆ పోస్టులపై ఫిర్యాదు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నామని మీనా తెలిపారు. జేఎన్‌టీయూ విజయనగరం గురజాడ విశ్వవిద్యాలయంలో ఆదివారం ఆయన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు.

రిజర్వేషన్లపై జగన్ స్పష్టత అభినందనీయం

ముస్లిం సంఘాల హర్షం

సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వరప్రసాదిని 'ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్'ను కాపాడుతామంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టత ఇవ్వడంపై ముస్లిం సమాజం హర్షం వ్యక్తం చేస్తున్నది. ఈ మేరకు పలు ముస్లిం సంఘాల రాష్ట్ర నేతలు ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

జగన్ భరోసా హర్షణీయం



ముస్లిం రిజర్వేషన్లను కొనసాగిస్తానని సీఎం వైఎస్ జగన్ హామీ ఇవ్వడం హర్షణీయం. రిజర్వేషన్లపై బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి చేస్తున్న కుతంత్రాలు పట్ల ముస్లిం సమాజం తీవ్ర ఆందోళనలో ఉంది వైఎస్సార్ కల్పించిన రిజర్వేషన్ల వల్లే ముస్లింలు విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందారు. ఎన్డీఏ కూటమిలో చేరి ముస్లిం సమాజానికి ద్రోహం చేస్తున్న చంద్రబాబుకు ముస్లింలు ఓటుతో బుద్ధి చెబుతారు.

– షేక్ నాగుల్ మీరా, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు

మైనార్టీలకు జగన్ పెద్ద అండ



ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ పెద్ద అండదండ అనే విషయం మరోసారి రుజువైంది. ముస్లిం రిజర్వేషన్లు ఉండి తీరాల్సిందేనని జగన్ చెప్పారు. రిజర్వేషన్లతోపాటు సీఏఏ, ఎన్ఆర్సీ, యూసీసీల విషయంలోనూ ముస్లిం సమాజం ప్రయోజనాలను కాపాడతామని సీఎం వైఎస్ జగన్ చాలా స్పష్టంగా చెప్పారు. ఈ విషయంలో చంద్రబాబు వైఖరి చెప్పే దమ్ముందా? కుట్రలు, కుతంత్రాలు చేస్తున్న కూటమికి గుణపాఠం చెప్పాలి.

–షేక్ మునీర్ అహ్మద్, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింల కు 4శాతం రిజర్వేషన్ ఉండి తీరాల్సిందేనని గట్టి భరోసా ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. సీఎం వైఎస్ జగన్ చెప్పినట్టు చంద్రబాబు, పవన్, పురందేశ్వరికి చెప్పే దమ్ము ధైర్యం ఉందా?. మోదీకి భయపడి చంద్రబాబు, పవన్ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్‌ను మేనిఫెస్టోలో పెట్టలేదు. ముస్లిం సమాజం అంతా సీఎం వైఎస్ జగన్ వెంటే నడుస్తుంది.

– షేక్ దస్తగిరి, దూదేకుల పొలిటికల్ జేఏసీ చైర్మన్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి 2024
సోమవారం
మే 6


జైత్రయాత్ర





గుసగుస

బాబును నమ్మలేక



కంచం, చెంబూ బయటపారేసి.. రాయీ, రప్పా లోపల వేసుకుంటామా? అంటున్నారట రాష్ట్రంలోని ఉద్యోగులు. చంద్రబాబును ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యోగులు నమ్మరన్న విషయం పోస్టల్ బ్యాలెట్లలో తేటతెల్లమవుతోందట. గత 3 రోజులుగా జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్ తీరు పై టీడీపీ వర్గాలు విశ్లేషించాయి. వారికి షాకిచ్చే అంశాలు బయటపడ్డాయి. మేనిఫె స్టో తర్వాత ఉద్యోగుల్లో భయం పెరిగిందట. ప్రస్తుత ప్రభుత్వం అవినీతికి తావులేకుండా డీబీటీ ద్వారా లబ్ధిదారులకు సంక్షే మ పథ కాలు అందిస్తోంది. ఇప్పుడు బాబు హామీలు అమలవ్వాలంటే ఆ పార్టీ నేతల దోపిడీతో ఏటా రూ.2 లక్షల కోట్లు వెచ్చించాలి. అదే జరిగితే తమ జీతాలూ కష్టమేనన్న నిర్ణయా నికి ఉద్యో గులు వచ్చారట. ఈ ప్రభావం పోస్టల్ బ్యాలెట్లలో తెలుస్తుండటంతో టీడీపీ నేతల్లో ఓటమి భయం రెట్టింపయింది.

వదిలేశారుగా..




అక్కర ఉన్నంత వరకు ఆదినారాయణ.. అక్కర తీరేక గూద నారాయణ అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయట పిఠాపురంలో జనసేన శ్రేణులు. వంచనకు మారు పేరైన చంద్రబాబుతో కలిశాక పవన్‌కల్యాణ్‌కూ ఆ లక్షణాలు బాగానే వంటబట్టినట్లున్నాయని టీడీపీ నేత వర్మ అనుచరులు వాపోతున్నారు. పిఠాపురంలో పవన్ సోదరుడు, సోదరుని కొడుకు, మేనల్లుడు తదితర కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. నాగబాబు ప్రచారంలో నామ్‌కేవాస్తేగా వర్మ కాసేపు పాల్గొన్నారు. మిగిలిన వారి ప్రచారంలో ఆయనకు సంబంధమే లేకుండా పోయిందట. కావాలనే జనసేన శ్రేణులు వర్మను పక్కన పెడుతున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. సీటు దక్కలేదన్న బాధను దిగమింగుకుని మరీ.. ప్రచారం చేస్తున్న వర్మకా ఈ దుర్గతి అంటూ.. తెగ ఫీలైపోతున్నారట.

ఏంటిది గంటా?



గంటకో పార్టీలో ఉండే గంటా శ్రీనివాసరావు గురించి అందరికీ తెలిసిందే. ఇప్పుడు మాటల్లోనూ తేడా చూపుతున్నా రు. విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు టీచర్ల నియామకాల కోసం నాలుగుసార్లు డీఎస్సీలు నిర్వహించినట్లు తాజాగా సెలవిచ్చా రు. దీనిపై నిరుద్యోగులు సామాజిక మాధ్యమాల్లో ఏకిపారేస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ప్రకటిస్తామన్న నోటిఫికేషన్‌ను వివిధ కారణాలతో వాయిదా వేస్తూ 2018కి లాక్కొచ్చారు. 2018 అక్టోబర్లో నోటిఫికేషన్ ఇచ్చారు. నియామకాలు మాత్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే జరిగాయి. ఇంతోటి దానికి ఇన్ని అబద్ధాలు చెప్తే ఎలా గంటా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

మేనిఫెస్టో మోసగాడు



అధికారం కోసం కిచిడీ మేనిఫెస్టోలతో బాబు వంచన

- అందలం ఎక్కగానే మేనిఫెస్టోలను తుంగలో తొక్కి ప్రజలకు వెన్నుపోటు
- 1994లో ఎన్టీఆర్ ఇచ్చిన హామీలకు చంద్రబాబు తిలోదకాలు
- సంపూర్ణ మద్య నిషేధం ఎత్తివేత, రూ.2 కేజీ బియ్యం రూ.5.50కు పెంపు
- 1999లో కోటి మందికి ఉపాధి, 35 లక్షల ఇళ్ల నిర్మాణం హామీ
- అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేసిన బాబు
- 2004లో బాబు హామీలను నమ్మని ఓటర్లు.. వైఎస్ రాజశేఖర రెడ్డికి పట్టం
- వైఎస్సార్ ఉచిత విద్యుత్‌ను ఎగతాళి చేస్తూ.. తీగలపై బట్టలారేసుకోవాలని బాబు ఎద్దేవా
- 2004లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన వైఎస్సార్..
- 2009 ఎన్నికల్లో బాబు బూటకపు మాటల్ని విశ్వసించని ప్రజలు.. వైఎస్సార్‌కు నీరాజనం
- 2014లో వ్యవసాయ, డ్వాక్రా రుణాల మాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి వంటి హామీలు
- 600 హామీలతో అందలం ఎక్కి.. వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టో మాయం చేసిన చంద్రబాబు
- ఇప్పుడు అమలు సాధ్యంకాని హామీలతో మోసగించేందుకు మళ్లీ సిద్ధం

మరిన్ని వీడియోల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

సాక్షి, అమరావతి: చంద్రబాబుకు అధికారమే పరమావధి.. అందుకోసం వందల హామీలిచ్చి అందలమెక్కుతాడు..

తనను నమ్మి ఓటేసిన ప్రజలను నిలువునా వంచిస్తాడు. హామీలన్నీ చెత్తబుట్టలో పడేస్తాడు.

హామీలిస్తే అమలు చేయాలా? అని సమాధానమిస్తాడు. మోసానికి నిలువెత్తు రూపం చంద్రబాబు..

మాయమాటలతో ఎన్నికల ముందు తిమ్మిని బమ్మి చేసి కిచిడీ మేనిఫెస్టోతో ప్రజల నమ్మకంతో ఆడుకుంటాడు.

'చంద్రబాబుకు ఒక శాపముంది.. 'నిజం చెబితే తల వెయ్యి ముక్కలవుతుంది' అని ఆనాడు అసెంబ్లీలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అన్న మాటలు ఎప్పటికీ అక్షరసత్యం.. అందుకే చంద్రబాబు మేనిఫెస్టో

-మిగతా III లో

1999



2014



2019



2024



"వ్యవసాయం వల్ల ఉపయోగం లేదు.. వ్యవసాయం చేయడం ఇక దండగ.. భూమిని నమ్ముకోకుండా లాభదాయకమైన వ్యాపారాలు చేసుకోవడం ఉత్తమం.. ఉచితంగా విద్యుత్ ఇస్తే.. ఆ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందే.. రైతులకు ఎంత చేసినా కావాలంటారు.. వాళ్లకు ఇంకేం పనిలేదు."

– అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు అన్నమాటలివి.

అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. లేనప్పుడు మరోలా మాట్లాడే ఊసరవెల్లి నారా చంద్రబాబు నాయుడు. అధికారమే పరమావధిగా అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పించడం.. అధికారం రాగానే వాటిని బుట్టదాఖలు చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. 2014లో ఆయన ఇచ్చిన హామీలే ఇందుకు నిదర్శనం. 'బ్యాంకులో తనఖా పెట్టిన మీ భార్య పుస్తెలతాడు ఇంటికి రావాలంటే బాబు రావాలి. మీ రుణాలన్నీ బేషరతుగా మాఫీ కావాలంటే బాబు రావాలి' అంటూ 2014 ఎన్నికల ముందు ఊరూ..వాడా ప్రచారం ఊదరగొట్టారు. తీరా గద్దెనెక్కాక నిండా ముంచిన వైనం ఇప్పటికీ అన్నదాతలు, డ్వాక్రా మహిళల కళ్లెదుట కదలాడుతోంది.

పక్కాగా కేటుగాడే!


నమ్మించి ముంచడంలో మాస్టర్ డిగ్రీ

- రుణ ఉపశమన పత్రాల పేరిట చంద్రబాబు మోసం
- 2014 ఎన్నికలప్పుడు రుణాలు మాఫీ చేస్తానని హామీ
- తీరా గద్దెనెక్కాక కమిటీ పేరుతో కాల యాపన
- రైతులు ప్రశ్నించడంతో బాండ్ల జారీ
- అవి చెల్లుబాటు కాక నష్టపోయిన 67.42 లక్షల మంది
- మళ్లీ ఇప్పుడు మాయ మాటలతో కొత్త మేనిఫెస్టో

-III లో

ఇవిగో పెట్టుబడులు

పాలకుడి సమర్థత రాష్ట్రంలో వెలుస్తున్న పరిశ్రమలను అడిగితే చెబుతాయి. పారిశ్రామిక వేత్తల చొరవ ప్రభుత్వం అందించే సహకారంపై ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు.. అమలు చేస్తున్న ప్రోత్సాహకాలు రాష్ట్రంలో ఎన్నో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. విశాఖ జీఐఎస్ సదస్సులో రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమల స్థాపనకు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా అనకాపల్లి వద్ద రూ.1.10 లక్షల కోట్లతో హైడ్రోజన్ పార్క్, రామాయపట్నం వద్ద రూ.43,000 కోట్లతో సోలార్ మాడ్యుల్స్ తయారీ యూనిట్, సిమెంట్ దిగ్గజ సంస్థలు అల్ట్రాటెక్, ఇండియా సిమెంట్స్ రాంకో, ఏసీసీ, శ్రీ సిమెంట్స్, ఆదిత్య బిర్లా గ్రూపు గ్రాసిం, బిర్లా కార్బన్, బిర్లా గార్మెంట్స్, హిందాల్కో అల్యూమినియం యూనిట్లు ఇప్పుడు కార్యరూపం దాలుస్తున్నాయి. భవిష్యత్‌లో మరిన్ని పెట్టుబడులకు అంబానీ, అదానీ, టాటా, బిర్లా, మిట్టల్, జిందాల్, బంగర్, భజాంకా, ఒబరాయ్, దాల్మియా, సింఘ్వీ వంటి వారు ఉవ్విళ్లూరుతున్నారు.



-మిగతా VI లో

5 ఏళ్లలో రాష్ట్రంలో రూ.1,000 కోట్లు పైబడిన పెట్టుబడులతో ప్రారంభమైన పరిశ్రమలు

కంపెనీ పేరు	పెట్టుబడి విలువ రూ.కోట్లల్లో	ఉపాధి
ఎన్‌టీపీసీ హైడ్రోపార్క్	1,10,000	61,000
రిలయన్స్ క్రంప్రెస్డ్ బయో గ్యాస్	1920	70,000 (రైతులకు లబ్ధి)
బిర్లా కార్బన్ ఇండియా	2000	1350
కోరమాండల్	1,000	1200
సెంచురీ ప్యానల్స్	2,600	2226
జేఎస్‌డబ్ల్యూ	5,000	200
అల్ట్రాటెక్ సిమెంట్స్	2,500	2,000
ఉత్కర్ష అల్యూమినియం	4,500	1,800
ఏసీసీ సిమెంట్స్	5,400	800
ఇండోసోల్ సోలార్ మాడ్యూల్స్	43,000	6,000
ఏటీసీ టైర్స్	1,136	1,723
పయనీర్ అల్యూమినియం	6,700	2,694
గ్రాసిం ఇండస్ట్రీస్ (కాస్టిక్ సోడా)	2,700	2450
రాంకో సిమెంట్స్	1,300	1000
ఏపీ పవర్ డెవలప్‌మెంట్ కార్ప్	7942	450
ఫాక్స్ లింక్	1,050	2000
హ్యుందాయ్ డైమోస్	1,027	812
కియా (విస్తరణ)	8,717	5,478
ప్యానల్ ఆప్టో డిస్‌ప్లే	1732	3174
డైకిన్ ఎయిర్ కండీషనింగ్	1,000	1500
శారదా మెటల్స్	1000	500
శ్రీ సిమెంట్స్	2500	500
లైఫిస్ ఫార్మా	1950	2000
డెక్కన్ ఫైన్ కెమికల్స్(విస్తరణ)	1,100	1050
ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ (విస్తరణ)	1,113	2350
ఐఎన్‌జెడ్ఐ ఆటో	1363	2744
జయ్‌రాజ్ ఇస్పాత్	2938	1060
శ్రేయాస్ ఇండస్ట్రీస్	1750	2000
ఏజీపీ సిటీ గ్యాస్	10,000	8,000
ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్	4,300	1500
జేఎస్‌డబ్ల్యూ	8,800	800
మాండలీజ్ (విస్తరణ)	1600	150
పట్టాభి ఆగ్రో ఫుడ్స్	1,153	2500
హిందాల్కో ఇండస్ట్రీస్	1620	165



ఆయనో మాజీ ముఖ్యమంత్రి. రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో సీఎం పదవిని వెలగబెట్టినా.. ఆయన ప్రజలకు చేసింది శూన్యం. పీలేరు నియోజకవర్గాన్ని పీల్చిపిప్పిచేశారు. పదవి అండ చూసుకుని సోదరుడితో కలిసి చెలరేగిపోయారు. భారీగా నిధులు స్వాహా చేశారు. భూములను కబళించారు. అక్రమార్జనతో బెంగళూరు, హైదరాబాద్‌లలో ఆస్తులు కూడబెట్టుకున్నారు. ఉపాధి హామీ పథకం నిధులను రూ.వందల కోట్లలో స్వాహా చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అండగా నిలిచారు. ఆయన బాటలోనే అనుచరులూ చెరువులు, కుంటల మరమ్మతుల్లో నిధులు స్వాహా చేశారు.

అవినీతి 'కిరణం'

పదవే దోపిడీకి ఆయుధం

- సీఎం కుర్చీ ముసుగులో రూ.వేల కోట్ల అక్రమార్జన
- భూ కబ్జాలు.. బినామీ పేర్లతో కాంట్రాక్టులు
- ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అండ..
- ఉపాధి హామీ పథకం నిధులూ కాజేత
- పక్క రాష్ట్రాల్లో భారీగా ఆస్తుల కొనుగోలు
- ఇప్పుడు కమలం గుర్తుపై అన్నమయ్య జన్మస్థలంలో పోటీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాల పునర్విభజనలో అన్నమయ్య జిల్లాలో చేరిన పీలేరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఆ మాజీ ముఖ్యమంత్రి హ్యాట్రిక్ విజయాలు అందించిన ప్రజల బాగోగులను వదిలేసి సొంత ఆస్తులు పెంచుకున్నారు. సోదరుడితో కలిసి భూ కబ్జాలకు తెగబడ్డారు. 2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత నియోజకవర్గానికి రాని ఆయనకు కరోనా సమయంలోనూ ప్రజల కష్టాలు పట్టలేదు. ఇప్పుడు అన్నమయ్య పుట్టిన ప్రాంతంలో బరిలో నిలిచారు. ఆయన హయాంలో ఉపాధి హామీ పనుల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని అవినీతి పీలేరు నియోజకవర్గంలోనే జరిగిందంటే అతిశయోక్తి కాదు. 2014లో స్వయంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడే ఆయనను ఆంధ్రా వీరప్పన్‌గా పోల్చడం గమనార్హం.

- ఆయన అధికారాన్ని అడ్డుపెట్టుకుని సోదరుడితో కలిసి రూ.వేలాది కోట్ల విలువచేసే ఆస్తుల్ని కూడబెట్టారు. హైదరాబాద్, బెంగళూరు వంటి పట్టణాల్లో విలాసవంతమైన విల్లాలు, భవనాలతో పాటు ఇళ్ల స్థలాలు, భూములు సంపాదించుకున్నారు. బెంగళూరులో అత్యంత ఖరీదైన ఓ ప్రాంతంలో వందల కోట్ల విలువచేసే భూములు కొన్నారు. ఇటీవల ఆయన హైదరాబాద్‌కు సమీపంలోని ఓ మండల కేంద్రంలో రూ.వందల కోట్ల విలువ చేసే ఒకటిన్నర ఎకరం పొలాన్ని విక్రయించారు.
- 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో మాజీ సీఎం సోదరులు రూ.వందల కోట్ల రూపాయలు స్వాహా చేశారు. పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ,

-మిగతా III లో




సామాజిక న్యాయానికే మళ్లీ జై
పెత్తందార్ల ఆగడాలకు బైబై

బాహుబలుల బరి!

మామాజీ, దిగ్గీ రాజా, సింధియాల గురి | మధ్యప్రదేశ్‌లో 9 చోట్ల 7న పోలింగ్ | అన్నీ కమలనాథుల సిట్టింగ్ స్థానాలే | ఈసారి కొన్నింట కాంగ్రెస్ గట్టి పోటీ

వారిద్దరూ మాజీ సీఎంలు. ఒకరు రాష్ట్రంలో, మరొకరు కేంద్రంలోనూ చక్రం తిప్పిన ఉద్దండులు. సుదీర్ఘకాలం తర్వాత లోక్‌సభ బరిలో దిగారు. వీరికి తోడు కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా. ఇలా పలువురు కీలకమైన నేతల పోటీకి మధ్యప్రదేశ్‌లో మూడో విడత ఎన్నికలు వేదికగా మారాయి. రాష్ట్రంలోని 9 లోక్‌సభ స్థానాలకు 7న పోలింగ్ జరగనుంది. 2019 ఎన్నికల్లో వీటన్నింటిలోనూ కమలమే విరబూసింది. ఈసారి పలు స్థానాల్లో కాంగ్రెస్ గట్టి పోటీయే ఇస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని కీలక స్థానాలపై ఫోకస్...

– సాక్షి, నేషనల్ డెస్క్


సింధియా, చౌహాన్, దిగ్విజయ్, అలోక్‌సింగ్, సంధ్యా రాయ్, సికర్‌వార్

విదిశ

మధ్యప్రదేశ్‌కు సుదీర్ఘకాలం సీఎంగా ఉన్న బీజేపీ దిగ్గజం శివరాజ్‌సింగ్ చౌహాన్ లోక్‌సభ బాట పట్టారు. విదిశ ఓటర్లకు ఆయన కొత్తేమీ కాదు. 1996, 1998, 1999, 2004 ఎన్నికల్లో ఇక్కడి నుంచి వరుసగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. మొత్తమ్మీద ఇక్కడి నుంచి ఐదుసార్లు గెలిచారు. నియోజకవర్గ ప్రజలు చౌహాన్‌ను ఆప్యాయంగా మామాజీ అని పిలుచుకుంటారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్ భాను శర్మతో పోలిస్తే ఆయనకే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 1991లో వాజ్‌పేయినీ లోక్‌సభకు పంపిన చరిత్ర విదిశకు ఉంది. 2009, 2014 ఎన్నికల్లో బీజేపీ దిగ్గజం సుష్మా స్వరాజ్ కూడా ఇక్కడి నుంచి గెలిచారు.

రాజ్‌గఢ్

మాజీ సీఎం, కాంగ్రెస్ కీలక నేత దిగ్విజయ్ సింగ్ పోటీలో ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక్కడి ప్రజలు గత రెండు ఎన్నికలుగా బీజేపీనే గెలిపిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లోనూ బీజేపీ నుంచి రోడ్మల్ నాగర్ ఇక్కడ బంపర్ మెజారిటీతో విజయం సాధించారు. 2014లో 2.28 లక్షల మెజారిటీ సాధించగా 2019లో 4.31 లక్షలకు పెంచుకున్నారు. ఈసారీ బీజేపీ నుంచి ఆయనే బరిలో ఉన్నారు. అభిమానులు దిగ్గీ రాజా అని పిలుచుకునే దిగ్విజయ్ ఏకంగా 30 ఏళ్ల తర్వాత ఇక్కడ పోటీకి దిగుతుండటం విశేషం. ఆయన సోదరుడు లక్ష్మణ్ సింగ్ ఇక్కడ ఐదుసార్లు గెలిచారు లక్ష్మణ్ సింగ్ 2004లో బీజేపీ టికెట్‌పైనా గెలవడం విశేషం!

వీటికి ఎన్నిక

మొరేనా, భిండ్, గ్వాలియర్, గుణ, సాగర్, విదిశ, భోపాల్, రాజ్‌గఢ్, బేతూల్ (ఇక్కడ రెండో విడతలోనే పోలింగ్ జరగాల్సింది. బీఎస్పీ అభ్యర్థి మృతితో మూడో విడతకు వాయిదా వేశారు)

భోపాల్

వివాదాస్పద బీజేపీ నాయకురాలు సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌కు ఇక్కడి సిట్టింగ్ ఎంపీ. 2019లో మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్‌ను ఆమె ఏకంగా 3.64 లక్షల ఓట్ల ఆధిక్యంతో మట్టి కరిపించి సంచలనం సృష్టించారు. అయినా వివాదాస్పదురాలిగా పేరుపడ్డ సాధ్వికి బీజేపీ ఈసారి టికెటివ్వకపోవడం విశేషం! భోపాల్ 1989 నుంచీ బీజేపీ కంచుకోటగా కొనసాగుతోంది. 1999లో మధ్యప్రదేశ్ మాజీ సీఎం ఉమా భారతి ఇక్కడ గెలిచారు. 2004, 2009ల్లో కైలాష్ చంద్రజోషి విజయం సొంతం చేసుకున్నారు. ఇలా అభ్యర్థులు మారుతున్నా బీజేపీనే ఓటర్లు దీవిస్తున్నారు. ఈసారి ఆ పార్టీ నుంచి అలోక్ శర్మ, కాంగ్రెస్ నుంచి అరుణ్ శ్రీవాస్తవ్ బరిలో ఉన్నారు.

మొరేనా

ఇక్కడ 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రామ్‌నివాస్ రావత్‌ను బీజేపీ అభ్యర్థి నరేంద్రసింగ్ తోమర్ 1.13 లక్షల ఓట్ల వ్యత్యాసంతో ఓడించారు. తోమర్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గడంతో ఈ స్థానం ఖాళీగా ఉంది. బీజేపీ నుంచి శివమంగళ్ సింగ్ తోమర్, కాంగ్రెస్ నుంచి సత్యపాల్ సింగ్ సికర్‌వార్ పోటీ చేస్తున్నారు. 1996 నుంచి ఇక్కడ బీజేపీదే విజయం. 1996, 1998, 1999, 2004ల్లో అశోక్ అర్గల్, 2009లో నరేంద్రసింగ్ తోమర్ గెలిచారు. ఇది సురక్షిత స్థానమనే ధీమాతో ఇప్పటిదాకా పెద్ద ఎన్నికలను ఎదుర్కోని శివమంగళ్‌ను బీజేపీ పోటీకి పెట్టింది. ఇక్కడ అభ్యర్థిని మార్చడం ఆ పార్టీకి ఇది వరుసగా మూడోసారి! కాంగ్రెస్ అభ్యర్థి సికర్‌వార్ మాజీ బీజేపీ నేతే. మొరేనాలో బ్రాహ్మణ, రాజ్‌పుత్ ఓట్లు రెండేసి లక్షల చొప్పున ఉన్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ సీట్లకు కాంగ్రెస్ ఏకంగా ఐదింట్లో గెలవడంతో ఈసారి ఫలితంపై ఆసక్తి పెరిగింది.

గుణ

ఇది సింధియాల కోట. మూడో విడతలో దేశవ్యాప్తంగా బాగా ఆసక్తి నెలకొన్న స్థానాల్లో ఒకటి. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా 2002 నుంచి 2019 దాకా ఈ స్థానానికి కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. మారిన రాజకీయ పరిణామాల్లో ఇప్పుడు బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. ఆయనతో కాంగ్రెస్ నేత రావు యాదవేంద్రసింగ్ యాదవ్ పోటీ పడుతున్నారు. 2019లో ఇక్కడ బీజేపీ నేత కృష్ణపాల్ సింగ్ యాదవ్ చేతిలో జ్యోతిరాదిత్య ఓటమి చవిచూశారు! 1957లో ఇక్కడ జ్యోతిరాదిత్య నానమ్మ విజయరాజే సింధియా గెలిచారు. 1971లో ఆమె కుమారుడు, జ్యోతిరాదిత్య తండ్రి దివంగత మాధవ్‌రావు సింధియా భారతీయ జన్‌సంఘ్ తరఫున ఇక్కడ నెగ్గారు.

భిండ్

చంబల్ ప్రాంతంలో ఉన్న ఈ స్థానంలో ఆది నుంచి బీజేపీదే ఆధిపత్యం. 2008లో ఎస్టీలకు రిజర్వ్ అయిన తర్వాత కూడా వరుసగా మూడు ఎన్నికల్లోనూ ఆ పార్టీయే గెలిచింది. కాంగ్రెస్ నుంచి ఫూల్‌సింగ్ బారియా, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ సంధ్యా రాయ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ 1971లో విజయరాజె సింధియా కాంగ్రెస్ నుంచి నెగ్గారు. భిండ్‌లో కూడా బ్రాహ్మణ, క్షత్రియ ఓట్లు కలిపి ఆరు లక్షలకు పైనే ఉన్నాయి.

విస్తృత ప్రచారం

మధ్యప్రదేశ్‌లో మూడో విడత స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. రెండు పార్టీల అగ్ర నేతలు కూడా ఇప్పటికే సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, సోదరి ప్రియాంక పలు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. తన తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం బలిదానం చేశారంటూ మొరేనాలో ప్రియాంక భావోద్వేగపూరితంగా మాట్లాడారు. బీజేపీ నుంచి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు నడ్డా మొరేనా, బేతూల్, రాజ్‌గఢ్‌ల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. కులం, నిరుద్యోగం, పేదరికం, వలసలు మూడో విడత స్థానాల్లో బాగా ప్రభావం చూపే అంశాలు.

ఎన్నికల రంగోలి!

ఎన్నికల్లో ఓటింగ్ పెంచేందుకు ఎన్నికల సంఘం ఎన్నో వినూత్నమైన చర్యలు చేపడుతోంది. అహ్మదాబాద్ ఎన్నికల అధికారులు కొంచెం భిన్నంగా ఆలోచించారు. 'మీ విలువైన ఓటుతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి' అన్న పిలుపు కంటే ఓటు ప్రాధాన్యతను కళాత్మకంగా చెబితే మనసులో బాగా నాటుకుంటుందని భావించారు. స్థానిక అల్ఫా వన్ మాల్ ఆవరణలో ఏకంగా 12 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవుతో ఓటుపై అవగాహన కల్పించే రంగోళీ రూపొందించారు. ఇందుకు 350 కిలోల రంగులు వినియోగించారు. 18 గంటల సమయం పట్టిందట. ప్రజలను ఓటు దిశగా ప్రోత్సహించి, అహ్మదాబాద్‌ను అత్యధిక ఓటింగ్ నమోదైన ప్రాంతంగా చేయడమే తమ ఉద్దేశమని నోడల్ ఆఫీసర్ యోగేశ్ పరేఖ్ అంటున్నారు. మాల్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఈ ఆర్ట్ తెగ ఆకర్షిస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్



శాంభవీ చౌదరి.. యంగెస్ట్ క్యాండిడేట్!

బిహార్‌లోని సమస్తిపూర్ నుంచి ఎల్‌జేపీ అభ్యర్థిగా లోక్‌సభ బరిలో



శాంభవీ చౌదరి. ఈ లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్నవారిలో అత్యంత చిన్నవయస్కురాలు. 25 ఏళ్ల శాంభవి బిహార్ మంత్రి అశోక్ చౌదరి కుమార్తె. లేడీ శ్రీరామ్ కాలేజీలో డిగ్రీ, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ చేశారు. బిహార్‌లోని మగధ్ వర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అభ్యర్థిగా సమస్తిపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

రాజకీయ కుటుంబంలో పుట్టిపెరగడంతో శాంభవికి సహజంగానే రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. తొలుత చదువుకే ప్రాధాన్యమిచ్చారు. బిహార్‌లో దేవాలయాల్లో దళిత పూజారులను నియమించిన మాజీ ఐపీఎస్ అధికారి ఆచార్య కిషోర్ కునాల్ కుమారుడు సాయన్ కునాల్‌ను పెళ్లాడారు. అత్తగారి ఊరైన సమస్తిపూర్ నుంచి లోక్‌సభ బరిలో ఉన్నారు. పైగా తండ్రి పార్టీ అయిన జేడీ(యూ)ను కాదని చిరాగ్ పార్టీలో చేరడం విశేషం! అది తన సొంత రాజకీయ నిర్ణయం అంటారామె. బిహార్‌కు, బిహారీలకు తొలి ప్రాధాన్యమిచ్చే చిరాగ్ విజన్ నచ్చి ఎల్‌జేపీలో చేరానంటారు. ''చిరాగ్ భయ్యా విజన్‌కు ఆకర్షితురాలినయ్యాను. ఎందుకంటే నేను ఢిల్లీ వర్సిటీలో చదివేటప్పుడు 'మీరు బిహారీలా కనిపించడం లేదని ప్రొఫెసర్లు అనేవారు. బిహారీలా కనిపించకపోవడం, దళితురాలిగా కనిపించకపోవడం ఏమిటా అని ఎప్పుడూ ఆలోచించేదాన్ని. అది నాపై తీవ్ర ప్రభావం చూపింది'' అంటారు శాంభవి. ''సమస్తిపూర్‌లో విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన నా తొలి ప్రాథమ్యాలు. వచ్చే ఐదేళ్లలో రాబోయే తరాల కోసం సరికొత్త సమస్తిపూర్‌ను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా'' అని వివరించారు. కాంగ్రెస్‌తో స్థానికంగా యాదవ, ముస్లిం, ఓబీసీ ఓటు బ్యాంకు అధికంగా ఉన్నా తన ఎస్సీ నేపథ్యం, భర్త ఓబీసీ నేపథ్యం కలిసొస్తాయని ధీమాతో ఉన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

తొలి రెండు దశల్లోనూ...

తగ్గిన మహిళా ఓటింగ్

పురుషులతో పోలిస్తే పలు రాష్ట్రాల్లో భారీ అంతరం

మహిళలు ఆకాశంలో సగం. అవకాశాల్లో అంతకంటే ఎక్కువే. అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానం. ఓటర్లపరంగా చూస్తే పలు రాష్ట్రాల్లో పురుషుల కంటే ఎక్కువే. అందుకే పార్టీలన్నీ తమ మేనిఫెస్టోల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నాయి. చాలా రాష్ట్రాల్లో మహిళల కోసం ప్రత్యేక పథకాలు పుట్టుకొస్తున్నాయి. కర్నాటకలో, తాజాగా తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల జయాపజయాల్ని నిర్దేశించింది ఈ మహిళా పథకాలే! అయితే ఎందుకో గానీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మహిళల్లో 'ఓటు ఉత్సాహం' లోపిస్తోంది. ఇప్పటిదాకా జరిగిన రెండు విడతల పోలింగ్‌లో మహిళల ఓటింగ్ శాతం తగ్గినట్టు కేంద్ర ఎన్నికల సంఘం తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది మంచి పరిణామం కాదంటున్నారు విశ్లేషకులు...

– సాక్షి, నేషనల్ డెస్క్

లోక్‌సభ ఎన్నికల తొలి రెండు దశల్లో రాష్ట్రాలవారీగా పోలింగ్ శాతం

రాష్ట్రం/యూటీ	మహిళల ఓటింగ్	పురుషుల ఓటింగ్
లక్షద్వీప్	85.5	82.9
త్రిపుర	80.6	81.3
సిక్కిం	79.8	79.9
అసోం	79.6	79
పుదుచ్చేరి	79.1	78.6
పశ్చిమబెంగాల్	80.3	78.3
మణిపూర్	79	77.9
అరుణాచల్‌ప్రదేశ్	80.6	76.3
మేఘాలయ	79.7	75.4
ఛత్తీస్‌గఢ్	73.5	75
కర్నాటక	71.1	71.5
కేరళ	71.7	70.6
తమిళనాడు	70.2	69.8
జమ్మూకశ్మీర్	71	69.6
మహారాష్ట్ర	60.7	65.9
మధ్యప్రదేశ్	61.3	65.3
అండమాన్	63.8	64.4
రాజస్థాన్	60.5	62.2
ఉత్తరప్రదేశ్	56.7	56.9
మిజోరం	55.7	58.1
నాగాలాండ్	57.9	57.5
ఉత్తరాఖండ్	58	54.5
బిహార్	56	53.2



లోక్‌సభ ఎన్నికల తొలి రెండు విడతల పోలింగ్‌ను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో మహిళల ఓటింగ్ శాతంలో తగ్గుదల నమోదైంది. 2019తో పోల్చి చూసినప్పుడు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి దాకా రెండు విడతల్లో ఓటు వేసిన మహిళల శాతం 0.8 శాతం మేర తగ్గింది. 2019లో తొలి రెండు విడతలతో పోలిస్తే ఈసారి మొత్తమ్మీద (స్త్రీ, పురుషులు) 3.3 శాతం దాకా తక్కువ ఓటింగ్ నమోదైంది. ఈ ఏడాది తొలి విడతలో దశలో 66.14 శాతం, రెండో విడతలో 66.71 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో మొదటి దశలో 69.4 శాతం, రెండో దశలో 69.6 శాతం ఓటింగ్ నమోదైంది.

ఇక్కడ దయనీయం

గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే నాగాలాండ్ లోక్‌సభ స్థానంలో ఈసారి రికార్డు స్థాయిలో మహిళల ఓటింగ్ ఏకంగా 24.79 శాతం తగ్గిపోయింది! మొత్తమ్మీద కూడా అక్కడ చాలా తక్కువ ఓటింగ్ నమోదైంది. మహిళల ఓటింగ్ సిద్ధీ లోక్‌సభ స్థానంలో 13 శాతం, మథురలో 13 శాతం, రేవా, పథనంతిట్టల్లో 12 శాతం, ముజఫర్‌నగర్, ఖజురహోల్లో 11 శాతం తగ్గింది. కొట్టాయం, ఇడుక్కి, రాంపూర్, సత్నా, భాగ్‌పత్‌ల్లో 10 శాతం, వయనాడ్‌లో 7 శాతం, బెంగళూరు రూరల్‌లో 7 శాతం, ఔరంగాబాద్‌లో 5 శాతం, ఝుంఝునూలో 9 శాతం, షిల్లాంగ్‌లో 8 శాతం చొప్పున మహిళల ఓటింగ్ తగ్గింది. మొత్తం మీద చూస్తే 14 లోక్‌సభ స్థానాల్లో 10 నుంచి 20 శాతం మధ్య, 59 చోట్ల 5–10 శాతం, 80 చోట్ల 0–5 శాతం ఓటింగ్ తగ్గిపోయింది. ఛత్తీస్‌గఢ్, కర్నాటక, త్రిపుర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, అండమాన్ నికోబార్, రాజస్థాన్, మిజోరం, యూపీల్లో మహిళల ఓటింగ్ బాగా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

ఇక్కడ నయం

రెండు దశల్లో ఎన్నికలకు వెళ్లిన నియోజకవర్గాల్లో 34 చోట్ల మాత్రం మహిళల ఓటింగ్ 0–5 శాతం మధ్య పెరిగింది. ఒక స్థానంలో ఇది మరింత ఎక్కువగా నమోదైంది. లక్షద్వీప్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర స్థానాల్లో 80 శాతం మహిళలు ఉత్సాహంగా ఓటు వేయడం ప్రోత్సాహనీయం. బీహార్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్, తమిళనాడు, కేరళ, మేఘాలయ, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లోనూ, పుదుచ్చేరిలోనూ పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ప్రస్తుత ఎన్నికల వరకే చూస్తే మొత్తం మీద స్త్రీ పురుషుల ఓటింగ్ మధ్య పెద్ద వ్యత్యాసం కనిపించడం లేదు. తొలి విడతలో మహిళల ఓటింగ్ 66.1 శాతం, పురుషుల ఓటింగ్ 66.2 శాతం నమోదైంది. రెండో విడతలో 66.4, 67 శాతంగా ఉంది. రాష్ట్రాలవారీగా చూస్తే మాత్రం తేడా బాగానే ఉంది.

మంచి పరిణామం కాదు

మహిళలు మరింతగా ముందుకొచ్చి ఓటు వేస్తేనే నేతలకు, పార్టీలకు, ప్రభుత్వాలకు స్పష్టమైన సందేశం సాధ్యమని విశ్లేషకులు అంటున్నారు. మిగతా ఐదు విడతల పోలింగ్‌లోనూ మహిళల అనాసక్తి ఇలాగే కొనసాగితే అది ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. మహిళా ఓటర్ల మనసు గెలిచేందుకు పార్టీలు మరింత కృషి చేయాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయన్న అభిప్రాయమూ ఉంది.

సంయుక్త... మంత్రిగారి అమ్మాయి

పుస్తకాల పురుగు



పరిచయం

సంయుక్తా పాటిల్. మంచి ఫుడీ. అంతకు మించి పుస్తకాల పురుగు. మంచి పుస్తకం దొరికిందంటే దాన్ని పూర్తి చేసేవరకు నిద్ర పోరు. బసవేశ్వరుని భక్తురాలు. కర్నాటక వ్యవసాయ మంత్రి శివానంద్ పాటిల్ కూతురైన సంయుక్త బీజాపూర్ గ్రామీణ మహిళల సాధికారత కోసం కృషి చేస్తున్నారు. జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌గా వారి ఆర్థిక స్వావలంబన కోసం పాటుపడుతున్నారు. బాగల్‌కోట్ నుంచి తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల బరిలో దిగారు. నాలుగు సార్లు ఎంపీగా గెలిచిన బీజేపీ సీనియర్ నేత పీసీ గద్దిగౌడర్‌తో కాంగ్రెస్ తరఫున తలపడుతున్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

క్షేత్రస్థాయిలో..

30 ఏళ్ల సంయుక్త క్రైస్ట్ యూనివర్సిటీ లా స్కూల్లో న్యాయ శాస్త్రం చదివారు. తండ్రి రాజకీయాలను చూస్తూ ఎదిగారు. విద్యార్థిగా ఎన్ఎస్‌యూఐలో పని చేశారు. యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా అత్యధిక ఓట్లతో గెలిచారు. మహిళా కాంగ్రెస్ నాయకురాలిగా ప్రజల మనసులను గెలుచుకున్నారు. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజలతో మమేకమై ఉండాలన్న పాఠాన్ని తండ్రి నుంచి నేర్చుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సంక్షేమానికి పని చేయాలన్న తండ్రి సూచన మేరకు 2017లో స్పర్శ్ ఫౌండేషన్ ప్రారంభించారు. ఇది గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం పనిచేస్తుంది. పాలసీలు సమాజంలోని అట్టడుగు వ్యక్తులకు చేరినప్పుడే అవి విజయం సాధించినట్లని సంయుక్త నమ్ముతారు. సాయంకాలాల్లో గ్రామాల్లోని ప్రజలను కలవడానికే ఇష్టపడతారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బసవనబాగేవాడి నియోజకవర్గంలో తండ్రి ప్రచారమంతా తానై నిర్వహించారు. అయితే ఎన్నికల ప్లానింగ్ ఒకెత్తు. నేరుగా పోటీ చేయడం మరో ఎత్తు. విద్యార్థి, యువజన సంఘాల ఎన్నికల అనుభవం తనకిప్పుడు ఉపయోగపడుతుందంటారామె. కొత్త పరిశ్రమలు, పర్యాటకాభివృద్ధి, బాగల్‌కోట్-కుడచి పెండింగ్ రైల్వే లైన్ పరిపూర్తి, నియోజకవర్గ సమగ్రాభివృద్ధి ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారు. వ్యవసాయాధారిత బాగల్‌కోట్ ప్రాంతం రెండు కరువులను ఎదుర్కొంది. ''అందుకే నీటి పారుదలపై దృష్టి పెడతా. ప్రజల గొంతుకగా మారతా'' అంటున్నారు.

బీజేపీకి గట్టి సమాధానం..

వారసత్వ రాజకీయాలపై బీజేపీ విమర్శలను సంయుక్త తేలిగ్గా తీసిపారేస్తారు. ''తల్లిదండ్రుల నేపథ్యం వల్ల రాజకీయాల్లోకి ఎంట్రీ సులభం అవుతుంది. కానీ చివరికి ప్రజలే నిర్ణేతలు. వాళ్లు అంగీకరించకపోతే ఎంతటి నేతల పిల్లలయినా రాజకీయాల్లో రాణించలేరు'' అన్నది ఆమె వాదన. ''దేశంలోని 65 శాతం మంది ఓటర్లు 40 ఏళ్ల లోపువారే. 50 శాతం 25 ఏళ్ల లోపువారే. కానీ 40 ఏళ్ల లోపున్న పార్లమెంటేరియన్లు మాత్రం కేవలం 12 శాతం. యువత ప్రజాప్రతినిధుల సంఖ్య బాగా పెరగాలి'' అంటారు సంయుక్త. ఆమె విజయపుర అసెంబ్లీ నియోజకవర్గవాసి. కనుక బాగల్‌కోట్‌కు బయటి వ్యక్తి అంటూ బీజేపీ విమర్శిస్తోంది. తాను బయటి వ్యక్తినెలా అవుతానని ప్రశ్నిస్తారామె. ''నేను అవిభక్త బీజాపూర్‌లో పుట్టా. ప్రతి ర్యాలీలోనూ నాకు ఘన స్వాగతం లభిస్తోంది. ఏ ఇంటికి వెళ్లినా నా ఇంటికి వెళ్లినట్టే ఉంటుంది'' అంటూ కొట్టిపారేస్తారు. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యంపైనా గళం విప్పుతున్నారు సంయుక్త. రాజకీయాల్లో ఎక్కువ మంది మహిళలుంటే విధాన రూపకల్పనలో మహిళా దృక్పథం వస్తుందన్నది ఆమె వాదన.

ఎనిమిదేళ్లుగా రంజాన్ ఉపవాసాలు...

సంయుక్త 12వ శతాబ్దపు మత, సంఘ సంస్కర్త బసవేశ్వరుని భక్తురాలు. అయితే ఎనిమిదేళ్లుగా రంజాన్ మాసమంతా విధిగా ఉపవాసం (రోజా) పాటిస్తున్నారు. మతమేదైనా విశ్వాసం మంచిదైనప్పుడు ఆచరించడంలో తప్పేముందని ప్రశ్నిస్తారు. ''పెద్దయ్యాక ఏమవుతావని నా చిన్నతనంలో ఎవరడిగినా ప్రధాని అవుతాననేదాన్ని. ఇప్పుడు ఎంపీ అయ్యే అవకాశం వచ్చింది. ఏమో, భవిష్యత్‌లో ప్రధాని కూడా అవుతానేమో!'' అని ఆశాభావం వ్యక్తం చేస్తారు సంయుక్త.



ఇవిగో
నవరత్నాల వెలుగులు

సొంతింటి కల జగన్ ద్వారా సాకారమైంది



మాది పెద్ద కుటుంబం. విజయవాడ రూరల్ మండలం, ఎనికేపాడు గ్రామంలో నివాసం ఉంటున్నాం. మా ఆయన క్రీస్తుమూర్తి గ్రామంలోని ఓ కంపెనీలో కూలి పనులు చేస్తుంటాడు. మొన్నటి వరకూ ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో కలసి 40 ఏళ్లుగా కలసి ఉండేవాళ్లం. పిల్లలకు వివాహాలు కావడంతో ప్రస్తుతం నేను మా ఆయన మాత్రమే ఉంటున్నాం. ఇప్పటి వరకూ మాకంటూ సొంతిల్లు లేదు. గత ప్రభుత్వంలో ఎన్నో సార్లు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం దక్కలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆవిర్భవించాక సంక్షేమ పథకాలు మమ్మల్ని ఆదుకున్నాయి. సీఎం వైఎస్ జగన్ చలువతో మాకు ఇంటి స్థలం మంజూరైంది. ప్రభుత్వ సహకారంతో 90 శాతం ఇంటి పనులు కూడా పూర్తయ్యాయి. నా భర్త వయస్సు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి అద్దె కట్టుకోవడం భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఆయనకు వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. పైగా నాకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 వంతున, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ 50 వేల వరకు లబ్ధి చేకూరింది. సొంతింటి కలను సాకారం చేసిన జగన్‌కు జన్మంతా రుణపడి ఉంటాం. – గోళ్ల హేమలత, ఎనికేపాడు

కూలి పని మానేసి వెల్డింగ్ షాపు పెట్టుకున్నా



ఓ షాపులో కూలిగా పనిచేసే నేను ఇప్పుడు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం తేతలిలో సొంతంగా షాపు పెట్టుకునే స్థాయికి ఎదిగాను. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల పుణ్యమే. ఏడో తరగతి వరకు చదువుకున్న నేను 2019 వరకు ఒక వెల్డింగ్ షాపులో రోజువారీ కూలీగా పనిచేశా. నాకు భార్య, ముగ్గురు పిల్లలు. డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్న నా భార్య నాగ వెంకట జ్యోతికి రూ.70 వేల రుణం మంజూరైంది. ఆ సొమ్ముతోపాటు మరికొంత జమ చేసి తేతలి గ్రామంలో గీతిక వెల్డింగ్ షాపు ఏర్పాటు చేసి సొంతంగా పనులు చేయడం ప్రారంభించా. అమ్మ ఒడి పథకం ద్వారా అందిన సొమ్ముతోపాటు వైఎస్సార్ ఆసరా ద్వారా వచ్చిన రూ.36 వేలు, సున్నా వడ్డీ ద్వారా వచ్చిన రూ.5,028 షాపు నడపడానికి ఉపయోగపడ్డాయి. జగనన్న కాలనీలో ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం వచ్చింది. దీనికి కారణమైన జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. – గారపాటి నాగరాజు, తేతలి

మేనిఫెస్టో మోసగాడు

▶ మొదటి పేజీ తరువాయి

అబద్ధాల పుట్ట.. అబద్ధాలు తప్ప నిజం మాట్లాడడు. అలాంటి వ్యక్తికి ఓటుతో బుద్ధి చెప్పాల్సిందే. ఇప్పుడా సమయం ఆసన్నమైంది. చంద్రబాబు పాలనలో మహిళలు, వృద్ధుల కష్టాలు, రైతుల కన్నీళ్లను గుర్తు చేసుకోవాలి. బాబొస్తే జాబన్నాడు. ఇంటికో ఉద్యోగమన్నాడు. కొడుక్కి మంత్రి పదవి కట్టబెట్టి నిరుద్యోగులకు మాత్రం కుచ్చుటోపీ పెట్టాడు. ఇప్పుడు మళ్లీ 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అంటూ కొత్త పల్లవి అందుకున్నాడు. మన భవిష్యత్‌ను గుర్తు చేసుకుని.. మన కోసం ఒక మంచి బాట వేసిన జననేతను మళ్లీ గెలిపించుకోవాలి. ఒక్క ఓటుతో చంద్రబాబు అబద్ధాల ప్రపంచాన్ని తుత్తునియలు చేయాలి.

హామీలతో వంచించే నేతను విశ్వసిస్తే భవిత నాశనమే..

ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి ప్యాకేజీకి అమ్ముడుపోయి.. ఇప్పుడు ఆ పార్టీతోనే చెట్టాపట్టాలు వేసుకుని తిరిగే నేతకు మేనిఫెస్టో కేవలం ఒక కాగితం మాత్రమే.. జగన్ దృష్టిలో మేనిఫెస్టో అంటే ప్రజలకు ఇచ్చే మాట.. ఐదేళ్ల పాలనను చాటి చెప్పే పవిత్ర వాగ్దానం. ఏరు దాటే వరకూ ఓడ మల్లన్న ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్లుగా చంద్రబాబు తాను గెలిచిన ప్రతీసారి ప్రజలను మోసగిస్తూనే ఉన్నారు. 2014లో పదవి కోసం చంద్రబాబు 600కు పైగా హామీలు గుప్పించారు. అందులో ఒక్కటీ అమలు కాలేదు. అధికారంలోకి వచ్చాక ఆయన రూటే వేరు. హామీల మాటే మరిచిపోతారు. జనంలోకెళ్తే ఎక్కడ తన్ని తరిమేస్తారోనని మేనిఫెస్టోను తన వెబ్‌సైట్ నుంచి మాయం చేస్తారు. ఎన్నికలప్పుడు అబద్ధాలకు రెక్కలు తొడుగుతూ సాధ్యంకాని హామీలతో మేనిఫెస్టోను విడుదల చేయడం.. అధికారంలోకి వచ్చాక దాన్ని తుంగలో తొక్కడంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు వెన్నుపోటుతో పెట్టిన విద్య. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇంత వరకూ.. ఎప్పుడూ మేనిఫెస్టోను అమలుచేసిన



చరిత్ర చంద్రబాబుకు లేదు. ఇప్పుడు మరోసారి.. సూపర్ సిక్స్‌తో కలిపి ఇతర హామీలు ఇస్తూ మేనిఫెస్టోను విడుదల చేసిన చంద్రబాబు మరోసారి ప్రజలను మోసగించేందుకు సిద్ధమయ్యారు.

ఎన్టీఆర్ హామీలకు బాబు వెన్నుపోటు

ఉమ్మడి రాష్ట్రంలో 1994 ఎన్నికల్లో టీడీపీ గెలవడంతో అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్‌కు బాబు వెన్నుపోటు పొడిచి.. అధికారంతోపాటు టీడీపీని కబ్జా చేశారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడానికి దోహదం చేసిన సంపూర్ణ మద్య నిషేధం, రూ.2 కే కిలో బియ్యం హామీలను చంద్రబాబు తుంగలో తొక్కారు. మద్య నిషేధాన్ని ఎత్తేయడంతో పాటు రూ.2కే కిలో బియ్యాన్ని రూ.5.50కు పెంచి ప్రజలకు వెన్నుపోటు పొడిచారు.

ఉచిత విద్యుత్‌పై పరిహాసం

అలిపిరి ఘటన నుంచి సానుభూతి పొందడం ద్వారా అధికారంలోకి రావాలన్న ఎత్తుగడతో 2004లో ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. వ్యవసాయానికి ఏడు గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని.. వ్యవసాయ విద్యుత్ బకాయిలను రద్దు చేస్తామని మహానేత వైఎస్సార్ హామీ ఇస్తే అపహాస్యం చేశారు. సేద్యానికి ఉచితంగా విద్యుత్ ఇస్తే.. తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందేనని చంద్రబాబు పరిహాసమాడారు. చంద్రబాబు మోసాన్ని గుర్తించిన జనం అతని పాలనకు చరమగీతం పాడారు.

2009లో తారాస్థాయికి బాబు అబద్ధాలు

2009 ఎన్నికల్లో రాష్ట్ర విభజనకు ఆమోదం తెలుపుతూ టీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎంలతో చంద్రబాబు మహాకూటమిగా బరిలోకి దిగారు.

ఆ ఎన్నికల్లో హామీలు

1. అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి నెలకు రూ.2 వేల నగదు బదిలీ
2. 50 లక్షల ఉద్యోగాలు
3. వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్
4. 25 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం..

అలా పదుల కొద్దీ హామీలతో ప్రచారంలో ఊదరగొట్టినా అతని నైజం తెలిసి ప్రజలు చిత్తుగా ఓడించారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని పార్టీని జనం గెలిపించారు. వ్యవసాయానికి ఏడు గంటలకు బదులు 9 గంటలు ఉచితంగా విద్యుత్ ఇస్తామని, రేషన్ బియ్యం ఒక్కొక్కరికి 4 కేజీలు కాకుండా 6 కేజీలకు పెంచి ఇస్తామని రెండే హామీలు ఇచ్చిన మహానేత వైఎస్ విశ్వసనీయతకు జనం పట్టం కట్టారు.

1999లో అరచేతిలో స్వర్గం

1999 ఎన్నికల సమయంలో చంద్రబాబు తన విశ్వరూపం చూపించాడు. ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించారు.

1. కోటి మందికి ఉపాధి
2. 35 లక్షల ఇళ్ల నిర్మాణం
3. దారిద్ర్య నిర్మూలనకు ప్రత్యేక విభాగం ఏర్పాటు
4. పట్టణాల్లో మహిళలకు వంట గ్యాస్ కనెక్షన్లు
5. 25 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీటి సౌకర్యం ఇలా పదుల సంఖ్యలో హామీలిచ్చారు.

అటల్ బిహారీ వాజ్‌పేయిపై సానుభూతి కలిసొచ్చి ఆ ఎన్నికల్లో చంద్రబాబు గట్టెక్కారు. ఆ ఎన్నికల్లో ఇచ్చిన ప్రధానమైన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. హామీల అమలును మీడియా ప్రతినిధులు ప్రశ్నిస్తే.. కేంద్రం సహకరించలేదని బుకాయించారు.

ప్రత్యేక హోదా అంటూ 2019లో మోసం

2018లో బీజేపీతో విడిపోయి 2019 ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగారు. కమీషన్ల కోసం పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకోవడం కోసం ప్రత్యేక హోదాను 2016లో కేంద్రానికి తాకట్టు పెట్టిన చంద్రబాబు.. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రత్యేక హోదా సాధిస్తానని హామీ ఇచ్చారు. వ్యవసాయానికి 12 గంటల ఉచిత విద్యుత్ పగటిపూటే సరఫరా చేస్తామని.. 2 కోట్ల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పిస్తామని.. అన్నదాత సుఖీభవలో రైతులకు ఏటా రూ.15 వేలు, మహిళలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతానని హామీలు ఇచ్చారు. చంద్రబాబు మోసానికి భయపడిన జనం ఆ ఎన్నికల్లో టీడీపీని చిత్తుచిత్తుగా ఓడించారు.

కర్ణాటక, తెలంగాణలో విఫలమైన హామీలతో 'సూపర్ సిక్స్'

2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన సీఎం జగన్.. నవరత్నాలు–సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లో నేరుగా రూ.2.70 లక్షల కోట్లను జమ చేశారు. సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ప్రజాక్షేత్రంలో ఒంటరిగా సీఎం జగన్‌ను ఎదుర్కోవడానికి భయపడిన చంద్రబాబు.. మళ్లీ బీజేపీ, జనసేనతో జట్టుకట్టారు. కర్ణాటక, తెలంగాణలలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమల్లో నీరుగారిపోయినా వాటికే సూపర్ సిక్స్ ముసుగేసి ఎన్నికల మేనిఫెస్టోను చంద్రబాబు విడుదల చేయడం గమనార్హం. తెలంగాణలో ఇంతవరకూ ఉచిత బస్సు హామీ తప్ప ఏదీ అమలు కాలేదు. మిగతావి అమలవుతాయో లేదో తెలియదు.

రుణమాఫీ పేరుతో టోపీ

2014 ఎన్నికల్లో బీజేపీ, పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు ఎన్నికల బరిలో నిలిచారు.

ఆ ఎన్నికల్లో ప్రధాన హామీలు

1. రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీపై తొలి సంతకం
2. రూ.14,205 కోట్ల డ్వాక్రా రుణాల మాఫీ
3. ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి
4. ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పథకంలో రూ.25 వేల డిపాజిట్
5. అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం.. పక్కా ఇళ్ల నిర్మాణం
6. ఏడాదికి రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ అమలు
7. చేనేత, పవర్ లూమ్స్ రుణాల మాఫీ
8. సింగపూర్‌ను మించి అభివృద్ధి
9. ప్రతి జిల్లా కేంద్రంలో హైటెక్ సిటీ నిర్మాణం

ఇలా 600కిపైగా హామీలు ఇచ్చారు. మోదీ ప్రభంజనంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఆ హామీల అమలును తుంగలో తొక్కారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. కేంద్రం సహకరించలేదంటూ బుకాయించి.. హామీలిస్తే అమలు చేయాలా? అని ఎదురు ప్రశ్నించారు.

అబద్ధాలు.. మోసాలపై గద్దిద్దాం
'పేదల ఇంటి'వేల్పును మళ్లీ గద్దెనెక్కిద్దాం

అవినీతి 'కిరణం'

▶ మొదటి పేజీ తరువాయి

కలకడ మండలాల్లో ఎక్కువ అవినీతి జరిగింది. వీరి అక్రమాలకు పలువురు ఉద్యోగులు బలి పశువులయ్యారు. చేయని పనులు చేసినట్లుగా చూపించడంతోపాటు బినామీ పేర్లతో పెద్ద ఎత్తున ఉపాధి హామీ నిధులు స్వాహా చేశారు. పీలేరు మండలం తలపల, రేగళ్ల పంచాయతీలో ఎక్కువ అవినీతి జరిగింది. తలపల పంచాయతీ పరిధిలో సర్వే నంబరు 1933/ఏ ఉలవల గంగమ్మ గుట్ట కుంట పేరుతో రూ. 63.644 లక్షల బిల్లులు చేసుకున్నారు. నిజానికి ఇక్కడ ఆ పేరుతో కుంట లేదు. సర్వే నంబరు 1224లో నెమళ్లవాని కుంట మరమ్మతుల పేరుతో రూ.3,97,729 నిధులు స్వాహా చేశారు. ఇక్కడ ఎలాంటి మరమ్మతులూ చేపట్టలేదు. సర్వే నం: 1178లో శుద్ధకుంట కట్ట మరమ్మతుల పేరుతో రూ. 3,72,109 బిల్లులు చేసుకొని స్వాహా చేశారు. వాస్తవానికి ఈ చెరువు కట్టమీద వడ్డిపల్లె గ్రామానికి తారురోడ్డు ఉంది. దీనిపై మట్టి పనులు చేసినట్లు బినామీ పేర్లతో బిల్లులు చేసుకున్నారు. సర్వే నం: 2359లో గోలోని కుంట మరమ్మతుల పేరిట బినామీ పేర్లతో రూ. 3,92,906 నిధులు స్వాహా చేశారు. వాస్తవంగా ఆ పనులు చేపట్టలేదు. ముంతావాండ్లపల్లె సమీపంలో సర్వేనెం : 520లో ఎగువ గుర్రెడ్డిచెరువు మరమ్మతుల పేరుతో రూ.1,10, 638 నిధులు స్వాహా చేశారు. పాతాళకుంట, కొర్రపెట్టిమిట్టకుంట, చిన్ననల్లికాయల చెరువు, బండకింద చెరువు, కరణమోరికుంట, సాకిరేవుకుంట, అలివేలుచలమ కుంట, ఇటుకుసోలపు కుంట,ఉప్పల సరవ కుంట, చిన్నయ్య బావివంక, ఉత్తారెడ్డికుంట, పుట్టావాండ్లకుంట, రెడ్డిబొమ్మయ్య కుంట, బయ్యకుంట, మంగళవానికుంట, గాండ్లవాని కుంట, కుంచెంవాండ్లకుంట, వెంకట్రాయుడుకుంట, బండ్ల కుంట చెరువుల మరమ్మతుల పేరుతో రూ.83,36,867 నిధులను స్వాహా చేశారు. రేగళ్ల పంచాయతీలోని పలుచెరువుల మరమ్మతుల పేరిట బినామీ పేర్లతో రూ.6 కోట్ల మేరకు నిధులు స్వాహా చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో కోళ్లు, ఆవులు, గొర్రెల యూనిట్ల పేరిట రూ.12 కోట్ల మేరకు బినామీ పేర్లతో స్వాహా చేశారు.

- పీలేరు పట్టణంలో విలువైన భూములు యథేచ్ఛగా కబ్జాలకు గురయ్యాయి. వారి అనుచరులు ఇష్టానుసారంగా అన్నదమ్ముల పేరుతో రూ.వందల కోట్ల విలువచేసే గుట్టలు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశారు. వీటిలో చాలా వరకు అప్పుడే విక్రయించేశారు. కొన్ని ప్రభుత్వ స్థలాల్లో అక్రమ లేఅవుట్లు వేసి ఇళ్ల స్థలాలను అమాయక ప్రజలకు విక్రయించి కోట్ల రూపాయలు దండుకున్నారు.


ఏడు కేసులు

- ముదివేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైమ్ నం. 79/2023, ఐపీసీ సెక్షన్ 120–బి, 147, 148, 153, 307, 115, 109, 323, 324, 506 రెడ్‌విత్ 149.
- ముదివేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైమ్ నం. 74/2023, ఐపీసీ సెక్షన్ 307, 341,352, 336, 506తో పాటు సెక్షన్ 25(1–బి) మారణాయుధాల చట్టం ప్రకారం కేసు నమోదు.
- పీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైమ్ నం. 72/2023. ఐపీసీ సెక్షన్ 188 ఆఫ్9 (బి) (1) బి–పేలుడు పదార్థాల చట్టం ప్రకారం మరో కేసు నమోదు.
- పీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నం. 71/2023, సెక్షన్ 188, 171– హెచ్ ఐపీసీ.
- పీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నం. 539/2021, ఐపీసీ సెక్షన్ 143, 188, 341, 269, 270 రెడ్‌విత్ 149, సెక్షన్ 3, 4 అంటువ్యాధుల నివారణ చట్టం ప్రకారం కేసు నమోదు. ● ముదివేడు పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నం. 310/2020 ఐపీసీ సెక్షన్ 151 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్.
- కలికిరి పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నం. 210/2020. ఐపీసీ సెక్షన్ 151 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్. (సిఫార్సు చేయబడింది.)

పక్కాగా కేటుగాడే!

సాక్షి, అమరావతి :

రాష్ట్రంలో 2014 ఎన్నికల నాటికి రైతులకు ఉన్న రూ.87,612 కోట్ల వ్యవసాయ, బంగారు రుణాలు బేషరతుగా మాఫీ చేస్తానంటూ నమ్మించి ఓట్లు దండుకున్న చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చాక రైతులను నిండా ముంచారు. రుణ మాఫీ సాధ్యం కాదని, ఎగ్గొట్టడంలో భాగంగా ఈ హామీ అమలు సాధ్యాసాధ్యాలపై నాబార్డు మాజీ చైర్మన్ కోటయ్య కమిషన్ వేశారు. ఆ కమిషన్ నివేదిక ప్రకారం కుటుంబానికి రూ.1.50 లక్షలకు మించి మాఫీ చేయబోమని మాట మార్చేశారు. అంతేకాకుండా అనేక షరతులు పెట్టారు. ఎకరాకు నిర్దేశించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు, సాగు కోసం తీసుకున్న బంగారు రుణాలు, మీడియం టర్మ్ రుణాలుగా మార్చిన పంట రుణాలు అయి ఉండాలంటూ మెలిక పెట్టారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున గరిష్టంగా రూ.50 వేలకే పరిమితం చేశారు. వ్యవసాయ రుణమాఫీ స్కీమ్ (ఏడీఆర్‌ఎస్) కోసం బడ్జెట్ అవసరమని 2014 ఆగస్టు 14న జీఓ 174 జారీ చేశారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు నోడల్ ఏజెన్సీగా రైతు సాధికార సంస్థను ఏర్పాటు చేశారు. రూ.50 వేల లోపు ఉన్న రుణాలను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద మాఫీ చేస్తామని ప్రకటించారు. ఒక వేళ అర్హత పొంది, అప్పటికే రుణ వాయిదాలు పూర్తిగా చెల్లించి ఉంటే, ఆ మేరకు మొత్తాన్ని వారి సేవింగ్ బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని, ఒక వేళ రుణ బకాయిలు ఉండి ఉంటే వాటికి సర్దుబాటు చేస్తామని చెప్పుకొచ్చారు. ఇలా గుర్తించిన రైతులకు రైతు సాధికార సంస్థ ద్వారా రైతు ఉపశమన అర్హత పత్రాలు పేరిట హంగామా చేశారు. చివరకు మూడు విడతల్లో కేవలం రూ.15 వేల కోట్లు మాత్రమే విదిల్చారు. 67.42 లక్షల మందికి అర్హత పత్రాలు ఉన్నప్పటికీ ఎగ్గొట్టారు. అర్హత ఉండి రుణాలు చెల్లించిన వారికి పైసా కూడా చెల్లించిన పాపాన పోలేదు. రైతు రుణ అర్హత పత్రాలు పొందిన వారు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పైసా సాయం అందలేదు. దీంతో చేసిన అప్పులపై వడ్డీలు సైతం చెల్లించలేక లక్షలాది మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు.



అన్నదాత సుఖీభవ అంటూ హంగామా

2019 ఎన్నికల ముందు ప్రజా సంకల్ప పాదయాత్రలో తాను అధికారంలోకి రాగానే ఏటా రూ.12,500 చొప్పున ప్రతి రైతు కుటుంబానికి నాలుగేళ్లపాటు రూ.50 వేలు ఇస్తానని వైఎస్ జగన్ ఇచ్చిన హామీని కాపీ కొట్టిన చంద్రబాబు ఆ ఎన్నికలకు సరిగ్గా నాలుగు నెలల ముందు అన్నదాత సుఖీభవ అంటూ రైతన్నలను బుట్టలో వేసుకునేందుకు కొత్త ఎత్తుగడ వేశారు. ఈ పథకం కింద కౌలు రైతులతో పాటు 2 హెక్టార్లలోపు చిన్న, సన్నకారు రైతులకు రూ.15 వేలు, 2 హెక్టార్లకు పైబడిన వారికి రూ.10 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామంటూ 2019 ఫిబ్రవరి 17న జీవో 28 జారీ చేశారు. ఆచరణలోకి వచ్చే సరికి పీఎం కిసాన్ సాయంతో ముడిపెట్టి తొలుత 46.76 లక్షల మందికి రూ.1,000 చొప్పున జమ చేశారు. ఎన్నికలకు నెల రోజుల ముందు వివిధ సాకులతో 3.50 లక్షల మందికి కోతపెట్టి 43.26 లక్షల మందికి రూ.3 వేలు చొప్పున వేశారు. ఇలా నాడు అన్నదాత సుఖీభవ కింద రూ.4 వేలు మాత్రమే ఇచ్చి రూ.1,765.29 కోట్లతో సరిపుచ్చారు. 2014లో వ్యవసాయ అనుబంధ రంగాల కోసం 200కు పైగా ఇచ్చిన హామీలు బుట్టదాఖలయ్యాయి.


ఇప్పుడూ అదే రీతిలో మోసం

2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని మరోసారి రైతులను ఏమార్చేందుకు చంద్రబాబు కొత్త హామీ ఇచ్చాడు. ప్రస్తుతం రైతు భరోసా ద్వారా లబ్ధి పొందుతున్న రైతులు 53.58 లక్షల మంది ఉన్నారు. వీరిలో కౌలు రైతులు, అటవీ, దేవదాయ సాగుదారులు 2.68 లక్షల మంది ఉన్నారు. 'బాబు చెప్పినట్టు ఏటా రూ.20 వేల చొప్పున ఇవ్వాలంటే ఐదేళ్లలో దాదాపు రూ.లక్ష కోట్లు అవసరం. గతంలో రూ.17 వేల కోట్లే సరిగా ఇవ్వలేకపోయిన ఈ పెద్దమనిషి రైతుల కోసం లక్ష కోట్లు ఇస్తానంటే నమ్మేవారెవరూ లేరు' అని అన్నదాతలు మండిపడుతున్నారు.

ఏపీ ఆదర్శ పాలనపై అమెరికాలోనూ చర్చ

- పేదలకు, పెత్తందారులకు మధ్య వార్ నడుస్తోంది
- ప్రజలు పేదల పక్షాన ఉన్న ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి.
- వైఎస్సార్‌సీపీ ఎన్నారై స్టేట్ కో–ఆర్డినేటర్, తానా మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటరమణ

సాక్షి,అమరావతి: 'ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి–సంక్షేమ పథకాలు చూసి అమెరికాలో ఉన్న తాము ఎంతో సంతోషపడుతున్నామని, పేదలకు సమాన అవకాశాలు కల్పించే పాలన సాగుతున్న తీరు చూసి సంబరపడుతున్నామని వైఎస్సార్‌సీపీ ఎన్నారై స్టేట్ కో ఆర్డినేటర్ (ఎలక్షన్స్), తానా మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటరమణ తన మనసులో మాట వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సాక్షితో ముచ్చటించారు. అందరికీ సమాన విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉండాలని తాము విద్యార్థి దశలో నినదించామని, దాన్ని ఇన్నాళ్లకు వైఎస్ జగన్ నిజం చేసి చూపించారన్నారు. మా కళ్ల ముందే ఆనాటి కలలు సాకారం అవుతున్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులంతా ఏపీ వైపు చూసి, ఇక్కడి పథకాల గురించి ఆలోచించేలా చేశారని తెలిపారు. ఇటీవల అమెరికాలో ప్రవాసాంధ్రుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చర్చ వచ్చిందని, సీఎం జగన్ పరిపాలన ఆదర్శప్రాయంగా, కుల, మత, పార్టీలకు అతీతంగా సాగుతోందని, మరో 30 ఏళ్ల పాటు సీఎంగా జగన్ కొనసాగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడ్డారని వివరించారు. సీఎం జగన్‌తో కలిసి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటే బాగుంటుందని పలువురు సూచించారన్నారు. తానా అధ్యక్షుడుగా చేసిన తాను ఏపీలో ఉండి సీఎం జగన్ బాటలో నడవాలని అనుకొంటున్నట్టు చెప్పారు.



కోమటి జయరాం క్షమాపణ చెప్పాలి

టీడీపీ ఎన్‌ఆర్‌ఐ నాయకుడు కోమటి జయరాం ఓటర్లు వెధవలంటూ మాట్లాడిన మాటలపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల మనసు గెలిస్తేనే అధికారం ఇస్తారు కానీ డబ్బులకు లొంగరనేది కోమటి జయరాం గుర్తుంచుకోవాలన్నారు. ఏపీలో పేదలకు, పెత్తందారులకు మధ్య వార్ నడుస్తోందని, పేదల పక్షాన ఉన్న ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. 2014లో ఇచ్చిన మేనిఫెస్టోను వెబ్ సైట్ నుంచి తీసేసిన ఘనత టీడీపీదని విమర్శించారు. అందుకే ఇప్పుడు చంద్రబాబు మాటలను ప్రజలు విశ్వసించడం లేదని చెప్పారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను సీఎం జగన్ అందించారని గుర్తు చేశారు. ప్రభుత్వ స్కూల్స్‌లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం ఒక ఎన్‌ఆర్‌ఐగా హర్షిస్తున్నానని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ ఎన్నారై స్టేట్ కో ఆర్డినేటర్ (ఎలక్షన్స్)గా నియామకం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యార్లగడ్డ వెంకటరమణ చౌదరిని పార్టీ ఎన్‌ఆర్‌ఐ స్టేట్ కో–ఆర్డినేటర్ (ఎలక్షన్స్)గా నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

మీకు తెలుసా?

మేం అధికారంలోకి వస్తే బీపీ, షుగర్ వంటి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులకు ఉచితంగా మందులు ఇస్తామని చంద్రబాబు ఇచ్చిన మరో హాస్యాస్పద హామీ.

ఎందుకంటే... జగన్ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్‌లు, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర కార్యక్రమాలను అమలు చేస్తూ ఉచితంగా విలువైన మందులు అందజేస్తూ రోగుల ప్రశంసలు అందుకుంది. గ్రామాల్లో ఇంటివద్దే ఫాలో అప్ వైద్యం అందిస్తున్నారు. క్షేత్రంలో వాస్తవాలు ఇలా ఉంటే ఉచితమంటూ ఉచిత సలహాలిస్తున్నారు.




పోలైన ఓట్లను ఇలా తెలుసుకోవచ్చు

ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో ఫలితం బటన్‌తో పాటు, టోటల్ బటన్ ఉంటుంది. పోల్ సమయంలో ఎప్పుడైనా ఈ బటన్ నొక్కితే అప్పటి వరకు పోలైన మొత్తం ఓట్ల సంఖ్య తెలుస్తుంది. పోలింగ్ ముగియగానే క్లోజ్ బటన్ నొక్కితే మెషీన్ ఇకపై ఓట్లను అంగీకరించదు. పోలింగ్ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లో సెక్యూరిటీ బలగాల పహారాలో భద్రపరుస్తారు. ఈ స్ట్రాంగ్‌రూమ్‌లకు ఎన్నికల అధికారులతో పాటు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సంతకాలతో సీలు వేస్తారు. కౌంటింగ్ రోజున అభ్యర్థులు/వారి ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌లు తెరుస్తారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లెక్కింపు పూర్తైన తర్వాత, వీవీప్యాట్ స్లిప్పులను బయటకు తీసి, అభ్యర్థులు/వారి ప్రతినిధుల సమక్షంలో నల్లటి కవరులో భద్రపరుస్తారు.

అక్కడ గెలిచే పార్టీదే ప్రభుత్వం

ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఏ పార్టీ అభ్యర్థి గెలుపొందితే ఆ పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ఇక్కడివారు ఓ సెంటిమెంట్‌గా చెబుతుంటారు. నియోజకవర్గం ఆవిర్భవించాక ఒక్కసారి మినహా మిగిలిన అన్నిపర్యాయాలూ అది నిజం కావడం విశేషం. 1967లో నియోజకవర్గాల పునర్విభజనతో జనరల్ స్థానం నుంచి తిరువూరు ఎస్సీలకు రిజర్వు చేశారు. అప్పటి నుంచి ప్రతి ఎన్నికలో ఇక్కడ గెలిచిన పార్టీకే రాష్ట్రంలో అధికారం దక్కుతోంది. అయితే రాష్ట్ర విభజన అనంతరం 2014లో ఒకే ఒక్కసారి మాత్రం తిరువూరులో వైఎస్సార్సీపీ గెలుపొందగా, ఈ ఆనవాయితీ తప్పింది. 2019లో మళ్ళీ వైఎస్సార్సీపీ తిరువూరును కైవసం చేసుకోగా, రాష్ట్రంలో కూడా ఈ పార్టీకే అధికారం లభించింది.



భారత ప్రధానులతో కపిలేశ్వరపురం జమీందారులు

ప్రస్తుతం అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కపిలేశ్వరపురానికి చెందిన జమీందారు ఎస్‌బీ ప్రభాకర పట్టాభి రామారావు కేంద్రంలోను, రాష్ట్రంలోను పలు పదవులను అధిష్టించారు. స్వాతంత్ర్యానంతరం భారత రాజకీయాల్లో వీరు కీలకంగా వ్యవహరించారు. భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, ఆయన కుమార్తె ప్రధాని ఇందిరా గాంధీలతో రాజకీయ సాన్నిహిత్యం ఉండేది. కేంద్ర మాజీ సహాయమంత్రిగా పలుమార్లు పనిచేసిన జమీందార్ పట్టాభిరామారావుకు నాటి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు, గవర్నర్ త్రివేది, నీలం సంజీవరెడ్డి, తెన్నేటి విశ్వనాథం, దామోదరం సంజీవయ్య తదితరుల సాన్నిహిత్యాన్ని పొందారు.

మూడు తరాలకూ అందుతున్న లబ్ధి



జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధి మూడు తరాల వారికీ అందుతోంది. మా కుటుంబంలో నాకు ఆసరా, చేదోడు, సున్నా వడ్డీ ప్రయోజనాలు కలిగాయి. నా కొడుకు గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. నా కుమార్తెకు అంగన్‌వాడీ ద్వారా సంపూర్ణ పోషణ కిట్, మనుమరాలికి అమ్మఒడి, గోరుముద్ద.. ఇలా మా కుటుంబంలో ఉన్న మూడు తరాలకూ సంక్షేమ లబ్ధి చేకూరింది. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్ పాలన సాగుతోంది. మళ్లీ గెలిచేది జగనే.

- కె.సుశీల, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

చంద్రబాబు, పిట్టలదొర ఒక్కటే



చంద్రబాబు నేతృత్వంలోని పొత్తు పార్టీల మేనిఫెస్టో చూస్తుంటే పిట్టలదొర హామీలు గుర్తుకొస్తున్నాయి. అవి అమలు చేయటం జరిగే పని కాదని వాళ్లకూ తెలుసు. హామీలు నెరవేర్చే ఉద్దేశం వారిలో అసలే కనపడదు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న లక్ష్యంగా ఇష్టారీతిన హామీలు గుప్పిస్తున్నారు. సంపద సృష్టించి హామీలు నెరవేర్చుతామంటున్నారు. అంటే సంపద సృష్టి జరిగే వరకూ హామీలు నెరవేర్చేది లేదని పరోక్షంగా చెబుతున్నారు. అందుకే జగన్ సాధ్యం కాని హామీలివ్వలేదు. విశ్వసనీయతకు నిబద్ధతకు నిదర్శనం జగన్.

- వీవీ నరసింహారావు, రిటైర్డ్ ఉద్యోగి, ఏలూరు

స్వార్థ గుంపును ఓటుతో తరిమేద్దాం
మేలు చేసిన నేతను మళ్లీ ఆదరిద్దాం

కర్నూలు.. ఫ్యాన్ జోరు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్సార్‌సీపీకి తిరుగులేని గాలి

- గత సార్వత్రిక పోరులో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను క్లీన్ స్వీప్ చేసిన వైఎస్సార్‌సీపీ
- ఈ దఫా కూడా అవే ఫలితాలు పునరావృతమవుతాయనే ధీమాలో ఆపార్టీ శ్రేణులు
- పొత్తుతో నష్టం జరుగుతోందని కర్నూలులో బీజేపీని దూరం పెట్టిన టీజీ
- ఆదోని, మంత్రాలయం, కోడుమూరు, ఎమ్మిగనూరులో టీడీపీలో ఇంటిపోరు
- ఆదోనిలో నామమాత్రపు పోటీకి పరిమితమైన బీజేపీ
- మరోసారి జగన్‌ను సీఎంగా చూడాలని కలిసికట్టుగా శ్రమిస్తోన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో సార్వత్రిక పోరు ఏకపక్షంగా కానుందా? 2019 ఫలితాలే పునరావృతం కానున్నాయా? 2 ఎంపీలతో పాటు 14 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేయనుందా? అంటే జిల్లాలోని రాజకీయ పరిస్థితులు, పార్టీల బలాబలాలు విశ్లేషిస్తే అవుననే తెలుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పట్ల ప్రజల్లో విశ్వసనీయత, ఇటీవల సీఎం జగన్ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టడం, ఆచరణ సాధ్యమయ్యే హామీలతో విడుదల చేసిన మేనిఫెస్టోకు ప్రజల మద్దతు రావడం వంటి అంశాలతో వైఎస్సార్‌సీపీ జోష్‌లో ఉంటే, చంద్రబాబు సభలకు సరైన స్పందన లేకపోవడం, చాలా నియోజకవర్గాల్లో నాయకత్వలేమి, వర్గ విభేదాలతో టీడీపీ ఈ దఫా కూడా బోణీ కొట్టడం కష్టమేననే భావన విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి అత్యంత బలంగా ఉంది. ఈ ఐదేళ్లలో ప్రతి ఇంటికీ చేయని సంక్షేమ ఫలాలు అందాయి. ప్రతీ గ్రా మంలో అభివృద్ధి జరిగింది. దీనికి తోడు తమ నాయకుడిని మరోసారి సీఎంగా చూడాలనే ఆకాంక్ష ఆ పార్టీ శ్రేణుల్లో బలంగా ఉంది.

కర్నూలులో గెలుపు గ్యారంటీ

రాష్ట్రంలోనే మైనార్టీ ఓట్లు అత్యధికంగా (1.15లక్షలు) ఉండే నియోజకవర్గం కర్నూలు. ఇక్కడ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్‌ను వైఎస్సార్‌సీపీ బరిలోకి దింపింది.ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు పార్టీ మొత్తం ఇంతియాజ్ గెలుపు కోసం పని చేస్తోంది. మైనార్టీలంతా వైఎస్సార్‌సీపీ వైపు నిలబడ్డారు. మరోవైపు టీజీ వెంకటేశ్ బీజేపీలో, భరత్ టీడీపీలో కొనసాగుతూ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు. రాజకీయాన్ని కూడా 'బిజినెస్'గా చూసే టీజీ కుటుంబాన్ని గత రెండు దఫాలు ప్రజలు ఓడించారు. మైనార్టీ ఓట్లు దూరమవుతాయనే భావనతో బీజేపీని టీజీ భరత్ దగ్గరకు రానీయడం లేదు. దీంతో బీజేపీ నేతలు కూడా టీజీపై గుర్రుగా ఉన్నారు.



నంద్యాలలో గెలుపు నల్లేరుపై నడకే

నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవి సౌమ్యుడు. రవితోపాటు ఆయన తండ్రి ఎప్పుడూ ప్రజల్ని ఇబ్బంది పెట్టలేదు. ఎవరు వెళ్లినా స్పందించే గుణం వారి సొంతం. మరో వైపు భూమా బ్రహ్మానందరెడ్డిని కాదని ఫరూక్‌కు టీడీపీ టికెట్ ఇచ్చింది. దీంతో బ్రహ్మం పూర్తి దూరంగా ఉన్నారు. నంద్యాలపై పట్టున్న అఖిలప్రియ కూడా ఫరూక్‌కు సహకరించలేదు. ఈ దఫా ఫరూక్ ఓడిపోతే వచ్చే ఎన్నికల్లో టికెట్ తన తమ్ముడు జగత్ విఖ్యాత్‌కు ఇప్పించాలనేది అఖిల వ్యూహం. దీంతో వర్గవిభేదాలతో టీడీపీ నలిగిపోతోంది.

కోడుమూరులో సునాయాసమే

కోడుమూరు(ఎస్సీ) టీడీపీలో గ్రూపు తగాదాలతో ఎన్నికలు ఏకపక్షంగా జరిగే అవకాశం ఉంది. తనకు కాకుండా బొగ్గుల దస్తగిరికి టికెట్ ఇచ్చారని ఇన్‌చార్జ్ ఆకేపోగు ప్రభాకర్ ఏకంగా ఆత్మహత్యకు యత్నించారు. తన ప్రమేయం లేకుండా ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి సూచించిన అభ్యర్థికి టికెట్ ఇవ్వడంతో కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి వర్గం దస్తగిరికి సహకరించడం లేదు. ఇటీవల సయోధ్య కుదిరినట్లు చెబుతున్నా సహకారం లేదు. మరోవైపు కోట్ల హరిచక్రపాణిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాశ్‌రెడ్డి ఇటీవలే వైఎస్సార్‌సీపీలో చేరారు. దీంతో వైఎస్సార్‌సీపీ బలం మరింత పెరిగింది.ఈ దఫా కూడా వైఎస్సార్‌సీపీకే అనుకూలంగా ఉంది.

'ఆలూరు'లో పెరిగిన వైఎస్సార్‌సీపీ బలం

ఆలూరులో చిప్పగిరి జెడ్పీటీసీ వాల్మీకి నేత విరూపాక్షి వైఎస్సార్‌సీపీ తరపున బరిలో ఉన్నారు. ఐదేళ్లు మంత్రి పదవి అనుభవించి పార్టీని వీడి వెళ్లిపోయిన గుమ్మనూరు జయరాం సిఫార్సుతో ఇక్కడ వీరభద్రగౌడ్‌కు టికెట్ ఇచ్చింది. దీంతో ఇక్కడ వాల్మీకులంతా ఏకమయ్యారు. దీనికి తోడు టీడీపీ నుంచి వైకుంఠం మల్లిఖార్జున చౌదరి, మాజీ ఎమ్మెల్సీ మసాల పద్మజ, కురబ వర్గానికి చెందిన శశికళ వైఎస్సార్‌సీపీలో చేరారు. కోట్ల హరిచక్రపాణిరెడ్డి కోడుమూరుతో పాటు ఆలూరుపై పట్టున్న నాయకుడు. ఇక్కడ కురబ, బోయ వర్గాలు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నాయి. దీంతో కచ్చితంగా గెలుస్తామనే భావనలో వైఎస్సార్‌సీపీ ఉంది.

బనగానపల్లిలో బోనస్ మార్కులే

బనగానపల్లిలో కాటసాని రామిరెడ్డి బలంగా ఉన్నారు. ఇక్క డ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధన్‌రెడ్డి నియోజకవర్గం కంటే హైదరాబాద్‌లో ఎక్కువగా ఉంటారు. దీనికి తోడు డోన్, నంద్యాలలో తన వర్గానికి టికెట్లు ఇప్పించుకునే క్రమంలో కోట్ల, భూమాకు ప్రత్యర్థిగా మారారు. ఈ ఎన్నికల్లో వీరు ఇతని ఓటమి కోసం పని చేసే అవకాశం ఉంది. బీసీపై భూమా బ్రహ్మానందరెడ్డి ఏకంగా చంద్రబాబుకే ఫిర్యాదు చేశారు. ఇక్కడ కాటసానికి గెలుపు అవకాశాలు ఎక్కువ.

నందికొట్కూరులో తిరుగులేని ఫ్యాన్

నందికొట్కూరులో వైఎస్సార్‌సీపీ తరపున సుధీర్ పోటీ చేస్తున్నారు. ఆయన గెలుపు కోసం బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి శ్రమిస్తున్నారు. టీడీపీ తరపున గిత్తా జయసూర్య పోటీ చేస్తున్నారు. ఇక్కడ మాండ్రను కాదని నంద్యాల ఎంపీ బైరెడ్డి రాజశేఖరరెడ్డి కుమార్తె శబరికి ఇచ్చారు. మాండ్ర హైదరాబాద్‌లో ఉంటున్నారు. దీంతో జయసూర్య ఒంటరైపోయాడు. దశాబ్దాలుగా ఫ్యాక్షన్ నడిపిన గౌరు, బైరెడ్డి వర్గాలు ఏకం కావడం కూడా నందికొట్కూరులో జీర్ణించుకోలేని అంశం. దీంతో అంతా వైఎస్సార్‌సీపీ వైపు నిలబడ్డారు.

ఆళ్లగడ్డలో అఖిలకు ఎదురుగాలి

ఆళ్లగడ్డలో భూమా అఖిలప్రియ తరచూ వివాదాలలో చిక్కుకుంటోంది. కుటుంబ సభ్యులు కూడా పూర్తిగా దూరమయ్యారు. 'భూమా' ప్రధాన అనుచరుడు ఏవీ సుబ్బారెడ్డి అఖిల ఓటమే లక్ష్యంగా పని చేస్తున్నారు. గంగుల బ్రిజేంద్రారెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి ఇద్దరూ ఆళ్లగడ్డలో 'ఫ్యాక్షన్ ' వాతావరణాన్ని తీసేసి ప్రశాంతంగా మార్చారు. ఇదే వీరికి ఈ ఎన్నికల్లో బలంగా మారింది.



శ్రీశైలంలో శివతాండవమే

శ్రీశైలంలో శిల్పా చక్రపాణిరెడ్డి వైఎస్సార్‌సీపీ తరపున బరిలో ఉన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు. టీడీపీ నేత బుడ్డా రాజశేఖరరెడ్డి నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో వివాదాల్లో ఉంటున్నారు. ఓటమి భయంతోనే బుడ్డా ఇలా వ్యవహరిస్తున్నారనే చర్చ నడుస్తోంది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలిచి, టీడీపీలోకి వెళ్లి ప్రజల్లో బుడ్డా విశ్వసనీయత కోల్పోయారు. దీంతో టీడీపీ నేతలు కూడా ఇతని కోసం గట్టిగా పని చేసే పరిస్థితులు లేవు. ఏరాసు ప్రతాప్‌రెడ్డి కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు.

పత్తికొండలో టీడీపీ పరాభవం తథ్యం

పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నిత్యం జనంతో మమేకం అవుతున్నారు. మరోవైపు మాజీ మంత్రి కేఈ కృష్ణమూర్తి తనయుడు కేఈ శ్యాంబాబు ఐదేళ్లపాటు పార్టీకి అందుబాటులో లేరు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ కూడా వీరికి దూరంగా ఉన్నారు. ఇక్కడ టీడీపీ గెలుపు అవకాశాలు స్వల్పమే.

మంత్రాలయం, ఆదోనిలో మురిపిస్తున్న ఫ్యాన్

మంత్రాలయం నియోజకవర్గ ఆవిర్భావం నుంచి బాలనాగిరెడ్డికి ఓటమి లేదు. నిత్యం ప్రజల్లో ఉండే రాజకీయనేత. మరోవైపు తిక్కారెడ్డిని కాదని, బోయ వర్గానికి చెందిన రాఘవేంద్రకు టీడీపీ టికెట్ ఇచ్చింది. దీనిపై తిక్కారెడ్డి ప్రత్యక్షంగా నిరసన చేశారు. దీంతో జిల్లా అధ్యక్ష పదవి ఇతనికి కట్టబెట్టింది. అయినా రాఘవేంద్రకు సహకరించడం లేదు. మరోవైపు తన అధ్యక్ష పదవిని తీయడంపై బీటీ నాయుడు గుర్రుగా ఉన్నారు. ఆదోనిలో టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న మీనాక్షి నాయుడును కాదని పొత్తులో భాగంగా బీజేపీకి టికెట్ ఇచ్చారు. ఇక్కడ టీడీపీ, బీజేపీ రెండూ బలహీనంగా ఉన్నాయి. దీంతో బీజేపీ కనీసం పోటీ ఇవ్వలేని పరిస్థితి.

ఎమ్మిగనూరు.. ఏకపక్షం

ఎమ్మిగనూరులో చేనేత వర్గానికి చెందిన మాజీ ఎంపీ బుట్టా రేణుక వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్నారు. బీసీలకు టికెట్ ఇవ్వాలని సీనియర్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని పక్కనపెట్టారు. దీంతో ఇక్కడ చేనేతలు, బీసీలు రేణుక కోసం ఏకమయ్యారు. చెన్నకేశవరెడ్డి కూడా రేణుక గెలుపు కోసం శ్రమిస్తున్నారు. మరోవైపు జయనాగేశ్వర రెడ్డికి కోట్ల వర్గం నుంచి కూడా మద్దతు లేదు. ఇక్కడ కూడా 'బుట్టా'కే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

'పోచా'దే నంద్యాల

నంద్యాల ఎంపీ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందరెడ్డి బరిలో ఉన్నారు. సిట్టింగ్ ఎంపీ. ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడటంతో పాటు ఇటు పార్టీ నేతలతో అటు పార్లమెంట్ పరిధిలోని ప్రజలతో మంచిగా ఉన్నారు. మరోవైపు టీడీపీ వేంద్ర శివానందరెడ్డిని కాదని, చివరి నిమిషంలో బీజేపీ నేత బైరెడ్డి శబరికి 'పచ్చ కండువా వేయించి ఎంపీగా పోటీ చేయిస్తోంది. బైరెడ్డి రాజశేఖరరెడ్డి 2014లోనే ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. పైగా బైరెడ్డిని టీడీపీ నేతలే స్వాగతించడం లేదు. పార్లమెంట్‌లోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ హవానే ఉంది. అసెంబ్లీలు స్వీప్ అయ్యే అవకాశం ఉంది కాబట్టి నంద్యాల మరోసారి పోచా వశం కానుంది.

గెలుపు బాటలో 'రామయ్య'

కర్నూలు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా బీవై రామయ్య పోటీ చేస్తున్నారు. పేద వ్యక్తి. పార్లమెంట్‌లో బలమైన 'వాల్మీకి' వర్గానికి చెందిన నేత. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పని చేసిన అనుభవంతో పార్లమెంట్‌లో విస్తృత పరిచయాలున్నాయి. రామయ్య తెలియని వ్యక్తి లేరు. అజాతశత్రువైన రామయ్యకు 'వాల్మీకుల'తో పాటు అన్ని వర్గాల నుంచి మద్దతు ఉంది. 7 అసెంబ్లీలలో 'ఫ్యాన్' గాలి వీస్తోంది. మరోవైపు టీడీపీకి అభ్యర్థులు లేక పంచలింగాల నాగరాజు అనే రియల్టర్‌ను చివరి నిమిషంలో తీసుకొచ్చారు. ఆయనెవరో కూడా జిల్లా ప్రజలకు తెలీదు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్‌లో అత్యంత బలంగా ఉండటం, బలమైన సామాజిక వర్గం, మంచితనం వెరసి రామయ్య గెలుపు నల్లేరుపై నడకే అనే చర్చ సర్వత్రా నడుస్తోంది.

డోన్, పాణ్యంలో దూకుడు

డోన్‌లో టీడీపీ అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డిని చంద్రబాబు రెండేళ్ల కిందటే ప్రకటించారు. అయితే సుబ్బారెడ్డి ఓడిపోతాడని సర్వేలో తేలడంతో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని బరిలోకి దించారు. యూరో పియన్ మోడల్ విద్యాసంస్థలతో పాటు అన్ని రకాలుగా మంత్రి బుగ్గన డోన్‌ను అభివృద్ధి చేశారు. 2009 ఓటమి తర్వాత కోట్ల కుటుంబం డోన్‌ను వదిలేసింది. ఇప్పుడు ప్రకాశ్‌రెడ్డిని పంపింది. ఇష్టం లేకపోయినా డోన్‌కు వెళుతున్నారని ప్రకాశ్‌రెడ్డి కోడుమూరు కార్యకర్తల సమావేశంలో కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇక్కడ బుగ్గన గెలుపు లాంఛనమే అని విశ్లేషకులు చెబుతున్నారు. పాణ్యంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ తరఫున, గౌరు చరిత టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యే కాటసాని. నిత్యం ప్రజల్లో ఉంటారు. బైరెడ్డి, గౌరు ఏకం కావడం గౌరు వర్గీయులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక్కడ ఈ దఫా కూడా కాటసానికే అనుకూలంగా ఉంది.


గోదారిలో గాలి కబుర్లే

- పవన్‌పై భ్రమలు తొలగిపోయాయి
- అసలు ఆ పార్టీకి సిద్ధాంతమంటూ ఉందా?
- జనసేన శ్రేణుల్లో తొలిచేస్తున్న ప్రశ్నలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నవతరం రాజకీయాలకు ఆలంబన అని...ఇప్పుడున్న రాజకీయాలకు భిన్నమైన ఆలోచనలతో పురుడుపోసుకున్న పార్టీ అని..పేదలు, బడుగు, బలహీన వర్గాలకు అగ్రాసనం వేస్తామనే అజెండాతో వచ్చిందీ జనసేన అని చెప్పడంతో నిజమనుకుని నమ్మి జనసేనలో పలువురు చేరారు. ఇన్నేళ్లూ ఆ పార్టీని భుజాన వేసుకుని కార్యక్రమాల కోసం లక్షలు తగలేసుకున్నారు. అయితే ఎన్నికల సమయం వచ్చేసరికి అవన్నీ గాలి కబుర్లేనని తెలిసొచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయిందనే ఆవేదన ఆ పార్టీలో స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయ పార్టీ అంటే గెలుపు ఓటముల ప్రమేయం లేకుండా ఎన్నికల్లో పోటీ చేయాలి. అటువంటిది స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా ముఖం చాటేసినప్పుడే ఆ పార్టీకి ఓ సిద్ధాంతం లేదని తేలిపోయిందని అప్పట్లోనే ఆ శ్రేణులు అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తీరును విభేదించాయి. అయినా, ఆయన పట్టించుకోలేదు. సార్వత్రిక ఎన్నికలు వచ్చేసరికి పొత్తులంటూ తలాతోకా లేని నిర్ణయాలతో పార్టీని, ఆ పార్టీని నమ్ముకున్న నాయకులను తెలుగుదేశం పార్టీకి తొత్తులుగా చేసేశారని మండి పడుతున్నారు.

పొత్తుతో మరింత దిగజారి...

టీడీపీతో పొత్తులో కనీసం 50 అసెంబ్లీ స్థానాలు డిమాండ్ చేస్తారని పార్టీ నేతలు, పవన్ అభిమానులు ఆశగా ఎదురు చూశారు. చివరకు మూడింట ఒక వంతు సీట్ల కంటే తక్కువతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీనిని సమర్థించుకుంటూ పవన్ కల్యాణ్..'మన బలం మనం తెలుసుకోకుండా ఎన్ని అంటే అన్ని సీట్లు ఎలా అడిగేస్తాం? గత ఎన్నికల్లో కనీసం నన్ను కూడా గెలిపించుకోలేకపోయామని ప్రశ్నిస్తూ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన గందరగోళం సృష్టించారు.



గోదావరి జిల్లాలపైనే ఆశలు

రాష్ట్రంలో కొద్దోగొప్పో పార్టీకి మనుగడ ఉందంటే అది గోదావరి జిల్లాల్లోనేనని ఆ పార్టీ నాయకుల మాట. దీనికి బలం చేకూర్చేలా ఆ పార్టీ పోటీ చేస్తున్న స్థానాల్లో సగం ఈ జిల్లాల్లోనే ఉండటం గమనార్హం. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జనసేన 11 అసెంబ్లీ స్థానాలతో పాటు కాకినాడ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తోంది. ఆ పార్టీకి బలం, బలగం ఉందనే నమ్మకంతో ఈ జిల్లాలపైనే ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. కానీ పార్టీని వీడుతున్న నేతలు ఈ జిల్లాల నుంచే ఎందుకు ఎక్కువగా ఉన్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది గత సార్వత్రిక ఎన్నికల్లో సైతం ఈ జిల్లాల పైనే ఆ పార్టీ గంపెడాశలు పెట్టుకుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో కలిపి ఏకైక స్థానం రాజోలులో మాత్రమే ఆ పార్టీ చావు తప్పి కన్ను లొట్టబోయింది అన్నట్టుగా గెలుపొందింది. చివరకు రాష్ట్రంలో గెలుపొందిన ఏకైక ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ కూడా ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిపోయారు.

ఆ పార్టీకి దూరంగా...

పార్టీపై నమ్మకంతో ఇంత కాలం పార్టీని భుజాన మోసిన నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ముఖ్యమైన నాయకులు కాకినాడ మాజీ మేయర్ పోలసపల్లి సరోజ, ముమ్మిడివరం, అమలాపురం, జగ్గంపేట, ఆచంట ఇన్‌చార్జీలు పితాని బాలకృష్ణ, శెట్టిబత్తుల రాజబాబు, పాఠంశెట్టి సూర్యచంద్ర, చేగొండి, అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ వంటి సుమారు డజను మందికి పైగా నాయకులు జనసేనకు గుడ్‌బై చెప్పారు. సిద్ధాంతం మాట దేవుడెరుగు కనీసం పార్టీలో విలువనేదే లేకుండా చేసేశారని, ఆత్మాభిమానం చంపుకుని ఇంకా ఆ పార్టీలో కొనసాగలేమని అంటున్నారు.

వేల్పులలో ప్రగతి వెలుగులు

చిత్రం సాక్షిగా

వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండలం వేల్పుల గ్రామంలో పలు అభివృద్ధి పనులు వెలుగులీనుతున్నాయి. గతమంతా ఛిద్రం ...అదే తమ బతుకు చిత్రం అనుకుంటున్న తరుణంలో వైఎస్సార్సీపీ సర్కారు కొలువు దీరిన అనంతరం ఒక్కో భవనం కొంగొత్తగా రూపుదాల్చడం ఆరంభించాయి. రూ.11.91 కోట్ల వ్యయంతో నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. - వేముల



వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండలం వేల్పుల గ్రామంలో ఒకే ప్రాంగణంలో కొలువుదీరిన ప్రభుత్వ కార్యాలయాలు




నాడు నేడులో భాగంగా నిర్మితమైన ప్రాథమిక ఉన్నత పాఠశాల



రైతు భరోసా కేంద్రం



సమస్యల పరిష్కారానికి వేదిక గ్రామ సచివాలయం



రోగులకు బాసటగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్



మహిళా స్వయం సమాఖ్య భవనం

పేదల పక్షపాత ప్రభుత్వం



మాది మధ్య తరగతి కుటుంబం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాల వల్ల మాలాంటి చాలా కుటుంబాలు ఆనందంగా జీవిస్తున్నాయి. ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి మరీ పథకాల లబ్ధిని చేకూర్చుతున్నారు. ఇంత గొప్ప పాలన మునుపెన్నడూ చూడలేదు. కొన్ని రాజకీయ పార్టీలు తాము ప్రజలకేం చేయగలమో చెప్పకుండా, సీఎం పదవిలో ఉన్న వ్యక్తికి కనీస గౌరవం ఇవ్వకుండా సభ్య సమాజం సిగ్గుపడేలా మాట్లాడుతున్నారు. ఇలాంటి వారిని ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలి.

- పూజారి లత, గృహిణి, విశాఖపట్నం

బాబు కాలంలో ఆకలి కేకలు



కేవలం టీడీపీ నిర్ణయాల వల్లే మాలాంటి వారి జీవితాలు ఎన్నో ఏళ్లు అర్థాకలితో అలమటించాయి. కరోనా రక్కసి మింగేసిన కాలాన్ని మినహాయిస్తే, అప్పటి ఆర్థిక నష్టాన్ని తట్టుకుని మరీ కేవలం రెండున్నరేళ్లలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ ఎన్నో కార్యక్రమాలు అమలు చేశారు. జగన్ కాబట్టే ఆ సమయంలో రాష్ట్రంలో మరణాలు కనీస స్థాయికే పరిమితమయ్యాయి. అదే బాబు ఉంటే ఉద్యోగులకు సగం జీతం కూడా ఇచ్చేవాడు కాదు. కరోనా పేరిట మొత్తం తన అనుచరులకే కట్టబెట్టేవారు.

- వీవీఎన్ రాజు, కాంట్రాక్ట్ లెక్చరర్, పోలవరం

మహాత్ముల బాటలో జగన్



దళితులకు, స్త్రీలకు విద్య నేర్పితే, వారికి సాంఘిక విముక్తి –ఆర్థిక అభ్యున్నతి సిద్ధిస్తాయి అన్న జ్యోతిరావ్ పూలే, గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయం అన్న గాంధీ మహాత్ముని మాటలే ఆదర్శంగా సీఎం జగన్ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల విద్య, వైద్యం కోసం అధిక ప్రాముఖ్యత ఇస్తున్నారు. 46 వేల గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు తదితర నిర్మాణాలు చేపట్టారు. వీటి ద్వారా లక్షన్నరకు పైగా యువతకు ప్రభుత్వ ఉద్యోగాలిచ్చారు. ఆస్పత్రుల్లో ఖాళీలన్నింటినీ భర్తీ చేశారు. ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచాడు జగన్.

-ఈదర గోపీచంద్, రాష్ట్ర అధ్యక్షుడు, అశ్లీలతా ప్రతిఘటన సమితి, నరసరావుపేట



రామాయపట్నం పోర్టు దృశ్యాలు

రూ.3,743 కోట్లతో రామాయపట్నం పోర్టు పనులు

- 850 ఎకరాల భూమిని సేకరించి రూ.3,743 కోట్లతో రామాయపట్నం పోర్టు పనులు ప్రారంభం
- పోర్టు ద్వారా 4 బెర్తులు పూర్తిగా అందుబాటులోకి
- 5 వేల మందికి ప్రత్యక్షంగా, 15 వేల మందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు
- పోర్ట్ ఆధారిత ఇతర పరిశ్రమల కూడలి స్థాపనకు 3,700 ఎకరాల విస్తీర్ణంలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు స్థాపించనున్నారు.
- తద్వారా 50 వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు
- చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నం వద్ద 11,095 ఎకరాల్లో రూ.5,783.84 కోట్లతో క్రిస్ సిటీ ఏర్పాటు
- కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ పేరుతో టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజనీరింగ్, ఎంఎస్ఎంఈ రంగాల పరిశ్రమలు అందుబాటులోకి
- ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే దాదాపు 3 లక్షల మందికి ప్రత్యక్షంగా, 1.71 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి
- తొలిదశలో రూ.1,500 కోట్లతో 2,006 ఎకరాలు అభివృద్ధి చేయనున్నారు.
- బోగోలు మండలం జువ్వలదిన్నెలో సుమారు రూ.289 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫిషింగ్ హార్బర్ నిర్మించారు.
- ఫిషింగ్ హార్బర్ ద్వారా ఏటా అదనంగా 41వేల టన్నుల మత్స్యసంపద లభిస్తుంది.
- నేలటూరులో దామోదరం సంజీవయ్య 1,600 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రంకు అనుబంధంగా 2వ దశలో నిర్మించిన 3వ యూనిట్ (800 మెగావాట్లు) రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు.

సింహపురి.. సస్యశ్యామలం



నెల్లూరు బ్యారేజీ

పురోగతిలో నీటిపారుదల ప్రాజెక్టులు

- సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు ద్వారా ఈ రిజర్వాయర్ నుంచి 5 టీఎంసీల నీటిని మళ్లించడానికి ప్రతిపాదన
- కెనాల్ పూర్తయితే 90 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ
- 58 రెవెన్యూ గ్రామాలకు సోమశిల జలాల తాగు నీరు అందించే లక్ష్యంగా జరిగే ఈ కెనాల్ ప్రాజెక్టు వ్యయం మొదటి విడతలో రూ.840.90 కోట్లు
- అందులో ఇప్పటికి రూ.604.50 కోట్లు ఖర్చుతో 62.38శాతం పనులు పూర్తి.
- సోమశిల– కండలేరు వరద కాలువ ఆధునికీకరణ కోసం ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు – రూ.960 కోట్లు
- సోమశిల నుంచి కండలేరు రిజర్వాయర్ వరకు **పెన్నా నది వరద నీటిని తీసుకెళ్లేందుకు ఈ కెనాల్ ఆధునికీకరణ ద్వారా రోజుకు రెండు టీఎంసీల నీరు వెళ్తుంది.**
- **45 కి.మీ పొడవు ఉన్న** కాలువ వెడల్పు కోసం రూ.960 కోట్లతో పనులు
- జలాశయం వద్ద వరదలకు దెబ్బతిన్న ఆప్రాన్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ భారీ వరదలకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా రూ.117 కోట్లు మంజూరు
- మెట్ట ప్రాంతంలో ఉత్తర కాలువ ఆధునికీకరణ కోసం రూ.960 కోట్లు మంజూరు
- 101 కి.మీ. పొడవు ఉన్న ఉత్తర కాలువ నీటి సామర్థ్యం 350 క్యూసెక్కుల నుంచి 700 క్యూసెక్కులకు పెంచేలా కాలువను ఆధునికీకరణ
- పనులు పూర్తయితే 1.10 లక్షల ఎకరాలకు ఆయకట్టు పెరగనుంది.

నెల్లూరు జిల్లాలో నెరవేరిన అభివృద్ధి సంకల్పం

రూ.960 కోట్లతో సోమశిల- కండలేరు వరద కాలువ ఆధునికీకరణ


- రూ, 840.90 కోట్లతో సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్ నిర్మాణం
- కండలేరు ఆధునీకరణ కోసం రూ,960 కోట్లు
- రూ.117 కోట్లతో సోమశిల ఆప్రాన్ పనులు
- రూ.99.95 కోట్లతో సర్వే కాలువ ఆధునీకీకరణ
- రూ.611 కోట్లతో సంగం, నెల్లూరు బ్యారేజీ పనులు
- రూ.3,743 కోట్లతో రామాయపట్నం పోర్టు పనులు
- రూ.2,89 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్



సోమశిల హై లెవెల్ లిఫ్ట్ కెనాల్ నిర్మాణం పనులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ పద్నాలుగేళ్ల పాలనలో కరువు సీమగా మారిన సింహపురి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జిల్లా ప్రగతికి జీవనాడిగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు పరుగులు పెట్టించారు. జిల్లాలో వైద్య ఆరోగ్యం, విద్య, వ్యవసాయంలో ఉత్తమ ఫలితాల కోసం కృషి చేశారు. రైతు భరోసా కేంద్రాలు, నాడు– నేడుతో పాఠశాలల్లో నూతన ఒరవడి తీసుకొచ్చారు. నిర్దిష్ట కాలానికంటే ముందే సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి జిల్లాకు అంకితం చేశారు. ఒకప్పుడు అన్నపూర్ణగా వెలుగొందిన నెల్లూరు జిల్లా టీడీపీ హయాంలో వెనుకబాటుకు గురైంది. గడచిన ఐదేళ్లుగా నెల్లూరు సీమ సస్యశ్యామలంగా మారింది. పారిశ్రామిక ప్రగతికి చేయూతనిచ్చారు. రామాయపట్నం పోర్టు, ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేసి పారిశ్రామిక రంగాన్ని పరుగులు తీయించారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపారు.

ఇదిగో.. మార్పు



సంఘం బ్యారేజ్

నెల్లూరు బ్యారేజీతో పుష్కలంగా నీరు

- ఈ బ్యారేజ్ ద్వారా సర్వేపల్లి, జాఫర్ సాహెబ్ కాలువల కింద సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల పరిధిలోని 77 గ్రామాల పరిధిలో 99,525 ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా నీరు
- బ్యారేజ్ ద్వారా నిత్యం 0.4 టీఎంసీలను నిల్వ చేయడంతో సాగు, తాగునీరు అందుతుంది.
- మేకపాటి గౌతంరెడ్డి సంగం బ్యారేజ్ కూడా దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే జలయజ్ఞం ద్వారా చేపట్టారు.
- పెన్నా జలాలను సంగం వద్ద నిల్వ చేసి ఆయకట్టుకు నీరు అందించేలా ప్రణాళిక
- 3.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టు రూ.335.80 కోట్ల వ్యయంతో అంచనాలు
- వైఎస్సార్ హయాంలోనే రూ.30.85 కోట్లు ఖర్చు
- టీడీపీ హయాంలో కాంట్రాక్టర్ నుంచి కమీషన్ల కోసం సులభమైన పనులకు రూ.86.10 కోట్లే ఖర్చు
- ఈ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును ప్రాధాన్యత క్రమంలో చేర్చి రూ.131.12 కోట్ల ఖర్చుతో పూర్తి చేసి జాతికి అంకితం చేసింది
- నగరంలోని 0.6 కి.మీ నుంచి 3.3 కి.మీ వరకు వెళ్లే సర్వేపల్లి కాలువకు రక్షణ గోడలు నిర్మాణానికి రూ.99.95 కోట్లు మంజూరు
- నెల్లూరులో జాఫర్ సాహెబ్ రక్షణ గోడల నిర్మాణ పనుల కోసం రూ.39.87 కోట్లు మంజూరు
- కండలేరు వాగుపై ఆనకట్ట నిర్మాణం, డేగపూడి బండేపల్లి లింకు కెనాల్ నిర్మాణం, పాట్టేళ్ల కాలువ ఫీడర్ చానల్ నిర్మాణానికి రూ.26.63 కోట్లు మంజూరు
- దగదర్తి–రాచర్లపాడు, దగదర్తి ముంగమూరు చానల్ అభివృద్ధికి రూ.24.20 కోట్లు మంజూరు
- ముత్తుకూరు, వెంకటాచలం మండలంలో సీఎం, సీడీ ప్రొటెక్షన్ పనులు, చానల్ బ్యాంకు పనులకు రూ.16.82 కోట్లు మంజూరు
- చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ డైవర్షన్ కాలువ నిర్మాణానికి రూ.22.75 కోట్లు
- బెజవాడ పాపిరెడ్డి కాలువ ఆధునికీకరణ కోసం రూ.12.98 కోట్లు
- చాబోలు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు కోసం రూ.73.36 కోట్లు
- పెన్నానది ఒడ్డున వరద ఉధృతి నుంచి రక్షణ గోడల నిర్మాణం కోసం రూ.94.59 కోట్లు మంజూరు.
- కృష్ణపట్నం పోర్టు సమీపంలో నేలటూరు పట్టపుపాళెం వద్ద రూ.25 కోట్ల అంచనాతో మినీ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం
- మనుబోలు మండలంలోని శ్రీచక్ర ఎకో టెక్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ప్రాజెక్టును దాదాపు రూ.350 కోట్లతో ఏర్పాటు
- ముత్తుకూరు మండలంలోని పంటపాళెంలో రూ.290.79 కోట్లతో ఎలిజబుల్ ఆయిల్ తయారీ కేంద్రం ఏర్పాటుతో 120 మందికి ఉపాధి
- బిట్రగుంట మండలం జువ్వలదిన్నె హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ఫుడ్‌పార్కును ఏర్పాటు చేశారు.
- రూ.2,000 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ కంపెనీలో 1000 మందికి ఉపాధి కల్గనుంది.
- సర్వేపల్లి నియోజకవర్గంలో క్రిభ్‌కో గ్రీన్‌ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రూ.725 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టులో 400 మందికి ఉపాధి

పంచాయతీలకు జవసత్వాలు

- వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో 271 గ్రామాల్లో డ్రోన్‌ల ద్వారా 6,30,849 లక్షల ఎకరాలకుగాను 80 వేల ఎకరాల్లో సర్వే పూర్తి చేశారు.
- నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద జిల్లాలో 58 వేల ఇళ్లు మంజూరు
- జిల్లాలో 282 లే అవుట్లలో గృహ నిర్మాణాలకు మౌలిక సదుపాయాలకు రూ.57.81 కోట్లు మంజూరు
- 544 గ్రామ సచివాలయాల భవనాలకు రూ.218 కోట్లు మంజూరు
- 541 రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలకు రూ.118 కోట్లు
- వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలకు రూ.80 కోట్లు
- పాల శీతలీకరణ కేంద్రాల భవన సముదాలకు రూ.15 కోట్లు మంజూరు
- అగ్రి కల్చర్ మార్కెట్ కమిటీ నిధులు ద్వారా 195 రోడ్లను 591 కి.మీ పొడవుతో నిర్మాణం కోసం రూ.155.63 కోట్లు మంజూరు
- ఎన్‌డీబీ ప్రాజెక్టు ద్వారా మండలం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్‌లైన్ రోడ్లతో అనుసంధానం కోసం రెండు విడతలుగా రూ.422 కోట్లు మంజూరు
- కావలిలో పాత మద్రాసు– కలకత్తా జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.55 కోట్లు
- ఉదయగిరిలో పీఎంజేవీకే పథకం ద్వారా విద్యాసంస్థ నిర్మాణానికి రూ.46 కోట్లు మంజూరు
- సీఆర్ఎఫ్ పనుల ద్వారా 16 పనులకు రూ.62 కోట్లు మంజూరు
- జిల్లాలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి నీటి కుళాయికి 941 గ్రామాల్లో రూ.253 కోట్లతో పనులు చేపట్టారు.
- జిల్లాలో 541 గ్రామ సచివాలయాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనుల కోసం రూ.16.23 కోట్లు మంజూరు
- ఆసియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు సహకారంతో సమగ్ర తాగునీటి సరఫరా పథకం నెల్లూరు కార్పొరేషన్‌లో విలీన గ్రామాలకు తాగునీటి పైప్‌లైన్ కోసం రూ.114.19 కోట్లు మంజూరు
- నెల్లూరులోని రోడ్లు, బీసీ భవన్, గోషా హాస్పిటల్ , శ్మశాన వాటిక నిర్మాణం కోసం రూ.80 కోట్లు
- కావలి, కందుకూరు మున్సిపాల్టీల పరిధిలో ఎంఐజీ లేఅవుట్‌ల అభివృద్ధి కోసం రూ.62 కోట్లు
- అక్కచెరువుపాడు పరిధిలో మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల నిర్మాణం కోసం రూ.15 కోట్లు
- ఆటోనగర్‌లో ఎంఎస్ఈ–సీడీపీ పథకం ద్వారా 9 కి.మీ వరకు ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసేందుకు రూ.22 కోట్లు
- మినీ బైపాస్‌రోడ్డు, రామలింగాపురం జంక్షన్ వద్ద అత్యాధునిక టెక్నాలజీతో మహా నగరాలకు దీటుగా 810 మీటర్ల పొడవున రూ.41.88 కోట్లతో ఫ్లైఓవర్
- ఆత్మకూరు నియోజకవర్గంలో నారంపేట వద్ద ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి కోసం రూ.23 కోట్లు మంజూరు

రాష్ట్రాన్ని దోచుకున్న బూటకాలమారి రావాలా? చెప్పింది చేసి చూపిన జననేత కావాలా?

పారిశ్రామికోత్సాహం



మహాలక్ష్మీ గ్రానైట్ ప్యాక్టరీ

నిరుద్యోగం నుంచి పారిశ్రామికవేత్తగా దంపతులు

పరిశ్రమలశాఖ తోడ్పాటుతో నెలకొల్పిన గ్రానైట్ పరిశ్రమ

సంవత్సరానికి రూ.50 లక్షల టర్నోవర్

నేడు పదిమందికి ఉపాధి కల్పిస్తున్న వైనం

ఉపాధికి ఊతం

చిన్న తరహా పరిశ్రమ నడిపిన అనుభవం పెద్ద పరిశ్రమ పెట్టడానికి బాటలు వేసింది. దానికి తోడు ప్రభుత్వ ప్రోత్సాహం, పరిశ్రమ శాఖ సహకారం, ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుకునేందుకు దోహదపడింది. వెరసి నిరుద్యోగ భార్యాభర్తలు నేడు పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. పరిశ్రమను నెలకొల్పే సమయంలో ఎన్నో ఎదురు దెబ్బలు తగిలాయి. అయినా తాము అనుకున్న లక్ష్యానికి చేరేవరకు విశ్రమించలేదు. ఇప్పుడు పది మందికి ఉపాధి కల్పిస్తూ విజయపథాన నడుస్తున్నారు. ఏడాదికి రూ. 50 లక్షల టర్నోవర్ చేస్తూ పలువురికి బాసటగా ఆ భార్యభర్తలు నిలిచారు.

తోడ్పాటివ్వని గత ప్రభుత్వం

బాపట్ల జిల్లా బల్లికురవ మండలం రాజపాలెం గ్రామానికి చెందిన కొమెర లక్ష్మీనారాయణ, రాణి దపంతులు. మొదటి నుంచి వారిది వ్యవసాయ కుటుంబం. భర్త ఇంటర్, భార్య పదోతరగతి వరకు చదువుకున్నారు. ఎన్నో వ్యయప్రయాసలతో తొలుత వారు 2010లో కొణిదెన గ్రామ సమీపాన టూ బై వన్ గ్రానైట్ పరిశ్రమను ఏర్పాటు చేసుకున్నారు. ఆ సైజు రాయికి మార్కెట్లో పెద్దగా గిరాకీ లేకపోవడంతో ఆశించిన లాభాలు రాలేదు. నష్టాలతో నెట్టుకొచ్చారు. పెట్టుబడి పెట్టేందుకు కూడా డబ్బులు లేవు. ఎలాగైనా పెద్ద పరిశ్రమ పెట్టాలనేది వారి కోరిక. దానివల్ల తొలుత ఇబ్బందులు వచ్చినా ఏదో సమయంలో విజయం సాధిస్తామని వారి ప్రగాఢ విశ్వాసం. అంతేకాదు. దాని ద్వారా పలువురికి ఉపాధి చూపాలనేది వారి ఆలోచన. ప్రభుత్వం సాయం చేస్తే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్లాబులను ఉత్పత్తి చేయా లని భావించారు. అయితే గత ప్రభు త్వం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సాయం చేయకపోగా కనీసం తోడ్పాటు కూడా ఇవ్వలేదు. పరిశ్రమ నెలకొల్పేందుకు ఎన్నిసార్లు తిరిగినా వారిని పట్టించుకోలేదు. దీంతో చిన్న పరిశ్రమతోనే నెట్టుకొచ్చారు.



కట్టింగ్ చేస్తున్న కార్మికులు

కష్టాలు తొలగి కడుపునిండింది

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత లక్ష్మీనారాయణ మరోసారి పరిశ్రమలశాఖ అధికారులను సంప్రదించారు. తొలుత వారు కూడా మొండిచెయ్యి చూపినా రెండోసారి చిలకలూరిపేట కరూ ర్ వైశ్యాబ్యాంక్ వారిని కలిశారు. ప్రాజెక్టు రిపోర్టులు, అనుభవం తదితర విషయాలు పూర్తిగా అందజేశారు. దీంతో వెంటనే పరిశ్రమల శాఖ స్పందించంది. 2019 సంవత్సరం నవంబరులో చిన్న తరహా పరిశ్రమల కింద రూ.70 లక్షలు రుణం మంజూరైంది. ఇందులో రూ.42 లక్షలు ప్రభుత్వం రాయితీ కల్పించింది. దాంతో బల్లికురవ మండలంలోని కొణిదెన నుంచి నాగరాజుపల్లి వెళ్లే రహదారిలో 'మహాలక్ష్మి' గ్రానైట్‌ను స్థాపించారు. అప్పటి నుంచి ఇంకా వెనుదిరిగి చూడలేదు. ముడిరాయిని పలకలుగా కోస్తూ మహారాష్ట్ర, తెలంగాణా, చెన్నై తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ ప్రస్తుతం లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ పరిశ్రమ ద్వారా సంవత్సరానికి రూ.50 లక్షల టర్నవర్ చేస్తున్నారు.

(గుంటుపల్లి ఆంజనేయులు, విలేకరి, బల్లికురవ మండలం)

కోవిడ్ కష్టంలోనూ చేయూత..



రాష్ట్రంలో కరోనా మహమ్మారి ప్రజలకు వణికించింది. ఆ ప్రభావం గ్రానైట్‌పై పడటంతో పరిశ్రమ మూతపడింది. వ్యాపారాలు లేక, అటు కార్మికులు, ఇటు యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఆ సమయంలో బ్యాంకు నుంచి మరో రూ.6 లక్షల రుణం లభించింది. ప్రస్తుతం వ్యాపారం బాగానే ఉంది. లాభాలు వస్తున్నాయి. పదిమందికి ఉపాధి కల్పించామనే తృప్తి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాకు బాగా అండగా నిలిచింది.

– కొమెర రాణి మహాలక్ష్మి గ్రానైట్ యజమాని

సంవత్సరం నుంచి పనిచేస్తున్నా..



గ్రానైట్ పరిశ్రమలో సంవత్సరకాలంగా పనిచేస్తున్నా. నేను ముడి రాయిని కట్టర్ సైజు మిషనరీ మీద పలకలుగా కోస్తాను. నెలకు రూ.20 వేల వరకు వస్తోంది. ఒడిస్సా నుంచి బతుకు తెరువు కోసం వచ్చా. నాకు భోజనం, వసతి యజమానే చూస్తున్నారు.

– సూర్య, కార్మికుడు, ఒడిస్సా

పదిమందికి ఉపాధి



మా యజమాని గ్రానైట్ పరిశ్రమ నెలకొల్పడంతో నాకు ఉద్యోగం దొరికింది. మాది సంతమాగులూరు మండలం మక్కెన వారిపాలెం. ఇక్కడ సూపర్‌వైజర్‌గా పని చేస్తూ నెలకు రూ.22 నుంచి రూ.25 వేల వరకు పొందుతున్నాను. మా ఊరికి దగ్గరగా ప్యాక్టరీ ఉండడంతో రోజూ ఇంటి నుంచే వస్తున్నారు. ఇప్పుడు నాకు నా కుటుంబానికి ఉపాధి కలిగింది.

– వల్లెపు అశోక్, సూపర్‌వైజర్

తప్పుడు ప్రచారం తగదు



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై టీడీపీ దొంగలు దుష్ప్రచారం చేస్తున్నారు. నేను ఇటీవల కొనుక్కున్న ఆస్తికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. డాక్యుమెంట్ ఇచ్చారు. మరి ఈ అబద్ధాలు చెప్పి చంద్రబాబు ఎంతకాలం ప్రజలను మోసం చేస్తాడో తెలీదు. రిజిస్ట్రేషన్ అయ్యాక డాక్యుమెంట్ రానివాళ్లు ఎవరూ లేరు. ఉంటే బయటకు వచ్చేవారు కదా. చంద్రబాబు అబద్ధాల పుట్ట. పండుటాకులను బాధిస్తున్నాడు. బాబుకు పుట్టగతులుండవు. తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్న పచ్చ మీడియాపై క్రిమినల్ కేసులు పెట్టాలి. **- అక్బర్ అలీ, విశ్రాంత బ్యాంకు అధికారి, విజయవాడ**

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా..



జగనన్న ప్రభుత్వం సంక్షేమంతోపాటే, రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో నిధులు వెచ్చిస్తోంది. ప్రతిపక్షాలు కావాలనే అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయి. జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తోంది. రాష్ట్రంలో వాస్తవంగా ఎన్నో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, పోర్టులు, హార్బర్లు, 17 వైద్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. నాడు–నేడులో స్కూళ్లు, ఆస్పత్రులు అభివృద్ధి చెందాయి. ఇవన్నీ జరిగినవి కేవలం రెండున్నరేళ్లలోనే. మళ్లీ వచ్చేది జగన్ ప్రభుత్వమే.

- పసుపులేటి శివరామప్రసాద్, భట్టిప్రోలు, బాపట్ల జిల్లా

బాబు మోసాలను తిప్పికొట్టాలి



ఈవీఎంలు, బ్యాలెట్ బాక్సులు మార్చడంలో సిద్ధహస్తుడు చంద్రబాబు. తన అధికార దాహం తీర్చుకునేందుకు బాబు ఎన్ని కుట్రలు, కుతంత్రాలకైనా పాల్పడతాడు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో జనాలకు దేవుడయ్యారు. జగన్‌ను ఎదుర్కొనే సత్తా లేకే జనసేన, బీజేపీతో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నాడు. ఎన్ని మోసాలు, తప్పుడు హామీలిచ్చినా ప్రజలు బాబును నమ్మే పరిస్థితి లేదు. జనమంతా జగన్ వెంటే ఉన్నారు.

- ఎస్‌కే మహబులా, ఎల్‌టీ నగర్, పల్నాడు జిల్లా

ఇవిగో పెట్టుబడులు


విశాఖ జీఐఎస్ సదస్సులో రూ.13.11 లక్షల కోట్ల ఒప్పందాలు



ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ పార్క్

కేంద్ర ప్రభుత్వ నవరత్న కంపెనీ ఎన్‌టీపీసీ ఒక్కటే రూ.1.10 లక్షల కోట్లతో అనకాపల్లి సమీపంలో పూడి మడక వద్ద భారీ గ్రీన్ ఎనర్జీ రంగానికి సంబంధించి హైడ్రోజన్ తయారీ పార్కును ఏర్పాటు చేస్తోంది. భవిష్యత్తులో పర్యావరణహిత ఇంధనానికి డిమాండ్ పెరగనుండటం, ఈ ఇంధనం లభించే చోటే భారీ పరిశ్రమలు వచ్చే అవకాశం ఉండటంతో ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేసింది. ఇంతకాలం బొగ్గు ద్వారా విద్యుత్ ఉత్పత్తికి పరిమితమైన ఎన్టీపీసీ ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై దృష్టి సారించింది. అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద 4,000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం కోసం కేటాయించిన 1200 ఎకరాలను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా అభివృద్ధి చేస్తోంది. మొత్తం రూ.2.25 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ పార్కును అభివృద్ధి చేస్తుండగా, తొలి దశలో రూ.లక్ష కోట్లతో తొలి దశ నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ఇటీవల శంకుస్థాపన చేశారు. 600 ఎకరాల హైడ్రోజన్ ఏరియాలో రోజుకు 1500 టన్నుల హైడ్రోజన్, 1300 టన్నుల గ్రీన్ అమ్మోనియా, 1200 టన్నుల గ్రీన్ మిథనాల్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ తయారు చేసే హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, మిథనాల్ దక్షిణాసియా దేశాలకు ఎగుమతి చేయనుంది.

సాక్షి, అమరావతి: సుదీర్ఘ తీరప్రాంతం, అపారమైన సహజ వనరులకు తోడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనుసరిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలతో దేశంలోని పారిశ్రామిక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. దేశంలో పారిశ్రామిక దిగ్గజ కుటుంబాలైన అంబానీ, అదానీ, టాటా, బిర్లా, మిట్టల్, జిందాల్, బంగర్, భజాంకా, ఒబరాయ్, దాల్మియా, సింఘ్వీ వంటి అనేక మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి స్వయంగా వచ్చి పెట్టుబడులు పెట్టడానికి ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందాలు చేసుకున్నారు. గత ఏడాది మార్చిలో విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13,11,465 కోట్ల విలువైన 386 పెట్టుబడుల ఒప్పందాలు జరిగితే అందులో ఇప్పటికే రూ.3.02 లక్షల కోట్ల పెట్టుబడుల వాస్తవ రూపంలోకి వచ్చాయి. రూ.78,514 కోట్ల విలువైన పెట్టుబడులు వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించగా మరో రూ.2.23 లక్షల కోట్ల పెట్టుబడులు ప్రయోగాత్మక ఉత్పత్తి లేదా నిర్మాణ దశలో ఉన్నాయి. జీఐఎస్‌లో చేసుకున్న ఒప్పందాల వల్ల మొత్తం 6.07 లక్షల మందికి ఉపాధి లభించనుండగా కేవలం ఏడాదిలోగానే 2,64,041 మందికి ఉపాధి కల్పన దిశగా అడుగులు పడ్డాయి. వాస్తవరూపంలోకి వస్తున్న వాటిలో భారీ పెట్టుబడులు ఉండటం ప్రభుత్వ చిత్త శుద్ధికి నిదర్శనం. సుమారు 32కు పైగా సంస్థలు రూ.1,000 కోట్ల కంటే అత్యధిక పెట్టుబడులు పెడుతున్నాయి.



బిర్లా గ్రూపు భారీ పెట్టుబడులు

దేశ పారిశ్రామిక దిగ్గజ సంస్థల్లో ఒకటైన ఆదిత్య బిర్లా గ్రూపు రాష్ట్రంలో భారీ పెట్టుబడులను పెడుతోంది. కాస్టిక్ సోడా, కార్బన్ బ్లాక్, గార్మెంట్స్, అల్యూమినియం ఇలా వివిధ రంగాల్లో వేల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఈ గ్రూపు చైర్మన్ కుమార మంగళం బిర్లా స్వయంగా వచ్చి పెట్టుబడుల కార్యక్రమంలో పాల్గొన్నారంటే ఈ రాష్ట్రంపై ఉన్న ప్రత్యేక ఆసక్తిని తెలియజేస్తోంది. ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో రూ.2,700 కోట్ల పెట్టుబడితో ఏటా రూ.1.50 లక్షల టన్నుల కాస్టిక్ సోడాను ఉత్పత్తి చేస్తే క్లోర్ ఆల్కలి యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ యూనిట్‌ను కుమార మంగళం బిర్లాతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2022 ఏప్రిల్ 21న ప్రారంభించారు. ఈ యూనిట్ ద్వారా ప్రస్తుతం 1,300 మందికి ఉద్యోగ అవకాశాలు రాగా పూర్తిస్థాయి సామర్థ్యం అందుబాటులోకి వస్తే ఈ సంఖ్య 2,400కు చేరుతుంది. అదే విధంగా వైఎస్ఆర్ జిల్లా పులివెందులలో రెడీమేడ్ దుస్తుల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. 2021 డిసెంబర్ 24న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసిన ఈ యూనిట్ రెండేళ్లల్లోనే అందుబాటులోకి వచ్చింది. రూ.110.38 కోట్ల వ్యయంతో 2112 మందికి ఉపాధి కల్పించే విధంగా ఈ యూనిట్ ఏర్పాటైంది. మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో ఉత్పత్తైన దుస్తులు ఆదిత్య బిర్లా రిటైల్ షోరూంలతో పాటు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇవి కాకుండా ఆదిత్య బిర్లా గ్రూపు చిత్తూరు జిల్లా నాయుడు పేటలో రంగులు, ఇంకు, టోనర్లు వంటి వాటిలో కీలకంగా వినియోగించే కార్బన్ బ్లాక్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. సుమారు రూ.1,700 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్ ద్వారా 250 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. ఇదే గ్రూపునకు చెందిన హిందాల్కో రూ.1,625 కోట్లతో భారీ అల్యూమినియం తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది.



మేడిన్ ఆంధ్రా ఏసీలు

కోవిడ్ తర్వాత కేవలం రెండేళ్లలోనే రాష్ట్రం మేడిన్ ఆంధ్రా ఏసీల తయారీ హబ్‌గా ఎదిగింది. దేశంలో అమ్ముడయ్యే ప్రతీ రెండు ఎయిర్ కండీషనర్లలో ఒకటి మన రాష్ట్రంలోనే తయారవ్వనుండగా, అదే దక్షిణాది రాష్ట్రాల్లో జరిగే ఏసీ అమ్మకాల్లో 80 శాతం రాష్ట్రం నుంచే తయారయ్యే ఏసీలే ఉండనున్నాయి. దేశంలోని దిగ్గజ ఏసీ తయారీ సంస్థలు రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేసి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) స్కీం కింద యూనిట్లు ఏర్పాటు చేశాయి. నెల్లూరు జిల్లా శ్రీ సిటీలో జపాన్ ఏసీ తయారీ సంస్థ డైకిన్, బ్లూస్టార్, హావెల్స్, పానాసోనిక్, యాంబర్, ఈపాక్ వంటి సంస్థలు భారీ తయారీ యూనిట్లను ఏర్పాటు చేశాయి. ఇందులో ఒక్క డైకినే తొలి దశలో ఏటా 10 లక్షల యూనిట్లను తయారు చేసే విధంగా యూనిట్‌ను ఏర్పాటు చేసింది. రెండో దశలో మరో 15 లక్షలు తయారు చేసే విధంగా విస్తరణ చేపట్టనుంది. ఇందుకోసం రూ 1,000 కోట్ల పెట్టుబడులను ఈ జపాన్ సంస్థ పెట్టనుంది. బ్లూస్టార్ ఏటా 12 లక్షల యూనిట్లను తయారు చేసే విధంగా యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం ఏటా దేశ వ్యాప్తంగా 75 లక్షల గృహ విని యోగ ఏసీలు అమ్ముడవుతున్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో ఈ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం 50 లక్షలు పైనే ఉంటుందని అంచనా. ఈ విధంగా చూస్తే వచ్చే మార్చి నుంచి దేశవ్యాప్తంగా అమ్ముడయ్యే ప్రతీ ఏసీలో ఒకటి మన రాష్ట్రంలో తయారైనదే ఉంటుందని అంచనా. మొత్తం ఈ ఆరు యూనిట్లు, ఒక్క ఏసీ తయారీ రంగంలోనే రాష్ట్రం రూ.3,755 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే 10,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.





బయో ఇథనాల్‌లో 20కిపైగా యూనిట్లు ఏర్పాటు

వ్యవసాయ ఉత్పత్తుల నుంచి ఇంధన తయారీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో అత్యధిక మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుండటంతో రైతులకు మరింత ఆదాయం సమకూర్చే విధంగా బయో ఇథనాల్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇప్పటికే అస్సాగో, క్రిబ్‌కో, అవేశా ఫుడ్స్, ఆయిల్ కార్పొరేషన్, ఈఐడీ ప్యారీ, డాల్వకోట్, ఎకో స్టీల్, చోడవరం సుగర్స్, రోచే గ్రీన్ ఆగ్రో, నితిన్‌సాయి, గ్రేస్ వెంచర్స్ వంటి 20కి పైగా సంస్థలు రాష్ట్రంలో రూ.3,000 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. మరికొన్ని సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయి. ఈ యూనిట్ల అన్నింటి ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిపి చూస్తే రోజుకు 5,000 కిలో లీటర్లకు పైగా బయో ఇథనాల్ రాష్ట్రంలో ఉత్పత్తి అవుతుందని, ఇది దేశంలోనే అత్యధికమని పరిశ్రమవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం దేశంలో ఆహార ధాన్యాల నుంచి 760 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి అవుతుండగా పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను మిశ్రమం చేయడానికి 2025–26 నాటికి అదనంగా 1,016 కోట్ల లీటర్లు అవసరమవుతుందని అంచనా. ఇథనాల్ కలపటాన్ని ప్రస్తుతం ఉన్న 10 శాతం నుంచి 20 శాతానికి పెంచడం వల్ల ఏటా ఇంధన దిగుమతి వ్యయంలో రూ.51,600 కోట్ల మేర విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని నీతి ఆయోగ్ అంచనా వేసింది.

సిమెంట్ రంగంలో దిగ్గజ బ్రాండ్‌లు

దేశంలోని సిమెంట్ రంగంలో ఉన్న దిగ్గజ బ్రాండ్‌లు అన్నీ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ప్రభుత్వం ప్రోత్సాహంతో అల్ట్రాటెక్, ఇండియా సిమెంట్స్ రాంకో, ఏసీసీ, శ్రీ సిమెంట్స్ ఏర్పాటు చేశాయి. ఇందులో ఇప్పటికే నంద్యాల్లో రూ.1,300 కోట్లతో ఏర్పాటు చేసిన రాంకో సిమెంట్స్ ఉత్పత్తిని ప్రారంభించింది. బంగర్ సిమెంట్ బ్రాండ్‌తో విక్రయించే శ్రీ సిమెంట్ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల వద్ద రూ.2500 కోట్లతో ఏర్పాటు చేసిన సిమెంట్ పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభించింది. అనంతపురంలోని పెన్నా సిమెంట్ రూ.680 కోట్లతో విస్తరణ పనులు పూర్తి చేసింది. ఇవి కాకుండా నంద్యాలల్లో అల్ట్రాటెక్ రూ.2,500 కోట్లతో చేపట్టిన విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏసీసీ సిమెంట్ వైఎస్ఆర్ కడప జిల్లాలో రూ.5,400 కోట్లతో భారీ సిమెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది.

జగన్ పాలనలో ముస్లింలకు స్వర్ణయుగం

- చంద్రబాబు పాలనలో దేశద్రోహం కేసులతో వేధింపులు
- జగన్ హయాంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ముందడుగు
- ముస్లిం మైనార్టీ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ సంషీర్ ఆలీబేగ్

సాక్షి, అమరావతి:

సీఎం వైఎస్ జగన్ పాలన ముస్లిం మైనార్టీలకు స్వర్ణయుగమని ఆంధ్రప్రదేశ్ ముస్లిం మైనార్టీ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ మీర్జా సంషీర్ ఆలీబేగ్ అన్నారు.



ఆయన ఆదివారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. 'సీఎం జగన్ పాలనలో ముస్లింలకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా తిరుగులేని భరోసా దక్కింది. చంద్రబాబు ముస్లింలపై దేశ ద్రోహం కేసులు పెట్టి అన్యాయంగా వేధించాడు. ఇచ్చిన హామీలు కూడా అమలు చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కానీ సీఎం జగన్ పాలనలో అనేక పథకాల ద్వారా ముస్లిం మైనార్టీలకు రూ.24,304.37 కోట్ల ప్రయోజనం చేకూరింది. ముఖ్యంగా విద్యకు రూ.3,411.84 కోట్లు, వైద్యానికి రూ.1,584.64 కోట్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల(హౌసింగ్ స్కీమ్)లో రూ.9,825 కోట్ల మేర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు లబ్ధి చేకూర్చింది. 2014లో ఇచ్చిన హామీలను అసలు అమలే చేయని చంద్రబాబు.. ఇప్పుడు ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం ఇస్తానని చెబితే ఎవరు నమ్ముతారు? వాస్తవానికి జగన్ వచ్చాకే ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం లభించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటివరకు ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం, కోవిడ్ ప్రత్యేక సాయంగా రూ.321.42 కోట్లు ఇచ్చింది. షాదీ తోఫాతో పాటు హజ్ యాత్రికులకు కూడా సీఎం జగన్ పెద్ద మనస్సుతో ఆర్థిక సాయం అందించారు. ఉర్దూను రెండవ అధికార భాషగా ప్రకటించారు. రాష్ట్రంలో తొమ్మిది షాదీ ఖానాలు మంజూరయ్యాయి. మరో పది చోట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలున్నాయి. ముస్లిం సమాజానికి ఇంత మేలు చేసిన జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం' అని ప్రజలకు సంషేర్ ఆలీబేగ్ విజ్ఞప్తి చేశారు.

ఆకలిగొన్న ఊళ్లో చదువే సుసంపన్నం..

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం
జనహృదయ విజేత పాలనలో సాక్షాత్కారం



ఆ ఊరి పేరు చిన్నతురకపాలెం...

నరసరావుపేట రూరల్ మండలంలో
ఓ చిన్న గ్రామం.. నాలుగువేల జనాభా...
750 ఇళ్లుంటాయి... ఊరంతా మైనార్టీలే....
2006 వరకు ఆ ఊరి చదువులు పదో తరగతి దాటలేదు... పాత గోనె సంచులు కుడితేనే బతుకులు వెళ్లమారేవి...అంత కటిక పేదరికంలో మగ్గిపోయిందా ఊరు...
అలాంటి ఊళ్లో మైనార్టీల బతుకుల్లో
ఒక పెను మార్పు సంభవించింది
డాక్టర్ వైఎస్సార్ రూపంలో...

మైనార్టీల జీవితాలను దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ అపూర్వంగా మలుపుతిప్పారు... 4 శాతం బీసీ–ఈ రిజర్వేషన్లతో ఇప్పుడా ఊళ్లో 9 మంది ఎంబీబీఎస్ పూర్తి చేశారు... మరో 23 మంది డాక్టర్ చదువుల్లోనే ఉన్నారు... వంద మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు..ఇంకో 200 మంది ఇంజనీరింగ్ కోర్సులు చదువుతున్నారు... మొత్తం గ్రామ ఆర్థిక స్థితినే మార్చేశాయి రిజర్వేషన్లు... ఆ అద్భుతం ఇప్పుడు కూటమి రూపంలో మాయమవుతుందేమోనన్న కలవరం ఆ ఊరి వారిలో అలజడి రేపుతోంది.. తాము గనుక అధికారంలోకి వస్తే ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చేస్తామని కూటమి నేతలు ప్రకటనలు చేయడమే ఆ ఊరి మైనార్టీల కలవరానికి కారణం.. ఆ ఊరి కథ రాష్ట్రం మొత్తానికీ వర్తిస్తుంది...రాష్ట్రంలో మైనార్టీలందరి గుండెల్లోనూ గుబులు రేపే అంశమే ఇది... ఇలాంటి దురాలోచన కడివెడు పాలలో కాలకూట విషమేనని...ఈ అకాల'కూటమి' రాష్ట్రానికి ఎందుకని గ్రామస్థులు తమలో తామే ప్రశ్నించుకుంటున్నారు...

చిన్నతురకపాలెం రెండు దశాబ్దాల కాలంలో ఎలా మారిపోయిందో తెలుసుకోవాలంటే ఆ ఊరి కథను తెలుసుకోవాల్సిందే....

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్ మండలం చిన్న తురకపాలెంలో మొత్తం మైనారిటీలే ఉంటారు, 2004 సంవత్సరానికి ముందు గ్రామంలో ఉన్నత చదువులు చదివినవారిని వేళ్లమీద లెక్కగట్టవచ్చు. ప్రస్తుతం ఆ గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ఉన్నత చదువుతో పాటు మంచి ఉద్యోగం చేస్తున్న యువత కనిపిస్తుంది. 16 మంది దాకా ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ కొలువుల్లో ఉన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు ఎలా మేలు చేశాయనడానికి చిన్న తురకపాలెం ఉదాహరణగా నిలుస్తోంది. మైనార్టీ రిజర్వేషన్లతో ఆ గ్రామంలో 2012 నుంచి సామాజిక, ఆర్థిక రంగాల్లో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. పిల్లలు వృద్ధిలోకి రావడంతో గతంలో గోతాల పనిచేసే కార్మికులు 50 శాతం మంది ఆ వృత్తి నుంచి తప్పుకున్నారు. ఇదే రంగంలో గతంలో కూలీలుగా పని చేసిన కుటుంబాలు నేడు దేశ వ్యాప్తంగా వ్యాపారాలు చేసే స్థాయికి ఎదిగాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడటం, గత ఐదేళ్లలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో తెచ్చిన అద్వితీయ మార్పులతో బాలలంతా బడిబాట పట్టారు. వైఎస్సార్ హయాంలో గ్రామంలో 420 కుటుంబాలకు పక్కా ఇళ్లను నిర్మించారు. తినడానికి తిండి లేని స్థితి నుంచి నేడు అన్ని వసతులనూ అనుభవిస్తూ సగర్వంగా బతుకుతున్నామంటే అది వైఎస్సార్ చలువే అంటూ గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బీజేపీ జాతీయ, రాష్ట్ర నేతల మైనార్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చేస్తున్న ప్రసంగాలతో వారు ఆందోళనలో ఉన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే మైనార్టీ రిజర్వేషన్లు రద్దవుతాయని, తమ పిల్లల భవిష్యత్ మళ్లీ అంధకారం కానుందని వాపోతున్నారు.

- పాత గోనెసంచులు కుట్టి జీవించే మైనార్టీల ఊరు
- ఆ ఘనత దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్‌దే..
- రిజర్వేషన్లతో ఉజ్వల స్థితికి చిన్నతురకపాలెం
- గ్రామంలో 32 మంది డాక్టర్లు, 300 మందికి పైగా ఇంజనీర్లు
- టీడీపీ, బీజేపీ కూటమితో ప్రమాదంలో మైనార్టీ రిజర్వేషన్లు
- మైనార్టీ ద్రోహులకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపు

మహానేత పెట్టిన భిక్ష...

దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిములకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్ వల్ల మెడికల్ సీటు పొందగలిగాను. ఇప్పుడు శ్రీకాకుళం రిమ్స్ కాలేజీలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాను. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మాకు రిజర్వేషన్లు ఉపయోగపడుతున్నాయి. నాతో పాటు గ్రామంలోని వందలాది మంది ఉన్నత విద్య అభ్యసిస్తున్నారంటే అది వైఎస్సార్ పుణ్యమే.



షేక్ బాదర్ అఫ్రీదీ, వైద్య విద్యార్థి

రిజర్వేషన్లు, విద్యా దీవెన ఆదుకున్నాయి

వైఎస్సార్ 4 శాతం రిజర్వేషన్‌తో పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుక, వసతి దీవెనలతో చదువుకుంటున్నాం. రోజు వారీ కూలి పనులు చేసుకుని జీవితాన్ని సాగిస్తున్న పేద ముస్లిం పిల్లలూ వీటి కారణంగా ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో చేరారు. రిజర్వేషన్లు వైఎస్సార్ మాకు ఇచ్చిన వరం..



-షేక్ పాదిలే అష్రఫ్ అబ్దుల్లా, ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థి

గ్రామ రూపు రేఖలే మారాయి...

మా గ్రామంలో గోనె సంచుల వ్యాపారంపై ఆధారపడి అన్ని కుటుంబాలు జీవిస్తుండేవి. 2006 వరకు గ్రామంలో 10వ తరగతి వరకు చదివిన వారే తక్కువ. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మాకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాత గ్రామంలో చదువుకునే వారి సంఖ్య బాగా పెరిగింది. నాటికీ –నేటికీ గ్రామంలో చాలా మార్పులు వచ్చాయి. రిజర్వేషన్లు రద్దు చేస్తే మా జీవితాలు మళ్లీ అంధకారమవుతాయి.



- షేక్ పాదిలి సైదావలి, చిన్నతురకపాలెం

బాబు వేధింపులను మేం మరిచిపోలేదు..

సాక్షి, అమరావతి: క్షణాల్లో మాట మార్చే చంద్రబాబు పాలనలో ముస్లిములు ఎదుర్కొన్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ప్రశ్నించినందుకు నిర్బంధించి, దారుణంగా కొట్టారు. దేశద్రోహం కేసులు పెట్టారు. ఇప్పుడు బీజేపీతో జతకట్టిన చంద్రబాబు మరోసారి ముస్లిములను మోసపుచ్చేందుకు కల్లబొల్లి మాటలు, బూటకపు హామీలు గుప్పిస్తున్నారు. మరి గతంలో ముస్లిముల పట్ల బాబు వైఖరి ఎంత దుర్మార్గంగా ఉండేదో గుర్తు చేసుకుని వారు మండిపడుతున్నారు. 2018 ఆగస్టు 28న గుంటూరులో జరిగిన 'నారా హమారా–టీడీపీ హమారా'సభలో 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఏమైందని అడిగినందుకు దేశద్రోహం కేసులు పెట్టి, వేధించిన సంగతి మర్చిపోయారా? అని ముస్లిములు ప్రశ్నిస్తున్నారు. ఫాతిమా కాలేజీ విద్యార్థులకు న్యాయం చేయాలని ప్లకార్డులు పట్టుకుంటే నంద్యాలకు చెందిన 8 మంది ముస్లిం యువకులను నిర్బంధించి, హింసించిన దారుణాన్ని తాము మర్చిపోలేదని అంటున్నారు. తన హయాంలో కనీసం నామినేటెడ్ పోస్టుల్ని కేటాయించని బాబు, ఇప్పుడు బీజేపీతో కలిసి రావడాన్ని ఆక్షేపిస్తున్నారు. మరోవైపు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ముస్లిం యువకులపై కేసుల్ని ఎత్తివేస్తూ అసెంబ్లీలో స్వయంగా ప్రకటించిన విషయాన్నీ వారు గుర్తు చేసుకుంటున్నారు. ఇమామ్‌లు, మౌజమ్‌లకు గౌరవ వేతనం పెంపు, హాజీలకు ఆర్థిక సాయం తదితర లబ్ధి చేకూర్చిన జగన్ వెంటే తామంతా అంటూ ముస్లిం సమాజం స్పష్టం చేస్తోంది.

2019 ఎన్నికలకు ముందు కంటితుడుపుగా ఓ పదవి ఇచ్చి, మోసగించిన బాబును ముస్లిం సమాజం నమ్మే పరిస్థితి లేదు. 4 శాతం రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ముస్లిం యువతకు దివంగత మహానేత వైఎస్సార్ మేలు చేస్తే, ఆర్థిక, రాజకీయ, సామాజికపరంగా మరింత చేయూతనిచ్చింది సీఎం జగనే. ఈ ఐదేళ్లలో మైనారిటీలకు డీబీటీ ద్వారా రూ.13,239.49 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.11,064.88 కోట్లు కలిపి మొత్తం రూ.24,304.37 కోట్ల లబ్ధి చేకూరింది.

షేక్ నాగుల్ మీరా, రాష్ట్ర అధ్యక్షుడు, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి
షేక్ దస్తగిరి, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముస్లిం దూదేకుల జేఏసీ